
ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

అక్టోబర్ - డిసెంబర్ 2026

మమత-సమత-మానవత
www.gurajada.org





సంపాదక మండలి

వ్యవస్థాపక సంపాదకులు

మహాకవి గురజాడ అప్పారావు

ప్రధాన సంపాదకులు

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ(USA)

నిర్వాహక సంపాదకులు

శ్రీమతి అరుణ గురజాడ (USA)

శ్రీ గురజాడ రవీంద్రుడు *(విశాఖపట్టణం)*

విద్యాసంబంధిత ప్రచురణ విభాగ సంపాదకులు

కార్యనిర్వాహక సంపాదకులు

ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు

(హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్)

సంపాదక సలహాదారులు

ఆచార్య, సూర్యా ధనంజయ్
(ఉపకులపతి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదు)

ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి
(అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాసి)

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
(సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు)

డా. వి.ఆర్. రాసాని
(విశ్రాంత ఆచార్యులు, తిరుపతి)

సంపాదకులు

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి
(యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప)

ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ
(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ
(మదురై విశ్వవిద్యాలయం, మదురై)

సహ సంపాదకులు

డా. నందవరం మృదుల, *(సహ ఆచార్యులు & తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బేగంపేట, హైదరాబాద్)*

డా. వి. వింధ్యవాసినీ దేవి, *తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు*

కథలు, కవితలు, వ్యాసాల విభాగం

సంపాదకులు

డా. ఎస్. రఘు, *(సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు)*

ISSN 2766-0168 | అంతర్జాల త్రైమాస పత్రిక | www.prakasika.org | editor@prakasika.org

సంపాదకుని మాట

ప్రకాశిక ఆరవ వార్షిక సంచిక 2026

ఆరు వసంతాలు, ఆరు గ్రీష్మాలు ఆస్వాదించి ప్రకాశిక ఏడవ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఎన్నో ప్రత్యేక అంశాల మీద వ్యాసాలు ప్రముఖులతో రాయించి, కొన్నిటిని సంకలనం చేసి ముద్రణ రూపంలోకి తీసుకు వచ్చాము. వర్ధమాన, చేయితిరిగిన రచయితలు రాసిన కథలు, కవితలు, నాటికలు ప్రచురించాము. సాహితీవేత్తల, పాఠకుల ప్రోత్సాహంతో ప్రకాశిక తెలుగు సాహిత్య రంగంలో తనదైన స్థానం సంపాదించుకుంది. ప్రకాశిక పయనంలో సాయం చేసినవారెందరో – వారందరికీ పేరుపేరునా అక్షరాభివందనాలు.

ప్రకాశిక ఆరవ వార్షిక సంచికలో వైవిధ్యభరితమైన వ్యాసాలు, కథలు, కవితలు ఉన్నాయి. తంజావూరు ఆస్థానం నుంచి ఈనాటి అపార్ట్మెంట్ల మీద రాసిన రచనలన్నీ మనుషుల గురించే మాట్లాడుతున్నాయి. "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్నాడు గురజాడ. ఈ సంచికలో ఇద్దరు కవులు ఆ మాటను నేరుగా తలచుకున్నారు. మిగిలినవాళ్లు తలచుకోకుండానే తమ రచనల్లో చూపారు.

గురజాడ ఫౌండేషన్ పత్రిక కాబట్టి, గురజాడ ప్రకాశికలో ఎప్పుడూ ఉంటాడు. ఈసారి ఐదుగురు ఆయనను ఐదు కోణాల నుంచి చూశారు. డా. శిరీష ఈడ్పుగంటి గురజాడ అసంపూర్ణ నాటకం 'బిల్హణీయం' నాటకాన్ని సమగ్రంగా ఆధునిక దృష్టితో విశ్లేషించారు. "గురజాడ బిల్హణీయము" కేవలం ఒక రాజు, కవి, రాకుమారిల చుట్టూ తిరిగే పాతకాలపు ప్రణయగాథ కాదు. ప్రాచీన రాచరికపు భావజాలం నుంచి మొదలై, ఆధునిక ప్రజాస్వామిక విలువలను అన్వేషించిన విలక్షణ రచన ఇది" అని ఈ వ్యాసంలో ప్రతిపాదించారు. శ్రీశ్రీ గురజాడను మహాకవిగా ఏ ఆధారాలపై నిలబెట్టారో ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు పరిశీలించారు. 'ముత్యాలసరాలు'లోని కుల, మత, వర్ణ ప్రస్తావనలను డాక్టర్ ఢిల్లీశ్వరరావు సనపల తరచి చూశారు.

డా. శివరాత్రి సుధాకర్ గురజాడ కథల్ని తెలుగుజాతికి వెలుగుదారిగా చూశారు. వందేళ్ళ క్రితం మెటిల్డా "నా కాపురం మన్ననివ్వరా?" అని అడిగింది. ఆ ప్రశ్న 2026లోనూ వినిపిస్తూనే ఉందని ఆయన గుర్తుచేశారు.

సముద్రాల హరికృష్ణ గారిది ఒక చమత్కారమైన ప్రయోగం. గురజాడవారి వీథి గుమ్మం దగ్గర ఎవరో అలికిడి. "ఎవరమ్మా నీవు?" అంటే, "మధురవాణినండీ" అని జవాబు. సృష్టించిన పాత్రే సృష్టికర్తను వెతుక్కుంటూ వస్తే ఎలా ఉంటుందో ఆయన ఊహించారు. చదివి చూడండి.

ప్రాచీన సాహిత్యం వైపు నుంచి మూడు వ్యాసాలు వచ్చాయి. తంజావూరు

మరాఠా ఆస్థాన కవయిత్రి ముద్దుపళని 'రాధికాసాంత్వనము' అవతారికలో ఆమె ఆత్మగౌరవాన్ని, తనకు ముందున్న కవులతో ఆమె చేసిన సంభాషణను ఆచార్య గంపా వెంకటరామయ్య వెలికితీశారు. రాజాశ్రయంలో ఉంటూనే తన గొంతును కోల్పోని కవయిత్రి ఆమె.

రామకథను చెప్పిన కవులు ఎందరో. కానీ ఆ కథను లోకానికి ఇచ్చిన వాల్మీకినే నాయకుడిగా చేసి కావ్యం రాశాడు రఘునాథనాయకుడు. ఆ 'వాల్మీకి చరిత్రము'ను శ్రీ పొన్నపల్లి శ్రీరామారావు క్లుప్తంగా పరిచయం చేశారు. డా. దహగాం సాంబమూర్తి 'విజయ విలాసము' అభివ్యక్తి సౌందర్యాన్ని విపులంగా విప్పి చూపారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలను పరా, అపరా విద్యలుగా విభజించి, వాటి సాధన మార్గాలను శ్రీ సుంకరణం సీతారామమూర్తి వివరించారు.

అక్షరం రాజవీధులను వదిలి సామాన్యుడి ప్రాంగణంలోకి ఎలా అడుగుపెట్టిందో, పద్యం తన బిగింపును ఎలా వదులుకుందో, ఆధునిక తెలుగు కవిత్వంలోని వస్తు, రూప, శిల్ప పరిణామాలను ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు చాలా చక్కగా విశ్లేషించారు. ఆ దారిలో నడిచిన ఒక కవి తిలక్. "నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అన్న కవి, అదే కలంతో ప్రజాశక్తులను మోసే "విజయ ఐరావతాల" గురించీ రాశాడు. డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి ఆయనను తెలుగు సాహిత్యంలో చెరిగిపోని సంతకంగా చూపారు.

కథ వైపు, చాసో కథాశిల్పాన్ని డాక్టర్ సేనాపతి సత్యనారాయణ విశ్లేషించారు. కృత్రిమ అలంకారాలు లేవు. అతిశయోక్తులు లేవు. క్లుప్తంగా, పచ్చి నిజం – అదే చాసో. అల్లం రాజయ్య రచనల్లో తెలంగాణ రైతు, కూలీ, కార్మికుడి శ్రమనూ, పోరాటాన్నీ డాక్టర్ మానమ మునిరత్నం చర్చించారు.

అమెరికాలో ఉంటున్నవారికి డాక్టర్ రాజేశ్వరి దివాకర్ల వ్యాసంలోని అంశం దగ్గరి విషయం. 1998లో వంగూరి ఫౌండేషన్ ప్రచురించిన 'అమెరికా తెలుగు కవిత' సంకలనం నుంచి మొదలుపెట్టి, అమెరికాలో తెలుగు కవిత్వం ప్రయాణాన్ని ఆమె పరిశీలించారు. మొదటి తరం కవుల్లో ఇంటి బెంగ. ఇక్కడే పుట్టి పెరిగిన తరం మీద ఆశ. ఈ రెండింటి మధ్య నిలబడ్డ మనల్ని మనం ఈ వ్యాసంలో చూసుకుంటాం.

ఈసారి కథలు ఏడు. వాటిలో చాలావరకు ఇంటి గుమ్మం దగ్గరే మొదలవుతాయి. డా. దారల విజయ కుమారి 'అపార్ట్మెంట్'లో తలుపులన్నీ ఒకే రంగు. ఒకే సైజు. వాటి వెనుక జీవితాల మధ్య దూరం మాత్రం చాలా ఎక్కువ. 'ఫ్రైవసీ' అనుకున్న నిశ్శబ్దానికి ఒక రాత్రి ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చిందో ఈ కథ చెబుతుంది. సంతోష్ శర్మ లక్కరాజు 'కాంచి'లో కథ చెప్పేది ఒక చిన్న పిల్లవాడు. పెద్దల మాటలు అతనికి అర్థం కావు. మనకు అర్థమవుతాయి. ఆ అంతరంలోనే కథ బరువంతా ఉంది.

ఒడియా రచయిత్రి శ్రీమతి కమల సత్పతి కథను శ్రీ అంబల్ల జనార్దన్ 'పెళ్ళిచూపుల ప్రహసనం'గా తెలుగులోకి తెచ్చారు. టీ ట్రే పట్టుకుని మళ్లీ మళ్లీ పరీక్షకు నిలబడాల్సిన ఒక ఉద్యోగిని, చివరికి తన ఆత్మాభిమానాన్ని తానే కాపాడుకుంటుంది. ప్రభుత్వ ఆసుపత్రి ఎలా ఉందో, ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్కే తాను రోగిగా మారినప్పుడు తెలుస్తుంది – దీ.ఎ.మిత్ర 'జ్ఞానోదయం' ఒక చిన్న మలుపుతో పెద్ద విషయం

చెబుతుంది.

జె.డి. వరలక్ష్మి 'నాన్న మేల్కొలుపు'లో ఒక తండ్రి తన కొడుకుకు ఇవ్వాలనుకున్న ఆస్తి ఒక్కటే – తన అనుభవం. "నా దగ్గర అదే ఉంది" అంటాడాయన. సత్య 'యశోద తనయ'లో ఒక ఇంటికి ఆశ్రమం నుంచి ఒక బిడ్డ వస్తుంది. కన్నతల్లి కాకపోయినా తల్లి కావచ్చని కథ పేరే చెబుతుంది.

సుజాత జమ్మలమడక కథ పేరు గురజాడ పాట నుంచే వచ్చింది – 'గట్టి మేల్ తలపెట్టవోయ్'. కలెక్టర్ కాలేకపోయిన రఘు పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం నడుపుతాడు. అతని శిష్యుడు శ్యామ్ కలెక్టర్ అవుతాడు. "విజయం అంటే మనం చేరుకున్న శిఖరం మాత్రమే కాదు; మన వల్ల మరొకరు చేరుకున్న శిఖరం కూడా." ఈ ఒక్క వాక్యం కథ మొత్తాన్నీ మోస్తుంది.

శ్రీ మహ్మద్ షరీఫ్ కంద, తేటగీతి, ఆటవెలది పద్యాల్లో గురజాడకు నివాళి అర్పించారు. శ్రీ పేర్ల దాసు (దాసశ్రీ) 'దేశమంటే మనుషులు' అంటూ ఆ ఆశయాన్ని ఈనాటి సమాజానికి పిలుపుగా మార్చారు. "చెట్టు కులం అడగదు, కానీ నీడనిస్తుంది" అంటారు మొహమ్మద్ అఫ్సర వలీషా 'మానవత్వ దీపం'లో. వరదకు, భూకంపానికి ప్రకృతిని నిందించే ముందు మనల్ని మనం చూసుకోమంటారు మున్నంగి శ్రీనివాస్ 'మనిషి రాసిన శిక్ష'లో.

శైలజామిత్ర 'నిశ్శబ్దానికి ఒక చిరునామా' కవితలో ఒంటరితనం ఆకాశాన్ని అడుగుతుంది: "నాకూ ఒక చిరునామా ఉందా?" ఆచంట సుధాకళ్యాణి 'రేపటికై ముందడుగు' విద్యార్థికి అడ్డదారులు వద్దని, ఓటమి నుంచి నేర్చుకోమని చెబుతుంది. ఎం. అనంతలక్ష్మి 'విజ్ఞాన వనరులు'లో పుస్తకం మనిషికి మౌన మిత్రుడు.

ఈ రచనల్లోని అభిప్రాయాలు ఆయా రచయితలవి. వాటిని మీ చర్చకు, విమర్శకు ఉంచుతున్నాం. రచనలు పంపిన రచయితలందరికీ, పాఠకులకు మరోసారి కృతజ్ఞతలు.

పలువురు రచయితలను ప్రోత్సహించి వ్యాసాలు రాయించిన డాక్టర్ వింధ్యావాసిని గారికి, చాసో సాహిత్యం మీద వ్యాసం రాయడానికి డాక్టర్ సత్యనారాయణ గారిని ప్రోత్సహించిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి ధన్యవాదాలు.

ప్రకాశిక ఆరవ వార్షిక ప్రత్యేక సంచిక ప్రింట్‌లో అందుబాటులో ఉంటుంది. ప్రింట్ కాపీ భద్రపరచుకోవాలనుకునే వారు +91 99085 72598 నంబర్‌కి WhatsApp మెసేజ్ చేసి ఆర్డర్ చేసుకోవచ్చు.

రచయితల కోరిక మేరకు, రచనలను మరింత తరచుగా ప్రచురించాలనే ఉద్దేశంతో, ఇకపై ప్రకాశిక అంతర్జాల మాసపత్రికగా వెలువడనుంది. వివరాలు త్వరలో ప్రకటిస్తాము.

భవదీయుడు

డా. కొవ్వలి గోపాలకృష్ణ, ప్రధాన సంపాదకుడు, ప్రకాశిక

Editor@prakasika.org

ముఖచిత్రం



విషయ సూచిక

ఆధునిక తెలుగు కవిత్వంలో వస్తు, రూప, శిల్ప పరిణామాలు.	7
'తెలుగు సాహిత్యంలో చెరిగిపోని సంతకం' దేవరకొండ బాలగంగాధర తిలక్	23
గురజాడ బిల్హణీయము – సంప్రదాయ కథనంపై ఆధునిక ముద్ర	31
గురజాడ మహాకవి – శ్రీశ్రీ ప్రతిపాదనలు	35
గురజాడ ముత్యాలసరాలు – కుల, మత, వర్ణ ప్రస్తావన పరిశీలన	43
అమెరికాలో తెలుగు కవిత్వం	49
చాసో కథాశిల్పం – ఆయన స్థానం	55
అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజాజీవితం	63
గురజాడవారితో మధురవాణి	71
'రాధికాసాంత్వనము' అవతారిక – ముద్దుపళని అంతరంగం	79
రఘునాథనాయకుని "వాల్మీకి చరిత్రము" – లఘుపరిచయము!	89
తెలుగుజాతికి వెలుగుదారి గురజాడ కథలు	92
భారతీయ జ్ఞాన వ్యవస్థలు – జ్ఞాన సాధన పద్ధతులు	99
విజయ విలాసము – అభివ్యక్తి సౌందర్యము	105
గట్టి మేల్ తలపెట్టవోయ్...	169
కాంచి	119
పెళ్ళిచూపుల ప్రహసనం	121
అపార్ట్‌మెంట్	127
జ్ఞానోదయం	131
నాన్న మేల్కొలుపు	134
యశోద తనయ	137



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
+91 99896 28049

ఆధునిక తెలుగు కవిత్వంలో వస్తు, రూప, శిల్ప పరిణామాలు

ఉపోద్ఘాతం

సాధారణంగా సాహిత్యం సమాజానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. వెల్చేరు నారాయణరావుగారి అభిప్రాయంలో "లేఖన విద్య కవిత్వానికి అక్షర రూపం ఇచ్చి వూరుకో లేదు. అది కవితా సృష్టినీ, కవితా స్వరూపాన్నీ పూర్తిగా మార్చేసింది." (తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, పుట 5) ఆ విధంగా శతాబ్దాల పాటు లిఖిత సాహిత్యం పండితుల ఆస్థానాలకూ, రాజప్రాసాదాలకూ, పౌరాణిక, భక్తి ఇతివృత్తాలకూ పరిమితమైంది. ప్రజల నోళ్ళలోని కవిత్వం సాహిత్య చరిత్రలోకి రాలేదనే అభిప్రాయం కూడా ఉంది. అలా కొనసాగిన తెలుగు కవిత్వం ఆధునిక యుగ ప్రవేశంతో ఒక గొప్ప చారిత్రక పరిణామానికి లోనైంది. అక్షరం రాజవీధులను వదిలి సామాన్యుడి ప్రాంగణంలోకి అడుగుపెట్టింది. ఛందో, అలంకారాలు, కఠిన నియమాలతో కూడిన పద్యం తన బిగింపును వదులుకుని, మనిషి స్వేచ్ఛాకాంక్షకు, దైనందిన జీవితానికి అనుగుణంగా కొత్త రూపుదిద్దుకుంది. తెలుగు సమాజంలో కందుకూరి వీరేశలింగం (1848–1919), తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు (1862–1915) వేసిన ముందడుగు తెలుగు సాహిత్యంలో సమూలంగా మార్పు తీసుకొచ్చింది. రాయప్రోలు సుబ్బారావు (1892–1984) ఆధునికతకు ప్రయత్నించినట్లు కనిపించినా, అది నవ్య సంప్రదాయమే తప్ప, నేటి ఆధునికతకు సంబంధించిన వస్తుతత్వం సంపూర్ణంగా కనిపించదు. 'మనిషి'నే ప్రధాన కేంద్రంగా తీసుకున్న వస్తువు, ఛందో భిన్నత్వంతో ముత్యాలసరాల రూపంలోను మౌలికమైన మార్పు తీసుకొస్తూ గురజాడ అప్పారావుతో ప్రారంభమైన ఈ ఆధునిక కవిత్వ ప్రస్థానం, ఆ తర్వాత ఎన్నో సామాజిక ఉద్యమాలకు, వాదాలకు గొంతుకగా మారి తెలుగు సాహిత్య స్వరూపాన్ని సమూలంగా మార్చివేసింది. ఈ కవిత్వ ప్రయాణాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే అందులో వచ్చిన వస్తు, రూప, శిల్ప

సామాన్యుడి వాడుక భాషను (వ్యావహారికం) సాహిత్య భాషగా మార్చిన గిడుగు రామ్మూర్తి (1863-1940) కృషితో తెలుగు సాహిత్య దృక్పథంలో ఆధునికత బలంగా నాటుకుంది.



పరిణామాలను విశ్లేషించుకోవాలి. ఆధునిక సాహిత్యంలో తత్వం దృష్ట్యా చూసినప్పుడు అత్యధికంగా దేవుళ్లు, మహావీరుల స్థానంలో అట్టడుగు మనిషి కన్నీళ్లు, ఆకలి, ఆత్మగౌరవ పోరాటాలు కవిత్వానికి కేంద్ర 'వస్తువు'గా మారాయి. ఛందస్సుల పరిమితుల నుంచి విడివడి గేయం, వచన కవిత, దీర్ఘ కవిత వంటి స్వేచ్ఛాయుతమైన విభిన్న 'రూపాలను' కవిత్వం ఆలింగనం చేసుకుంది. అలాగే, ఆధునిక మానవుడి సంక్లిష్ట సంఘర్షణలను, సామాజిక వైరుధ్యాలను ఆవిష్కరించడానికి ప్రజల వాడుక భాష, సరికొత్త ప్రతీకలు, నిర్మాణ కౌశలంతో 'శిల్ప'పరంగానూ అద్భుతమైన మార్పులను సంతరించుకుంది. ఆధునిక తెలుగు కవిత్వం వస్తువులో విస్తృతిని, రూపంలో స్వేచ్ఛను, శిల్పంలో ప్రయోగశీలతను సాధించింది. ఛందోబద్ధ పద్యానికి సమాంతరంగా మొదలైన గేయం, వచన కవిత, దీర్ఘకవిత, మినీ కవిత, నానీ, హైకూ వంటి రూపాలే ఆధునిక కవిత్వమనేటట్లుగా తమ విశ్వరూపాన్ని చూపిస్తున్నాయి. మరొకవైపు ఛందోబద్ధమైన పద్యం వస్తున్నప్పటికీ, ఆ రూపం పాతరూపంలోనే ఉన్నా, సారం రీత్యా చూస్తే, ఆధునిక సమాజ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. పద్యంలో నవ్యసంప్రదాయ తత్వం సంతరించుకున్నా, వస్తుపరంగా ఆధునికతను అంగీకరించకతప్పలేదు. కవిత్వ భాష కూడా గ్రాంథికత నుంచి వ్యావహారికత వైపు, అక్కడి నుంచి ప్రజల జీవనభాష, ప్రాంతీయ మాండలికాలు, దళిత, బహుజన భాషా వ్యక్తీకరణల వైపు విస్తరించింది. ఈ పరిణామంలో శిల్పపరంగా కూడా ఎంతో వైవిధ్యాన్ని సాధించింది. తెలుగు కవిత్వం సాధించిన ఈ బహుముఖ వికాసాన్ని వస్తు, రూప, శిల్ప కోణాల నుంచి పరిశీలించే ప్రయత్నమే ఈ వ్యాసం.

సంస్కరణోద్యమాల ప్రభావం - ఆధునికత:

సంప్రదాయ లేదా ప్రాచీన సాహిత్యంలో పురాణ ఇతిహాసాలుగా దేవుళ్ల లీలలు, రాజుల పరాక్రమాలు, సంప్రదాయ శృంగారం మాత్రమే కావ్యాలకు ప్రధాన వస్తువులుగా ఉండేవి. ఆధునిక సాహిత్యంలో వస్తువు రాజప్రాసాదాల నుంచి సామాన్యుడి గడపలోకి వచ్చింది. సామాన్యుడి దైనందిన జీవితం, ఆకలి, పేదరికం, వర్గ పోరాటం, దళిత, బహుజన, స్త్రీవాద అస్తిత్వ వేదనలు, పర్యావరణ సంక్షోభం ఆధునిక సాహిత్య వస్తువులుగా మారాయి. తెలుగు సాహిత్యంలో 'ఆధునికత' అనేది కందుకూరి వీరేశలింగం గద్య రచనలు, సామాజిక సంస్కరణలతో బీజాలు వేసుకోగా, గురజాడ అప్పారావు సృజనాత్మక విప్లవంతో పూర్తిస్థాయిలో ప్రాణం పోసుకుంది. ప్రాచీన పండిత సంప్రదాయాలను, గ్రాంథిక భాషా పట్టింపులను పక్కనపెట్టి, సామాన్యుడి వాడుక భాషను (వ్యావహారికం) సాహిత్య భాషగా మార్చిన గిడుగు రామ్మూర్తి (1863–1940) కృషితో తెలుగు సాహిత్య దృక్పథంలో ఆధునికత బలంగా నాటుకుంది. "దేశమంటే మనుషులోయ్" అంటూ గురజాడ ఇచ్చిన మానవతావాద పిలుపుతో మొదలై, దేవులపల్లి కృష్ణశాస్త్రి (1897–1980) కాల్పనికతను, శ్రీశ్రీ (1910–1983) మార్క్సిస్టు వర్గపోరాట చైతన్యాన్ని, కుందుర్తి ఆంజనేయులు (1922–1982) వచన కవితా స్వేచ్ఛను, గుఱ్ఱం జాషువ (1895 – 1971), కాళోజీ నారాయణరావు (1914–2002)ల అస్తిత్వ ధిక్కారాన్ని తెలుగు రచయితలు ఆధునికతా లక్షణాలుగా తమ రచనల్లోకి ఆహ్వానించారు. స్థూలంగా చెప్పాలంటే, ఆధునికతను కేవలం పాశ్చాత్య అనుకరణగానే భావించడానికి వీల్లేదు. సమాజంలోని మూఢవిశ్వాసాలను, ఆర్థిక, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ, అట్టడుగు మనిషి ఆత్మగౌరవాన్ని, సమకాలీన జీవిత వాస్తవికతను సరికొత్త స్వేచ్ఛా రూపాల్లో కళాత్మకంగా ఆవిష్కరించే నిరంతర చైతన్యమే!

బ్రిటిష్ వారి రాకతో మన దేశంలోకి ప్రవేశించిన ఆంగ్ల విద్య, ఆధునిక ముద్రణాయంత్రం (Printing Press), ఆధునిక శాస్త్ర విజ్ఞానం, హేతువాదం, ఫ్రెంచ్ విప్లవ భావాలైన 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' వంటి సిద్ధాంతాలు భారతీయ మేధావులను ప్రభావితం చేశాయి. రాజా రామ్మోహన్ రాయ్ (1772–1833) నుంచి మన తెలుగు ప్రాంతంలో కందుకూరి వీరేశలింగం వరకు ఎంతోమంది ఆధునిక విద్యా విధానం ద్వారా ప్రపంచ దృక్పథాన్ని అలవర్చుకున్నారు. సతీసహగమనం,

బాల్యవివాహాలు, కన్యాశుల్కం మొదలైన సమాజంలోని దురాచారాలను శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించడానికి ఈ పాశ్చాత్య భావాలు ఒక ఆయుధంగా ఉపయోగపడ్డాయని చెప్పొచ్చు. అయితే, కేవలం పశ్చిమ దేశాల ప్రభావం వల్లే భారతదేశంలో సంస్కరణలు వచ్చాయంటే అది పొరబాటే. మన దేశంలో అంతకు ముందే భక్తి ఉద్యమం (బసవేశ్వరుడు, పోతులూరి వీరబ్రహ్మం, యోగి వేమన వంటి వారు) రూపంలోనూ, అంతకంటే ముందు బౌద్ధ, జైన సంప్రదాయాల రూపంలోనూ సమాజంలోని కుల వ్యవస్థను, మూఢవిశ్వాసాలను ఎదిరించే ప్రత్యామ్నాయ స్వదేశీ చైతన్యం వేళ్లూనుకుని ఉంది. ఇంగ్లీష్ సాహిత్యంతో పరిచయం పొందకముందే కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు గారు ఇక్కడి ప్రజల దీనస్థితిని చూసి చలించిపోయారు. పాశ్చాత్య భావాలు కేవలం వారి ఆలోచనలకు ఒక రూపాన్ని, హేతుబద్ధతను మాత్రమే ఇచ్చాయి; కానీ ఆవేదన మాత్రం స్వచ్ఛమైన భారతీయ నేలదే. ఇక్కడి సామాజిక రుగ్మతలను ఎదిరించే గుండెధైర్యం మన సమాజపు అంతర్గత సంక్షోభం నుంచే పుట్టింది. పాశ్చాత్య ప్రభావం అనేది ఒక 'దీపానికి అందిన గాలి లేదా నూనె' లాంటిది. కానీ మంట పుట్టడానికి కారణం మాత్రం మన సమాజంలో పేరుకుపోయిన అసమానతలు, అణచివేతలే. ఈ రెండింటి కలయికే మన దేశంలో, తెలుగు నేలలో గొప్ప సంస్కరణోద్యమాలకు దారితీసింది.

సాహిత్యపరంగా 'ఆధునికత' అనగా కేవలం కాలానికి సంబంధించిన వర్గీకరణ మాత్రమే కాదు; అది దశాబ్దాలుగా పాతుకుపోయిన పాత మూసలను బద్దలుకొట్టిన ఒక నూతన ఆలోచనా దృక్పథం, ఒక చారిత్రక చైతన్యం. దైవ కేంద్రక, రాజ కేంద్రక భావజాలం నుంచి సమాజం 'మానవ కేంద్రక' వ్యవస్థగా మారడమే ఆధునికత ప్రధాన లక్షణం. సంప్రదాయాలను గుడ్డిగా నమ్మకుండా హేతుబద్ధంగా ప్రశ్నించడం, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవ హక్కులు, ఆత్మగౌరవం, ప్రజాస్వామిక విలువలను ఎలుగెత్తి చాటడం దీని అంతస్సూత్రాలు. ఈ ఆధునికతా దృక్పథమే సాహిత్య వస్తువును ఆకాశం నుంచి నేల మీదకు, పండితుల ఆస్థానాల నుంచి సామాన్యుడి ముంగిట్లోకి తీసుకువచ్చింది. మారుతున్న యాంత్రిక జీవనం, వర్గ, వర్ణ వైరుధ్యాలు, అస్తిత్వ పోరాటాలు, మనిషి అంతరంగంలోని సంక్లిష్టతలను అక్షరీకరించడానికి కవులు పాత ఛందస్సులను వదిలి స్వేచ్ఛా వచనాన్ని (రూపం), నూతన ప్రక్రియలను, సరికొత్త ప్రతీకలను, అభివ్యక్తి వైవిధ్యాన్ని (శిల్పం) ఎంచుకునేలా చేసి, నేటి బహుముఖ సాహిత్య వికాసానికి ఆధునికత ఒక గొప్ప ఉత్ప్రేరకంగా నిలిచింది. ఇది తెలుగు కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది.

సాహిత్యంలో వస్తువు:

మనిషి తన జీవితంలో చూసినవి, అనుభవించినవి, వాటి గురించి ఆలోచించినవి, సామాజిక వాస్తవాలే సాహిత్యానికి అసలైన వస్తువులు. కవికి ముడిసరుకుగా ఉపయోగపడే జీవిత వాస్తవాలు, భావోద్వేగాలు, ఆలోచనల సమాహారమే 'వస్తువు'. అది కళాత్మకతను సంతరించుకున్నప్పుడు కావ్యంగా మారుతుంది. రచయిత నివసిస్తున్న సమాజంలోని వాస్తవికత, అట్టడుగు మనుషుల జీవితాలు, వర్గ వైరుధ్యాలే సాహిత్యానికి ప్రాణప్రదమైన వస్తువులు. ఒక కవిత లేదా కథ దేని గురించి బాహ్యంగా చెబుతుందో అది స్థూలంగా వస్తువు. ఆ వస్తువు ద్వారా రచయిత పాఠకుడికి అందించాలనుకునే కేంద్ర తాత్విక ఆలోచనను థీమ్ (Theme) అంటారు. కవి ఏ విషయాన్ని గురించి రాస్తున్నాడో తెలిపేదే 'వస్తువు'. ఆ ఎంచుకున్న వస్తువును పాఠకుడికి ఎలా అందిస్తున్నాడో (నిర్మాణం, భాష, శైలి) తెలిపేది 'శిల్పం' (Form/Art). జీవితంలోని ఒక సంఘటన, ఒక సామాజిక సమస్య, ఒక మానసిక భావోద్వేగం లేదా ఒక తాత్విక ఆలోచన ఏదైనా రచనకు వస్తువు కావచ్చు. సాహిత్య వస్తువుకి నిర్దిష్టమైన పరిమితులు లేవు; కానీ అది పాఠకుడికి ఒక కొత్త దృక్పథాన్ని లేదా గాఢమైన అనుభూతిని కలిగించే శక్తిని కలిగి ఉండాలి.

> **పాశ్చాత్య ప్రభావం అనేది ఒక 'దీపానికి అందిన గాలి లేదా నూనె' లాంటిది. కానీ మంట పుట్టడానికి కారణం మాత్రం మన సమాజంలో పేరుకుపోయిన అసమానతలు, అణచివేతలే. ఈ రెండింటి కలయికే మన దేశంలో, తెలుగు నేలలో గొప్ప సంస్కరణోద్యమాలకు దారితీసింది.**

సాహిత్యంలో రూపం:

'మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం, దానిలోని సమస్త వైరుధ్యాలు – వీటన్నింటి కళాత్మక ప్రతిఫలనం సాహిత్యంలో వస్తువు అవుతుంది. సాహిత్య వస్తువుకీ, సామాజిక వస్తువుకీ భేదం ఉంది. సాహిత్యంలో కనిపించేది సామాజిక వాస్తవికత కళాత్మక ప్రతిఫలనం' అని పాపినేని శివశంకర్ నిర్వచించారు. (సాహిత్యం – మౌలిక భావనలు, పుట 98).

సాహిత్య సృష్టిలో వస్తువు, రూపం, శిల్పం, ప్రక్రియ అనేవి ఒకదానితో ఒకటి విడదీయరాని అవినాభావ సంబంధం ఉన్న మూలస్తంభాలు.



ఆయనే దీన్ని మరింత స్పష్టంగా చెప్తూ 'ఒక కళాఖండం 'దేనిగురించి' అనే ప్రశ్నకు జవాబే వస్తువు. 'ఎట్లా' అనే ప్రశ్నకు జవాబే రూపం' (పుట 100) అని వివరించారు. అంటే 'రూపం' (Form) అనేది కేవలం వస్తువును కప్పి ఉంచే అలంకార ప్రాయమైన పైపూత కాదు; అది కావ్యానికి కళాత్మకతను ఆపాదించే ఒక నిర్మాణాత్మక వ్యవస్థ. ముడిసరుకుగా ఉన్న వస్తువును ఒక నిర్దిష్టమైన పద్ధతిలో ఆకృతి చేసి, పాఠకుడికి సమగ్రమైన అనుభూతిని కలిగించే సాధనమే రూపం. ఒక సాహిత్య రచనను ఏ విధంగా అమర్చారో, క్రమబద్ధీకరించారో నిర్ణయించే సూత్రమే రూపం. ఒక కవిత లేదా కావ్యంలోని వివిధ భాగాలు (పదాలు, వాక్యాలు, లయ) ఎలా ఒకదానితో ఒకటి కలిసి ఒక సమగ్ర నిర్మాణాన్ని ఏర్పరుస్తాయో ఇది వివరిస్తుంది (ఉదాహరణకు: పద్య ఛందస్సు, ముత్యాల సరాలు, గేయం, వచన కవిత, దీర్ఘ కవిత). నూతన విమర్శనా పద్ధతి ప్రకారం రూపం, వస్తువు విడదీయరానివి. కవిత్వం యొక్క 'నిర్మాణం' లేదా 'రూపం' దాని అర్థాన్ని స్వయంగా ఆవిష్కరిస్తుంది. కవితలోని పదాల అమరిక, వాక్య నిర్మాణం, బాహ్య స్వరూపమే ఆ కవిత యొక్క నిజమైన రూపం. కవి తన భావాలను వ్యక్తీకరించడానికి ఎంచుకునే నిర్దిష్ట వాహికే రూపం. కవిత్వం, నాటకం, నవల వంటి స్థూల ప్రక్రియా విభజనలతో పాటు, లోపలి నిర్మాణపరమైన అంశాలు (ఛందస్సు, వృత్తాలు, మాత్రా ఛందస్సు లేదా నేటి స్వేచ్ఛా వచనం – Free verse) అన్నీ సాహిత్య రూపం పరిధిలోకే వస్తాయి.

సాహిత్యంలో 'శిల్పం':

శిల్పం అనగా కవి ఎంచుకున్న వస్తువును పాఠకుడికి అత్యంత ప్రభావవంతంగా చేరవేయడానికి ఉపయోగించే కళాత్మక నైపుణ్యం. ఇందులో కవి వాడే భాష, పదాల కూర్పు (Diction), ప్రతీకలు (Symbols), ప్రతిమా విధానం (Imagery), ఉపమానాలు అంతర్భాగంగా ఉంటాయి. వస్తువు 'ఏమి చెప్పాలో' నిర్దేశిస్తే, ఆ చెప్పే విధానంలోని కళాత్మకతే 'శిల్పం'. కవి తనలోని భావోద్వేగాన్ని నేరుగా చెప్పకుండా, ఆ ఉద్వేగాన్ని పాఠకుడిలో రగిలించే ఒక దృశ్యాన్ని, వాతావరణాన్ని లేదా సంఘటనల పరంపరను సృష్టించడమే నిజమైన శిల్పం అని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఆధునిక తెలుగు కవిత్వ శిల్ప విశ్లేషణకు ఇదే ప్రధాన గీటురాయి. కవిత్వంలో పదాలు కేవలం అర్థాన్ని మాత్రమే కాకుండా, ఒక భావావేశాన్ని ఎలా సృష్టిస్తాయో ఈ గ్రంథం వివరిస్తుంది. భాషా శిల్పం, అలంకారాలు, లయ ద్వారా కవి పాఠకుడి నాడీమండలంపై ఎలా ప్రభావం చూపుతాడో వివరించే మనోవిజ్ఞానపరమైన విశ్లేషణ ఇది. కవితలో కవి ప్రయోగించే ప్రతి పదం శిల్ప నిర్మాణంలో ఒక ఇటుక లాంటిదని రిచర్డ్స్ పేర్కొన్నారు. కవిత్వ శిల్పంలోని ప్రధాన సాధనాలైన ప్రతిమా విధానం (Imagery), ప్రతీకలు (Symbols), ఉపమానాలు (Metaphors), శైలి (Style) తదితర అంశాలన్నీ శిల్పంలో భాగమే. అమూర్తమైన భావాలను మూర్తమైన (కళ్లకు కట్టినట్లుగా కనిపించే) పదచిత్రాలుగా మార్చడమే కవితా శిల్పం. ఉత్తమ కవిత్వ శిల్పం ఎప్పుడూ ఏకార్థాన్ని కాకుండా అనేక అర్థ ఛాయలను (Ambiguity / Multiple meanings) ఇవ్వొచ్చు. కవి వాడే ఒక పదం లేదా వాక్యం ఒకేసారి భిన్నమైన ఆలోచనలను రేకెత్తించగలగడం శిల్పపరమైన సంక్లిష్టతకు, కవి సాధించిన కళాత్మక విజయానికి నిదర్శనమని ఈ గ్రంథం తెలియజేస్తుంది.

సాహిత్యంలో వస్తు, రూప, శిల్పాలు:

సాహిత్య సృష్టిలో వస్తువు, రూపం, శిల్పం, ప్రక్రియ అనేవి ఒకదానితో ఒకటి విడదీయరాని అవినాభావ సంబంధం ఉన్న మూలస్తంభాలు. సైద్ధాంతికంగా పరిశీలిస్తే, కవి లేదా రచయిత తాను పొందిన అనుభూతిని, సమాజంలో చూసిన వాస్తవికతను లేదా అంతరంగిక ఆలోచనను ఏ కేంద్ర బిందువు ఆధారంగా చెప్పాలనుకుంటాడో అదే 'వస్తువు' (Content / Subject Matter). అంటే వస్తువు కావ్యానికి ప్రాణం లేదా 'ఏమి చెప్పాలి' అని నిర్దేశించే మూలపదార్థం. ఆ అమూర్తమైన వస్తువును పాఠకుడికి అనుభూతిగా మార్చడానికి కవి ఎంచుకునే నిర్దిష్టమైన ఆకృతి లేదా నిర్మాణ వ్యవస్థే 'రూపం'. ఇక, ఆ రూపంలో వస్తువును అత్యంత ప్రభావవంతంగా, రసవత్తరంగా అమర్చే కళాత్మక నైపుణ్యం 'శిల్పం' (Craft / Technique). కవి వాడే ప్రతీకలు, ప్రతిమా విధానం (Imagery), వస్తుగత శిల్పం, పదాల

కూర్పు అన్నీ ఈ శిల్పం కిందికే వస్తాయి. వస్తువు ముడిసరుకైతే, శిల్పం దానిని 'ఎలా చెప్పాలో' నిర్ణయించి రచనకు ప్రాణప్రతిష్ఠ చేస్తుంది.

ఈ వస్తు, రూప, శిల్పాల సమగ్ర సమ్మేళనమే ఒక నిర్దిష్టమైన 'ప్రక్రియ' ఆవిర్భావానికి దారితీస్తుంది. ఒక రచన యొక్క అంతర్గత లక్షణాలను (వస్తు స్వభావం), బాహ్య లక్షణాలను (నిర్మాణం) బట్టి దానిని కవిత్వం, నాటకం, నవల లేదా కథ వంటి ఒక వర్గంగా విభజించడాన్ని ప్రక్రియ అంటారు. పాశ్చాత్య విమర్శకులు రెనె వెల్లెక్, ఆస్టిన్ వారెన్ సిద్ధాంతీకరించినట్లుగా రూపం, వస్తువు వేర్వేరు కావు; అవి రెండూ ఒక కావ్య శరీరంలో విడదీయలేని భాగాలు. సమాజం, మానవ సంబంధాలు పరిణామం చెందే కొద్దీ నూతన వస్తువులు పుట్టుకొస్తాయి. ఆ కొత్త వస్తువు బరువును మోయడానికి పాత రూపాలు, పాత ప్రక్రియలు సరిపోనప్పుడు, రచయితలు కొత్త రూపాలను (ఉదాహరణకు: పద్యం నుంచి వచన కవితకు) మరియు కొత్త శిల్ప నిర్మాణాలను సృష్టించుకుంటారు. స్థూలంగా చెప్పాలంటే.. వస్తువు ఆత్మ అయితే, రూపం దాని దేహం, శిల్పం ఆ దేహంలోని ప్రాణస్పందన, ఈ మూడింటి జీవన గమనమే ఒక విశిష్టమైన సాహిత్య ప్రక్రియ.

సాహిత్య వస్తువు ఒక కవి లేదా రచయిత తన సృజనాత్మక రచనకు కేంద్రంగా ఎంచుకున్న మూల పదార్థం లేదా ప్రధానాంశం అవుతుంది. కవి తన అనుభవాన్ని, ఆలోచనను ఏ ఇతివృత్తం ద్వారా పాఠకుడికి చేరవేయాలనుకుంటాడో అదే ఆ రచనకు వస్తువు (Subject Matter) అవుతుంది. రూపపరమైన ఈ మార్పులకు అనుగుణంగా శిల్పం కూడా అలంకారకేంద్రిత స్థితి నుంచి ప్రతీక, బింబం, ధ్వని, వ్యంగ్యం, వాక్యవిరామం, పదవిన్యాసం, దృశ్యాత్మకత, మౌనం వంటి ఆధునిక అభివ్యక్తి సాధనాల వైపు పయనించింది. గురజాడ, రాయప్రోలు, దేవులపల్లి, శ్రీశ్రీ, దాశరథి, కాళోజీ, ఆరుద్రల నుంచి దళిత, స్త్రీవాద, విప్లవ, తెలంగాణ, బహుజన తదితర కవితా ఉద్యమాల వరకు సాగిన ఈ ప్రయాణం తెలుగు కవిత్వ స్వరూపాన్ని నిరంతరం పునర్నిర్మించింది. కాబట్టి ఆధునిక తెలుగు కవిత్వంలోని వస్తు, రూప, శిల్ప పరిణామాలను విడివిడిగా పరిశీలించడమే కాకుండా, వాటి పరస్పర సంబంధాన్ని గుర్తించడం అవసరం. ఎందుకంటే వస్తువు మారినప్పుడు రూపం మారుతుంది; రూపం మారినప్పుడు శిల్పం కొత్త వ్యక్తీకరణను వెతుక్కుంటుంది. ఈ మూడింటి సమన్వయమే ఆధునిక కవిత్వానికి ప్రత్యేకమైన సౌందర్యాన్ని, సామాజిక ప్రయోజనాన్ని, చారిత్రక ప్రాసంగికతను కల్పించింది.

సాహిత్యంలో 'ప్రక్రియ'

ప్రక్రియను ఆంగ్లంలో Genre అంటారు. అనగా ఒక రచనను దాని నిర్మాణ లక్షణాలు, వస్తు స్వభావాన్ని బట్టి ఒక నిర్దిష్టమైన వర్గంలో (Category) చేర్చడం. కవిత్వం, నాటకం, నవల, చిన్నకథ, వ్యాసం వంటివన్నీ వివిధ సాహిత్య ప్రక్రియలు. కవి ఏ వాహిక ద్వారా తన వస్తువును పాఠకుడికి చేరవేస్తున్నాడనేది ప్రక్రియ నిర్ణయిస్తుంది. ప్రక్రియ అనగా కేవలం బాహ్య నిర్మాణం (Outer form – ఛందస్సు, వాక్య నిర్మాణం) మాత్రమే కాదు, అంతర్గత లక్షణాలు (Inner form – వస్తువు, దృక్పథం, స్వభావం) రెండింటి ఆధారంగా సాహిత్య రచనలను ఒక వర్గంగా (Group) విభజించడమే ప్రక్రియ. ఒక రచనను పాఠకుడికి లేదా ప్రేక్షకుడికి ఎలా అందిస్తున్నారు అనే 'ప్రదర్శనా విధానాన్ని' బట్టి ప్రక్రియల విభజన జరుగుతుంది. 'Genre' (ప్రక్రియ) అనే పదం ఫ్రెంచ్ భాష నుంచి వచ్చిందని, దీని అర్థం 'రకం' (Type) లేదా 'తరగతి' (Class) అని అబ్రామ్స్ వివరించారు. కవిత్వం, నాటకం వంటి స్థూల విభజనలే కాకుండా, ఆ కవిత్వంలోనే మళ్లీ పద్యం, గేయం, వచన కవిత, దీర్ఘ కవిత వంటి సూక్ష్మ విభజనలను కూడా ప్రక్రియల పరిణామంగానే పరిగణిస్తారు.

> **సాహిత్య వస్తువు ఒక కవి లేదా రచయిత తన సృజనాత్మక రచనకు కేంద్రంగా ఎంచుకున్న మూల పదార్థం లేదా ప్రధానాంశం అవుతుంది. కవి తన అనుభవాన్ని, ఆలోచనను ఏ ఇతివృత్తం ద్వారా పాఠకుడికి చేరవేయాలనుకుంటాడో అదే ఆ రచనకు వస్తువు అవుతుంది.**

ప్రాచీన కవిత్వం నుండి ఆధునిక కవిత్వం వరకు:

ప్రాచీన కవిత్వంలో దేవుళ్లు, రాజుల చుట్టూ తిరిగిన ఇతివృత్తాలు ఆధునిక యుగంలో సామాన్యుడి వైపు మళ్లాయి. దీనికి తొలి అడుగుగా 'భావ కవిత్వం' ప్రకృతి ఆరాధన, స్వేచ్ఛా ప్రణయం, మానవతావాదాలను ప్రధాన వస్తువుగా స్వీకరించింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షం'లో కనిపించే ఆత్మాశ్రయ శైలి, రాయప్రోలు సుబ్బారావు 'తృణకంకణం'లో వ్యక్తమైన అమలిన శృంగారం ఈ కవిత్వానికి ప్రతినిధులుగా నిలుస్తాయి. బాహ్య

కుందుర్తి ఆంజనేయులు "వచన కవిత" అనే పదాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చి, 1958లో "ఫ్రీవర్స్ ఫ్రంట్" సంస్థను స్థాపించి నూతన కవులను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రక్రియను బలిష్టమైన ఉద్యమంగా మలిచారు. అందుకే ఆయనను "వచన కవితా పితామహుడు" అని పిలుస్తారు.



ప్రపంచం కంటే కవి అంతరంగం, వ్యక్తిగత స్వేచ్ఛ, మానవత్వపు విలువలకే ఈ దశలో పెద్దపీట వేసి కవిత్వాన్ని కాల్పనిక జగత్తులోకి తీసుకెళ్లారు. అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు రచించిన "నేటికాలపు కవిత్వం" (1928) అనే గ్రంథం 1920ల కాలంలో విరివిగా ప్రచారంలో ఉన్న భావకవిత్వంపై తీవ్రమైన విమర్శలు గుప్పించి తెలుగు సాహిత్యంలో పెద్ద సంచలనం రేపింది. భారతీయ సంప్రదాయాలను, ప్రాచీన కావ్య నియమాలను, అలంకారిక శాస్త్రాలను పక్కనబెట్టి స్వేచ్ఛ పేరిట భావకవులు రాస్తున్న కవిత్వాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కాలపు కవిత్వంలో నూతనత్వం పేరిట శబ్దవాచ్యత, పులుముడు, అయోమయత్వం, భావసంకోచం, పాశ్చాత్య అనుకరణ మరియు క్షుద్ర శృంగార ధోరణులు వ్యాపించాయని, ఇవి కావ్యగుణాన్ని తగ్గించి దోషాలుగా మారాయని ఆయన సిద్ధాంతపూర్వకంగా, తర్కబద్ధంగా విమర్శించారు. ఆంగ్ల సాహిత్యంలోని "ఫ్రీ వర్స్" (Free Verse) ప్రేరణతో, కఠినమైన ఛందోబద్ధ నియమాలను, వ్యాకరణాన్ని సంకెళ్లుగా భావించి, దాన్ని పక్కనపెట్టి కేవలం అంతర్గత లయ, సామాజిక స్పృహలతో రూపుదిద్దుకున్న ప్రక్రియే "వచన కవిత్వం". 1930ల కాలంలో సాంప్రదాయక పద్యాలపై, భావకవిత్వంపై వచ్చిన నిరసన ఫలితంగా శిష్టా ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి వంటి కవులు వచన కవితా ధోరణికి పునాదులు వేశారు. పఠాభి (తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి) "వచన పద్యం" అనే పదాన్ని ప్రయోగించాడు. 1938లో వెలువడిన శిష్టావారి "నవమి చిలుక" కవితా సంపుటి తొలి వచన కవితా సంపుటిగా పేరు పొందింది. దీని ద్వారా వచన కవిత్వం కొత్త దారి తొక్కింది. శిష్టా ఉమామహేశ్వరరావు తన కవిత్వాన్ని "ప్రహ్లాద కవిత్వం" అని పిలుస్తూ, అది ఆరిపోయే దీపాన్ని రగుల్చుతుందని, పరుగెత్తే పామరుణ్ణి నిలదీస్తుందని తన కవిత్వ తత్వాన్ని స్పష్టం చేశారు; అయితే, ఆయన భావ కవిత్వంపై తీవ్ర తిరుగుబాటు చేసినప్పటికీ, తెలుగు కవిత్వానికి ఒక స్పష్టమైన క్రొత్తబాట వేయలేదని ప్రముఖ కవి సినారె అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత కుందుర్తి ఆంజనేయులు "వచన కవిత" అనే పదాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చి, 1958లో "ఫ్రీవర్స్ ఫ్రంట్" సంస్థను స్థాపించి నూతన కవులను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రక్రియను బలిష్టమైన ఉద్యమంగా మలిచారు. అందుకే ఆయనను "వచన కవితా పితామహుడు" అని పిలుస్తారు. ఆయన రాసిన "నగరంలో వాన" వంటి కావ్యాలు ఈ ప్రక్రియకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. ప్రారంభంలో దువ్వూరి రామిరెడ్డి, నోరి నరసింహశాస్త్రి వంటి సాంప్రదాయ పండితులు వచన కవిత్వాన్ని హేళన చేస్తూ తీవ్రంగా విమర్శించినప్పటికీ, కాలక్రమేణా ఇది ప్రధాన సాహిత్య ప్రక్రియగా ఎదిగింది. వ్యావహారిక భాషను స్వీకరించడం, సామాజిక స్పృహతో దోపిడీ మరియు అసమానతలను ప్రశ్నించడం, స్వేచ్ఛాయుత భావవ్యక్తీకరణ, తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని పలికించే అభివ్యక్తి నైపుణ్యం, సమకాలీన ఆశలు – ఆకాంక్షలను ఆవిష్కరించడం వల్ల ఇది సామాన్యుడికి ఎంతో చేరువయ్యింది. చివరికి సి. నారాయణరెడ్డి గారు రాసిన "విశ్వంభర" వచన కావ్యానికి ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ పురస్కారం లభించడంతో వచన కవిత్వానికి అంతర్జాతీయ స్థాయిలో మహాకావ్య గౌరవం లభించి, తెలుగు సాహిత్యంలో అత్యున్నత స్థానం స్థిరపడింది.

'ప్రాచీన కవిత్వానికి భరతవాక్యంగా, ఆధునిక కవిత్వానికి నాందీవాక్యంగా' భావించే తిరుపతి వేంకటకవులు పద్యంలోనే సరళంగా రాశారు తప్ప, వచనంలో రాయలేదు (రామమోహన్ రాయ్, 20వ శతాబ్ది తెలుగు కవిత్వం, పుట 2). చెళ్ళపిల్ల వేంకటశాస్త్రిగారు దళితుల ఆలయ ప్రవేశాన్ని వ్యతిరేకించారు. ఇలాంటి ఆధునికతకు తిరుపతి వేంకటకవులు వ్యతిరేకులు. కట్టమంచి రామలింగారెడ్డిగారి 'ముసలమ్మమరణం' కావ్యం నవ్య కాంతులతో ఆవిర్భవించిందని పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పినా, అది ఛందోబద్ధంగానే కొనసాగింది. 1910లో 'మాలవాండ్ర పాట'లో ఒక అజ్ఞాతకవి కుల ధర్మాన్ని వ్యతిరేకించడం కనిపిస్తున్నా, అది హిందూ మతంలో అంతర్భాగంగా కొనసాగాలనే దృక్పథంతో కొనసాగింది. 1911లో గురజాడ అప్పారావు 'లవణరాజుకల'లో "మలినదేహుల మాలలనుచును మలిన చిత్తుల కధిక కులముల నెలవొసంగిన వర్ణధర్మ మధర్మ

ధర్మధర్మంబే" అని ఖండించి, "మంచిచెడ్డలు మనుజులందున ఎంచి చూడగ రెండె కులములుఞ మంచియన్నది మాలయైతే మాలనే అగుదున్" అని తన ఆధునిక దృక్పథాన్ని స్పష్టంగా ప్రకటించారు. ఈ గేయాన్ని వస్తుపరంగాను, రూపపరంగాను నవ్యత్వానికి నాందీగీతంగా చెప్పొచ్చు. "సంఘసంస్కార ప్రేరకమైన "లవణరాజుకల, కన్యక, పూర్ణమ్మ, మనిషి, లంగరెత్తుము" మొదలైన కావ్యాలు రచించి ఆయన జాతికి నిద్దురమత్తు వదిలించి, నవ చైతన్యాన్ని కలిగించారు. కవిత్వమంటే సామాన్య జనులకు దూరమైన బరువుభాషలో వుండనక్కరలేదని ఋజువు చేశార"ని కడియాల రామమోహన్ రాయ్ చేసిన వ్యాఖ్య (పుట 46) కవిత్వంలో వచ్చిన వస్తుపరిణామానికి నిదర్శనంగా కనిపిస్తుంది. పాశ్చాత్య ప్రభావంతో రొమాంటిసిజమ్ ప్రభావంతో భావకవిత్వం వచ్చి తొలుత ప్రకృతిని ఆరాధించేలా చేసింది. తర్వాత వ్యక్తిగతమైన అనుభూతుల కేంద్రంగా మారిపోయింది. కృష్ణశాస్త్రి ప్రభావం ఆ కాలంలోని ఇంచుమించు అందరిపైనా ప్రభావం చూపించింది. అందుకే తొలినాళ్ళలో శ్రీశ్రీ కూడా భావకవిత్వం రాశాడు. భావకవిత్వ ప్రభావమే విశ్వనాథ సత్యనారాయణ 'కిన్నెరసాని పాటలు' రాయించింది. నండూరి సుబ్బారావుగారి 'ఎంకిపాటలు'లో ప్రేమతో పాటు పల్లె జీవనంలోని నిష్కల్మషమైన సౌందర్యాన్ని తెలియజేసిన పాటలు తెలుగు కవిత్వాన్ని పరిమళింపజేశాయి. అయితే, అదే కాలంలో జీవించిన గుఱ్ఱం జాషువా కవిత్వం లేకుండా ముద్దు కృష్ణగారి 'వైతాళికులు' ప్రచురించడం తెలుగు కవిత్వ పరిణామంలో గుర్తించాల్సిన ఒక రచనగా మిగిలిపోయింది. అయితే, భావకవిత్వం పట్ల సదభిప్రాయంలేని జాషువా మాత్రం సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న కుల, మత ఘర్షణలకు ప్రాధాన్యాన్నిస్తూనే, గబ్బిలం, గిజిగాడు, సాలీడు వంటి వాటిలో ఉదాత్తమైన కవిత్వాన్ని వర్ణించాడు. భావకవిత్వాన్ని హేళన చేస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి 'కృష్ణ పక్షము' నకు వ్యతిరేకంగా అనంతపంతుల రామలింగస్వామి 'శుక్లపక్షము' రచించారు. 1930 నాటికి భారతదేశంలో ఆర్థిక మాంద్యం పెరుగుతున్నప్పుడు, దేశకాల పరిస్థితులను పట్టించుకోని భావకవిత్వాన్ని ప్రేయసి మెల్లకన్నుమీద కవిత్వం అల్లుతున్నారని మహాప్రస్థానానికి రాసిన యోగ్యతా పత్రంలో చలం నిరసించడం ఈ సందర్భంగా గమనించాలి. తెలుగు కవిత్వంలో భావకవిత్వం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, అది కలిగించిన ప్రభావం సామాన్యమైంది కాదు. భావకవులు తెలుగు పద్య రచనలోనూ, ఛందస్సులోనూ కొన్ని విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. సాంప్రదాయ పద్యాల లాగా నియమబద్ధంగా పద్యం పూర్తి కావాలని వారు భావించలేదు. పద్యంలో పాదం మధ్యలోనే భావం ముగిసిపోతే, అక్కడితోనే పద్య విరమణ చేసి తర్వాతి భావానికి వెళ్లారు. పద్యం ఏ వృత్తమో, జాతో తెలిపే పద్యనామాలు లేదా "ఉ-చ-మ-శా" (ఉత్పలమాల, చంపకమాల వంటి) సూచికలను పద్యానికి ముందు వదిలేశారు. పద్యాలను సాంప్రదాయ పద్ధతిలో నాలుగు పాదాలుగా కాకుండా, ఆధునిక కవితల్లాగా 6 నుండి 8 పంక్తులుగా విడగొట్టి అచ్చు వేయడం ప్రారంభించారు. ఇలా వస్తువులోను, రూపంలోను, అభివ్యక్తి (శిల్పం)లోను కొత్తదనాన్ని కలిగించిందని చెప్పవచ్చు.

భావకవిత్వం తర్వాత వచ్చిన అభ్యుదయ కవిత్వానికి మార్క్సిజమే ప్రధాన భూమికగా కనిపించినా, ఆ కాలంలోనే కవిత్వంలో ప్రయోగాలు చేయడం కూడా కనిపిస్తుంది. ఇది రూపంలోను, శిల్పంలోను వచ్చిన ఒక పరిణామంగా భావించాలి.

భావకవిత్వం తర్వాత వచ్చిన అభ్యుదయ కవిత్వానికి మార్క్సిజమే ప్రధాన భూమికగా కనిపించినా, ఆ కాలంలోనే కవిత్వంలో ప్రయోగాలు చేయడం కూడా కనిపిస్తుంది. ఇది రూపంలోను, శిల్పంలోను వచ్చిన ఒక పరిణామంగా భావించాలి.

అందుకనే "అభ్యుదయ కవులు ఛందస్సుపై తిరుగుబాటు చేశారు. కొత్తదనంకోసం అఱ్ఱులు చాచారు. తొలితరం అభ్యుదయ కవులలో శిష్ట్లా ఉమామహేశ్వర రావు, శ్రీశ్రీ, నారాయణబాబు, ముద్దుకృష్ణ, జలసూత్రం, పాలగుమ్మి పద్మరాజు, పఠాభి, పురిపండా ప్రముఖులు. వీరిని 'ప్రయోగవాదులు'గా తలచవచ్చు" అని కడియాల రామమోహన్ రాయ్ వ్యాఖ్యానించారు. (పుట 68) భావకవిత్వానికి నాయకుడిగా కనిపించే దేవులపల్లి కృష్ణశాస్త్రి అభ్యుదయ సాహిత్యం అంటే ఏమిటో నిర్వచిస్తూ "పీడింపబడేవాళ్ళు, పీడించేవాళ్ళు ఉన్న యీ వర్గసమాజం ఉండాలని ఎవరూ కోరరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించేవారు ఎప్పుడూ అభ్యుదయ వాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలని కోరుకోవటమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొని రాసేది

తెలుగులో వచన దీర్ఘ కావ్యం 'విశ్వంభర' తదితర రచనలకు జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన కవి సినారె, ఏ ఇజానికీ కట్టుబడి కవిత్వం రాయని కవిగా కనిపిస్తారు. తనది మానవత్వమే కేంద్రమంటారు. అంటే మానవతావాదాన్ని కేంద్రం చేసుకున్న కవిత్వం వచ్చింది.



అభ్యుదయ రచన" అని అన్నారు. (అభ్యుదయ రచయితల తృతీయ మహాసభ – అధ్యక్షోపన్యాసము; దేవులపల్లి కృష్ణశాస్త్రి 'తెలుగు తల్లి' మార్చి, 1946.) ఒకవైపు అభ్యుదయ కవిత్వం కొనసాగుతున్న క్రమంలోనే తెలంగాణా ప్రాంతంలో నిజాం నవాబు దుశ్చర్యలను ఖండిస్తూ దాశరథి, తిరునగరి ఆంజనేయులు, కాళోజీ నారాయణరావు తదితరులు కవిత్వం రాశారు. తెలంగాణ ఉద్యమంపై ఇంగ్లీష్‌లో హరీంద్రనాథ్ చటోపాధ్యాయ రాసిన 'టేల్స్ ఆఫ్ తెలంగాణ' కావ్యాన్ని ఆరుద్ర "వీరతెలంగాన విప్లవగాథలు" పేరుతో అనువాదం చేశారు. దీనితో పాటు 'త్వమేవాహమ్' కావ్యంలో ప్రయోగవాదం కూడా గమనించాలి. దీని తర్వాత 'పఠాభి' (తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి) 'వచన పద్యాలనే దుడ్డుకర్రలతో పద్యాల నడుములు విరగదంతాను' అనడం ఒక వచన కవితా రూపానికి దక్కిన ఆదరణను, అవసరాన్ని తెలియజేస్తుంది. "ఇది నా కవిత్వం గీత / వినేవాడు నరుడు/చదువు సంధ్యలు రాని రోడ్డుమీద పామరుడు/లేమితల్లి యొడిలో నిరంతర గాఢనిద్రా పరుడు" అని సామాన్యుని కోసం కలంపట్టి అభ్యుదయ మార్గంలో నడిపించిన కవి కుందుర్తి ఆంజనేయులు. ఈ కాలంలోనే 'దేవుడా రక్షించు నాదేశాన్ని' అంటూ భావాభ్యుదయ దృక్పథంతో కవిత్వం రాసిన బాలగంగాధర తిలక్ తెలుగు కవిత్వంలో అమృతాన్ని కురిపించాడు. రాయలసీమ కన్నీటి పాటను, కరువుని కవిత్వం చేసినవాడు విద్వాన్ విశ్వం. శ్రామికుల కోసం ఆవంత్స సోమసుందర్ 'వజ్రాయుధం' కవిత్వం రాశాడు. అది ప్రభుత్వ నిషేధానికి గురైంది. కవిత్వం ప్రజల్ని ఉద్యమకారులను చేస్తుందని భయపెట్టిన కవిత్వంగా అది నిలిచిపోయింది. "నలభై కోట్ల ప్రజా / విప్లవ కంఠం నా గీతం / నేనెదిగిన మట్టి నాది / నాదేయని ఘోషిస్తా" అని ప్రజల పక్షాన కవిత్వం రాసిన వాడు అనిసెట్టి. ఆధునిక మానవుని నిస్సహాయతను, మానసిక సంఘర్షణను చిత్రించిన కవిత్వం అజంతా 'స్వప్నలిపి'లో కనిపిస్తుంది.

తెలుగులో వచన దీర్ఘ కావ్యం 'విశ్వంభర' తదితర రచనలకు జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన కవి సినారె, ఏ ఇజానికీ కట్టుబడి కవిత్వం రాయని కవిగా కనిపిస్తారు. తనది మానవత్వమే కేంద్రమంటారు. అంటే మానవతావాదాన్ని కేంద్రం చేసుకున్న కవిత్వం వచ్చింది. యూరోపు దేశాలలో వచ్చిన రియలిజమ్, ఇమేజిజమ్, ఫ్యూచరిజమ్, క్యూబిజమ్, డాడాయిజమ్, సర్రియలిజం (అధివాస్తవికత) మొదలైన కళాసాహిత్య సిద్ధాంతాల ప్రభావంతో తెలుగులో కొంతమంది కవిత్వం రాశారు. ఇది వస్తు, రూపాల్లోనే కాదు, శిల్పంలో కూడా చెప్పుకోదగ్గ పరిణామమే. "కాకికేమి తెలుసు psychoanalysis? /ఆటవెలది ద్విపదకత్తగారు/5, 3, 2, ఆముక్త మాల్యద/విశ్వదాభిరామ వినురవేమ" అని శ్రీశ్రీ వంటి కవులే అధివాస్తవిక కవిత్వం రాశారు. తెలుగు కవిత్వంలోకి అధివాస్తవికత ప్రవేశిస్తున్న దశలో సర్రియలిజమ్‌కు సమానార్థకంగా "విజయ నగరంలో శ్రీశ్రీ, నారాయణబాబు, చాసో, ఆరుద్ర, బహుశా రోణంకి కలిసి పిచ్చాపాటీగా తలా తమకు తోచిన ఒక అక్షరం తీసి "స్వజేళజం" అనే అపూర్వ అనర్థ శబ్దాన్ని సృష్టించారు గాని అది నిలవలేదు. ఫ్రాయిడ్ సిద్ధాంతం చెప్పే 'సబ్ కాన్షస్' (అవ్యక్త) మనశ్చైతన్యాన్ని చిత్రించి, వ్యాఖ్యానించే ఈ కవిత్వం సాహిత్యాది కళల్లో హేతు బుద్ధిని తిరస్కరించి, సందర్భాన్నీ, ఔచిత్యాన్నీ, పొందికనీ, అమరికనీ తిరస్కరించే ఒకానొక వికటరీతిగా బయల్పడింది" అని కె.వి.రమణారెడ్డి గారు వ్యాఖ్యానించారని రామమోహన్ రాయ్ ఆయన అభిప్రాయాన్ని తన పుస్తకంలో ఉటంకించారు. (పుట 97)

ప్రయోగవాద కవిత్వం తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్దపు మధ్యకాలంలో, ముఖ్యంగా 1950ల ప్రాంతంలో ఒక ప్రత్యేక ధోరణిగా రూపుదిద్దుకుంది. అప్పటివరకు సాగిన భావకవిత్వపు అతిసుకుమారత్వాన్ని, కాల్పనికతను తిరస్కరిస్తూ, కవిత్వంలో సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ధోరణి ఇది. వస్తుపరంగా, ఈ కవిత్వం సామాన్యుడి దైనందిన జీవిత సంక్షోభాన్ని, నగర నాగరికత తెచ్చిన ఒంటరితనాన్ని, మనోవైజ్ఞానిక విశ్లేషణలను (Psychological analysis) ప్రధానాంశాలుగా చేసుకుంది. రూపం మరియు శిల్పం పరంగా, సాంప్రదాయ ఛందస్సును పూర్తిగా పక్కనబెట్టి స్వేచ్ఛా

ఛందస్సును (Free Verse/వచన కవిత్వం) స్థిరపరిచింది. సాంప్రదాయ ఉపమానాల స్థానంలో నిత్యజీవితంలో కనిపించే సరికొత్త ప్రతీకలను (Symbols), కాంతి-చీకటి లాంటి దృశ్యరూపాలను (Imagery) కవిత్వ శిల్పంలో ప్రవేశపెట్టింది. ఆరుద్ర రాసిన 'త్వమేవాహమ్', 'సినీవాలి', కుందుర్తి ఆంజనేయులు (వచన కవితా పితామహుడు) రచనలు, మరియు తిలక్ రాసిన 'అమృతం కురిసిన రాత్రి' ఈ ప్రయోగవాద శిల్పానికి, తెలుగు వచన కవిత్వ వికాసానికి అత్యున్నత ఉదాహరణలు.

20వ శతాబ్దపు ద్వితీయార్ధంలో, ముఖ్యంగా 1980ల తర్వాత తెలుగు సాహిత్యంలో సరికొత్త సామాజిక చైతన్యం వెల్లువెత్తింది. సాంప్రదాయ, అభ్యుదయ, విప్లవ కవిత్వాల పరిమితులను అధిగమిస్తూ తమ సొంత అస్తిత్వాన్ని, ఆవేదనను చాటుకోవడానికి దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళిత, మైనారిటీ, ప్రాంతీయ వాద కవిత్వాలు ఉద్భవించాయి. ఇవి వస్తువు (Theme), రూపం (Form), శిల్పం (Technique) పరంగా విప్లవాత్మకమైన పరిణామాలను తీసుకువచ్చి, కవిత్వ భాషను అట్టడుగు ప్రజలకు, వాస్తవికతకు మరింత దగ్గర చేశాయి.

దిగంబర కవిత్వం 1960ల మధ్య కాలంలో (1965-1970) తెలుగు సాహిత్య రంగంలో ఒక పెద్ద సంచలనంగా, సాంప్రదాయ విలువలకు వ్యతిరేకంగా ఉద్భవించింది. నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, భైరవయ్య, మహాస్వప్న అనే ఆరుగురు కవులు ఒక సమూహంగా ఏర్పడి, సమాజంలోని కుళ్ళును, బూటకత్వాన్ని, రాజకీయ అవినీతిని కడిగిపారేయడానికి ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. వస్తుపరంగా, వీరు వ్యవస్థలోని దగాను, దోపిడీని, కపటత్వాన్ని తీవ్రంగా నిరసించారు. రూపం, శిల్పం పరంగా, అప్పటివరకు ఉన్న ఛందస్సును, అలంకారిక అందాలను, భావకవిత్వపు సుకుమారత్వాన్ని పూర్తిగా తిరస్కరించి, అత్యంత పదునైన, పచ్చిగా ఉండే వాడుక భాషను, కఠినమైన పదజాలాన్ని ఆయుధంగా మలచుకున్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను కళ్ళకు కట్టినట్లు చూపించడానికి బీభత్స రసాన్ని, విప్లవాత్మక ప్రతీకలను తమ శిల్పంలో భాగం చేశారు. సమాజంలో మార్పు కోసం అలజడి సృష్టించిన ఈ దిగంబర కవుల ధోరణి, తర్వాతి కాలంలో వచ్చిన విప్లవ కవిత్వానికి బలమైన పునాది వేసింది.

విప్లవ కవిత్వం 1970ల ప్రారంభంలో, ముఖ్యంగా శ్రీకాకుళ, నక్సల్బరీ సాయుధ పోరాటాల ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ఒక శక్తిమంతమైన ఉద్యమంగా ఉద్భవించింది. కమ్యూనిస్టు భావజాలం, మార్క్సిజం - లెనినిజం పునాదులపై ఏర్పడిన ఈ ధోరణికి ప్రధాన చోదక శక్తిగా విప్లవ రచయితల సంఘం (విరసం) నిలిచింది. వస్తుపరంగా, ఈ కవిత్వం వర్గపోరాటం, భూస్వామ్య వ్యవస్థ నిర్మూలన, కార్మిక - కర్షక శ్రమదోపిడీ, సాయుధ విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. రూపం, శిల్పం పరంగా, అలంకారిక శైలిని పక్కన పెట్టి, ప్రజలను చైతన్యపరిచే పదునైన వచన కవిత్వాన్ని, విప్లవ గీతాలను ప్రధాన రూపాలుగా మలచుకుంది. ప్రజా బాహుళ్యానికి సులువుగా చేరువ కావడానికి జానపద బాణీలను, విప్లవాత్మక ప్రతీకలను (ఉదాహరణకు: ఎర్రజెండా, తుపాకీ, అరుణోదయం, రక్తాక్షరాలు) తమ శిల్పంలో అద్భుతంగా వాడుకున్నారు. శ్రీశ్రీ రాసిన 'మరో ప్రస్థానం', చెరబండరాజు కవిత్వం, మరియు శివసాగర్, గద్దర్ల విప్లవ ప్రజా గేయాలు విప్లవ కవిత్వ శిల్పానికి, తెలుగు సమాజంలో అది సృష్టించిన రాజకీయ - సాంస్కృతిక చైతన్యానికి అద్దం పడతాయి.

స్త్రీవాద కవిత్వం: పితృస్వామ్య వ్యవస్థపై

విప్లవ కవిత్వం 1970ల ప్రారంభంలో, ముఖ్యంగా శ్రీకాకుళ, నక్సల్బరీ సాయుధ పోరాటాల ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ఒక శక్తిమంతమైన ఉద్యమంగా ఉద్భవించింది. కమ్యూనిస్టు భావజాలం, మార్క్సిజం - లెనినిజం పునాదులపై ఏర్పడిన ఈ ధోరణికి ప్రధాన చోదక శక్తిగా విప్లవ రచయితల సంఘం (విరసం) నిలిచింది.

తిరుగుబాటుగా, స్త్రీల ఆత్మగౌరవాన్ని, శరీర అస్తిత్వాన్ని చాటుతూ వచ్చింది. వస్తుపరంగా గృహహింస, పురుషాధిక్యత, లైంగిక వేధింపులు, స్త్రీల శ్రమదోపిడీ ప్రధానాంశాలయ్యాయి. రూపం మరియు శిల్పంలో సాంప్రదాయక అందచందాల ఉపమానాలను తోసిరాజని, నేరుగా హృదయానికి నాటుకునే పదునైన వచన కవితా శైలిని, సరికొత్త ప్రతీకలను (Symbols) వాడారు. ఓల్గా సంపాదకత్వంలో వచ్చిన 'నీలి మేఘాలు' కవితా సంకలనం ఈ ధోరణికి ఒక మైలురాయిగా నిలిచింది. ఉదాహరణకు, కవయిత్రి విమల రాసిన "వంటిల్లు" కవితలో వంటగదిని స్త్రీల శతాబ్దాల అణచివేతకు ప్రతీకగా చూపడం మరియు కొండేపూడి నిర్మల గారి 'నడిచే గాయాలు' కవితా సంపుటి స్త్రీవాద శిల్ప పరిణామానికి ఉత్తమ నిదర్శనాలు.

వచన కవిత్వంలో జానపద కవిత అనే ఒక విశిష్ట కవితారూపాన్ని కసిరెడ్డి వెంకటరెడ్డిగారు గుర్తించారు. గతులకు ఒదగని కవితల్ని స్వరకవితల క్రింద పరిశీలించాలనే ఉద్దేశంతోనే ఈ ప్రక్రియ గేయకవితలో అంతర్భాగమైనదని అంటున్నారు.



దళిత కవిత్వం: శతాబ్దాల నాటి కుల వివక్ష, అస్పృశ్యత, సామాజిక బహిష్కరణలకు వ్యతిరేకంగా పెల్లుబికింది. వస్తుపరంగా ఆత్మగౌరవ పోరాటం, శ్రమ సౌందర్యం, చారిత్రక అన్యాయాలపై ధిక్కారం చోటుచేసుకున్నాయి. రూపం మరియు శిల్పంలో అట్టడుగు వర్గాల నిత్యజీవిత భాషను, శక్తిమంతమైన మాండలికాలను, పల్లె పదాలను వాడుతూ గ్రంథస్థ శైలిని బద్దలు కొట్టారు. దీని మూలాలు మునుపటి కుసుమ ధర్మన్న "హరిజన శతకము", జాషువా "గబ్బిలము" లలో ఉన్నప్పటికీ, ఆధునిక కాలంలో శివసాగర్ గారి 'నల్ల జెండాలు', సతీష్ చందర్ గారి 'పంచమ వేదం', ఎండ్లూరి సుధాకర్ గారి 'కొత్త గబ్బిలం', 'వర్తమానం' కావ్యాలు దళిత జీవిత శిల్పాన్ని, ఆత్మగౌరవాన్ని మరింత శక్తిమంతమైన ప్రతీకలతో ఆవిష్కరించాయి.

మైనారిటీ కవిత్వం: సమాజంలో ముస్లిం మరియు ఇతర మైనారిటీలు ఎదుర్కొంటున్న సాంస్కృతిక అభద్రతాభావం, మత వివక్ష, అస్తిత్వ సంక్షోభాన్ని ప్రధాన వస్తువుగా చేసుకుంది. ముస్లిం మహిళల బురఖా, తలాక్ వంటి అంతర్గత సామాజిక సమస్యలు కూడా ఇందులో ప్రతిబింబించాయి. శిల్పంలో ఉర్దూ మిశ్రిత తెలుగు పదజాలం (ఉదా: జిహాద్, జనాజా, దస్తర్‌ఖాన్) మరియు ముస్లిం సాంస్కృతిక ప్రతీకలను ఉపయోగించి విలక్షణమైన రూపాన్ని సంతరింపజేశారు. ఉదాహరణకు, స్కైబాబా రాసిన 'జల్‌జలా' (భూకంపం) కవితా సంకలనం ముస్లింల ఆవేదనను బలంగా వినిపించగా, షాజహానా గారి 'నఖాబ్', 'దర్గా' వంటి కవితలు ముస్లిం స్త్రీల స్వేచ్ఛను ఆకాంక్షిస్తూ మైనారిటీ అస్తిత్వ వేదనను సమాజం ముందుంచాయి.

ప్రాంతీయ వాద కవిత్వం (అస్తిత్వ కవిత్వం): ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ వంటి ప్రాంతాలలో జరిగిన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వివక్షకు వ్యతిరేకంగా ఉద్భవించింది. వస్తుపరంగా ఆయా ప్రాంతాల భౌగోళికత, నదులు, కరువు, వలసలు, బతుకమ్మ, పీర్ల పండుగ వంటి సాంస్కృతిక అంశాలు ప్రధానాంశాలయ్యాయి. రూపం మరియు శిల్పంలో స్వచ్ఛమైన మాండలిక భాష (Dialect), జానపద గేయ రీతులు, మట్టి జీవన ప్రతీకలను అత్యంత శక్తిమంతంగా వాడారు. ఉదాహరణకు, నందిని సిధారెడ్డి రాసిన 'భూమి స్వప్నం', "నాగెటి చాలల్లో నా తెలంగాణ" మరియు గోరటి వెంకన్న గేయ సంపుటులైన 'రేల పూతలు', 'అల సెంద్రవంకసెంద్రసంద్ర వంక' వంటి రచనలు ప్రాంతీయ శిల్ప సౌందర్యానికి, మట్టి మనుషుల శ్రమకు అద్దం పట్టే ప్రతీకలుగా నిలిచాయి.

◆ ◆ ◆

కవిత్వమా? వచనమా?

కవిత్వానికి, వచనానికి సరిహద్దురేఖలు లేకపోవడం వచనకవిత్వంలో వచ్చిన ఒక మార్పు లేదా పరిణామంగా విమర్శకుల పరిశీలనను తెలియజేస్తుంది. 'కవిత్వానికి, వచనానికి మధ్య గల సరిహద్దు రేఖను చెరిపి వేయటమేగాక, వచనంలోను పంక్చుయేషన్, సింటాక్స్ పాటించని అతి నవీన కవి 'మో'. ఈ కవి మనోవల్మీకపు వ్యక్తావ్యక్తాలాపన 'పునరపి'. ఇందులో 'దుఃఖస్మితం'.. 'రాచపుండు' విశేషమైన కవితలు' పేర్కొనదగినవని 1993లో వచ్చిన వచన కవితల పరిణామాన్ని విశ్లేషిస్తూ '1993లో తెలుగు కవితావికాసం' అనే వ్యాసంలో కడియాల రామ్మోహనరాయ్ (సాహితీ సమాలోచనం, యువభారతి, 1994, పుట 143) వ్యాఖ్యానించారు. ఇలాంటి కవిత్వాన్ని తర్వాత కాలంలో అఫ్సర్, సీతారాం, ప్రసేన్ వంటి వాళ్ళు రాశారు. కవిత్వమే ముఖ్యం తప్ప, అది పాదాల రూపంలో ఉందా? లేదా? అనేదాన్ని పెద్దగా పట్టించుకోని ఒక ఆలోచన వచనకవిత్వంలో కనిపిస్తుందని భావించడానికి ఇటువంటి ప్రయోగాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

చిత్రకవిత & ఫోటో కవిత:

'చిత్రకవిత & ఫోటో కవిత'ను ఒక ప్రక్రియగా చెప్పడాన్ని అందరూ అంగీకరించకపోవచ్చుననీ, అయితే, ఒకప్పుడు చెప్పకున్నా ఇప్పుడు చాలా పత్రికల్లో రోజూ వస్తున్న చిత్ర కవితల్ని (బొమ్మతోపాటు వ్యాఖ్యాన పద్యగద్య గేయాల్ని), ఫోటో కవితల్ని (ఫోటోతోపాటు వ్యాఖ్యాన పద్యగద్య గేయాల్ని) సంఖ్యదృష్ట్యా పరిగణనలోకి తీసుకొని, ఇదికూడా పరిశీలనార్హమైందే అని ఒక

ప్రక్రియగా భావిస్తున్నట్లు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ('1993లో తెలుగు కవిత' వ్యాసం, సాహితీ సమాలోచనం, యువభారతి, 1994, పుట 110) కవితలు రాసిన తర్వాత చిత్రమో ఫోటోనో వేయించి (తీయించి) గ్రంథాలకు గ్రంథాలే ప్రచురించినవారున్నారు. అలా గ్రంథాలుగా వచ్చినవీ, పత్రికల్లో అనునిత్యం వస్తున్నవి పరిశీలిస్తే, ఈ సంవత్సరం కొన్ని వందల చిత్ర, ఫోటో కవితలు వచ్చినట్లు తెలుస్తున్నది. అందుకే ఈ శీర్షిక పెట్టారని ఆయన వివరించి, గజ్జెల మల్లారెడ్డిగారి కవితను ఉదాహరించారు. "లౌకికవాద విశిష్టత / లోకానికి చెప్పవచ్చు / ప్రజాస్వామ్య సిద్ధాంతం/పంచాంగం విప్పవచ్చు/ఓటుకొరకు విజృంభించి / వెన్నుపోటు పొడవవచ్చు /ఆ మీదట తీరిగ్గా / అశ్రువులను విడువవచ్చు." చిత్రాక్షరాల సమ్మేళనం వల్ల ఈ కవిత ఎలాంటి పఠితనైనా చదివించే విధంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇక ఫోటో కవితలు కూడా ఆయా పత్రికల్లో వస్తూనే ఉన్నాయి. అయితే గ్రంథాలుగా వచ్చినవి తక్కువ అనే చెప్పాలి. "అయోధ్యలో 36 గంటలు" అనే ఓ కార్డు సైజు చిన్న పుస్తకం వచ్చింది. ఇందులో 24 ఫోటోలున్నాయని పేర్కొన్నారు. (అదే: పుట 110,111) దీన్ని బట్టి వచన కవిత్వంలో రూపపరమైన పరిణామంలో దీన్ని ఒక పరిణామంగా గుర్తించవచ్చు.

జానపద కవిత:

వచన కవిత్వంలో జానపద కవిత అనే ఒక విశిష్ట కవితారూపాన్ని కసిరెడ్డి వెంకటరెడ్డిగారు గుర్తించారు. గతులకు ఒదగని కవితల్ని స్వరకవితల క్రింద పరిశీలించాలనే ఉద్దేశంతోనే ఈ ప్రక్రియ గేయకవితలో అంతర్భాగమైనదని అంటున్నారు. అయితే ఊనికను బట్టి, స్వర ధైర్ఘ్యాన్ని బట్టి దానిని ఏదో ఒక గతి క్రింద పరిశీలించవచ్చుననే అభిప్రాయం కూడా ఉందని ఆయనే పేర్కొన్నారు. స్వరానికి ఉన్న ప్రాధాన్యాన్ని బట్టి ఈ జానపద బాణీల్లోని కవితల్ని 'స్వరకవిత' అనవచ్చునని ఆయన అన్నారు. దీనికి ఒక ఉదాహరణగా ఈ కవితను చూడొచ్చు.

"పల్లవి: మానుకో ఈ రోత సారానూ/తాగుడు/మానితే నీ రాతే మారేనూ

చరణం: ఇప్పపువ్వు సారబెట్టి/తిప్పల పడుబోకన్నా /ఇంటిలోని సారబట్టి/కొంప కెసరు పెట్టునన్న/ఎద్దు ఎవుసం మాని/పొద్దంతా తాగుడాయె/తల్లి తాగె, పిల్ల తాగె/మూల్గే ముసలోడు తాగే/బిమానుకో ఈ రోత సారానూ" మందాడి సత్యనారాయణ రెడ్డి, నాగపురి రాజమౌళి రాసిన 'జనచైతన్య గీతాలు' గ్రంథంలో ఉన్నాయని సోదాహరణంగా చూపించారు. పల్లవి ఖండగతిలో, చరణం త్రిశ్రగతిలో నడిచాయి. అయితే అక్కడక్కడ కనిపించే స్వర ధైర్ఘ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. అందుకే వీటిని గేయాల్లో కాక జానపద కవితలుగా ప్రత్యేకంగా పరిశీలించానన్నారు. ఈ లాంటి గేయాలు వందలకొలది వచ్చినై. పదుల కొలది సంపుటాలు, సంకలనాలు వచ్చినై" అని కూడా కసిరెడ్డిగారు రాశారు.

పేరడీ కవితలు కూడా వచన కవిత్వంలో ఒక భాగంగా కనిపిస్తాయి. ప్రసిద్ధమైన కవితలు లేదా పద్యాల శైలి, లయ, ఛందస్సులను అనుకరిస్తూ, పదాలను, వస్తువును మార్చి హాస్యం, వ్యంగ్యం లేదా సామాజిక విమర్శను పండించడానికి రాసే కవిత్వాన్ని పేరడీ కవిత్వం అని పిలుస్తారు. ఇది సుపరిచితమైన మూల కవితలోని ఉదాత్తతకు, పేరడీలోని తేలికపాటి లేదా వ్యంగ్య వస్తువుకు మధ్య ఉండే వైరుధ్యం ద్వారా పాఠకులను అలరిస్తూనే, కేవలం వినోదం కోసం రాసే హాస్య పేరడీ, సమాజంలోని సమస్యలను ఎత్తిచూపే సామాజిక పేరడీ, నాయకుల వైఫల్యాలను ఎద్దేవా చేసే రాజకీయ పేరడీ, నిర్దిష్ట కవుల శైలిని అనుకరించే వ్యక్తిగత పేరడీ అనే విభిన్న రూపాల్లో

> **విశ్వ సాహిత్యంలో గజల్, రుబాయత్ ప్రక్రియలలో గుర్తింపు పొందిన కవులలో ఉమర్ ఖయ్యామ్, మిర్జా గాలిబ్, మౌలానా రూమి, షేఖ్ సాదీ, మహమ్మద్ ఇక్బాల్ మరియు అమ్జద్ హైదరాబాదీలు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందారు.**

సామాజిక, రాజకీయ, నిత్య జీవిత వాస్తవాలను ప్రభావవంతంగా ఆవిష్కరిస్తుంది. శ్రీశ్రీ మహాప్రస్థానగీతానికి ఛాయలో మరో ప్రస్థాన గీతం అంటూ రామకృష్ణశర్మ ఇలా రాశాడు.

"స్పందించు భారత్ /సాధించు భారత్

శాంతిశంఖం పలికించు భారత్

బహుజనస్వామ్యం భాసించు భారత్

జీవించు భారత్ /జయించు భారత్" అని సాగుతుంది. ఇది శ్రీశ్రీ 'గర్జించు రష్యా' గేయానికి అనుకృతి. తెలుగు వచన కవిత్వంలో పేరడీ వికాసం కేవలం ఛందోబద్ధ పద్యాల అనుకరణలకే పరిమితం కాకుండా వస్తువు, రూపం, శిల్ప రంగాల్లో సృజనాత్మక పరిణామాన్ని సాధించింది. ప్రాచీన, సాంప్రదాయక ప్రమాణాల అనుకరణతో ఆరంభమై, వచన

వచన కవిత్వంలో వచ్చిన పరిణామాలను తెలుసుకోవడానికి, కవుల చేతిరాతలను గుర్తించడానికి ఉపయోగపడే "పాయెట్రీ వర్క్‌షాప్" పుస్తకాన్ని డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ రూపొందించారు.



కవిత్వ యుగంలో రూపాంతరం చెందుతూ సమకాలీన సామాజిక అశాంతి, రాజకీయ కుంభకోణాలు, నిరుద్యోగం, నగర జీవన వైరుధ్యాలనే వస్తువులుగా స్వీకరించింది. రూపం పరంగా ముక్త ఛందస్సు, మాత్రాబద్ధ గేయ నడకలు, మినీ కవితా నమూనాలు మరియు వచన నాటికా శైలులను స్వీకరించి విస్తరించగా, శిల్పం పరంగా తీవ్రమైన భావజాలాన్ని తేలికపాటి పదబంధాలు, చిలిపి వ్యంగ్యం, వ్యంగ్యచిత్రణ (Satire), అసంబద్ధ ప్రకటనల (Irony) ద్వారా తిరగరాయడం ముఖ్యలక్షణంగా మారింది. ఈ క్రమంలో శైలీపరమైన అననుకూలతను (Dissonance) సృష్టించడం ద్వారా మూల కవితలోని తీవ్రతను ప్రశ్నిస్తూనే, ప్రజాస్వామిక స్పృహతో నిత్య జీవిత వాస్తవాలను సమర్థవంతంగా ఆవిష్కరించే పదునైన ప్రక్రియగా స్థిరపడింది.

గజల్ రూపం:

తెలుగు కవిత్వంలో ఉర్దూ ప్రభావం వల్ల గజల్, రుబాయి అనే ప్రక్రియలు ప్రవేశించి విశేష ప్రాచుర్యం పొందాయి. రెండు పాదాల జంటలను 'షేర్' అని పిలుస్తూ, ఖాఫియా (ప్రాస), రదీఫ్ (పునరావృత పదం) నియమాలతో, ప్రేమ, వేదన, ఆధ్యాత్మిక భావాలను వ్యక్తీకరించే ప్రక్రియను గజల్ అంటారు; దీనిలో మొదటి షేర్ను 'మత్లా' అని, కవి ముద్ర ఉండే చివరి షేర్ను 'మఖ్తా' అని వ్యవహరిస్తారు. మరోవైపు, 'నాలుగు' అనే అర్థం గల రుబాయి కేవలం నాలుగు పాదాల చుట్టూ తిరిగే కవితా రూపం, దీనిలో మొదటి, రెండు మరియు నాల్గవ పాదాలు ఒకే ప్రాసను కలిగి ఉండి, క్లుప్తంగా తాత్విక చింతనను, జీవిత సత్యాలను బోధిస్తాయి. దాశరథి కృష్ణమాచార్య, డా. సి. నారాయణ రెడ్డి వంటి మహాకవులు ఈ రెండు ప్రక్రియలను తెలుగులోకి తెచ్చి అత్యంత ప్రజాదరణ కల్పించారు. విశ్వ సాహిత్యంలో గజల్, రుబాయత్ ప్రక్రియలలో గుర్తింపు పొందిన కవులలో ఉమర్ ఖయ్యామ్, మిర్జా గాలిబ్, మౌలానా రూమి, షేఖ్ సాదీ, మహమ్మద్ ఇక్బాల్ మరియు అమ్జద్ హైదరాబాదీలు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందారు. వీరి స్ఫూర్తితో తెలుగు సాహిత్యంలో గజల్స్ రాసి ప్రాచుర్యం కల్పించిన వారిలో దాశరథి కృష్ణమాచార్యులు, డా. సి. నారాయణ రెడ్డి (సినారె), డా. పెన్నా శివరామకృష్ణ, గజల్ శ్రీనివాస్ ముఖ్యులు కాగా; తెలుగులో రుబాయిలను సమర్థవంతంగా నడిపిన వారిలో తిరుమల శ్రీనివాసాచార్య, సామల సదాశివ, ఎండ్లూరి సుధాకర్, అద్దేపల్లి రామ్మోహన్ రావు, ఏనుగు నరసింహారెడ్డి, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి వంటి ప్రముఖ కవులు, కవయిత్రులు ఉన్నారు. తిరుమల శ్రీనివాసాచార్య పూర్తిస్థాయి నియమాలను (రదీఫ్, ఖాఫియా) పాటిస్తూ తెలుగులో తొలిగా రుబాయిలు రాసిన కవిగా ఈయనను పేర్కొంటారు. సామల సదాశివ ఉర్దూ కవి అమ్జద్ హైదరాబాదీ రాసిన రుబాయిలను తెలుగులోకి అనువదించారు. గజల్ వస్తువు, రూపాన్ని గమనించడానికి వీలుగా సి.నారాయణరెడ్డిగారి ప్రసిద్ధమైన ఒక గజల్ పేర్కొంటున్నాను.

"పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని? మూగనేలకు నీరందివ్వని వాగుసరుగు దేనికని?

తాతలు తాగిన నేతుల సంగతి నీతులుగా పలికెను మన సంస్కృతి జల్లుకు నిలవని ఎండకు ఆగని చిల్లుల గొడుగు దేనికని?

ఆదర్శాలకు నోళ్లు చాలవు ఆశయాలకు పైళ్లు చాలవు పదపదమంటూ పలుకులెగానీ కదలని అడుగు దేనికని?

జలవిద్యుత్తుకు కరువే లేదు జనసంపత్తికి కొరవే లేదు అవసరానికి మీట నొక్కితే అందని వెలుగు దేనికని?

శిశుహృదయానికి కల్లలు లేవు రసరాజ్యానికి ఎల్లలు లేవు లోపలి నలుపు 'సినారె'కు తెలుసు పైపై తొడుగు దేనికని?" (సినారె, తెలుగు గజళ్లు, పుట 8) సి.నారాయణరెడ్డి (సినారె) రచించిన ఈ గజల్ సమాజంలోని ఆడంబరాలను, బోలుతనాన్ని, ఆచరణలేని ఆదర్శాలను పదునైన శిల్పంతో ఎండగడుతుంది. 'పరులకోసం పాటుపడని నరుని బ్రతుకు దేనికని' అంటూ స్వార్థపూరిత మానవ జీవిత నిరర్థకతను సూటిగా ప్రశ్నిస్తూ ఆరంభమయ్యే ఈ గజల్, పూర్వవైభవాన్ని పొగిడే మన సంస్కృతి

వర్తమాన కష్టాలను తీర్చలేకపోవడాన్ని 'చిల్లుల గొడుగు'తో పోల్చి సంప్రదాయ అహంకారాన్ని ఎండగడుతుంది. ఆదర్శాల ప్రగల్భాలకు, కార్యరూపం దాల్చని నిశ్చలత్వానికి మధ్య ఉన్న అంతరాన్ని నిలదీస్తూ, జలవిద్యుత్తు మరియు జనసంపత్తి పుష్కలంగా ఉన్నా అవసరానికి అందని వెలుగుల రూపంలో మన వ్యవస్థలోని అసంబద్ధతలను, పాలకుల నిర్లక్ష్యాన్ని ఆవిష్కరిస్తుంది. చివరగా, పసిపాపల స్వచ్ఛతను, రసరాజ్య నిరపేక్షతను ఆదర్శంగా చూపుతూ, మనుషుల అంతరంగంలోని కల్మషాలను దాచే 'పైపై తాడుగు' వ్యర్థమని స్వీయ ముద్రతో (సినారె) ముగించడం ద్వారా అంతరంగాన్ని శుద్ధి చేసుకోవాలనే దార్శనిక సందేశాన్ని, నిత్య జీవిత రూపకాలతో ఎంతో ఆకట్టుకునేలా ఈ గజల్ ప్రబోధిస్తుంది. తెలుగు కవిత్వంలో గజల్, రుబాయి ఒక ప్రత్యేక రూపంగా కనిపిస్తున్నాయనేది వీటిని బట్టి తెలుస్తుంది.

వచన కవిత్వంలో వచ్చిన పరిణామాలను తెలుసుకోవడానికి, కవుల చేతిరాతలను గుర్తించడానికి ఉపయోగపడే "పొయెట్రీ వర్క్‌షప్" పుస్తకాన్ని డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ రూపొందించారు. ఇది 1862 – 1962 సంవత్సరాల మధ్య పుట్టిన వందమందికి పైగా తెలుగు కవుల చేతి రాతలు ఉన్న కవితల సంకలనం. గురజాడ నుంచి యాకూబ్ వరకు ఉన్న విభిన్న తరాల కవుల ఛాయాచిత్రాలతో పాటు వారి కవితల చిత్తు ప్రతులను, తుది ప్రతులను ఇందులో పొందుపరిచారు.

రేడియో, దూరదర్శన్ కవిత్వాన్ని శ్రవ్య వచన కవిత్వంగా చెప్పుకోవచ్చు. క్యాసెట్ రూపంలో గేయాలు, (ఉదా: భక్తి గేయాలు, జానపద గేయాలు), వచన కవిత్వం (ఉదా: పైడి తెరీష్ బాబు 'హిందూ మహాసముద్రం') అనే దీర్ఘకావ్యం.

తెలుగు వచన కవిత్వం వరకట్నం, వధువు అగ్నిపరీక్ష, సారా నిషేధం, భూకంపం, బాల వెట్టి కార్మికులు, బస్సు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, గోరక్షణ, నేతకార్మికులు, గీతకార్మికులు, డంకెల్ వ్యతిరేకత, కాశ్మీరు కాందిశీకులు, పాకిస్థాన్ – బంగ్లాదేశ్‌ల చొరబాటుదారులు, సంతృప్తీకరణ విధానం, స్కాం కుంభకోణం, షేర్ల కుంభకోణం, ఎయిడ్స్, ధూమపానం, అప్పులు, ఎరువులు, లంచాలు, రాజకీయ హత్యలు, విదేశీ రుణాలు, తిరుగుబాటు ధోరణులు, నగర జీవితంలోగల నీళ్ళు పాలు సమస్యలు, దేశద్రోహం, మతోన్మాదం, పర్యావరణ కాలుష్యం వంటి వైవిధ్యభరితమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు ప్రాపంచిక అంశాలన్నింటినీ తన ప్రధాన వస్తువులుగా స్వీకరించి నిత్య జీవిత వాస్తవికతను ఆవిష్కరించింది.

రూప పరిణామం (ఛందస్సు నుంచి స్వేచ్ఛా ప్రకటనకు):

భావప్రకటనకు అడ్డంకిగా ఉన్న సంప్రదాయ సంకెళ్లను తెంచుకుని కవిత్వం కొత్త రూపాలను సంతరించుకుంది.

మాత్రా ఛందస్సు – గేయాలకు గురజాడ అప్పారావు 'ముత్యాల సరాలు'తో ప్రారంభమైన మార్పు గీతాలు, గేయాలకు ప్రాణం పోసింది. వచన కవిత్వం (Free Verse)గా శిష్ట్లా ఉమామహేశ్వరరావుతో ప్రారంభమైనా, కుందుర్తి ఆంజనేయులు ఉద్యమంగా తెచ్చిన వచన కవిత్వం, నేటికీ ప్రధాన సాహిత్య వాహికగా కొనసాగుతోంది. దీర్ఘ కవితలు, దీర్ఘ కావ్యాలు కూడా రూప పరంగా వచ్చిన మార్పులే. ఒకే వస్తువును లేదా తాత్వికతను లోతుగా, సమగ్రంగా ఆవిష్కరించడానికి దీర్ఘ కవితలు నేడు అత్యంత బలమైన రూపంగా స్థిరపడ్డాయి. సంక్షిప్త రూపాలుగా నానీలు, హైకూలు, రెక్కలు వంటి మినీ కవితలు తక్కువ పదాల్లో ఎక్కువ భావాన్ని చెప్పే రూపాలుగా ప్రాచుర్యం పొందాయి.

మాత్రా ఛందస్సు – గేయాలకు గురజాడ అప్పారావు 'ముత్యాల సరాలు'తో ప్రారంభమైన మార్పు గీతాలు, గేయాలకు ప్రాణం పోసింది. వచన కవిత్వం (Free Verse)గా శిష్ట్లా ఉమామహేశ్వరరావుతో ప్రారంభమైనా, కుందుర్తి ఆంజనేయులు ఉద్యమంగా తెచ్చిన వచన కవిత్వం, నేటికీ ప్రధాన సాహిత్య వాహికగా కొనసాగుతోంది.

మాత్రా ఛందస్సు – గేయాలు: సంప్రదాయ పద్య ఛందస్సులైన వృత్తాల కఠిన నియమాల నుంచి కవిత్వానికి విముక్తి కల్పిస్తూ ఆధునిక యుగంలో పుట్టిన తొలి నూతన రూపం మాత్రా ఛందస్సు. మహాకవి గురజాడ అప్పారావు ఛందస్సును పూర్తిగా విస్మరించకుండానే, వాడుక భాషకు అనువైన నూతన లయను జోడించి 'ముత్యాల సరాలు' అనే కొత్త గేయ రూపానికి ప్రాణం పోశారు. ఆధునిక భావాలను సామాన్యుల దరికి చేర్చడానికి ఈ గేయ, గీత రూపాలు ఎంతో దోహదం చేశాయి. తదనంతర కాలంలో ఎందరో కవులు ఈ లయాత్మక గేయ రూపాన్ని తమ భావాల వ్యక్తీకరణకు ఆయుధంగా మలుచుకున్నారు.

వచన కవిత్వం (Free Verse): సమాజం, మానవ

వెల్చేరు నారాయణరావు గారి 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం', కడియాల రామమోహన్ రాయ్ గారి 'తెలుగు కవితా వికాసం (1947-1980)', ప్రొఫెసర్ ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి "స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత - వస్తువు, రూపం, శిల్పం" పేరుతో ఒక పుస్తకాన్ని రచించారు



సంబంధాలు సంక్లిష్టంగా మారుతున్న కొద్దీ, సూటిగా భావాన్ని ప్రకటించడానికి ఏ నియమాలూ లేని స్వేచ్ఛా వాక్య నిర్మాణంతో కూడిన 'వచన కవిత్వం' ఆవిర్భవించింది. వచన కవితా పితామహుడిగా పేరొందిన కుందుర్తి ఆంజనేయులు దీనిని ఒక బలమైన ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లారు. వాడుక భాషలో, నిరాడంబరంగా, తీవ్రమైన భావాన్ని సైతం స్పష్టంగా వ్యక్తీకరించడానికి వచన కవిత అద్భుతమైన సాధనంగా మారింది. నేటికీ తెలుగు కవిత్వంలో అత్యధికంగా వ్రాయబడుతూ, కవులకు ప్రధాన సాహిత్య వాహికగా వచన కవిత్వమే అగ్రస్థానంలో కొనసాగుతోంది.

దీర్ఘ కవితలు: కవిత్వం కేవలం ఒక చిన్న అనుభూతిని చిత్రించడానికే పరిమితం కాకుండా, ఒక విస్తృతమైన వస్తువును లేదా తాత్విక చింతనను సమగ్రంగా ఆవిష్కరించడానికి ఎంచుకున్న మరో విశాలమైన రూపం 'దీర్ఘ కవిత'. ఆధునిక మానవుడి అంతర్మథనాన్ని, సమాజంతో అతనికి ఉన్న వైరుధ్యాలను లోతుగా విశ్లేషించడానికి కవులకు ఈ రూపం ఎంతో తోడ్పడింది. మనిషి స్వీయాత్మక అన్వేషణను, తాత్విక లోతులను బలంగా ప్రతిబింబించే 'నాలో మిగిలిన నేను' వంటి రచనలు ఈ దీర్ఘ కవితా నిర్మాణ శిల్పానికి ప్రబలమైన ఉదాహరణలు. ఒకే ఇతివృత్తాన్ని వివిధ కోణాల్లో పరామర్శిస్తూ, పాఠకుడిని నిరంతరం ఆలోచనలో నిమగ్నం చేసే శక్తి ఈ రూపానికి ఉంది.

సంక్షిప్త రూపాలు: ఆధునిక తెలుగు కవిత్వం ఒకవైపు దీర్ఘ కవితలుగా విస్తరిస్తూనే, మరోవైపు యాంత్రికమైన, వేగవంతమైన ఆధునిక జీవితానికి అనుగుణంగా 'సంక్షిప్త రూపాల'ను కూడా సంతరించుకుంది. జపాన్ సాహిత్య ప్రభావంతో వచ్చిన 'హైకూ'లు, ఆచార్య ఎన్. గోపి పరిచయం చేసిన 'నానీ'లు, మినీ కవితలు ఈ కోవలోకి వస్తాయి. తక్కువ పదాల్లో ఎక్కువ భావాన్ని, ఒక మెరుపు లాంటి ఆలోచనను లేదా సామాజిక విమర్శను పాఠకుడి మెదడులో నాటడానికి ఇవి ఎంతో ప్రాచుర్యం పొందాయి. సముద్రాన్ని ఒక చిన్న నీటిబొట్టులో బంధించినట్లుగా, గాఢమైన అర్థాన్ని అత్యంత సూక్ష్మ రూపంలో అందించడం ఈ సంక్షిప్త రూపాల ప్రత్యేకత.

డా.సి.నారాయణరెడ్డి తన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు, ప్రయోగములు' కవిత్వంలో వచ్చిన వస్తు, రూప, ప్రయోగవాద ధోరణులను సాధికారికంగా వివరిస్తుంది. వెల్చేరు నారాయణరావు గారి 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం', కడియాల రామమోహన్ రాయ్ గారి 'తెలుగు కవితా వికాసం (1947–1980)', ప్రొఫెసర్ ఎస్.శరత్ జ్యోత్స్నారాణి "స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత – వస్తువు, రూపం, శిల్పం" పేరుతో ఒక పుస్తకాన్ని రచించారు. దీనిలో ప్రాచీన తెలుగు సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం, ముఖ్యంగా కవిత్వంలో వచ్చిన పరిణామాలు శాస్త్రీయంగా విశ్లేషించారు. '50 వసంతాల తెలుగు కవిత: వస్తువు–రూపం–శిల్పం' పేరుతో యస్వీ కృష్ణ ఒక పుస్తకాన్ని ప్రచురించారు. దీనిలో సిద్ధాంతం కంటే, కవితలను ఉదాహరించడం, భావకవిత్వం నుంచి దళిత కవిత్వం వరకు వచ్చిన వస్తు పరిణామాలు చూడవచ్చు. ఈ గ్రంథాలన్నీ తెలుగులో కవితా వికాసాన్ని, వస్తు రూప శిల్ప పరిణామాలను వివరిస్తున్న మౌలిక రచనలు.

డా.సి.నారాయణరెడ్డి తన సిద్ధాంత గ్రంథంలో అతి నవ్య కవితాధోరణులను సోదాహరణంగా వివరించారు. తెలుగు కవులు పాశ్చాత్య ప్రభావంతో వచన కవిత్వాన్ని కూడా బొమ్మలుగా, నిలువుగా, అడ్డంగా, ఇతర భాషలతో కలిపి రాయడం వంటి ధోరణులను ప్రదర్శించారు. ఇవన్నీ రూపపరమైన పరిణామంలో భాగంగానే గమనించాలి.

వస్తు-రూప-శిల్పాల పరస్పర సంబంధం.. ఒక పట్టిక:

ఆధునిక తెలుగు కవిత్వ పరిణామాన్ని సమగ్రంగా పరిశీలిస్తే వస్తు, రూప, శిల్పాలు విడివిడిగా పరిణమించలేదని స్పష్టమవుతుంది. ఒక కాలంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిణామాలు కవిత్వ వస్తువును మార్చినప్పుడు, ఆ కొత్త వస్తువును వ్యక్తీకరించడానికి తగిన కొత్త రూపాలు, శిల్పపద్ధతులు కూడా ఆవిర్భవించాయి. వీటిని సులభంగా గుర్తించడానికి వీలుగా ఒక పట్టికలో ఇలా తెలుసుకోవచ్చు.

క్రమ సంఖ్య	యుగం / కవిత్వ ధోరణి	వస్తువు	రూపం	శిల్పం
1	గురజాడ యుగం	సమాజం, దేశభక్తి, మానవతావాదం, సంస్కరణ భావాలు	గేయరూపం, పద్యరూపంలో ఆధునిక ప్రయోగం	వ్యావహారిక భాష, సంభాషణాత్మకత, సరళమైన పదవిన్యాసం, వ్యంగ్యం
2	భావకవిత్వం	ప్రేమ, ప్రకృతి, వ్యక్తిగత అనుభూతి, విరహం, సౌందర్యం	గేయం, గీతిక, ఛందోబద్ధ పద్యాలు	లయ, మాధుర్యం, ప్రతీకలు, ప్రకృతి బింబాలు, భావోద్రేకం
3	జాతీయోద్యమ	కవిత్వం పరాధీనత, దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్ష, బ్రిటిషు పాలనపై వ్యతిరేకత, ప్రాచీన వైభవ స్మరణ, త్యాగనిరతి	గేయం, పద్యం, ప్రబోధాత్మక కవిత	ఆవేశపూరిత పదజాలం, ప్రబోధాత్మకత, ప్రతీకలు, సెంటిమెంట్, పౌరులను చైతన్య పరిచే శైలి
4	అభ్యుదయ కవిత్వం	శ్రమజీవి, పేదరికం, వర్గ వైరుధ్యం, సామాజిక అసమానతలు, దోపిడీ	వచన కవిత, స్వేచ్ఛా వచనం, ప్రయోగవాద రూపాలు	కొత్త ప్రతీకలు, భావచిత్రాలు, పునరుక్తి, వ్యంగ్యం, నినాదాత్మకత మొదలైనవి.
5	దిగంబర కవిత్వం	వ్యవస్థాగత కుళ్లు, సామాజిక అన్యాయం, బూటకపు విలువలు, వ్యవస్థపై తిరుగుబాటు	స్వేచ్ఛా వచనం, దీర్ఘకవిత	తీవ్రమైన ఆవేశం, జుగుప్సాకరమైన బింబాలు, పచ్చి నిజాల బహిర్గతం, కఠినమైన భాష, తిరుగుబాటు ధోరణి.
6	విప్లవ కవిత్వం	దోపిడీ, అణచివేత, రాజ్యాధికారం, పోరాటం, విప్లవ చైతన్యం	స్వేచ్ఛా వచనం, దీర్ఘకవిత, ఉద్యమ గేయం	ఆగ్రహం, ఆవేశం, నినాదం, ప్రత్యక్ష సంబోధన, ప్రశ్న, హెచ్చరిక.
7	స్త్రీవాద కవిత్వం	స్త్రీ అస్తిత్వం, శరీరం, కుటుంబం, వివాహం, మాతృత్వం, పితృస్వామ్యం	స్వేచ్ఛా వచనం, వచన కవిత	ప్రశ్నించడం, ఆత్మకథనాత్మకత, ప్రత్యక్షత, శరీరానుభవ భాష, ప్రతిఘటన.
8	దళిత కవిత్వం	కులవివక్ష, అంటరానితనం, అవమానం, అస్తిత్వం, ఆత్మగౌరవం, ప్రతిఘటన	వచన కవిత, దీర్ఘకవిత	దళిత జీవనభాష, మాండలిక పదజాలం, వ్యంగ్యం, ప్రతీక, అనుభవ తీవ్రత.
9	మైనారిటీ కవిత్వం	మతపరమైన వివక్ష, ఆత్మగౌరవం, అభద్రతా భావం, అస్తిత్వ పోరాటం, సాంస్కృతిక గుర్తింపు	వచన కవిత, దీర్ఘకవిత	ఉర్దూ/పారశీక పదబంధాలు, సాంద్రమైన ఆవేదన, ప్రతీకాత్మకత, ప్రశ్నించే ధోరణి.
10	తెలంగాణ కవిత్వం (ప్రాంతీయ కవిత్వం)	ప్రాంతీయ అస్తిత్వం, తెలంగాణ నేల, ప్రజాజీవితం, రైతు, కూలీ, ఉద్యమం	గేయం, వచన కవిత, ఉద్యమ కవిత	తెలంగాణ మాండలికం, స్థానిక ప్రతీకలు, జానపద ధోరణి, సామెతలు, ప్రజల భాష.
11	సమకాలీన కవిత్వం	ప్రపంచీకరణ, నగరీకరణ, సాంకేతికత, పర్యావరణం, వలస, ఏకాంతం, అస్తిత్వ సంక్షోభం	మినీ కవిత, నానీ, హైకూ, వచన కవిత, దీర్ఘకవిత, వచనకావ్యం	బింబం, ప్రతీక, ధ్వని, మౌనం, విరామం, పదవిన్యాసం, వ్యంగ్యం, సంక్షిప్తత.

ముగింపు:

సమగ్రంగా పరిశీలిస్తే, ఆధునిక తెలుగు కవిత్వం సాధించిన వస్తు-రూప-శిల్ప పరిణామాలు కేవలం మార్పులు మాత్రమే కావు; అవి దశాబ్దాలుగా మారుతున్న తెలుగు సమాజపు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ స్పందనలకు సజీవ దర్పణాలు. పౌరాణిక, ప్రబంధ శృంగారాల నుంచి విడివడి దైనందిన జీవితం, అట్టడుగు వర్గాల ఆత్మగౌరవం, పీడితుల గొంతుక మరియు అస్తిత్వ పోరాటాలను ఆలింగనం చేసుకోవడం ద్వారా కవిత్వం ప్రజాస్వామ్యీకరించబడింది. ఈ క్రమంలో శ్రీశ్రీ, పఠాభి, శిష్ట్లా, ఆరుద్ర, నారాయణబాబు వంటి కవులు తెచ్చిన ప్రయోగవాదం కవిత్వ శిల్పానికి, అభివ్యక్తికి సరికొత్త పదునును ఇచ్చింది. అధివాస్తవికత, ప్రతీకాత్మకతలతో పాటు చిత్రకవిత, ఫోటో కవిత, గజల్, రుబాయీ, మినీ కవితల వంటి నూతన రూపాల ప్రయోగాలు ఛందోబంధనాలను తెంచి, కవిత్వంలో సరికొత్త శిల్ప సౌందర్యాన్ని ఆవిష్కరించాయి. ఒక నదీ ప్రవాహం తన గమనంలో కొత్త పాయలను కలుపుకుంటూ విస్తరించినట్లే, ఆధునిక తెలుగు కవిత్వం కూడా కాలంతో పాటు వచ్చే సామాజిక, తాత్విక సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతోంది. మారుతున్న గ్లోబలైజేషన్, డిజిటల్ యుగం మరియు మానసిక సంక్షోభాల నేపథ్యంలో కవిత్వం తన వస్తువులో సార్వజనీనతను, రూపంలో సౌలభ్యాన్ని, శిల్పంలో ప్రయోగశీలతను నిరంతరం పునర్నిర్మించుకుంటోంది. అక్షరాన్ని సామాన్యుడి ప్రాంగణంలో నిలిపి, నిరంతర ప్రయోగాలతో వికసించిన ఈ కవితా ప్రయాణం రేపటి నూతన ఆలోచనలకు నిరంతర చైతన్య రథంగా, మానవతా కాంతిరేఖగా వెలుగుతూనే ఉంటుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు:

1. అక్కిరాజు, ఉమాకాన్తవిద్యాశేఖరులు. నేటికాలపు కవిత్వం. వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి. 1928.
2. కృష్ణ, యస్.వి. 50 వసంతాల తెలుగు కవిత: వస్తువు-రూపం-శిల్పం. జయంతి పబ్లికేషన్స్, హైదరాబాద్. 2001.
3. నారాయణరెడ్డి, సి. తెలుగు గజళ్ళు. చేతన సాహితీ సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్. 1986.
4. నారాయణరెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు, ప్రయోగములు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.
5. నారాయణరావు వెల్చేరు. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ. 1978.
6. రామమోహన్ రాయ్ కడియాల. 20వ శతాబ్ది తెలుగు కవిత్వం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్. 2003.
7. వెలుదండ నిత్యానందరావు. తెలుగు సాహిత్యంలో పేరడి. స్వీయ ప్రచురణ, హైదరాబాద్. 1994.
8. శివశంకర్ పాపినేని. సాహిత్యం- మౌలిక భావనలు. ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ. 2020.
9. సుబ్రహ్మణ్యం జి.వి., సంపాదకుడు. సాహితీ సమాలోచనం 1992-93. యువభారతి, హైదరాబాద్. 1994.
10. హనుమచ్ఛాస్త్రి ఇంద్రగంటి. ఆరు యుగాల ఆంధ్రకవిత. ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్. 1986.
11. ఎస్. శరత్ జ్యోత్స్నారాణి "స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత - వస్తువు, రూపం, శిల్పం. జ్యోత్స్న కళాపీఠం: హైదరాబాద్. 2001.
12. రామమోహన్ రాయ్ కడియాల "తెలుగు కవితా వికాసం 1947-1980" ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ: హైదరాబాద్, 1982.



'తెలుగు సాహిత్యంలో చెరిగిపోని సంతకం'

దేవరకొండ బాలగంగాధర తిలక్

డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి
+91 63027 38678

భావుకతకు అభ్యుదయ దృష్టిని జోడించి, మానవతను అంతర్లీనంగా చేసుకుని తెలుగు సాహిత్యంలో కవిత్వాన్ని చెప్పి, తనదైన ముద్రను, విశిష్టతను అక్షరాక్షరానా చూపిన కవి, తెలుగు కథా రచయిత, నాటకకర్త దేవరకొండ బాలగంగాధర తిలక్.

ఈ భావాన్నే చెప్పే ఆయన కవితా పంక్తులను చూడండి

◆ ◆ ◆

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు"
"నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు"
"నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"

అంటూ... మానవత, అభ్యుదయం, భావుకత తన కవితాపథమని సుస్పష్టం చేసి, తెలుగు కవిత్వంలో తనకొక ముద్రని, చిరంతన యశస్సును పొందినవారు బాలగంగాధర తిలక్.

భావకవిత్వంలోని సౌకుమార్యాన్ని, అభ్యుదయ కవిత్వంలోని సామాజిక స్పృహను సమన్వయపరిచి, వచన కవితకు ఒక ప్రత్యేకమైన పలుకును, పరుగును ఇచ్చిన విశిష్ట కవి తిలక్.

స్వతంత్ర భావాలు, స్వచ్ఛమైన ఆలోచన, నవనవోన్మేష దృష్టి తిలక్ కవిత్వపు ప్రత్యేకతలు. ఏ సిద్ధాంతానికీ పూర్తిగా బద్ధుడు కాకుండా, సునిశిత పరిశీలనాదృష్టితో జీవితాన్ని, సమాజాన్ని, మనిషిని అధ్యయనం చేసినవారు. పాత భావాలను యథాతథంగా స్వీకరించకుండా, తనదైన దృష్టితో జీవితాన్ని, సమాజాన్ని కొత్త కోణంలో దర్శించినవారు తిలక్. ఈ నవనవోన్మేష దృష్టే తిలక్‌ను ప్రత్యేకమైన కవిగా నిలబెట్టింది. ఎందరికో కవిత్వ మార్గదర్శకత్వాన్ని ఇచ్చి, కవిత్వానికి కొత్త దిశను నిర్దేశించింది.

దేవరకొండ బాలగంగాధర తిలక్ తన కాలంలో ఎందరో యువ కవులను తన కవిత్వంతో ప్రభావితం చేసిన గొప్ప కవి. ఆనాటి తరుణ కవిలోకం ఆయనను అభిమానించటం, ఆరాధించటమే కాదు, ఆయన కవిత్వాన్ని అనుసరించింది.

> కృష్ణశాస్త్రి "కృష్ణపక్షం", శ్రీశ్రీ "మహాప్రస్థానం" లాగా తిలక్ "అమృతం కురిసిన రాత్రి" తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.



తిలక్ పేరు తలుచుకోగానే సాహితీ స్పృహ ఉన్నవారికి చటుక్కున స్ఫురించేది "అమృతం కురిసిన రాత్రి".

కృష్ణశాస్త్రి "కృష్ణపక్షం", శ్రీశ్రీ "మహాప్రస్థానం" లాగా తిలక్ "అమృతం కురిసిన రాత్రి" తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

"తిక్కన, వేమన, గురజాడ ఆధునిక కవిత్రయం" అని శ్రీశ్రీ అన్నారు. డాక్టర్ శ్రీపాద కృష్ణమూర్తి "శ్రీశ్రీ, తిలక్, శేషేంద్ర – ఈ ముగ్గురు నవ్యాధునిక కవిత్రయం" అన్నారు. తిలక్ కవిత్వం భావ, అభ్యుదయ కవిత్వాలు కలగలిసిన అనుభూతి కవిత్వం. తిలక్ కవిత్వాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే "అద్భుత సౌందర్యం – దుర్భర విషాదం".

"నా కవిత్వం" అనే తన కవితలో తిలక్ తన కవిత్వ లక్షణాన్ని స్వయంగా చెప్పుకున్నారు.

నా కవిత్వం
కాదు ధనిక వాదం, సామ్యవాదం
కాదయ్యా అయోమయం, జరామయం... (అంటే కాలం చెల్లింది కాదు)
వెన్నెల సముద్రాలూ, జాజి పువ్వుల అత్తరు దీపాలు
నా కవితా చందన శాలా సుందర చిత్ర విచిత్రాలు

ఈ పంక్తుల్లో భావుకతకు ప్రాధాన్యం ఇస్తూ భావకవితా లక్షణాలను చెపుతున్నారు.

అగాధ బాధా పాథఃపతంగాలు

◆ ◆ ◆

నా కళా కరవాల ధగ ధ్దగ రవాలు...

ఈ పంక్తుల్లో అభ్యుదయ భావాలను వ్యక్తం చేస్తున్నారు.

తిలక్ 1921 ఆగస్టు 1వ తేదీన తణుకు తాలూకా మండపాక గ్రామంలో జన్మించారు. ఇది పశ్చిమ గోదావరి జిల్లాలో ఉంది. తిలక్ తణుకులో బోర్డు స్కూలులో ఉన్నత పాఠశాల విద్య పూర్తయ్యాక, మద్రాసు లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరారు కాని అనారోగ్యం వల్ల పూర్తి చేయలేదు. ఆ తరువాత విశాఖపట్నంలో చేరారు. అక్కడా చదువు పూర్తవలేదు. స్వయంగా ఆసక్తితో తెలుగు సాహిత్యం, సంస్కృత సాహిత్యం, ఇంగ్లీషు సాహిత్యం బాగా చదువుకున్నారు. సాహిత్యపు లోతులను పరిశీలనతో పట్టుకున్నారు. డిగ్రీలతో పట్టా కట్టలేని పాండిత్యం తిలక్‌ది. స్వయంకృషితో తనను తాను తీర్చిదిద్దుకున్న సాహితీవేత్త ఆయన.

నిరంతరం సాహిత్య గోష్ఠులు, చర్చలు తిలక్‌లో సాహితీ పిపాసను పెంపొందించాయి. కవి మిత్రుల పరిచయాలు, స్నేహాలతో సాహిత్య ప్రపంచంలోనే మునిగి తేలిన తిలక్ కవిత్వం, కథలు, నాటకాలు, నాటికలు, వ్యాసాలు, నవలలు, లేఖలు అన్ని ప్రక్రియలలో ఎన్నో రచనలు సృజించారు.

రాయాలని సంకల్పించి పూర్తి చేయని అసంపూర్ణ రచనలు కూడా ఉన్నాయి. కారణం ఆయన అనారోగ్యమే!

మొదట్లో మల్లవరపు విశ్వేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, అబ్బూరి వరదరాజేశ్వరరావులతో, తరువాత శ్రీపాద కృష్ణమూర్తి, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, వెల్చేరు నారాయణరావులతో స్నేహం చేశారు. తిలక్ స్నేహశీలి. ఆయనకు అనేకమంది మిత్రులు. సాహితీ సరోవరం, శతపత్ర గోష్ఠి, బృందావన కళా సమితి వంటి సాహిత్య సంస్థలను స్థాపించారు.

పదకొండేళ్ల వయసులోనే కథలు, పద్యాలుగు – పదిహేనేళ్ల వయసులో పద్యాలు రాయడం ప్రారంభించిన తిలక్, 1942 ప్రాంతంలో విస్తృతంగా రచనలు చేయసాగారు. అయితే 1944లో గోదావరి పుష్కరాల సందర్భంగా కానూరు అగ్రహారానికి వెళ్లిన ఆయన తండ్రి సత్యనారాయణమూర్తి గోదావరి తీరంలోనే హఠాత్తుగా గుండెపోటుతో మరణించడం తిలక్‌ను తీవ్రంగా కలచివేసింది. ఆ తరువాత అనారోగ్య భయాలతో దాదాపు పదేళ్లపాటు రచనలకు దూరమయ్యారు. మహాకవి గురజాడకు, తిలక్‌కు అనారోగ్యంలో పోలిక ఉండటం కాకతాళీయం. అయితే గురజాడ తన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు.

కానీ తిలక్‌కు అంతటి స్థైర్యం లేక కొన్నేళ్లు రచనకు దూరమయ్యారు. ఆ తరువాత ఆయన చేసిన రచనలు

సాహిత్యంలో నిలిచేవి. 1956లో ఆరోగ్యం కుదుటపడిన తరువాత మళ్లీ కలం పట్టిన తిలక్, 1956–66 మధ్య తన సాహిత్య జీవితంలో అత్యున్నత దశను ఆవిష్కరించారు.

ఈ కాలంలోనే ఆయన కవితా, కథానికా ప్రతిభ శిఖరాలను అధిరోహించిందని చెప్పవచ్చు.

ఆరోగ్యం మెరుగుపడినా, జీవితంపై ఆయనకు ఒకరకమైన విరక్తి ఉండేది. తణుకులోనే జీవితమంతా గడపవలసి రావడం ఆయనకు నచ్చేది కాదు. ఆరోగ్యం సహకరించి ఉంటే కుటుంబంతో మరొక మంచి ప్రదేశంలో స్థిరపడేవాడిననే భావన ఆయనలో ఉండేది.

కొన్ని వ్యాపారాల్లో చేయి వేసినా అవి కలిసి రాలేదు.

జీవించింది చాలా తక్కువ సంవత్సరాలే అయినా అపారమైన సాహిత్యాన్ని సృష్టించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో, అందునా కవిత్వ జగత్తులో తన పాత్రను సుస్థిరం చేసుకున్నారు.

15–16 సంవత్సరాల వయసులో తిలక్ "ప్రభాతము – సంధ్య" పేరుతో కొన్ని కవితా ఖండికలను ప్రచురించారు. భావంలో, భాషలో భావ కవిత్వ ప్రభావాన్ని ఇవి చూపెడతాయి. వచన కవిత్వమే కాక ఛందోబద్ధ పద్య కవిత్వాన్ని రచించారు.

"మలుపు" అనే నవల తిలక్ 60 పేజీలు రాసి ముగించని అసంపూర్ణ నవల. "ఖడ్గతిక్కన" నవలను రాయాలనుకున్నారు కాని రాయలేదు. "మరో నాటకం" అనే నాటకం రాయాలనుకున్నారు కాని అది కూడా కార్యరూపం దాల్చలేదు.

'అమృతం కురిసిన రాత్రి' తిలక్ కవితా ప్రతిభకు శిఖరస్థాయిని తెలియజేసే గ్రంథం; తెలుగు సాహిత్య చరిత్రలో కలకాలం నిలిచిపోయే పుస్తకం. ఇది తదనంతర కవులకు స్ఫూర్తి, దారిదీపం. దీనిని 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించాయి.

అమృతం కురిసిన రాత్రి కవితల సంపుటిలో అందరికీ నచ్చే, విద్యార్థులకు బోధించినపుడు వాళ్లు కూడా ఆసక్తిగా వినే కవితా ఖండిక "తపాలా బంట్రోతు". పశ్చిమ గోదావరి జిల్లాలో తంతి తపాలా శాఖ వారి వార్షికోత్సవాల్లో చదవటానికి ఒక కవిత రాసి ఇమ్మని తంగిరాల వెంకట సుబ్బారావు గారు అడిగితే తిలక్ ఆ సమయానికి ఇవ్వలేదుట. తంగిరాల గారు తిలక్ రాసిన "ఆర్తగీతం" ఆ సభలో చదివారు. "తపాలా బంట్రోతు"ను తిలక్ ఆ తరవాత ఎప్పుడో రాసిచ్చారుట. సభ అయిపోయాక రాసిచ్చారని తంగిరాల గారు బాధ పడితే, తిలక్ "వెంటనే రాస్తే ఏడ్చినట్లు వచ్చేది; ఇన్నాళ్లు నానింది కాబట్టి ఇంత బాగా వచ్చింది" అన్నారుట.

కవితావిర్భావం ఒక ప్రసవ వేదన. కవిమనసులో ఒక భావన వచ్చి, అది తీవ్ర ఆలోచనకు గురైనపుడు కవిత పుడుతుంది. సాధారణ పంక్తులతో మొదలై అసాధారణంగా, అద్భుతంగా కొనసాగిన తపాలా బంట్రోతు కవిత నాటి మానవ జీవితాలలో పోస్ట్‌మాన్ ఎంత ముఖ్య పాత్ర వహించాడో చెపుతుంది. పోస్ట్‌మాన్‌తో మనుషులకున్న ఆత్మీయానుబంధాలను చెపుతుంది. కవిత చదువుతున్నంత సేపు అలనాటి ఉత్తరాల కోసం నిరీక్షణ ప్రతివారి స్మృతిలో మెదులుతుంది.

కవితారంభం...

"మై డియర్ సుబ్బారావ్,
కనిపించటం మానేశావ్..."

అంటూ ఎంత సాధారణమైన పంక్తులతో మొదలైన ఈ

'అమృతం కురిసిన రాత్రి' తిలక్ కవితా ప్రతిభకు శిఖరస్థాయిని తెలియజేసే గ్రంథం; తెలుగు సాహిత్య చరిత్రలో కలకాలం నిలిచిపోయే పుస్తకం. ఇది తదనంతర కవులకు స్ఫూర్తి, దారిదీపం. దీనిని 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించాయి.

కవిత, పాఠకులను ఇంత అని చెప్పలేనంతగా ఆకర్షిస్తుంది; ఆ భావం వారి మనసంతా ముసురుకుంటుంది. స్నేహితుడితో మాట్లాడుతున్నట్టుగా సాగే ఈ కవితలోని అలతి అలతి పదాలు అక్షరాయస్కాంతాలు. చదువరులను కవితలోకి లాగేసుకుని, ఏకబిగిన ఆసాంతం చదివిస్తాయి.


ముగింపు పంక్తులు ఎలా గుండెను పిండేస్తాయో చూడండి...

// ఇన్ని యిళ్లు తిరిగినా
నీ గుండెబరువు దింపుకోవడానికి ఒక్క గడపలేదు
ఇన్ని కళ్లు పిలిచినా
ఒక్క నయనం నీ కోటుదాటి లోపలకు చూడదు
ఉత్తరం ఇచ్చి నిర్లిప్తుడి లాగ వెళ్లిపోయే నిన్ను చూసినపుడు
తీరం వదిలి సముద్రంలోకి పోతున్న ఏకాకి నౌక చప్పుడు //

చదివిన కన్నులు చెమరించవా!?
గుండె ఆర్ద్రమై, సాంద్రమవ్వదా!?

అయితే కవిత సాగే క్రమంలో మరికొన్ని సాహిత్యపరమైన

> **తిలక్ 'ఆర్తగీతం' కవిత శీర్షికే పాఠకులకు సూటిగా విషయాన్ని తేట తెల్లం చేస్తుంది. తిలక్ లోని మానవీయ దృక్పథానికి ఆర్తగీతం ఒక మచ్చు తునక. కవిత ప్రారంభమే ఒక ఉత్కంఠను కలిగిస్తుంది.**



సంగతులు పాఠకులను కవితలోకి ప్రయాణింపజేసి, లోతుగా ఆలోచింపచేస్తాయి.

ప్రణాళికాబద్ధంగా సాగిన చక్కని కవిత ఇది. మొదటి పంక్తులలో ప్రాచీన కవిత్వంలో వస్తువు గురించి

ప్రస్తావిస్తూ

అందమైన అమ్మాయి మీద కాని
చందమామ మీద కాని
వంద్యుడైన భగవంతుడి మీద కాని
పద్యాలల్లమని మన పూర్వులు శాసిస్తే...

అంటారు.

ప్రాచీన కవిత్వంలో అంశం ఉదాత్తంగా ఉండాలని, నాయకుడు ధీరోదాత్తుడుగా ఉండాలని, భాష ఉదాత్తంగా, గంభీరంగా, అలంకారాలతో, ఛందోబద్ధంగా ఉండాలని ఎన్నో నియమాలున్నాయి.

రాజాస్థానాలలో తెలుగు పద్య కవిత ప్రభవించి, పెంపొందింది. ఈ పంక్తుల్లో తిలక్ ఆనాటి కవితాంశాలను సున్నితమైన హాస్యంతోనూ, వ్యంగ్యంతోనూ విమర్శించారు.

తర్వాత...

"మృదు మాధ్వీ పదలహరీ
తరంగ మృదంగ.....
మనోహరాలౌ కావ్యాల్ గేయాల్
కొల్లలుగా వ్రాస్తాను" అంటూ భావ కవితా లక్షణాన్ని ప్రస్తావిస్తారు.

ఎండలో, వానలో ఎండిన చివికిన
ఒక చిన్న సైజు జీతగాడు
ఖాకీ దుస్తులు

అరిగిన చెప్పులు... ఇలా పోస్ట్‌మాన్ భౌతిక రూపాన్ని పాఠకుల ముందు ఆవిష్కరిస్తారు. ఇక్కడ నుంచి ఉత్తరాల కోసం ఎదురుచూసేవారిని చూపిస్తారు – "కిటికీలో రెండు విచ్చిన కలువల్లాంటి కళ్ళతో అందమైన అమ్మాయి దేశాంతర గతుడైన ప్రియుని ఉత్తరం కోసం నిరీక్షణ

గుడిసె ముందు కూర్చున్న పండు ముసలి అవ్వ
తాను కనిన ప్రాణం
క్షణ క్షణ ప్రతీక్షణ ఒక కార్డు ముక్క రాసాడా
అలాగే మిత్రుడికి, నిరుద్యోగికి, వర్తకుడికి, నర్తకుడికి
దూరాల దారాల్ని
ఒకే నిముసము
అనే కండె చుట్టూ తిప్పగల నేర్పరి"

అంటారు.

తపాలా బంట్రోతు ఆ రోజుల్లో అందరికీ ఆప్త బంధువు
శుభాశుభాలకు అతడు వర్తమానం

అందరూ అతడు తెచ్చే ఉత్తరాల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. కాని అతని గుండె బరువు దింపుకోవటానికి ఒక్క గడప లేదు

కవిత ముగిసిపోయినా ఆ ఆవరణలో నుంచి వెంటనే బైటకు రాలేని మానసిక స్థితి పాఠకునిది.

గొప్ప భావుకతతో, సామాజిక స్పృహతో నడిచిన కవిత 'తపాలా బంట్రోతు'. లేఖా రచన ఒక కళ. ఆ కళ ఇప్పుడు మృగ్యమై పోయింది. భావ వ్యక్తీకరణకు లేఖా రచన గొప్ప ఆలంబనం. ఆ రోజుల్లో కవులు, రచయితలు ఉత్తరాల ద్వారా సాహిత్య చర్చలు చేసేవారు. సామాన్య కుటుంబాల్లోని ఆడవారు, మగవారు కూడా కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా ఉత్తరాలు రాసేవారు. ఒకప్పటి పోస్ట్‌మాన్ ప్రాముఖ్యాన్ని గుర్తు చేసే, ఆ కాలం వారు తమ గతంలోకి వెళ్లి మధుర స్మృతులను గుర్తు తెచ్చుకునేట్లు చేసే గొప్ప కవిత ఇది. భాష, భావం, కవితా నిర్మాణం సమపాళ్ళలో ఉన్న కవిత ఇది.

కవి ఎంచుకున్న కవితాంశం పాఠకులకు సులభంగా చేరటంలో శీర్షిక పాత్ర గొప్పది. శీర్షిక క్లుప్తంగా, చిన్నదిగా ఉండాలి. కవితాంశాన్ని సూచించేదిగా ఉండాలి.

తిలక్ 'ఆర్తగీతం' కవిత శీర్షికే పాఠకులకు సూటిగా విషయాన్ని తేట తెల్లం చేస్తుంది. తిలక్ లోని మానవీయ దృక్పథానికి ఆర్తగీతం ఒక మచ్చు తునక. కవిత ప్రారంభమే ఒక

ఉత్కంఠను కలిగిస్తుంది.

నా దేశాన్ని గురించి పాడలేను, నీ ఆదేశాన్ని మన్నించలేను.... ప్రారంభ పంక్తులు ఇవి. కవి దేశాన్ని గురించి ఎందుకు పాడలేనంటున్నారు? ఎందుకంటే ఆ రోజు కవికి విషాద స్మృతి. హృదయం మోడైన దుస్థితి. హృదయం చలించిపోయే, కళ్ళు చెమరించే దృశ్యాలు చూసిన కవి కన్నీరుగా కరిగిన గీతిక అయ్యారు. సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగు అయిపోయారు. కవితకు కొత్త సింగారాలు, ఉదాత్త శయ్యా సజ్జితాలు వద్దనుకుంటారు. తన మిత్రుడో ఎవరో చెప్పే గడిచిపోయిన చరిత్రలోని వీరగాథలు, వారి కీర్తి ప్రతిష్ఠలు వినిపించద్దు, విసిగించద్దు అంటారు. కళ్ళ ముందు సామాన్య ప్రజానీకానికి జరిగే అన్యాయాలను పట్టించుకోకుండా గతంలో గొప్పదనాన్ని, లేని ఆడంబరాలను ప్రస్తుతించనంటారు.

కవి చూసే దృశ్యాలను చూస్తూ పాఠకులు కూడా కవితో ప్రయాణం చేస్తారు. వారి హృదయం కూడా చలించిపోతుంది. తిలక్ మానవతా దృష్టికి పరాకాష్ఠ ఆర్తగీతం. దేశంలో నిరుపేదల కష్టాలను పట్టించుకునేదెవరు? ఇది కవి ప్రశ్న!

కవి తాను చూసిన సన్నివేశాలకు ప్రాతిపదికగా, నీ ఆదేశాన్ని మన్నించలేను అంటూ తన నిరసనను, తిరస్కరణను ప్రకటిస్తారు. ఇంతకూ కవి చూసినదేమిటి? ఒక్కొక్కటీ వరసగా చెప్పుకుంటూ వెళ్తారు.

నేను చూసాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలి వాణ్ణి

నీరంధ్ర వర్షాన వంతెన కింద నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని!

మురికి కాల్వ పక్కన నిద్రించిన

మూడేళ్ళ పసిబాలుడు

పిల్లలకు గంజి కాచిపోసి ఆఫీస్ కు వెళ్లిన ఫ్యూన్ వీరన్న

అరక్త, అశక్త గుమస్తా

ఒక సన్నివేశాన్ని మించి మరోటి కవి బాధను తీవ్రతరం చేస్తుంది. పాఠకుల బాధను కూడా!

"తల్లి లేక, తండ్రి లేక, తిండి లేక ఏడుస్తూ ఏడుస్తూ"...పదాల పునరావృత్తి వల్ల ఒక లయ, సౌందర్యం పంక్తులలో అభివ్యక్తమవుతుంది.

"ప్రచండ వాతూల హత నీప శాఖ వలె గజ గజ వణికిన అరక్త, అశక్త గుమస్తా" – ఇది ఉపమాలంకారం. కళ్ళముందు గాలికి పడిపోయిన చెట్టు కొమ్మలా, వణుకుతున్న గుమస్తా కనిపిస్తాడు.

మూర్తీ భవత్ దైన్యాన్ని, హైన్యాన్ని

.....నీరధుల్ని, గచ్ఛత్ శవాకార వికారుల్ని

.....నాగరికతకు ఫల శ్రుతి? విజ్ఞాన ప్రకర్షకు ఉపశ్రుతి?

ప్రతి పాదంలో పదాంత్యానుప్రాసలు కవితను సౌందర్యోపేతం చేస్తాయి.

అభినయింప లేను

స్తుతింప లేను

తిరుగలేను

ప్రతి పాదంలో అంత్యానుప్రాసలు అలరిస్తాయి.

కవి సాటి మానవుని దీనస్థితిని పట్టించుకోని సమాజాన్ని చూసి, తనకు అంతవరకూ తన దేశం, తన తోటి ప్రజల గురించి ఉన్న గర్వం అంతా పోయి నిగర్వినయ్యానంటున్నారు.

తాను చూసిన సమస్యలు అన్నీ పరిష్కృతమయ్యే వరకు తనకు శాంతి కలగదు. కాని తన ఆర్తి ఏ సౌధాంతరాలకు పయనింపగలదు? అని ప్రశ్నిస్తున్నారు. చేయగలిగిన సమర్థులు

తాను చూసిన సమస్యలు అన్నీ పరిష్కృతమయ్యే వరకు తనకు శాంతి కలగదు. కాని తన ఆర్తి ఏ సౌధాంతరాలకు పయనింపగలదు? అని ప్రశ్నిస్తున్నారు. చేయగలిగిన సమర్థులు పట్టించుకోకపోతే సామాన్యులకు న్యాయం జరగదని కవి భావిస్తున్నారు.

పట్టించుకోకపోతే

సామాన్యులకు న్యాయం

జరగదని కవి భావిస్తున్నారు. అందుకే, రాజకీయ వేత్త గుండెను తన ఆర్తి స్పృశించాలి, ధనవంతుని చలింపజేయాలి, భగవంతునికి ఆర్తి చేరాలి, అనే మంచి ముగింపుతో కవిత పూర్తవుతుంది. కవితా వస్తువు చాలా బలమైనది. దానికి తగిన భాష, పోలికలు, లయ, అంత్యప్రాసలు కవితకు సమగ్రతనిచ్చాయి. సామాజిక స్పృహ, మానవీయతతో నిండిన గొప్ప కవిత ఆర్త గీతం.

'అమృతం కురిసిన రాత్రి' కవిత పేరే కవితల సంపుటం పేరు. ప్రకృతి, ప్రేమ, వెన్నెల, సౌందర్యం, ఏకాంతం, ఆనందం, భావుకత, మానవ హృదయగత భావాలు అన్నీ కలిసి ఒక అమృతసమానమైన కవితగా రూపొందింది అమృతం కురిసిన రాత్రి.

'ప్రార్థన' అనే కవితలో మనుషులకు కనీసం ఏం కావాలో చెపుతున్నారు.

> తిలక్ కథల్లో 'నల్లజర్ల రోడ్డు' చాలా ప్రసిద్ధమైంది. నాగరికత పేరుతో సాగే కపటత్వాన్ని, మానవ సంబంధాల నైతిక పతనాన్ని ఈ కథ అద్భుతంగా దృశ్యీకరించింది.



దేవుడా

రక్షించు నా దేశాన్ని అంటూ ప్రార్థిస్తూ, మనిషికి కావలసింది ఇంతే అంటారు:

"కడుపు నిండుగా ఆహారం గుండె నిండుగా ఆశ్లేషం
బ్రతుకు పొడుగునా స్వతంత్రం
కాస్త కన్నీరు మరి కాస్త సంతోషపు తేనీరు
చాలు మాకు తండ్రీ!"

ఇంతకంటే మనిషికి ఏం కావాలి?

"మంచి గంధం లాగా పరిమళించే మానవత్వం
మాకున్న ఒకే ఒక అలంకారం!"

మానవత్వానికి పెద్ద పీట వేసిన గొప్ప కవితా ఖండిక ఇది. ఇంకా ఎన్నో విశిష్టమైన కవితలు 'అమృతం కురిసిన రాత్రి'లో ఉన్నాయి.

"మంచి రచన చదివాక బాగా భోం చేసినట్లుండాలి
కొంచెం బాధ పడాలి చించుకున్నట్లుండాలి
మనస్సుకి జ్వరం రావాలి ఒళ్ళు తిరగాలి
ఈ బాధ లోంచే తేరుకుని బాగుపడాలి"

అని ప్రముఖ కవి ఆరుద్ర చెప్పిన పంక్తులు తిలక్ కవితలకు చక్కగా అన్వయిస్తాయి.

ఇక, తిలక్ కథల దగ్గరికి వస్తే, కవి కథారచయిత కూడా అయితే ఆ భావుకత, వర్ణనాశక్తి కొంతైనా కథలలో కూడా కనిపిస్తుంది. తిలక్ కవిగా ప్రసిద్ధులు అయినా కథలు కూడా తెలుగు సాహిత్యంలో నిలిచిపోయేవి రాసారు. వీరి కథారచనా శైలి కవితాత్మకంగా, సున్నితమైన హాస్యంతో, కన్ను చెమరించే వాస్తవికతతో ఉంటుంది.

తిలక్ కథల్లో 'నల్లజర్ల రోడ్డు' చాలా ప్రసిద్ధమైంది. నాగరికత పేరుతో సాగే కపటత్వాన్ని, మానవ సంబంధాల నైతిక పతనాన్ని ఈ కథ అద్భుతంగా దృశ్యీకరించింది.

"తలనుండు విషము ఫణికిని ...

ఖలునకు నిలువెల్ల విషము" అనే సుమతీ పద్యం ఈ కథ చదువుతున్నప్పుడు గుర్తుకు వస్తుంది.

ధనవంతుడైన రామచంద్రం తన స్నేహితుడు భూషణంతో కలిసి ఒక కుర్రాడిని వెంట తీసుకుని తన పాత కారులో తణుకు నుంచి ఏలూరుకు బయలుదేరుతాడు. ఏలూరులో పనులు ముగించుకుని మళ్ళీ తిరిగి తణుకులో కలెక్టరు గారింట్లో పెళ్ళికి వెళ్ళాలి. ఏలూరులో పనులు అయ్యేటప్పటికి రాత్రి 10 గంటలయ్యింది.

ఆ రోజుల్లో ఇన్ని ప్రయాణ సాధనాలు, రాకపోకల రద్దీ సందడి ఉండేది కాదు. రాత్రి ఎనిమిదింటికే ఊరంతా నిశ్శబ్దమైపోయింది. రామచంద్రం వాళ్ళు ఆ రాత్రికే తణుకు వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటారు. దట్టమైన అడవిలోకి వచ్చేటప్పటికి కారు ఆగిపోయింది. వెంటనే బాగయింది. మళ్ళీ ఆగిపోయింది. రాత్రి 12 అయింది. రామచంద్రం ఇంజను మీద కొట్టటానికి కర్ర కోసం తుప్పల్లోకి వెళ్ళాడు. పెద్ద విష సర్పం కాటు వేసి మాయమయింది. రామచంద్రం అరుపులు అడవంతా ప్రతిధ్వనించాయి. నోటి వెంట నురుగు వస్తోంది. భూషణం "ఎవరైనా నా స్నేహితుణ్ణి కాపాడండి. ఎన్ని లక్షలయినా ఇస్తాం" అని గట్టిగా పిలుస్తున్నాడు.

దూరంగా ముప్పల సవ్వడి. కోడె త్రాచుల విషం తీసి వైద్యానికి ఉపయోగించే సిద్ధయ్యది ముప్పల సవ్వడి. అతడు వాళ్ళను గుడిసెలోకి తీసుకువెళ్ళాడు. రామచంద్రాన్ని పడుకోబెట్టిన మంచం చుట్టూ తిరుగుతూ సిద్ధయ్య మంత్రం చదువుతున్నాడు. సిద్ధయ్య కూతురు ప్రమాదమని తెలిసినా అడవిలోకి వెళ్లి వైద్యానికి కావలసిన ఆకు తెచ్చి పసరు తాగించింది. రామచంద్రం బతికాడు. డబ్బు ఇవ్వబోతే సిద్ధయ్య తీసుకోడు. మనిషిని మనిషి కాపాడటంలో గొప్పదనం ఏమీ లేదంటాడు.

మొదటి బస్సుకి పెళ్ళికి ముగ్గురు బయలుదేరుతున్నారు. సిద్ధయ్య కూతురు ఏడుస్తూ "మా అయ్యను కాపాడండి. పాము కరిచింది. ఒక్కదాన్ని చూసుకోలేను. మందు తెచ్చి వెయ్యాలి. సాయంగా ఉండండి ఈ అడవిలో" అని మొర పెట్టుకుంది. ప్రాధేయపడింది. రెండు పది రూపాయల నోట్లు అమ్మాయి

ముఖం మీదకు విసిరి వాళ్ళు వెళ్లిపోయారు.

"నల్లజర్ల అడవి మీద చంద్రుడు భయంకరంగా ఉదయించాడు" – కథ ప్రారంభ వాక్యం ఇది. "చంద్రుడూ, వెన్నెలా ఎప్పుడూ మనోల్లాసంగా హాయిగా వుంటాయని మీ అభిప్రాయం. కాని ఒక్కొక్క పరిస్థితిలో ఎంత భయపెడతాయో మీకు తెలియదు" అన్నారు మళ్ళీ.... ఈ వాక్యాలు జరగబోయే కథకి పునాది.

ఆ రాత్రి చంద్రుడు నిజంగానే భయంకరంగా ఉదయించాడు. ఆ భయం గొలిపే వాతావరణంలో, అడవిలో రామచంద్రాన్ని పాము కాటు వేయటం, అతని కేకలు, భూషణం సాయం కోసం అర్థింపు, సిద్ధయ్య ప్రాణం పోయటం, సిద్ధయ్య కూతురు అడవికి వెళ్లి ఆకు తేవటం అన్నీ భయంకర వాతావరణంలోనే జరిగాయి. ఇది కొత్త భావ వ్యక్తీకరణ!

ప్రాణ భయం పోయాక, సిద్ధయ్య కూతురు విషయంలో బైటపడిన భూషణం సహజ ప్రవృత్తి, సాయం చేసి ప్రాణం నిల్పిన సిద్ధయ్య, కూతురు విషయంలో రామచంద్రం, భూషణంల స్వార్థ ప్రవర్తన ఇవన్నీ చంద్రుడు అడవి మీద భయంకరంగా ఉదయించటాన్ని సమర్థిస్తున్నాయి.

"అడవిలో మృత్యువు లాంటి చీకటి. మృత్యు దేవత నవ్వు లాంటి బూడిద రంగు వెన్నెల"– ఇలా వెన్నెలను రకరకాలుగా ఈ కథలో తిలక్ పోలుస్తారు.

అడుగడుగునా ఉత్కంఠ రేపే కథన శైలి. అద్భుతమైన కథా నిర్మాణం. మానవత్వం మంట గలిసిన వైనం. అడవులలో నాగరికతకు దూరంగా నివసించే సిద్ధయ్య, కూతురుల మంచితనం. నాగరికులు, నగర వాసులు అనే రామచంద్రం, భూషణంల అమానుష ప్రవర్తన, వెరసి ఈ కథ ఒక ఉత్కంఠభరితమైన చలన చిత్రాన్ని చూస్తున్న అనుభూతినిస్తుంది.

జీవితం సమస్యల సుడిగుండంలోకి తోసేస్తున్నా, కష్టాల వలయంలో బంధించేస్తున్నా కొందరు ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగానే కనిపిస్తారు. వారి పక్కన ఉండేవారికి కూడా వారిని చూస్తే ధైర్యం వస్తుంది. అటువంటి వ్యక్తి 'నవ్వు' కథలోని రామచంద్ర రావు.

అతడు ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. ఊళ్ళో అందరినీ నవ్వుతూ పలకరిస్తాడు. అందరూ అతనికి స్నేహితులు. ఇవి కథా ప్రారంభ వాక్యాలు. ఇందులో రామచంద్ర రావు స్వభావం పరిచయం అవుతుంది.

అతని పక్కనుంటే మూర్తికి ఉదయపు నీరెండ వంటి ఉత్సాహం వచ్చినట్లుంటుంది – ఇదొక పోలిక. ఉదయపు నీరెండ ఆహ్లాదంగా, ఆరోగ్యప్రదాతగా ఉంటుంది.

కాని మూర్తికి ఆశ్చర్యంగా ఉంటుంది. ఎప్పుడూ విషాదం ఇతనిలో కనిపించదు. ఆనందంలోని ఏ కీలకాన్ని ఇతను వశపరచుకున్నాడు?

మన చుట్టూ ప్రపంచంలో కూడా కొందరు రామచంద్ర రావు లాగే ఉంటారు. అంటే వాళ్ళ జీవితాలలో ఏ కష్టాలు, సమస్యలు ఉండవా? సుఖ దుఃఖ సమ్మిశ్రితమైన మానవ జీవితంలో ఎవరికైనా సమస్యలు, విషాదాలు ఎందుకుండవు? ఉంటాయి. అయినా వాళ్ళు నిత్య సంతోషులుగా వుంటూ పక్క వారికి కూడా మానసిక బలాన్నివ్వటం వారి గొప్పదనం.

ఇలా సంతోషంగా ఉండటానికి డబ్బు, హోదా వంటివి కారణం అవ్వవు. అవి ఉన్నవాళ్లు అందరూ సంతోషంగా ఉన్నారనటానికి దాఖలాలు లేవు. సంతోషం, ఆనందం అనేవి మనస్సంబంధమైనవి.

రామచంద్రరావు ఆస్తి, హోదా ఉన్నవాడు కాదు. నా

జీవితం సమస్యల సుడిగుండంలోకి తోసేస్తున్నా, కష్టాల వలయంలో బంధించేస్తున్నా కొందరు ఎప్పుడూ నవ్వుతూ సంతోషంగానే కనిపిస్తారు. వారి పక్కన ఉండేవారికి కూడా వారిని చూస్తే ధైర్యం వస్తుంది. అటువంటి వ్యక్తి 'నవ్వు' కథలోని రామచంద్ర రావు.

అన్నవాళ్లెవరూ లేరు. ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఒంటరి వాడు. అతడు వెళ్లే బస్సు ప్రమాదానికి గురై, అతడు హాస్పిటల్‌లో వున్నప్పుడు మూర్తి చూడటానికి వెళ్ళినప్పుడు, బతికే ఉన్నానా? అంటూ నవ్వుతాడు. ఆ నవ్వు హాయిగా మొగ్గవిడి తెల్లని పువ్వు రేకులను విచ్చుకుంటున్నట్లు ఉంటుంది. అంటే ఆ నవ్వు సానుభూతి ఇష్టం లేనప్పుడు చేసే నటన కాదు. సహజ దరహాసం. అందుకే విచ్చుకుంటున్న తెల్లని పువ్వురేకులతో పోలిక!

రామచంద్ర రావుకు సమస్యలు లేవా? చాలా ఉన్నాయి. అతడు సరళను ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఆమె ఇష్టపడింది. కానీ ఆస్తి ఏమీ లేనివాడని తిరస్కరించింది. అప్పుడూ అతని పెదవులపై చిరునవ్వే. ఆమెకు పెళ్లయిపోయింది.

రామచంద్ర రావుకు ఉద్యోగం పోయింది. తీవ్రమైన జబ్బు చేసింది. సరళ భర్తను కోల్పోయి బాధలో వున్నప్పుడు రామచంద్ర రావు రోజూ వెళ్లి పలకరించే వాడు. మూర్తి సరళకు అది గుర్తు

చేసి, అతని మంచితనాన్ని తలపించి, అతని బాధ్యత తీసుకొమ్మని కోరతాడు.

సరళ తన ఇంటికి తీసుకు వచ్చి సపర్యలు చేస్తుంది. కోలుకున్నాక ఒకటవుతారు. సరళ అప్పుడు అడుగుతుంది ఎప్పుడూ నవ్వుతూ ఉండటానికి కారణం ఏమిటని.

రామచంద్ర రావు ఏ ఒక్క సంతోషం లేని తన జీవిత ప్రస్థానాన్ని చెప్పి రేపటి బాధలకి ఆందోళన చెందటం, ఈ కాసేపటి బతుకునీ ద్వేష విషంతో నింపుకోవటం మూర్ఖత్వం అంటాడు. అతని నవ్వు వెనక భయంకర విషాదం ఉంది. జీవిత పర్యంతం కష్టాలు అలవాటు అయిపోయినవాళ్ళు రామచంద్ర రావు లాగానే ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు. ఇటువంటి వ్యక్తులను చుట్టూ సమాజంలో చూస్తూనే ఉంటాం. ఇది ఒక సందేశాత్మక కథ.

"ఊరి చివర ఇల్లు" అనే కథను తిలక్ "The Shadows" అనే పేరుతో స్వయంగా ఆంగ్లంలోకి అనువదించి "Tribute" అనే అమెరికన్ పత్రిక పెట్టిన ప్రపంచ కథల పోటీకి పంపారు.

ఈ కథ ఆధారంగా తెలుగులో "కమలతో నా ప్రయాణం" అనే సినిమా కూడా వచ్చింది. మానవ సంబంధాలు, ఆప్యాయతలు, జీవితంలోని విషాదాన్ని, భావోద్వేగాలను ఈ కథ ప్రతిఫలిస్తుంది.

తిలక్ కథలు మధ్య తరగతి జీవితంలోని మానవ సంబంధాలు, ఆత్మీయతలు, ఆశ నిరాశలు, సంఘర్షణలను ప్రతిబింబిస్తాయి. కథలను చదువుతున్నంత సేపు, దృశ్యాలను చూస్తున్న అనుభూతి పాఠకులకు కలుగుతుంది.

ఇంకా, తిలక్ నాటకాలు సామాజిక సమస్యలను బలంగా చిత్రీకరించాయి. సంభాషణలు సహజంగా, పాత్రోచితంగా వుంటూ చదివిస్తాయి. మిత్రులంతా కలిసి ప్రదర్శించిన నాటకాలు ఉన్నాయి.

తిలక్ సాహిత్యం బహుముఖాలుగా విస్తరించింది. సామాజిక స్పృహ, మానవీయత, భావుకత, విషాదం, సౌందర్యం ప్రధానాంశాలుగా సాగిన తిలక్ రచనా వ్యాసంగం, ముఖ్యంగా కవిత్వం, కథలు, ఆధునిక తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందాయి. అనంతర కవులపై, రచయితలపై అపారమైన ప్రభావాన్ని చూపాయి.

కుందుర్తి 'అమృతం కురిసిన రాత్రి' పీఠికలో తిలక్‌ను అందగాడిగా, మానసికంగా మెత్తనివాడిగా, స్నేహశీలిగా, కవిగా, రసజ్ఞుడిగా అభివర్ణించారు. శ్రీశ్రీ ఆయన అకాల మరణాన్ని తలచుకొని – "గాలి మూగదయి పోయింది... పాట బూడిదయి పోయింది" అంటూ సంతాపం వ్యక్తం చేశారు.

తిలక్ కవిత్వమే కాక కథలు, నాటకాలు, నాటికలు వంటి ప్రక్రియల్లోనూ తనదైన ముద్ర వేశారు. కవిత్వమైనా, కథైనా, నాటకమైనా – మానవ జీవితమే ఆయన సృజనకు కేంద్రం. 'అమృతం కురిసిన రాత్రి'కి 1971లో లభించిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఆయన ప్రతిభకు లభించిన మరణానంతర గౌరవం.

నలభై ఐదేళ్లు కూడా నిండని స్వల్ప జీవితంలోనే అపారమైన సాహిత్యాన్ని సృష్టించిన తిలక్ తెలుగు సాహిత్యానికి ఒక అరుదైన వరం. ఆయన అక్షరాలు "వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అయితే, ప్రజాశక్తిని మోసే "విజయ ఐరావతాలు" కూడా. అందుకే దేవరకొండ బాలగంగాధర తిలక్ తెలుగు కవిత్వంలో ఒక ప్రత్యేక స్వరం; తెలుగు సాహిత్య చరిత్రలో చెరిగిపోని సంతకం.

ఆధారాలు:

1. భావాభ్యుదయ కవి స్వర్గీయ దేవరకొండ బాలగంగాధర తిలక్ (1921–1966) – తంగిరాల వెంకట సుబ్బారావు
2. దేవరకొండ బాలగంగాధర తిలక్ లభ్య రచనల సంకలనం – నవంబర్ 2013.

గురజాడ బిల్హణీయము - సంప్రదాయ కథనంపై ఆధునిక ముద్ర

డా. శిరీష ఈడ్పుగంటి,
sirishavr@gmail.com



తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగవైతాళికుడిగా గురజాడ అప్పారావు గారి స్థానం అద్వితీయం. కేవలం సామాజిక సంస్కరణలకే ఆయన పరిమితం కాలేదు. సాహిత్యంలో పేరుకుపోయిన పాత భావాలను, మూస పద్ధతులను ఆయన ప్రశ్నించారు. హేతుబద్ధమైన ఆలోచనలతో నూతన దృక్పథాన్ని తెచ్చిన యుగపురుషుడు గురజాడ.

కన్యాశుల్కంతో తెలుగు నాటకరంగంలో గొప్ప విప్లవానికి నాంది పలికారు. చారిత్రక, సాంప్రదాయిక కథలను సైతం సరికొత్తగా మార్చగల అద్భుత ప్రతిభ ఆయన సొంతం. అందుకు బిల్హణీయము నాటకమే ప్రత్యక్ష నిదర్శనం. ఇందులో కాశ్మీర మహాకవి బిల్హణుడి కథను ఇతివృత్తంగా తీసుకున్నారు. కానీ దాన్ని పాత పద్ధతిలో కాకుండా మానవీయ కోణంలో రాశారు. ఇది కేవలం శృంగార కథ కాదు. స్త్రీల భావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఆయన ఇందులో చూపించారు. స్త్రీల వ్యక్తిత్వానికి సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. గురుశిష్యుల సంబంధాల ఔచిత్యాన్ని లోతుగా చర్చించారు. రాజ్య నియంతృత్వానికి, వ్యక్తి స్వేచ్ఛకు మధ్య జరిగే ఘర్షణను చూపించారు. సంప్రదాయ కల్పనలను శాస్త్రీయంగా పరిశీలించారు. ప్రాచీన ఇతివృత్తానికి ఆధునిక జీవాన్ని, తాత్విక బలాన్ని అందించారు. తెలుగు నాటకాల్లో కొత్త ఆలోచనలకు గురజాడ మార్గదర్శి అనడానికి బిల్హణీయము నాటకాన్ని గొప్ప ఉదాహరణగా చెప్పుకోవచ్చును.

సంస్కృతంలో మహాకవి బిల్హణుడు చౌరపంచాశిక రాశారు. దాని ఆధారంగా తెలుగులో ఎన్నో ప్రబంధాలు, యక్షగానాలు వచ్చాయి. వాటన్నింటిలోనూ బిల్హణుడి కథ కేవలం అంతఃపుర రహస్య శృంగారంగానే కనిపించింది. నాయకుడు ఉరిశిక్ష వరకు వెళ్లడం, శ్లోకాలు చదివి రాజు దయ పొందడంతో కథ ముగిసేది. అదొక విలాసభరిత ఇతివృత్తంగా మాత్రమే సాగింది. కానీ, గురజాడ చేతికి వచ్చేసరికి ఆ కథ రూపురేఖలే మారిపోయాయి. పాత సంప్రదాయ చట్రాలు బద్దలయ్యాయి. ఆ కథలో సరికొత్త ఆలోచనలు చేరాయి. ఆధునిక మానవతావాదం, తాత్విక హేతుబద్ధత చోటుచేసుకున్నాయి. ప్రాచీన ఇతివృత్తం నూతన కాంతితో వెలిగింది.

కథా పునర్నిర్మాణంలో హేతుదృష్టి

సంప్రదాయ కథలో ఒక అసహజమైన మూస ఉంది. రాజు ఇద్దరికీ తెలియకుండా ఒకరి గురించి మరొకరికి అబద్ధాలు చెబుతాడు. బిల్హణుడికి కంటిచూపు లేదని రాజకుమారికి చెబుతాడు. రాజకుమారి యామినీపూర్ణతిలక కుష్ఠురోగి అని బిల్హణుడికి చెబుతాడు. తెరచాటున విద్యాబోధన చేయిస్తాడు. ఆ తెర తొలగగానే వారిద్దరూ శృంగార వ్యామోహంలో పడతారు. గురజాడ ఈ అసంబద్ధమైన నాటకీయ ముసుగును పూర్తిగా తిరస్కరించారు.

గురజాడ చిత్రించిన బిల్హణుడు వేరు. ఆయన వయసు మళ్లినవాడు. ఎంతో అనుభవం ఉన్న ప్రౌఢ పండితుడు. రసజ్ఞుడైన గొప్ప కవి. అలాగే గురజాడ చేసిన అత్యంత విప్లవాత్మకమైన మార్పు రణసింహుడి పాత్ర. రణసింహుడు కాశ్మీర వలస రాకుమారుడు. అతడు అంతకుముందే యామినీదేవిని చూస్తాడు. ఆమెను నిష్కల్మషంగా ప్రేమిస్తాడు. బిల్హణుడు యామినీదేవికి గీతోపదేశం చేస్తాడు. అలా ఆమె మనసును నేర్పుగా రణసింహుడి వైపు మళ్లిస్తాడు. రాజపుత్రిక ఆయనను గురువుగా ఆరాధిస్తుంది. ఆయన పట్ల ఆకర్షితురాలు అవుతుంది. అయినా బిల్హణుడు ఆమె ఆకర్షణకు లొంగిపోడు. ఆమె ప్రేమను సున్నితంగా నిరాకరిస్తాడు. ఆమెకు సరిజోడైన

> ప్రాచీన కావ్యాల్లో రాజాస్థానాలను ఆదర్శంగా చూపించారు. అవి రసాస్వాదనకు, ధర్మ పరిపాలనకు నిలయాలని వర్ణించారు. కానీ గురజాడ దృష్టి వేరు. ఆయన ఒక ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలా ఆలోచించారు.



రణసింహుడితో ఆమెను కలపాలని నిర్ణయించుకుంటాడు. గురజాడ రాసిపెట్టిన కథా విభాగం ప్రకారం, నాటకం చివర్లో బిల్హణుడు నగరం విడిచి వెళ్లిపోతాడు. వెళ్తూ యామినీదేవికి ఒక లేఖ రాస్తాడు. రణసింహుడి పవిత్ర ప్రేమను అంగీకరించమని అందులో కోరతాడు (అప్పారావు, గురజాడ. 1957: 183). గురజాడ ప్రతిపాదించిన ఆధునిక నైతిక శిఖరానికి ఇది నిదర్శనం.

ఆస్థాన రాజకీయాలు – అధికార వర్గాల కుళ్లుపై ఆధునిక వ్యంగ్యం

ప్రాచీన కావ్యాల్లో రాజాస్థానాలను ఆదర్శంగా చూపించారు. అవి రసాస్వాదనకు, ధర్మ పరిపాలనకు నిలయాలని వర్ణించారు. కానీ గురజాడ దృష్టి వేరు. ఆయన ఒక ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలా ఆలోచించారు. ఆస్థానాల వెనుక ఉన్న అసలు రంగును బయటపెట్టారు. అక్కడ దాగి ఉన్న ఈర్ష్యాసూయలను, కుతంత్రాలను బట్టబయలు చేశారు. ఇందుకు ఉదాహరణ నానామంత్రి పాత్ర చిత్రణ. నానామంత్రి ఒక నికార్సయిన అవకాశవాది. దైవభక్తిని ముసుగుగా వేసుకుంటాడు. ప్రతి మాటకు భగవద్గీత, అమ్మాజీ ఆజ్ఞ అంటాడు. తీరా చూస్తే విలువైన రుద్రాక్షమాలను కాజేయాలని చూస్తాడు. పరమ లౌక్యంతో వ్యవహరిస్తాడు. అధికారం కోసం ఎంతటి నీచానికైనా దిగజారే రాజకీయ వర్గాలకు ఈ పాత్ర నిలువెత్తు ప్రతీక. అలాగే ఆస్థానంలో మాధవశర్మ, నారాయణభట్టు వంటి విద్వాంసులు ఉంటారు. కొత్తగా వచ్చిన ప్రతిభావంతుడిపై వారు కక్షగడతారు. ఎక్కడ రాజాదరణ కోల్పోతామోనని భయపడతారు. కుట్రలు, పన్నాగాలు పన్నుతారు. గురజాడ ఈ వైనాన్ని కళ్లకు కట్టారు. విద్య వినయాన్ని ఇవ్వాలి. కానీ ఇక్కడ మాత్సర్యానికి కారణమైంది. ఈ నిజాన్ని గురజాడ బిల్హణుడి నోట సూటిగా చెప్పించారు.

"పండిత సామాన్యమునకు విద్యన్నది జ్ఞానసాధకం కాక మాత్సర్య హేతువైయే యుండును" (అప్పారావు, గురజాడ. 1957: 145--146)

రుద్రాక్షమాల ఉదంతం – అధికార దుర్వినియోగంపై విమర్శ

నాటకంలో రుద్రాక్షమాల ఉదంతం అత్యంత నాటకీయమైనది. ఇది పాలకుల అహంకారాన్ని, మంత్రుల లోభత్వాన్ని పట్టిచూపుతుంది. కర్ణ మహారాజు బిల్హణుడి ప్రతిభను మెచ్చి ఒక అమూల్యమైన బంగారు రుద్రాక్షమాలను కానుకగా ఇస్తాడు. అయితే బిల్హణుడు ఒక రుద్రాక్షమాలను నిరాడంబరంగా తోటి పండితుడైన నారాయణభట్టుకు ఇచ్చివేస్తాడు. పండితుడికి విద్యాదానమే గొప్ప గానీ, ఇలాంటి వస్తు వ్యామోహాలు తగవని బిల్హణుడి భావన. దీనిని నానామంత్రి తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. రాజు ఇచ్చిన కానుకను తిరస్కరించి బిల్హణుడు ప్రభువును అవమానించాడని కర్ణరాజుకు నూరిపోస్తాడు. వెంటనే కర్ణ మహారాజు విచక్షణ కోల్పోతాడు. బిల్హణుడిని రాజ్య బహిష్కారం చేయాలని నిర్ణయిస్తాడు. విచారణ లేకుండా పాలకుడు తీసుకునే నియంతృత్వ నిర్ణయాన్ని గురజాడ ఇక్కడ తీవ్రంగా నిరసించారు.

అంతేకాదు, అదే నానామంత్రి తీరా నారాయణభట్టు ఇంటికి వెళ్లి బెదిరించి, ఆ బంగారు మాలను తన జేబులో వేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. చివరకు సభలో విదూషకుడు, కేశవభట్టుల చొరవతో నిజం నిరూపితమవుతుంది. బిల్హణుడు దాహళాధీశుడైన కర్ణదేవుడిచ్చిన పాత మాలనే నారాయణభట్టుకి ఇచ్చాడని, ప్రభువు ఇచ్చిన కొత్త మాల భద్రంగానే ఉందని తేలుతుంది. నానామంత్రి పిరికితనం, కర్ణరాజు తొందరపాటు బయటపడతాయి. అధికారంలో ఉన్నవారు భజనపరుల మాటలు నమ్మడం రాజ్యానికి ఎంత చేటో ఈ ఉదంతం వివరిస్తుంది.

అయితే ఇక్కడ ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. నాటకంలో 'కర్ణ' పేరుతో ఇద్దరు వేర్వేరు రాజుల ప్రస్తావన ఉంది. ఒకరు, దాహళాధీశుడైన కర్ణదేవుడు లేదా కర్ణమహారాజు లేదా కర్ణుడు (పుట: 145). బిల్హణుడు తన చారిత్రక కావ్యమైన విక్రమాంకదేవ చరితలో తన పూర్వ ప్రయాణాలను ప్రస్తావిస్తూ, దాహళ ప్రభువైన కర్ణుని ఆస్థానంలో కూడా కొంతకాలం ఉన్నట్లు పేర్కొన్నాడు (విక్రమాంకదేవ చరిత, 18వ సర్గ, శ్లో. 93--94).

ప్రస్తుత నాటకంలో వీరి పేరు ప్రస్తావన మాత్రమే ఒకటి రెండు చోట్ల ఉంటుంది. పాత్ర ఉండదు. బిల్హణుడు నారాయణభట్టుకి ఇచ్చిన రుద్రాక్షమాల దాహళాధీశుడైన కర్ణదేవుడిచ్చినది. ఇంకొకరు అనిహిల్లా పట్టణపు రాజు, కర్ణమహారాజు (పుట: 118). ప్రస్తుత నాటకంలో ముఖ్య పాత్ర. ఈయన కానుకగా ఇచ్చిన రుద్రాక్షమాల గురించే ప్రస్తుత చర్చ, రుద్రాక్షమాల ఉదంతం.

స్వేచ్ఛా స్వరానికి నవ్య ప్రతీక విదూషకుడు

సంస్కృత నాటకాల్లో విదూషకుడు కేవలం తిండిపోతుగా కనిపిస్తాడు. నవ్వించే హాస్యగాడిగా మాత్రమే మిగిలిపోతాడు. కానీ గురజాడ బిల్హణీయములో అతడి రూపం మారింది. ఇక్కడి విదూషకుడు పదునైన ఆలోచనలను రగిలిస్తాడు. అతడు ఆధునిక ప్రజాస్వామిక స్వరానికి ప్రతీక. అతడు మంత్రుల దొంగనీతులను నిలదీస్తాడు. వారిపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తాడు. మాటలతోనే చురకలు వేస్తాడు.

"సాగింది నిజం, సాగంది దబ్బర. మంత్రులనే మాట సాగుతుంది గనుక, వారనే మాటల్లా నిజమే. యింకా ప్రభువు మాటే సాగక తగుచు దబ్బరౌతుంది." (అప్పారావు, గురజాడ. 1957: 130)

కర్ణ మహారాజు సైతం ఈ విదూషకుడి పాత్రను సమర్థిస్తాడు. మహారాజు చిరునవ్వుతో ఇలా అంటాడు.

"హద్దుమీరిన మనిషి ఒక్కొక్కడు ఉంటేనేగాని, హద్దుయొక్క గుణాగుణములు తెలియవు. మనవలె ఉచ్ఛావస్థలో నున్నవారిని స్వేచ్ఛగా తిట్టగలిగినవారిని ఒకరిని అచ్చుబోసి వదిలితేనే గాని మనను గూర్చి లోకం యేమనేదీ మనకు తెలియబోదు. యేమంటారు?" (అప్పారావు, గురజాడ. 1957: 131)

గురజాడ భావప్రకటనా స్వేచ్ఛను ఎంతగా గౌరవించారో ఈ మాటలు చెబుతాయి. ప్రజాస్వామిక విమర్శకు ఆయన ఇచ్చిన స్థానాన్ని ఇది స్పష్టం చేస్తుంది. పాలకులను నిర్భయంగా విమర్శించే ప్రతిపక్ష స్వరం వ్యవస్థకు ఎంతో అవసరమని గురజాడ ఆనాడే చాటారు.

మత సమన్వయం – మానవతావాద తాత్వికత

నాటకంలోని అముద్రిత భాగంలో ఒక అద్భుతమైన సంభాషణ ఉంది. అది బిల్హణుడికి, రణసింహుడికి మధ్య జరుగుతుంది. ఇది గురజాడ తాత్విక ఆలోచనలకు పరాకాష్ఠ. సంపత్కరుడు జైనుడు కావడం వల్ల అతని స్నేహం మంచిది కాదేమోనని రణసింహుడు అనుమానం వ్యక్తం చేస్తాడు. అప్పుడు బిల్హణుడు సంకుచిత మత సరిహద్దులను చెరిపివేసేలా గొప్ప సమాధానం ఇస్తాడు.

"నాలుగు దేశాలూ తిరిగి నాలుగు మతాల వాళ్లతోనూ అన్నదమ్ములాగ బతికిన వాళ్లకి మతాభిమానాలు మాసిపోతాయి. బుద్ధికి సంకెళ్లు విడిపోతాయి" (అప్పారావు, గురజాడ. 1957: 176)

అని బిల్హణుడు స్పష్టం చేస్తాడు. బాహ్య ఆచారాల కన్నా మనుషులకు భూతదయ ముఖ్యం. సత్ప్రవర్తనే నిజమైన ప్రాణం అని బిల్హణుడు చెబుతాడు. భగవద్గీతలోని దైవీ, ఆసురీ గుణాలను ఉదాహరణగా చూపిస్తాడు. పూజలు, పునస్కారాలు చేసే వైదికుడు నానామంత్రి. కానీ అతనిలో రాక్షస ప్రవృత్తి నిండి ఉంది. వేదబాహ్యుడైన సంపత్కరుడు ఒక జైనుడు. అయినప్పటికీ అతనిలో దైవ ప్రవృత్తి కనిపిస్తుంది. బిల్హణుడు ఈ నిజాన్ని నిరూపిస్తాడు. "మతం కన్నా మనిషి ముఖ్యం" అన్నదే గురజాడ సందేశం. విశాలమైన ఆధునిక లౌకికవాదానికి ఇది నిలువెత్తు నిదర్శనం.

> **బాహ్య ఆచారాల కన్నా మనుషులకు భూతదయ ముఖ్యం. సత్ప్రవర్తనే నిజమైన ప్రాణం అని బిల్హణుడు చెబుతాడు. భగవద్గీతలోని దైవీ, ఆసురీ గుణాలను ఉదాహరణగా చూపిస్తాడు. పూజలు, పునస్కారాలు చేసే వైదికుడు నానామంత్రి. కా**

స్త్రీ విద్యాబోధన – వ్యక్తిత్వ వికాసం

సంప్రదాయ కావ్యాల్లో రాజకుమార్తెల విద్యాభ్యాసం కేవలం శృంగార కళలకే పరిమితమై ఉండేది. కానీ గురజాడ బిల్హణీయములో యామినీదేవికి బిల్హణుడు బోధించేది కేవలం వర్ణనలు కావు. భగవద్గీతను, లోకజ్ఞానాన్ని, మానవతా విలువలను ఆమెకు నేర్పుతాడు. అంతఃపురాల్లో ఉండే అసూయలను, రాచరికపు అసంతృప్తిని యామినీదేవి గ్రహించేలా చేస్తాడు. రాజభోగాల కన్నా స్వచ్ఛమైన హృదయం, నిష్కల్మషమైన ప్రేమే గొప్పవని బోధిస్తాడు. యామినీదేవిని మూగబొమ్మలా కాకుండా, ప్రశ్నించే తత్వం ఉన్న చైతన్యమూర్తిగా గురజాడ మలిచారు. ఆమె తన గురువు విద్వత్తును గౌరవిస్తుంది. అంతర్గత సత్యాన్ని తెలుసుకునే వివేకాన్ని ప్రదర్శిస్తుంది. స్త్రీ అభ్యున్నతిని, ఆత్మగౌరవాన్ని కాంక్షించిన గురజాడ ఆలోచనలు ఈ సన్నివేశాల్లో కనిపిస్తాయి.

కేశవభట్టు పాత్ర -- తార్కిక సమతుల్యత

నాటకంలో కేశవభట్టు నైయాయికుడు, తార్కికుడు. ఇతడు బిల్హణుడి ఆప్తమిత్రుడు. ఆస్థానంలో ఈర్ష్యతో రగిలిపోయే నారాయణభట్టు, మాధవశర్మలను శాంతింపజేయడానికి అతడు చేసే ప్రయత్నాలు గురజాడ సమతూకపు ఆలోచనలకు అద్దంపడతాయి.

"వాదానికి యుక్తి ప్రధానంగాని, పుస్తకాలతో యేంపనండీ!" (అప్పారావు, గురజాడ. 1957: 119) అంటూ గ్రంథస్థ ఛాందసాన్ని అతడు తోసిపుచ్చుతాడు.

"మనిషి దైవసృష్టి, శత్రుమిత్రులు మనుష్యసృష్టి" (అప్పారావు, గురజాడ. 1957: 123) అంటూ వసుధైవ కుటుంబక భావనను గుర్తుచేస్తాడు. గుడ్డి సంప్రదాయ వాదులను ఒకవైపు అదుపు చేస్తూనే, నిజమైన పాండిత్యం ఉన్న బిల్హణుడిని గౌరవించే ఒక ప్రగతిశీల మేధావిగా కేశవభట్టు పాత్రను గురజాడ అద్భుతంగా నిలబెట్టారు.

భాష - సాహిత్యం

నాటకంలోని రెండవ అంకంలో ఒక ఆసక్తికరమైన సన్నివేశం వస్తుంది. ఇది కేవలం నవ్వు పుట్టించే ఘట్టం మాత్రమే కాదు. నాటి పండితుల ఛాందస ధోరణిపై గురజాడ సంధించిన పదునైన విమర్శనాస్త్రం. అందులో నారాయణభట్టు తన శిష్యుడితో ఒక శ్లోకాన్ని రాయిస్తాడు. నాటి సంప్రదాయ పండితుల తీరును ఈ దృశ్యం నిక్కచ్చిగా ఎండగడుతుంది. వారిది శుష్కమైన, కేవలం కఠిన నియమాలతో కూడిన ధోరణి. భావం, అనుభూతి లేకుండా, కేవలం ఛందోనియమాలకే ప్రాధాన్యమిచ్చే ఆ నిస్సార పద్ధతిని గురజాడ తీవ్రంగా గేలిచేశారు. ఆ కాలంలో కొందరు పండితులు ప్రాసల కోసమే వెంపర్లాడేవారు. వ్యాకరణ నియమాల కోసమే అర్థం లేని పదాలను గుట్టలుగా పేర్చేవారు. దాన్నే గొప్ప కవిత్వమని వారు భ్రమపడేవారు. శబ్దాల ఆర్భాటాలు, జిమ్మిక్కులను చూపి మంచి కావ్యమని లోకాన్ని భ్రమపెట్టేవారు. అయితే, మంచి కావ్యానికి కావాల్సింది బాహ్య శబ్ద చమత్కారాలు కావు. ఈ నిజాన్ని గురజాడ బిల్హణుడి పాత్ర ద్వారా స్పష్టంగా చెప్పారు. కాళిదాసు శ్లోకాలను ఉదహరిస్తూ బిల్హణుడి ద్వారా గురజాడ సరికొత్త సౌందర్య మీమాంసను చేశారు.

"కవిత్వంలో ధ్వని ఆ అందెలచడిలా వుండాలి." (అప్పారావు, గురజాడ. 1957: 178)

ప్రజలు మాట్లాడే సజీవ వ్యావహారిక భాషకు పెద్దపీట వేయాలన్న గురజాడ సాహిత్య సంకల్పం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నాటకం ద్వారా ఆయన రసాత్మక సాహిత్య విప్లవాన్ని బలంగా నడిపారు. గురజాడ అప్పారావు గారు సమాజంలో, సాహిత్యంలో ఒక నవయుగానికి నాంది పలికారు. ఆ యుగకర్త ఆశయాలన్నింటికీ ఈ నాటకం ఒక చక్కని ప్రతిరూపం.

ముగింపు

గురజాడ బిల్హణీయము కేవలం ఒక రాజు, కవి, రాకుమారిల చుట్టూ తిరిగే పాతకాలపు ప్రణయగాథ కాదు. ప్రాచీన రాచరికపు భావజాలం నుంచి మొదలై, ఆధునిక ప్రజాస్వామిక విలువలను అన్వేషించిన విలక్షణ రచన ఇది. సంకుచిత సంప్రదాయాల సంకెళ్లను తెంచుకుని, విశాల మానవతా దృక్పథాన్ని ఆవిష్కరించిన గొప్ప సాహిత్య ప్రయోగం. ఈ నాటకంలో గురజాడ ప్రాచీన భావనలకు తిరుగులేని ఆధునిక నిర్వచనాలు ఇచ్చారు. శృంగారానికి త్యాగనిరతిని జోడించారు. పాండిత్యాన్ని తాత్విక హేతుబద్ధతతో అనుసంధానించారు. మతాన్ని బాహ్య ఆచారాలతో కాకుండా సత్ప్రవర్తనతోనే కొలవాలని చాటారు. తద్వారా ఈ సంప్రదాయ కథావస్తువుపై తనదైన ఆధునిక ముద్రను బలంగా వేశారు. బిల్హణీయము అసంపూర్ణ నాటకమే కావొచ్చు. కానీ అందులోని ఆలోచనా వైశాల్యం, ప్రగతిశీల దృక్పథం అపారమైనవి. తెలుగు నాటకరంగంలో కొత్త పుంతలు తొక్కిన అరుదైన, చిరస్మరణీయమైన ప్రయోగమిది.

ఆధార రచన

అప్పారావు, గురజాడ. 1957. కొండుభట్టీయము - బిల్హణీయము (నాటక సంపుటి). విశాలాంధ్ర ప్రచురణాలయం. విజయవాడ.





గురజాడ మహాకవి శ్రీశ్రీ ప్రతిపాదనలు

ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు
94901 64963

ప్రవేశిక:

కట్టమంచి రామలింగారెడ్డి రాసిన 'కవిత్వతత్వ విచారం' ఆధునిక విమర్శకు తెరతీసిందని విమర్శకుల అభిప్రాయం. విమర్శలో గుణాలనే కాకుండా, దోషాలను తెల్పడం, రచనలోని సాంఘిక, ఆర్థిక, మానవీయ కోణాల్ని ఆవిష్కరించడం నేటి విమర్శ లక్ష్యమైంది. అన్నిటికంటే ఒక రచయిత లేదా కవిపై వ్యక్తిగత దృష్టితో కాకుండా, సహృదయ విమర్శ చేయాలని చాలామంది ఆమోదించారు. సహృదయ దృష్టి అనేది అందరికీ ఒకేలా లేదు. రచయితను సహృదయుడు అర్థం చేసుకొని సానుభూతితో పరిశీలించడం సహృదయ దృష్టి అని కొందరు భావిస్తారు. సహృదయుడు అంటే మంచి మనసు గలవాడు అని అర్థం. మంచిమనసుతో విమర్శ చేయడం సహృదయ విమర్శ. విమర్శ వల్లనే ఒక రచన లోతుపాతులు, రచయిత దృష్టి ఆవిష్కృతమవుతాయి. శ్రీశ్రీ వేగుచుక్కగా గురజాడను కీర్తించడానికి ఆయన చేసిన రచనల్లోని విలక్షణతే కారణం. శ్రీశ్రీ గురజాడను ఏఏ కోణాల్లో పరిశీలించారో వివరించడం ఈ వ్యాసోద్దేశం.

శ్రీశ్రీ దృష్టిలో కవిగా, కథకుడిగా గురజాడ:

శ్రీశ్రీ వివిధ సందర్భాల్లో గురజాడ కవిత్వం, నాటకం, కథలపై రాసిన విషయాలూ, గురజాడ రచనాధోరణిపై రాసిన విమర్శ వ్యాసాలూ కలిసి 'మన గురజాడ' అనే పుస్తక రూపంలో వచ్చాయి. ఈ చిన్న పుస్తకంలో 15 అంశాలకు సంబంధించిన విమర్శలున్నాయి. అవి 1. 'కన్యాశుల్కము'లో స్త్రీ వ్యక్తులు 2. ముత్యాలసరం – ఒక కృషి 3. 'కన్యాశుల్కం' మీద 4. సెల్యులాయిడ్లో 'కన్యాశుల్కం' 5. నరకంలో 6. ఒక కావ్యనాయిక 7. బైరాగి 8. 'కన్యాశుల్కం'లో లోపాలు 9. ఆధునిక గద్య వాఙ్మయ ప్రవర్తకుడు 10. గురజాడ ఆధిక్యానికి కారణాలు 11. ముత్యాలసరాలు 12. గురజాడ – కథనశిల్పం 13. నాకు నచ్చిన కథ 14. ముందడుగు 15. కామ్రేడ్ గురజాడ. ఈ 15 అంశాల్లో పదకొండు వ్యాసాలు కన్యాశుల్కానికి సంబంధించినవి. రెండు కవిత్వానికి సంబంధించినవి కాగా, రెండు గురజాడ దృక్పథాన్ని వివరిస్తూ రాసినవి. ముందుగా శ్రీశ్రీ దృష్టిలో కవిగా, కథకుడిగా గురజాడ స్థానాన్ని తెలుసుకుందాం.

శ్రీశ్రీ 'మన గురజాడ' గ్రంథంలో గురజాడ కవిత్వాన్ని, విమర్శ వ్యాసాలను, కథకుడిగా వారి ప్రత్యేకతను పరిశీలించారు. ఈ పుస్తకంలోని విషయంలోను, విస్మృతిలోను పెద్ద వ్యాసం 'ముత్యాలసరం – ఒక కృషి' అనేది. ఇందులో వీరి కవిత్వ విమర్శనా తత్వపు లోతులు స్పష్టంగా కన్పిస్తాయి. ప్రపంచంలో వాఙ్మయం మొదట పుట్టాక విమర్శకులు దాన్ని వర్గీకరిస్తారని

> గురజాడ కథల గురించి శ్రీశ్రీ రెండు విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. అవి గురజాడ కథనశిల్పం, నాకు నచ్చిన కథ. వీటిలో మొదటిది ఆకాశవాణి విజయవాడ కేంద్రం వారి కోరికపై చేసిన ప్రసంగం. అందులో కథకు, కథనానికి తేడాని చెప్తూ 'కథనం' అంటే చెప్పడం.



చెప్తూ, గురజాడను మహాకవిగా ఆవిష్కరించే ప్రయత్నంలో భాగంగా మొదటగా మహాకవులెవ్వరినీ నియమాలు బంధించలేదని, అలాగని నియమాలను ఉల్లంఘించి మహాకవి పదవినర్థించడం పరిహాసాస్పదమని అంటారు. అలాగే విమర్శకుడంటే మహాపండితుడై ఉంటాడని చెప్పారు. ఆధునిక విమర్శకులు, కవులు సాముగారడీలు చేస్తుంటే ప్రేక్షకుల్లా ఊరుకోరని చెప్పారు శ్రీశ్రీ. తన విమర్శతత్వాన్నీ, తన విమర్శకు శ్రోతలు ఎలా ఉండాలో కూడా వివరించారు. "నవీన కవిత్వం బాధ్యతలేని భ్రంశకార్య తత్పరుల అగమ్యగోష్టి కాదనీ, శుద్ధాంతఃకరణతో, సత్యసంకల్పముతో, అనేక సారస్వతాలతో కావ్యగుణం గవేషించి కొత్త విధంగా కవిత్వ సాక్షాత్కారం పొంది కావ్యగానం చేస్తున్న వారి వింత కంఠమని నమ్మినవారిని నా శ్రోతలుగా నిర్ణయించుకున్నాను" అని చెప్పి, వింతకంఠం వినిపించిన గురజాడ ముత్యాలసరాల ఛందస్సును సమీక్షించారు.

కొత్తపాతల మేలుకలయికగా, కొత్త మెరుగులు చిమ్ముతూ వచ్చిన ముత్యాలసరాలు 1910లో గురజాడ ప్రోగించిన నవీన కవిత ఆరంభ గీతాలని చెప్పారు శ్రీశ్రీ. మెచ్చినా, మెచ్చకున్నా ఇబ్బంది లేదని ధైర్యంగా అడుగేసిన గురజాడ 29 ముత్యాలసరాల్ని ఖండకావ్యంగా మలచారని, దానితో ఆధునిక కవిత్వపు కవాటాలు తెరుచుకున్నాయని తెలిపారు శ్రీశ్రీ. ముత్యాలసరాలు గురజాడ స్వతంత్ర సృష్టి కాదనేవారికి వీరు ఇలా సమాధానం చెప్పారు. "ముత్యాలసరం అనే ఛందస్సు అప్పారావుగారి స్వతంత్రసృష్టి కాకపోవచ్చును. అంతకు పూర్వమున్న యక్షగానాల్లో ఈ విధంగా నడిచే రచనలెన్నింటినో చూపించవచ్చును. 'వృషభగతి' అనే రగడలో ముత్యాలసరానికి గల బాంధవ్యం గమనించవచ్చును. ఆ రగడల్లో కళిక – ఉత్కలిక లను ఊహించవచ్చును. షట్పదాలను పేర్కొనవచ్చును. అక్షరాల ముత్యాలసరమే అయినా 'గుమ్మడేడే గోపితల్లి' అనే గేయాన్ని తెచ్చి ముత్యాలసరం నవీనతను ప్రతిఘటించవచ్చును. ఏమైనా ముత్యాలసరం అంటే మనకు గురజాడగారి పేరే జ్ఞాపకం వస్తుంది. ఏ సుముహూర్తంలోనో అతడాగేయం పలికి దానికి 'ముత్యాలసరం' అని నామకరణం చేశాడు. ఒక నూత్నావేశానికి వాహనంగా చేసుకొని ఒక స్వతంత్ర కవిత్వాన్ని విడుదల చేశాడు. గురజాడ అప్పారావుదే ఈ ఛందస్సు". ముత్యాలసరాల్లోని నాలుగు పాదాల్లో మొదటి మూడు దీర్ఘ పాదాలని, అందులో 14 మాత్రలుంటాయని, నాల్గవదైన హ్రస్వపాదంలో 9 మాత్రలుంటాయని తెల్పారు. గురజాడ ముత్యాలసరాల వంటివి రంగాచార్యులు రాసిన 'అప్పరాయి స్మృతి'లో, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి తోక ముత్యాలసరాలలో, కవికొండల వెంకటరావు 'శివరాత్రి ప్రభ'లో ఇంకా బసవరాజు అప్పారావు, తురగా వెంకట్రామయ్య, వేంకట పార్వతీశ కవులు, దువ్వూరి రామిరెడ్డి వంటివారి రచనల్లో ఉన్నాయని వాటి ఛాయలను శ్రీశ్రీ ఉదహరించారు. అలాగే తన రచనలైన బాటసారి, జయభేరి ఖండికల్లో ఎలాంటి పోకడలున్నాయో తెలిపారు. ఛందస్సు గుర్రంలాంటిదని, దాన్ని లొంగదీసి దానిచేత చిత్ర, విచిత్ర రీతుల్లో కదం తొక్కించినవాడినే ప్రశంసిస్తారని, అందుచేతే గురజాడ ప్రశంసనీయుడని చెప్తారు శ్రీశ్రీ.

'ముత్యాలసరాలు' అనే విమర్శనా వ్యాసంలో ఆదికాలంలో తిక్కనను, మధ్యయుగంలో వేమనను, ఆధునిక కాలంలో గురజాడను మాత్రమే తెలుగులో మహాకవులుగా పేర్కొన్నారు. "నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు తళుకు బెళుకురాళ్ళు తట్టడేల" అనే వేమన వాక్కు గురజాడ విషయంలో అక్షరసత్యమంటారు. గురజాడ 'దేశభక్తి' గీతం సమస్త ప్రపంచ జనుల జాతీయగీతమని చెప్తూ "ఒక తెలుగు కవి ప్రపంచానికిచ్చిన కవిత్వపు కానుక ఇది" అన్నారు. గురజాడ కూడా జానపద జీవితంలో ఒదిగివున్న ముత్యాలసరాన్ని తనది చేసుకున్నారు. ముత్యాలసరం నామధేయం కూడా గురజాడ పెట్టినదే. "గణబద్ధ ఛందస్సుల ప్యూడలిజం నుండి మాత్రాబద్ధ ఛందస్సుల ప్రజాస్వామ్య యుగానికి ఆంధ్ర సాహిత్య చరిత్ర గమనాన్ని పరివర్తన చేసిన వాడు గురజాడ" అని శ్రీశ్రీ

కితాబిచ్చారు. గురజాడలోని ప్రగతిశీల దృక్పథాన్నీ, తోకచుక్క గురించి చెప్పి మూఢ విశ్వాసాన్ని ఖండించడం వంటి అంశాలనూ శ్రీశ్రీ వివరిస్తారు.

గురజాడ కథల గురించి శ్రీశ్రీ రెండు విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. అవి గురజాడ కథనశిల్పం, నాకు నచ్చిన కథ. వీటిలో మొదటిది ఆకాశవాణి విజయవాడ కేంద్రం వారి కోరికపై చేసిన ప్రసంగం. అందులో కథకు, కథనానికి తేడాని చెప్తూ "'కథనం' అంటే చెప్పడం. ఈ చెప్పడం అనేది ఎంత రమణీయార్థ ప్రతిపాదకంగా ఉంటే అంతగా అది సాహిత్య శిల్పంగా రాణిస్తుంది. గురజాడ కథన కౌశలం ఆయన కథానికలకు మాత్రమే పరిమితం కాదు. తాను చేపట్టిన అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ మనల్ని ఆకట్టుకొని రంజింపజేస్తుంది" అంటారు. ఈ కథన శిల్పాన్ని కన్యాశుల్కం నాటకంలోని సన్నివేశాలకు కూడా అనుసంధానం చేశారు. అలాగే 'నాకు నచ్చిన కథ'లో "కథారచనలో నన్ను మించిన వాళ్ళెందరో తెలుగు రచయితల్లో ఉన్నారని ఏ దాపరికమూ లేకుండానే ఒప్పుకుంటాను. అందరినీ మించినవాడు గురజాడ అప్పారావు గారంటే అందరూ ఒప్పుకుంటారనే నా నమ్మకం" అని సిద్ధాంతీకరించారు. గురజాడ రచనల్లో వజ్రపు తునకగా 'మీ పేరేమిటి?' కథను వర్ణించారు శ్రీశ్రీ. వందేళ్ళ కిందట విజయనగరం దగ్గరలో ఒక గ్రామంలో కథకు మూలాలున్నాయని, అయినా ఇందులో సంఘటనలు నిన్నగాక మొన్న జరిగినట్లు ఉంటాయని అంటారు. ఈ విధంగా శ్రీశ్రీ ముత్యాలసరాల విశిష్టతను, కథకుడిగా గురజాడ ఆధిక్యతను వివరించారు.

గురజాడ కన్యాశుల్కంపై శ్రీశ్రీ అభిప్రాయాలు:

శ్రీశ్రీ రాసిన 'మన గురజాడ' గ్రంథంలో అగ్రతాంబూలం 'కన్యాశుల్కం' నాటకానిదే. వీటిలో కన్యాశుల్కంలోని పాత్రల సజీవత్వాన్ని విశ్లేషిస్తూ ఎక్కువ వ్యాసాలు రాశారు. అలాగే కన్యాశుల్కంలో తనకు కన్పించిన లోపాలను కూడా తెల్పి, సద్విమర్శకుడనిపించుకున్నారు. కన్యాశుల్కంపై అప్పటికే ఎన్నో విమర్శనాత్మక వ్యాసాలు వచ్చి ఉండడంతో, శ్రీశ్రీ కొన్ని విషయాలపై మాత్రమే విమర్శ చేశారు. అలాంటి విమర్శ వ్యాసాల్లో 'కన్యాశుల్కంలో స్త్రీ వ్యక్తులు' అనేది మొదటిది. వ్యాసానికి శీర్షికను పెట్టడంలోనే శ్రీశ్రీ విలక్షణతను ప్రదర్శించారు. 'స్త్రీలు' అనిగాని, 'స్త్రీ పాత్రలు' అని గాని కాకుండా 'స్త్రీ వ్యక్తులు' అనడంలో అందులో పాత్రలకున్న విలక్షణ వ్యక్తిత్వం అర్థమవుతుంది. నాటకంలో స్త్రీలను "తళుక్కున మధురవాణి మెరుస్తుంది. బుచ్చమ్మ అమాయకముగా చూస్తుంది. వెంకమ్మ కూర తరుగుతూ కనిపెట్టుకుంటుంది. పూటకూళ్ళమ్మ పల్లెవాటులో చీపురుకట్ట దాచి ప్రవేశిస్తుంది. మీనాక్షి వెంటనంటుతుంది. యోగిని సైగ చేస్తుంది. మహేశము కూడా పెళ్ళి కూతురై ప్రవేశిస్తానంటాడు" అని వారి పాత్రతత్వంతో సహా పరిచయం చేయడం శ్రీశ్రీ ప్రత్యేకత.

శ్రీశ్రీ దృష్టిలో కన్యాశుల్కంలో అత్యంత ప్రాధాన్యత గల స్త్రీ పాత్ర మధురవాణి. శ్రీశ్రీ విజయనగరం నుండి ఆమె పూర్వరంగ చరిత్రను రెండు మూడు మాటల్లో చెప్పి, ఆమె సంభాషణా చాతుర్యంలోని గొప్పదనాన్ని వివరిస్తారు. అంతేగాదు ఆమె గొప్పదనాన్ని కన్యాశుల్కంలో ప్రతి పురుషపాత్ర మెచ్చుకున్న

> **'కన్యాశుల్కం'లో "అన్ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడో"గా గిరీశం కీర్తించిన బుచ్చమ్మ నియమబద్ధ జీవితాన్ని, నిష్కల్మష హృదయాన్ని, ఆ హృదయంలో గిరీశం నిర్మిస్తున్న విక్షోభాన్ని శ్రీశ్రీ వివరించారు. బుచ్చమ్మకూ, మరొక వితంతువైన మీనాక్షికీ పోలిక లేకపోవడాన్ని శ్రీశ్రీ గుర్తించారు.**

విషయాన్ని క్రోడీకరించారు. "'మధురవాణి' అంటూ ఒక వేశ్యాశిఖామణి ఈ కళింగరాజ్యంలో ఉండకపోతే భగవంతుడి సృష్టికి ఎంత లోపం వచ్చి ఉండును" అని పలికిన కరటకశాస్త్రి మాటల్ని, మధురవాణితో 'నువ్వు మంచిదానివి, ఎవరో కాలుజారిన సత్పురుషుడి పిల్లవై ఉంటావు' అన్న సౌజన్యారావు మాటల్ని శ్రీశ్రీ ఉటంకించి, ఆమె వ్యక్తిత్వాన్ని స్థిరపరుస్తారు. చివరకు మధురవాణి గురించి శ్రీశ్రీ ఇలా చెప్పారు. "మధురవాణి నాటకానికే అతి ముఖ్యమైన స్త్రీ పాత్రము. ఆమె వలన కథ సూటిదారిలో ప్రవహిస్తుంది. కథ ఎదురు తిరిగితే చక్రం అడ్డు వేయగలిగినంత ధీమా ఆమెకున్నది. అధైర్యము ఎక్కడా ఆమె ముందు తొణుకాడదు. పరిస్థితులు బాగా పరించి తదనుగుణంగా సూటిగా ప్రవర్తిస్తుంది. కథలో చిక్కు తీసుకొని వచ్చునదీ, విడగొట్టునదీ కూడా మధురవాణే".

కన్యాశుల్కంలో మధురవాణి పాత్రకు, ఇతర పాత్రలకు గల వ్యత్యాసాన్ని శ్రీశ్రీ స్పష్టంగా గుర్తించారు. నగర స్త్రీ అయిన

> 'ఒక కావ్య నాయిక' అనే విమర్శ శ్రీశ్రీ కన్యాశుల్కాన్ని ఎంతగా చదివారో తెలుపుతుంది. తన పుస్తకాల్లో ఆ నాటకం లేకపోయినప్పటికీ కళ్ళు మూసుకొని ఆ నాటకం ఆమూలాగ్రం గుర్తు చేసుకోగలిగినంత లోతుగా దాన్ని చదివారు.



మధురవాణికీ, అగ్రహార స్త్రీలైన మిగిలినవారికీ మధ్య గురజాడ చూపిన వ్యత్యాసాన్ని శ్రీశ్రీ వివరించారు. వెంకమ్మ పాత్రలో కన్పించే అమాయకత్వాన్ని, తల్లి ప్రేమను వివరిస్తూ శ్రీశ్రీ "నాటక ద్వితీయాంకమామె వాక్యములతో, ఆత్రముతో ఆరంభమవుతుంది. వెంకటేశము రాగానే ఆమెయే ప్రేమతో అతనిని కౌగలించుకుంటుంది. ఆమెయందలి అమాయకత్వమే బుచ్చమ్మలో ప్రతిఫలించింది" అని చెప్తారు. తర్వాత రాబోయే బుచ్చమ్మ కూడా ఎంత అమాయకమైందో సూచించారు శ్రీశ్రీ.

'కన్యాశుల్కం'లో "అన్ఫార్చునేట్ బ్యూటిఫుల్ యంగ్ విడో"గా గిరీశం కీర్తించిన బుచ్చమ్మ నియమబద్ధ జీవితాన్ని, నిష్కల్మష హృదయాన్ని, ఆ హృదయంలో గిరీశం నిర్మిస్తున్న విక్షోభాన్ని శ్రీశ్రీ వివరించారు. బుచ్చమ్మకూ, మరొక వితంతువైన మీనాక్షికి పోలిక లేకపోవడాన్ని శ్రీశ్రీ గుర్తించారు. అలాగే గిరీశం చరిత్రనూ, అతని గుణాన్ని చెప్పడానికే అన్నట్లు గురజాడ సృష్టించిన పూటకూళ్ళమ్మ ఎంత హాస్యాన్ని సృష్టించిందో శ్రీశ్రీ తెల్పారు. నాటకంలో అముఖ్య పాత్రగా కన్పించే యోగిని పాత్రను కూడా శ్రీశ్రీ గుర్తించారు. చివరగా "కన్యాశుల్కమునందు కానవచ్చు, వ్యక్తులిందు సంఘములందలి వేరువేరు తరగతుల నుండి ఏరి తీయబడినారు. వారి నర్థం చేసుకొనుటనగా కన్యాశు ల్కమునర్థము చేసుకొనుమాట" అని చెప్పారు.

'కన్యాశుల్కం మీద' అనే విమర్శలో "కన్యాశుల్కం గొప్పది. జీవితమంత గొప్పది. సాహిత్యంలో వాస్తవికతను ఇంత సమగ్రంగా ప్రదర్శించిన నాటకం ఈనాటి మన దేశంలో లేనేలేదు" అంటారు. గురజాడ సమాజంలో కన్పించే అన్ని సంఘటనల్నీ, అన్ని రకాల మనుషుల్నీ, ఆహారం, నిద్ర, భయం, మైథునం, చావు, హత్య, ప్రసవం, పెళ్ళి – అన్ని అంశాల్నీ చూపించాడని చెప్పారు. అయితే "ఇవన్నీ ఉండాలని ముందుగా అనుకొని గురజాడ అప్పారావు వీటిని నాటకంలో ప్రవేశపెట్టలేదు. అలా అయితే గణాలు లెక్కెట్టించుకుంటూ కవిత్వం రాసినట్టే ఉంటుంది" అని వివరించారు. 'సెల్యులాయిడ్లో కన్యాశుల్కం' అనే విమర్శలో తెలుగునాట గొప్పగా ప్రదర్శితమైన కన్యాశుల్కం నాటకం సినిమాగా తెరకెక్కించే విషయంపై శ్రీశ్రీ అంచనా వేశారు. కొంతమంది విమర్శకుల అభిప్రాయాన్ని ఇలా తిప్పికొట్టారు: "కన్యాశుల్కంలో మాటలేగాని బొమ్మలు లేవట అంచేత అది ఫిల్మికి అనర్హమట. మాటల్ని బొమ్మలుగా మార్చే శక్తి మీకు లేదనండి. అదే న్యాయమైన మాట. కన్యాశుల్కంలో ఏ ఒక్క పేజీనైనా రెండువేల అడుగుల ఫిల్మి తీయడానికి అవకాశం ఉంటుందంటాను నేను" అని విమర్శించారు. "కన్యాశుల్కంలో గిరీశం, రామప్పంతులు, లుబ్ధావధాన్లు వంటి నవ్వు పుట్టించే ట్రాజిక్ హీరోల నాటకంతో శిథిలీకృతమవుతున్న ఒకానొక సాంఘిక వ్యవస్థ కరాళనృత్యం కన్పిస్తుంది" అని చెప్తూ, కన్యాశు ల్కం బీభత్సరస ప్రధానమైన విషాదాంత నాటకం అంటారు.

'ఒక కావ్య నాయిక' అనే విమర్శ శ్రీశ్రీ కన్యాశుల్కాన్ని ఎంతగా చదివారో తెలుపుతుంది. తన పుస్తకాల్లో ఆ నాటకం లేకపోయినప్పటికీ కళ్ళు మూసుకొని ఆ నాటకం ఆమూలాగ్రం గుర్తు చేసుకోగలిగినంత లోతుగా దాన్ని చదివారు. ఎన్నో గ్రంథాల్ని చదివినా ఆయన్ను ఆకర్షించే ఏకైక పాత్ర మధురవాణి అని చెప్తారు. "నేను చదివినంత వరకు విశ్వ సాహిత్యంలో మధురవాణితో సరిపోల్చు దగిన పాత్ర మరొకటి లేదు. అనగా తెగలో ఈమె అద్వితీయంగా నిలుస్తుంది. ఆ తెగ అనగా 'సామాన్య' అనే నాయికా విశేషం నా ఉద్దేశం. 'విక్రమోర్వశీయం'లో ఊర్వశి, 'మృచ్ఛకటికం'లో వసంతసేన కవితా కన్యకలుగానే కనిపిస్తారు. రక్తమాంసాలతో పుష్టిగా భూమి మీద తిరిగే పాత్రలు కావివి" అని విశ్లేషణాత్మకమైన విమర్శ చేశారు. మధురవాణి ఎవరితోనైనా ఒక్కలాగే మాట్లాడుతుందని, పల్లెలోనైనా, పట్టణంలోనైనా సామర్థ్యంతో ధీమాగా మధురవాణి కదుల్తుందని అంటారు శ్రీశ్రీ. చివరగా గొప్ప నాటకమైన మృచ్ఛకటికం నాయిక కంటే మధురవాణి ఎందుకు గొప్పదో ఇలా చెప్పారు. "ఉజ్జయినీ నగరాన్నీ, చారుదత్తుని ప్రేమనీ వదులుకోవలసి వస్తే వసంతసేన ఏమయిపోతుందో

తలచుకోవడానికి భయమవుతుంది. మధురవాణి మాత్రం ఏ స్థలాన్నయినా, ఏ స్థితిలోనైనా లొంగదీసుకోగలదు. ఎంత గొప్ప పాత్రని సృష్టించాడు గురజాడ".

'బైరాగి' అనే వ్యాసంలో కన్యాశుల్కంలో బైరాగి పాత్ర ఔచిత్యాన్ని వివరించారు. కొన్ని నాటకాల్లో ఒక పాత్ర ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తే కొన్నిటికి సమాధానం దొరకదు. ఆ పాత్ర లేకుంటే వెలితిగా ఉంటుందని మాత్రం చెప్పగలం. బైరాగి పాత్ర విషయంలో అదే విషయాన్ని శ్రీశ్రీ "ఇతనే లేకపోతే ఏదో లోపం వచ్చినట్టుంటుంది. ఆ లోపం ఏమిటో చెప్పడం కష్టం. బైరాగి లేని కన్యాశుల్కం డెన్మార్కు రాకుమారుడు లేని హామ్లెట్ గాని, కర్ణుడు లేని భారతంగాని అయిపోతుంది. బైరాగి అన్నివిధాలా అనవసరమైన పాత్ర. కాని అతడు లేనిదే కన్యాశుల్కానికి సంపూర్ణత లేదు" అని చెప్పారు. అయితే కన్యాశుల్కం కాలంనాటికి, నేటికీ బైరాగుల విషయంలో పెద్ద తేడా కన్పించదు. ఎందుకంటే అందరూ పోలీసులకు భయపడితే, పోలీసులు మాత్రం స్వామీజీల కాళ్ళ దగ్గర మోకరిల్లే ఉదంతాలు నేటి సమాజంలో బాగా కన్పిస్తున్నాయి. దేశంలో అత్యున్నత పోలీసు అధికారులు దేరా బాబా వంటి కుహనా బాబాల దగ్గర చేరినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని శ్రీశ్రీ "ప్రపంచం పోలీసువాళ్ళను గౌరవిస్తే పోలీసులు బైరాగులను గౌరవిస్తారు" అని చెప్తారు. "మేం సిద్ధులం నిజాన్ని అబద్ధం చేస్తాం. అబద్ధాన్ని నిజం చేస్తాం" అనే బైరాగి మాటల్లోని లోతుల్ని వివరించారు. అతనిలోని డొల్లతనాన్ని శ్రీశ్రీ వ్యంగ్యంగా విమర్శిస్తూ "బైరాగి దుర్మార్గుడనిగానీ, మోసం చేసి జీవిస్తాడనిగాని ఎవరైనా అంటే నేను ఒప్పుకోను. జ్ఞాన రహస్యాలను పామరులు అపార్థాలు చేసుకుంటారని బైరాగి సెలవిచ్చాడు. ఒక ఆధ్యాత్మిక స్థాయిలో జీవించే బైరాగికి మన విలువలు అంటగట్టడం అన్యాయం. ప్రతి ఊళ్ళోనూ అతన్ని నమ్మే శిష్యబృందం ఉన్నంతకాలం అతనికేమీ లోటు లేదు" అని అంటారు.

'కన్యాశుల్కంలో లోపాలు' అనే విమర్శనాత్మక వ్యాసంలో కన్యాశుల్కంలో గురజాడ చేసిన పొరపాట్లను వివరించారు. గురజాడ గురుతుల్యుడైనా ఆయన రచనలో లోపాలను చెప్పడంలో శ్రీశ్రీ మొహమాటపడలేదు. అయితే శ్రీశ్రీకి కన్యాశుల్కం అంటే మహా ఇష్టం. ఆ విషయాన్నే "కన్యాశుల్కంలో కనపడ్డ తప్పులు చూపిస్తున్నానంటే ఆ గ్రంథం మీద నాకు గౌరవం లేకపోవడం కారణమని ఎవరూ అనుకోకూడదు. నిజానికి తెలుగు భాషలో ప్రథమ శ్రేణిలో నిలిచే పది పుస్తకాలలో కన్యాశుల్కానికి నేను ప్రథమస్థానం ఇస్తాను. ప్రపంచపు నూరు పుస్తకాలలో కన్యాశుల్కం ఒకటి" అని వివరించారు. శ్రీశ్రీ చెప్పిన కన్యాశుల్కంలోని లోపాలలో ఒకటి – గురజాడ పాత్రలకు పెట్టిన పేర్లు వాస్తవ రచనా సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయనేది. మంచివాళ్ళ పేర్లు మంచి గుణాల్ని సూచించేవిగాను, చెడ్డవాళ్ళ పేర్లు చెడ్డగుణాల్ని సూచించేవిగా ఉన్నాయని, ఇది ప్రాచీన సంప్రదాయమని అభిప్రాయపడ్డారు. "కోపగట్టు పేరు అగ్నిహోత్రావధాన్లు, జిత్తులమారి పేరు కరటకశాస్త్రి, పిసినిగొట్టు పేరు లుబ్ధావధాన్లు, మంచి ప్లీడరు పేరు సౌజన్యారావు. ఇన్ని ఒకచోట చేరడం అస్వాభావికం" అంటారు. ఇలా శ్రీశ్రీ గురజాడ కన్యాశుల్కాన్ని అణువణువూ శోధించి, జల్లెడపట్టి గుణదోషాలను నిర్ధారిస్తూ విమర్శనాత్మక వ్యాసాలు రాశారు.

గురజాడ మహాకవి గురించి – శ్రీశ్రీ ప్రతిపాదించిన అంశాలు:

గురజాడ రచనా దృక్పథాన్ని, రచనల్లోని విలక్షణతను, క్రాంతదార్శనికతను వివరించడానికి శ్రీశ్రీ చేసిన ప్రయత్నం ఐదు వ్యాసాల్లో కన్పిస్తుంది. నరకంలో, ఆధునిక గద్య వాఙ్మయ ప్రవర్తకుడు, గురజాడ ఆధిక్యానికి కారణాలు, ముందడుగు, కామ్రేడ్ గురజాడ అనే వ్యాసాల ద్వారా గురజాడలోని మహాకవి లక్షణాల్ని ధ్రువీకరించారు. కాలాన్ని అనుసరించి కూడా వారు రాసిన వ్యాసాల క్రమం ఇదే. స్వర్గ, నరకాలపైన నమ్మకం లేని శ్రీశ్రీ వ్యంగ్యాత్మక ధోరణిలో రాసిన విమర్శనాత్మక సంభాషణే 'నరకంలో' అనేది. గురజాడను నరకంలో కలుసుకున్న శ్రీశ్రీ కన్యాశుల్కంలోని పాత్రల గురించి, వాళ్ళలో చాలామంది స్వర్గలోకంలో చేరిన తీరు గురించి మాట్లాడుతుంటారు. గురజాడ సృష్టించిన పాత్రలు అజరామరంగా స్వర్గలోకంలో ఉంటే గురజాడ మాత్రం

> **గురజాడ రచనల్లో కథనాత్మక వచనానికి ఉదాహరణగా దిద్దుబాటు కథలోని ప్రారంభ ఎత్తుగడ అయిన "తలుపు!... తలుపు! తలుపు తెరువబడలేదు. ఒక నిమిషమతడూరుకొనెను. గదిలోని గడియారం టింగుమని ఒంటిగంట కొట్టినది" అనే వచనాన్ని శ్రీశ్రీ ఉదహరించారు.**

గురజాడ రచనల్లో కథనాత్మక వచనానికి ఉదాహరణగా దిద్దుబాటు కథలోని ప్రారంభ ఎత్తుగడ అయిన "తలుపు!..... తలుపు! తలుపు తెరువబడలేదు. ఒక నిమిషమతడూరుకొనెను. గదిలోని గడియారం టింగుమని ఒంటిగంట కొట్టినది" అనే వచనాన్ని శ్రీశ్రీ ఉదహరించారు.



నరకంలో ఉన్నాడంటారు. శ్రీశ్రీ దృష్టిలో నరకం అంటే జనసమూహం. కష్టాలు, కడగండ్లు నిరంతరం అనుభవించే జనసందోహం. గురజాడ, శ్రీశ్రీ ఎప్పుడూ వారి పక్షానే నిలబడ్డారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గురజాడను ఆధునిక గద్య వాఙ్మయానికి ప్రవర్తకుడిగా ప్రకటిస్తూ, "వేసిన దారంట వెళ్ళిపోవడం సులభం. అంతేకాదు పదిలం....కాని పురోగమనానికి కొత్తదారులే రాచబాటలు" అంటూ అలాంటి రాచబాట వేసిన గురజాడ వారి సరికొత్త మార్గాన్ని వివరించారు.

ఆధునిక కాలపు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సాగిందే అసలైన ఆధునిక వచనమని, అలాంటి గద్య రచనకు గురజాడ ప్రారంభకుడని వివరించారు. "సాహిత్యశాలలో ఆయన ఎన్నెన్నో కొత్త మార్గాలు తెరచి కొత్త మార్గాలు ఆరంభించాడు. ప్రత్యేకంగా వచన రచనలో ఆయన వాడుక భాషను స్వీకరించి దానిని మహోన్నత సాహిత్య స్థాయికి తీసుకెళ్ళాడు" అని వివరంగా తెలిపారు. గురజాడను వచన రచనకు ప్రవర్తకుడిగా నిర్ధారించడానికి ఆయన వచన రచనలన్నింటినీ నాటకీయం, కథనాత్మకం, వివరణాత్మకం, వ్యక్తిగతం అనే నాలుగు విభాగాలు చేశారు. ఇందులో నాల్గవ విభాగం కింద గురజాడ వారి డైరీలు, లేఖలు, నోట్సులు వస్తాయనీ, అవి నేడు సంపూర్ణంగా లభించడం లేదని చెప్పారు. గురజాడ వచన రచనల్లో కన్పించే నాటకీయతకు కన్యాశుల్కంలో అడుగడుగునా ఉదాహరణలు కన్పిస్తాయని, పాత్రోచితమైన వ్యావహారిక శైలిలో మొట్టమొదటిసారిగా నాటకం రాసింది గురజాడ అప్పారావేనని శ్రీశ్రీ చెప్పారు. వాస్తవిక నాటకాల్లో స్వగతాలు అస్వాభావికం అనే వాదం ఉందని, ఆ వాదంతో తాను ఏకీభవిస్తానని, అయితే గురజాడ స్వగతాలు సాహిత్య కళాకిరీటాలని, నాటక స్వగతంలో కనిపించే లోపాన్ని సవరించుకొని ముందుకు సాగుతాయని ఉదాహరణ ద్వారా వివరించారు. "అన్నిటికన్నా మిన్నగా నేటి సినిమా రంగానికి కూడా సాధ్యం కాని మనోవేగాన్ని స్ఫురింపజేసే స్వగతం ఇంకొకటి ఉంది. రామప్పపంతులు మధురవాణి ఇంట్లో మంచం కింద దాక్కొని ఉంటాడు. గిరీశం వస్తాడు. అప్పుడు గిరీశానికీ, మధురవాణికీ జరిగిన సంభాషణలో ఒకచోట 'ఎవడీ మాటలు పేల్తున్నాడో వాడి పేరు ఈ క్షణం చెబుతావా, చెప్పవా?' అని గిరీశం అడిగితే మధురవాణి 'రామ.. రామ ఒహరు చెప్పేదేమిటి?' అంటుంది. ఇందులో మొదటి 'రామ' చెవిన పడగానే రామప్ప పంతులు గుండెల్లో రాయి పడుతుంది. 'చచ్చానా పేరు చెప్పేసింది' అని తనలో అనుకుంటాడు". ఇలా గురజాడ స్వగతాలకు సహజమైన సందర్భాలను చూపారు శ్రీశ్రీ.

గురజాడ రచనల్లో కథనాత్మక వచనానికి ఉదాహరణగా దిద్దుబాటు కథలోని ప్రారంభ ఎత్తుగడ అయిన "తలుపు!... తలుపు! తలుపు తెరువబడలేదు. ఒక నిమిషమతడూరుకొనెను. గదిలోని గడియారం టింగుమని ఒంటిగంట కొట్టినది" అనే వచనాన్ని శ్రీశ్రీ ఉదహరించారు. "ప్రారంభం, నిర్వహణ, ఉపసంహారం.. ఇవే కళా వస్తువు నాణ్యం తెలియజేసే నికషాలు" అంటారు. గురజాడలోని విమర్శనాత్మక వచనాన్ని వివరిస్తూ "గురజాడ అప్పారావుగారి వ్యాసం ఏది చూచినా అందులోని అసాధారణ ధీశక్తి తొంగి చూస్తూ ఉంటుంది. కత్తివాదరకన్నా పదునైన హాస్యం పలకరిస్తుంది. ఒకానొక క్రమశిక్షణతో కూడుకున్న వాదపటిమ గోచరిస్తుంది" అని చెప్పారు. గురజాడకు ఒక వ్యక్తి ఆకాశరామన్న ఉత్తరం రాశాడట. అందులో గురజాడను బుద్ధి తెచ్చుకోమన్నాడట. దానికి గురజాడ సున్నితంగా ఎలా సమాధానం చెప్పారో శ్రీశ్రీ ఆయన మాటల్నే ఉదహరించారు. "నా వంటి వాళ్ళు కూడా బుద్ధి కలిగితే బుద్ధి చవకైపోతుంది. కనక ఆ బుద్ధన్నదేదో ఆకాశరామన్నగారు భద్రంగానూ, రహస్యంగానూ దాచుకుంటే విలువ." అలాగే గురజాడ మహాకవి అని చెప్పడానికి ఆయన మాటల్నే ఉదహరించారు. "చిన్నతనంలో బొమ్మలాట నేర్చి ఉండుట చేత లోకమనే రంగంలో చిత్రకోటి రీతులను ఆటాడే మనుష్యులనే పాత్రముల సొగసునే కనిపెట్టడము నాకు అలవాటైనది. సొగసులేని మనిషే ఉండడు. స్నేహమూ, ప్రేమ అనేవి అనాది

అయిన్నీ ఎప్పటికీ సరికొత్తగా ఉండే రెండు వెలుగులను నరుని మీద తిప్పికాంచితే వింత సొగసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా ఏక నలుపే". ఇంతటి గొప్ప మాటలు చెప్పారు కాబట్టే గురజాడ మహానుభావుడని చెప్తారు శ్రీశ్రీ.

ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ ఆధిక్యానికి కారణాలను విశ్లేషించారు. కందుకూరి వీరేశలింగం, రాయప్రోలు సుబ్బారావు సాహిత్య విప్లవకారులు కాదని చెప్పారు శ్రీశ్రీ. "కందుకూరి వీరేశలింగం యుగపురుషుడే. తిరుపతి వేంకటేశ్వరులు మార్గదర్శకులే. రాయప్రోలు సుబ్బారావు ఒకానొక కవితా పద్ధతికి ఒరవడి పెట్టినవాడే. ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికి ఒక చరిత్ర, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక, చారిత్రక పరిణామ గమనంలో కవి స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రభావశీలీ అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను" అని గురజాడ మహాకవి కావడానికున్న అర్హతని చెప్పారు శ్రీశ్రీ. అంతేకాదు కవుల్లో విశ్వనాథ వంటివారు భూతకాలంపై మక్కువతో అభిమానంతో రచనలు చేశారు. గురజాడ భవిష్యత్తు మీద విశ్వాసంతో రచనలు చేశారని వీరు వివరించారు. చివరిగా గురజాడ ఆధిక్యతకు కారణాన్ని "ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగుదేశపు సరిహద్దులకవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగువారి తరపున ప్రతినిధిగా నిలుచోగలిగినవాడు గురజాడ అప్పారావు ఒక్కడే" అని స్పష్టంగా చెప్పారు.

'ముందడుగు' అనే వ్యాసంలో శ్రీశ్రీ గురజాడ, కందుకూరి, గిడుగు వంటివారు సాహిత్య దృక్పథాన్ని అర్థం చేసుకొని, సామాజిక పరిస్థితులే సాహిత్య స్వరూపాన్ని నిర్ధారిస్తాయనే విషయాన్ని గుర్తించి నడుచుకోవాలని కోరారు. కార్మిక, కర్షక వర్గంతో భుజం కలిపే ధైర్యం లేకున్నా వారికి ద్రోహం తలపెట్టే నీచబుద్ధి మానుకోవాలని రచయితలకు హితవు పలికారు. 'కామ్రేడ్ గురజాడ' అనే విమర్శనాత్మక వ్యాసం గురజాడను కవిగా గుర్తించలేమని చెప్పిన కొందరు వ్యక్తులను హేళన చేస్తూ శ్రీశ్రీ రాశారు. "ఇప్పటికే గురజాడను కవిగా గుర్తించలేని గాడిదలున్నాయి. ఈ రెండు కాళ్ళ గాడిదలకి ఇప్పటికీ ఘన సన్మానాలు జరుగుతూనే ఉన్నాయి. స్వచ్ఛమైన సత్యాన్ని చంపి చచ్చు పుచ్చు అబద్ధాలనే కవిత్వంగా చలామణి చేసేవాళ్ళకి గురజాడలోని మహత్తర మానవత్వం అర్థం కాదు. వీళ్ళకి ఎదుటివాడు ఒక దేవతగానో, రాక్షసిగానో, కనబడుతాడు తప్ప తనలాంటి మనిషిగా కనిపించడు" అని వారిపై ఆవేశాన్ని వెళ్ళగక్కుతారు శ్రీశ్రీ. చివరగా గురజాడ గురించి "కనిపించని వంద కల్పవృక్షాల కన్నా దేశభక్తి గీతం మిన్న. సన్మానాలు పొందే లక్ష సామ్రాట్టులకన్న ఒక కామ్రేడ్ మేలు" అని అంటారు.

సంపాదకుని వ్యాఖ్య: గురజాడ అప్పారావు గారి అసలు ప్రతిపాదన (7 నుండి 14 మాత్రలు): గురజాడ గారు ఈ ఛందస్సును సృష్టించినప్పుడు నాల్గవ పాదానికి కచ్చితమైన సంఖ్యను నిర్దేశించలేదు. ఆయన 7 నుండి 14 మాత్రల వరకు ఎన్నైనా ఉండవచ్చని ఒక వెసులుబాటు (flexibility) ఇచ్చారు.

ఆధార గ్రంథాలు

1. కన్యాశుల్కం – గురజాడ అప్పారావు: సంపా: సెట్టి ఈశ్వరరావు: విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్ – 2016

2. గురజాడ రచనలు – కథానికలు: సంపా: సెట్టి ఈశ్వరరావు: విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్ – 1984

3. మన గురజాడ – శ్రీశ్రీ (కూర్పు: చలసాని ప్రసాద్); విరసం ప్రచురణ – 1988

4. వ్యాలు, రివ్యాలు – శ్రీశ్రీ (సంపా: ఎమ్వీయల్); మినర్వాప్రెస్: మచిలీపట్నం – 1969

మానవత్వ దీపం

మొహమ్మద్ అఫ్సర వలీషా
85005 97116



మానవత్వం లేని మనిషి
గుండె లేని గడియారం లాంటి వాడు...

ఎన్ని చదువులు చదివినా,
ఎన్ని పదవులు చేపట్టినా
గుండెల్లో ప్రేమ లేకుంటే
అంతా శూన్యమే కదా..

ఆకలితో అలమటించే వాడిని చూసి
అన్నం పెట్టలేని చేతులు
కన్నీరు కారుస్తున్న వాడిని చూసి
ఓదార్చలేని పెదవులు
రోడ్డుపై పడిపోయిన వృద్ధుడిని చూసి
లేవదీయని అడుగులు
కష్టంలో ఉన్న వారిని
ఆదుకోని మనసు ఒక మనసేనా....

కుల, మతాల గోడలు కట్టుకుంటున్నారు
డబ్బు లెక్కలు వేసుకుంటున్నారు
కానీ మనిషితనాన్ని మాత్రం మరచిపోతున్నారు...

చెట్టు కులం అడగదు
కానీ నీడనిస్తుంది
నది మతం అడగదు
కానీ దాహం తీరుస్తుంది
సూర్యుడు వేడి గొప్పా చూడడు
కానీ లోకమంతా వెలుగునిస్తాడు
మరి మనుషులమైన మనకెందుకీ భేదం..

ఒక చల్లని మాట
హృదయ బాధను చల్లారుస్తుంది
ఒక వెచ్చని చేయూత
కన్నీరు తుడుస్తుంది
ఒక నిస్వార్థ సహాయం
జీవితాన్ని మారుస్తుంది...

రండి అందరం కలిసి
ప్రేమ అనే పంటను పండిద్దాం
కుల, మతాల రంగును మార్చి
మనిషి అనే కులంలో కలిసిపోదాం...

ఎందుకంటే...
గుడిలో దేవుడు ఉన్నట్లే
గుండెల్లో మానవత్వం ఉండాలి
అదే నిజమైన పూజ
అదే నిజమైన ధర్మం
అందుకే అందరం కలిసి
మానవత్వ దీపం వెలిగిద్దాం....!!

గురజాడ ముత్యాలసరాలు
కుల, మత, వర్ణ ప్రస్తావన పరిశీలన

డాక్టర్ ఢిల్లీశ్వరరావు సనపల
94419 44208
eswar.dilli820@gmail.com



వ్యాస సంగ్రహం

ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగకర్తగా పిలవబడిన గురజాడ వారు, కందుకూరి వీరేశలింగం గారి సంఘసంస్కరణ, గిడుగు రామ్మూర్తి పంతులు గారి భాషా సంస్కరణ కలగలిపి సాహిత్య రచన చేశారు. గురజాడ సాహిత్యం తదనంతర రచయితలకు అడుగుజాడలు పరిచింది. "ఆధునిక సాహిత్య యుగ కర్తే కాదు తెలుగులో వ్యావహారిక రచనకు ఉపక్రమించిన వారిలో ప్రథములు కూడా గురజాడే" అని గొర్రెపాటి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. (యుగకర్త గురజాడ, పుట 17) "అప్పారాయ కవీంద్రుని చేతులలో ముత్యాల సరాలు తళతళ మెరిసినవి. ఇవే నవ్యాంధ్ర వాఙ్మయమునకు తలకట్టులు, మేలుబంతులు, విజ్ఞాన కోశములు" (యుగకర్త గురజాడ, పుట 53) అని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి పేర్కొన్న మాటలు పరిశీలించదగినవి. గురజాడ రచించిన ముత్యాలసరాలు (ముత్యాలసరాలు, కాసులు, లవణరాజుకల, కన్యక, డామన్ పితియస్, పూర్ణమ్మ, మనిషి, దేశభక్తి, నీలగిరి పాటలు, సుభద్ర మొదలైనవి) కవితా ఖండికల్లో విజ్ఞాన కోశములనదగిన భాష, ఛందస్సు, ప్రకృతి వర్ణన, ప్రణయం, దేశభక్తి, స్నేహం, త్యాగం, ఆధ్యాత్మికత, విశ్వమానవ ప్రేమ మొదలైన అనేక విశేషాలు నిండి ఉన్నప్పటికీ ముత్యాలసరాల్లోని కులం, మతం, వర్ణ వ్యవస్థ విషయాలను మాత్రమే పరిశీలించి, వివేచన చేయడం కుల, మత, వర్ణ వ్యవస్థలపై గురజాడ వారి దృష్టి కోణాన్ని ఆవిష్కరించి విశ్లేషించడం ఈ వ్యాసం ప్రధానాంశం.

ఉపోద్ఘాతం: "ఈ శతాబ్దపుటారంభమునకే గురజాడ అప్పారాయ కవి యువలోకం కనుచున్న కలలు రూపొందింప చేయుచు, ఆధునిక కవిత్వపు ధ్వజమును ప్రతిష్ఠించెను. ముత్యాలసరములను గేయ సంపుటితో నవ్య కవితకు నాంది పఠించెను" (ఆధునికాంధ్ర కవిత్వము, వ్యాసం, విజ్ఞాన సర్వస్వం, తెలుగు సంస్కృతి, పుట 62) అని ఖండవల్లి లక్ష్మీరంజనం పేర్కొన్నారు. "అప్పారావు గారి ముత్యాలసరాలు కొత్త పాతల మేలు కలయిక కూర్చిన నవ్య సాహిత్యపు తొలికృతులు" (నవ్య కవిత్వం దాని ఉద్దేశం, వ్యాసం, ప్రతిభ, జనవరి 1938) అని నోరి నరసింహా శాస్త్రి పలికిన మాటలు గురజాడ వారి కొత్త మార్గాలను గూర్చి చెప్పకనే తెలియజేస్తాయి. సరళమైన ఛందస్సులో ప్రాసయతులు లేకుండా ముత్యాలసరాలను సృజించిన సృష్టికర్త గురజాడ అప్పారావు. ముత్యాలసరాలలో మొదటి మూడు పాదాలకు 3+4, 3+4 = 14 మాత్రలు, చివరి పాదం (నాల్గవ పాదానికి) 7 నుంచి 14 మాత్రలుంటాయి.

ముత్యాలసరాలు – కుల ప్రస్తావన పరిశీలన: గురజాడ వారి ముత్యాలసరాలు ఆధునిక యుగంలో సంఘసంస్కరణ ఉద్యమం

జీవన భృతికై పశువును చంపినవాడు కులం లేనివాడు, కులం తక్కువ వాడు ఐతే మనుషుల్ని పట్టిపీడించి సాటి మనిషిని ఎనలేని బాధలకు, కష్టాలకు గురిచేసేవాడు అధిక కులానికి చెందినవాడు ఎలా అవుతాడు



ప్రారంభానికి ముందే తెలుగులో అస్పృశ్యతా విషయ ప్రస్తావనకు నాంది పలికాయి. తెలుగులో కృష్ణదేవరాయలు, అన్నమయ్య, వేమన, పోతులూరి వీరబ్రహ్మం వంటి వారి రచనల్లో అస్పృశ్యతా ప్రస్తావన కనిపిస్తున్నా అవన్నీ చెదురుమదురు సంఘటనలుగానే చెప్పవచ్చు. ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ వారికి ముందు కుల, మత, వర్ణ వ్యవస్థలకు సంబంధించిన ప్రస్తావన అతి కొద్ది రచనల్లో మాత్రమే దర్శనమిస్తుంది. గురజాడ అప్పారావు 1910లో రాసిన లవణరాజుకల కవితా ఖండికలో కుల ప్రస్తావన పేర్కొనబడింది. గురజాడ వారు ప్రస్తావించిన కుల భావన మునుపటి సమాజ భావనలకు పూర్తి భిన్నమైనదని చెప్పవచ్చు. వృత్తిని బట్టి ఏర్పడిన కుల భావనను నిరసించారు గురజాడ. చేస్తున్న పని ఆధారంగా మలినమైన వారిగా ఎంచి వెలి వేయడాన్ని నిరసిస్తూ దేహం మలినమైనంత మాత్రాన వారిని వెలి వేయడమనే భావన కలిగిన వారే నిజమైన మలినమని, అటువంటి ఆలోచనలు కలిగిన వారే నిజమైన మాల అని చెబుతూ

"మలిన వృత్తులు మాలవారని
కులము వేర్చిన బలియు రొకదే
శమున కొందరి వెలికి దోసిరి మలినమే మాల" (లవణరాజుకల, పుట 344)

అని పేర్కొన్న మాటల్లో మలిన వృత్తిని చేపట్టిన వారు మాలలు కారని, మానసిక మాలిన్యతను కలిగిన మనిషే నిజమైన మాల (అస్పృశ్యుడు)గా ఎంచదగినవాడు అని పేర్కొన్నారు. రంగు, రూపు, ఎంచుకున్న వృత్తి, చేస్తున్న పని వంటి బాహ్యంగా కనిపించే లక్షణాలు ఆధారంగా కులాన్ని నిర్ణయించడం అస్పృశ్యుడిగా ఎంచడం సరికాదనే భావన వ్యక్తపరుస్తూ

"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కధికకులముల
నెలవొసంగిన వర్ణధర్మ మధర్మ ధర్మంబే" (లవణరాజుకల, పుట 344) అంటారు. శారీరక మలినం కలిగిన వారు మాలలైతే మానసిక మలినం కలిగిన వారు అంతకంటే తక్కువ వారు కావాలని, అదే ధర్మం అని, అలా కానినాడు వర్ణధర్మమే అధర్మం అని పేర్కొన్నారు. పై మాటల్లో వాస్తవికతను ఎరుకపరచడంతో పాటు వాస్తవిక సామాజిక స్థితి తీరును చెప్పకనే చెప్పారు కవి. కులం తక్కువ వాడు కులం లేని వాడు అనే మాటలు నేటికీ వినిపించడం పరిపాటే. జీవన భృతికై పశువును చంపినవాడు కులం లేనివాడు, కులం తక్కువ వాడు ఐతే మనుషుల్ని పట్టిపీడించి సాటి మనిషిని ఎనలేని బాధలకు, కష్టాలకు గురిచేసేవాడు అధిక కులానికి చెందినవాడు ఎలా అవుతాడని ప్రశ్నిస్తూ

"కులము లేదట ఒక్క వేటున
పసరముల హింసించు వారికి –
కులము కలదట నరుల ద్రేచెడి క్రూరకర్ములకున్" అంటాడు కవి.

పై మాటల్లో లోతైన తార్కికతతో పాటు మానవతా వివేచన వ్యక్తం అవుతుంది. కులం పేరుతో నేటికీ పరువుహత్యలు జరుగుతున్న కాలంలో 115 సంవత్సరాలకు పూర్వమే కుల వ్యవస్థ పోవాలని, వృత్తిని బట్టి కులం కాదు గుణాన్ని బట్టి, మనిషితనాన్ని బట్టి, మంచితనాన్ని బట్టి మనుషుల విభజన ఉండాలనే మాటలకు ఎంతవరకు సమాజం విలువనిస్తుంది? ఖచ్చితంగా ఆ మాటలు నాటి సమాజానికి విషపు గుళికలుగానే అనిపిస్తాయనేది సుస్పష్టం. అందుకే గురజాడ వారు తాను పేర్కొన్న మాటలను తనకే అన్వయం చేసుకుంటూ తాను ఆ మాటలకు కట్టుబడుతున్నట్లు ప్రకటిస్తూ

"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచియన్నది మాలయైతే, మాలనే అగుదున్" (లవణరాజుకల, పుట 345) అనే మాటల్లో మనుషుల్లో గుణాన్ని బట్టే విభజన తప్ప కులాన్ని బట్టి విభజన ఉండరాదని చెప్పడంతో పాటు తాను గుణాన్ని బట్టి విభజనకు కట్టుబడి ఉన్నట్లు

ప్రకటించారు. అలా ప్రకటించడానికి ఎంతో ధైర్యంతో పాటు ఎరుకత కూడా అవసరం. కవి నిరంకుశుడు, కవి తన కాలపు సమాజానికి అతీతుడు కాదు అనే వైవిధ్యమైన భావనలు రెండూ తనలో నిక్షిప్తం చేసుకున్న తీరు గురజాడ వారిలో గమనించవచ్చు. గురజాడ అప్పారావు పేర్కొన్న కుల ప్రస్తావన మాటలు కేవలం ఆదర్శాల ప్రకటనకు సంబంధించినవి ఎంత మాత్రం కావు. ఆ మాటలు ఒక సమాజ నిర్మాణం, తీరుతెన్నులు అందులోని లోతుపాతులు, లోటుపాట్లు వ్యక్తం చేసేవిధంగా ఉన్నాయి. గురజాడ వారు చేసిన కుల ప్రస్తావనలో దార్శనికత వ్యక్తమౌతుంది. ఆ మాటల్లో ఆదర్శం, తర్కం, తాత్వికత, నిర్దేశం, అన్వయం, ఆచరణ, ఆలోచన, బుద్ధిబోధ కలగలిసిన తీరు దర్శనమిస్తుంది.

"మాల యను వారున్న, వారల

– మందబుద్ధికి వగవవలే" (లవణరాజుకల, పుట 345).

అనే మాటల్లో లోతు చెప్పకనే అర్థమవుతుంది. గురజాడ వారు ప్రకటించిన కుల భావనలో ప్రబోధం కనిపిస్తుంది. కులం నశించాలి, అస్పృశ్యత అంతరించాలి, అనే ఆదర్శపు మాటలు మాత్రమే చెప్పడం గురజాడ వారి అభిమతం కానేకాదు. ఆధునిక సాహిత్య యుగకర్త ఆలోచన ఆదర్శపు మాటలకే పరిమితమైతే అడుగుజాడ గురజాడ అని శ్రీశ్రీ వంటి మహాకవి ఎందుకు ప్రకటిస్తాడు? గురజాడ ఆదర్శం సమూల మార్పు. అది ఆలోచన విస్తృతిని బట్టే సాధ్యం. అందుకే గురజాడ వారు కుల సమస్యను గుర్తించి ఎత్తిచూపడంతో పాటు ఆ సమస్యకు సరైన పరిష్కారాన్ని సూచించారు. చేస్తున్న వృత్తిని బట్టి కులం నిర్ణయం జరుగుతున్న తరుణంలో ఆ వృత్తిని మార్చుకొని కొత్త వృత్తిని చేపట్టడమే అస్పృశ్యతా నివారణకు మార్గమని బోధించాడు.

"మాలనైనను మలిన వృత్తులు

మానుకుంటిని గురువుదయచే

పొలము లోపల పశుల మేపుచు పొట్ట పోషింతున్"

అనే మాటల్లో గురజాడ వారి గురుబోధ సుస్పష్టం. చేసే పని మనిషికి మంచి గుర్తింపును కలిగించాలి. కానీ వృత్తి మనిషి గుర్తింపును హరించడంతో పాటు వారిని సమాజానికి అంటరాని వారిగా వెలివేస్తున్నప్పుడు అటువంటి పనిని (వృత్తిని) విడిచి నూతన మార్గాలను ఎంచుకోవాలి అనే ఎరుక కలిగించడం ద్వారా గొప్ప జ్ఞానబోధ చేసారు గురజాడ.

"మలిన వృత్తులు మాన్పిమాలల

వలస తెచ్చితి యీ వనాంతము"... అనే పంక్తులలో మాటలను నిశితంగా పరిశీలించి చూస్తే తరాల తలరాతలు మార్చే రాతలు గురజాడ వారికే సాధ్యం అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

ముత్యాలసరాలు – మత ప్రస్తావన పరిశీలన: ఒక సమాజం అనుసరించే విశ్వాసాలు, ఆచారాలు, ఆధ్యాత్మిక సిద్ధాంతాల వ్యవస్థే మతం. మతం మనిషి జీవితానికి నైతిక ఆధారం అంటారు మహాత్మా గాంధీ. "పవిత్రమైన విషయాలకు సంబంధించిన నమ్మకాలు మరియు ఆచారాల సమగ్ర వ్యవస్థ. అది ప్రజలను ఒక నైతిక సమాజంగా ఏకం చేస్తుంది" అని ఎమిల్ దర్కీమ్ (Emile Durkheim) మతాన్ని గురించి నిర్వచించారు. (అంతర్జాలం ఆధారంగా). పై మాటలను పరిశీలిస్తే మతం సామాజిక వ్యవస్థలో బలమైన శక్తిగా నిలిచిన సంగతి తెలియవస్తుంది. అటువంటి బలమైన శక్తి ఒక్కసారిగా నశించడం అనే భావన వాస్తవ దూరమైనదని గ్రహించిన సామాజిక విజ్ఞాని గురజాడ.

కులం నశించాలి, అస్పృశ్యత అంతరించాలి, అనే ఆదర్శపు మాటలు మాత్రమే చెప్పడం గురజాడ వారి అభిమతం కానేకాదు. ఆధునిక సాహిత్య యుగకర్త ఆలోచన ఆదర్శపు మాటలకే పరిమితమైతే అడుగుజాడ గురజాడ అని శ్రీశ్రీ వంటి మహాకవి ఎందుకు ప్రకటిస్తాడు? గురజాడ ఆదర్శం సమూల మార్పు. అది ఆలోచన విస్తృతిని బట్టే సాధ్యం.

ముత్యాలసరాలు

కవితాఖండికల్లో మతాన్ని గూర్చి ప్రస్తావించిన సందర్భాలు గురజాడ వారికి మతం పట్ల గల తార్కిక దృక్పథం, మానవత్వం, విశ్వమానవ సౌభ్రాతృత్వం ప్రకటించేవిగా అగుపిస్తాయి. మతం పట్ల గురజాడ వారికి గల భావన ముత్యాల సరాలు ఖండికలో స్పష్టంగా ప్రకటితమౌతుంది.

"మతములన్నియు మాసిపోవును

జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" (ముత్యాలసరాలు, పుట 333).

అనే పంక్తులు మనిషిలో జ్ఞానం వికసించడం ద్వారా మానవత్వపు వెలుగులు విరజిమ్మి మతం క్రమంగా లయమైపోవాలనే ఆశాభావం వ్యక్తమౌతుంది. ఇక్కడ కవి పేర్కొన్న మాటల్లో మాసిపోవడం అనగా క్రమంగా క్షీణించిపోవడం, మసకబారడం. జ్ఞానం కలిగిన వారు మాత్రమే మతం యొక్క

> ఒకరినొకరు కలుపుకొని వెళ్లడానికి వ్యక్తి యొక్క మానసిక స్థితే ప్రధానమైందిగా భావించాలి తప్ప వ్యక్తి ఆధ్యాత్మిక స్థితి ఎంత మాత్రం అడ్డుకారాదనే పరమ సత్యాన్ని గురజాడ ప్రకటించారు



ఆవిర్భావ వాస్తవికతను తెలియజేసే సాధనం. మనుషుల్ని ఏకం చేయడానికి మతం పుట్టింది. కానీ తదనంతరం ఆ మతమే మనుషుల్ని విడదీసేదిగా మారింది. మనిషి కోసం మతం గాని మతం కోసం మనిషి కాదు అని పలికిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి మాటలు గురజాడ వారి విజ్ఞాన భావాల్ని వ్యక్తపరిచేవిగా చెప్పవచ్చు. గురజాడ వారు మతం భావనలో తన దృఢనిశ్చయాన్ని దేశభక్తి కవితలో ప్రకటిస్తూ

"అన్నదమ్ముల వలెను జాతులు

మతములన్నీ మెలగవలెనోయి!" (దేశభక్తి కవిత, పుట 371)

అనే మాటల్లో మతసామరస్యం, మానవ సౌభ్రాతృత్వం చెప్పకనే వ్యక్తమౌతుంది. మతం విషయంలో గురజాడ వారిది మానవమతం. అది వర్గాలకు, ఛాందస భావాలకు, ఈశ్వర-నిరీశ్వర వాదాలకు భిన్నమైనది మరియు అతీతమైనది. మనిషిని మనిషి గౌరవించుకుంటూ సాటి మనిషి పట్ల మానవత్వంతో కూడిన ప్రేమానురాగాలను కలిగి ఉండాలనేది గురజాడ వారి అభిమతం.

"మతం వేరైతేను యేమోయి?

మనసు వొకటై మనుషులుంటే" (దేశభక్తి కవిత, పుట 372)

అని పేర్కొన్న పంక్తులలో మనిషికి మనసు ప్రధానం తప్ప, మతం ఎంత మాత్రం ప్రధానం కారాదనే దృగ్విషయం బోధపరుస్తుంది. ఒకరినొకరు కలుపుకొని వెళ్లడానికి వ్యక్తి యొక్క మానసిక స్థితే ప్రధానమైందిగా భావించాలి తప్ప వ్యక్తి ఆధ్యాత్మిక స్థితి ఎంత మాత్రం అడ్డుకారాదనే పరమ సత్యాన్ని గురజాడ ప్రకటించారు.

ముత్యాలసరాలు - వర్ణవ్యవస్థ వివేచన: వర్ణవ్యవస్థకు సంబంధించి భారతీయ సాహిత్యంలో వేదవాఙ్మయం మొదలుకొని నేటి వరకు అనేక విషయాలు ప్రస్తావించబడ్డాయి. భారత ఉపఖండంలో వృత్తులు ఆధారంగా ఏర్పడిన చాతుర్వర్ణ వ్యవస్థ (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) తదనంతర కాలంలో సామాజిక అంతరాలకు వేదికగా మారిందనేది చారిత్రక సత్యం. ప్రపంచంలోని వివిధ సమాజాల్లో పుట్టుక, వంశం, జాతి, వృత్తి లేదా సామాజిక స్థితి ఆధారంగా ఏర్పడిన సామాజిక శ్రేణీకరణ, వ్యవస్థలు ఏర్పాటు జరిగింది. అటువంటి బలమైన సామాజిక, చారిత్రక నేపథ్యం కలిగిన వర్ణవ్యవస్థకు సంబంధించి గురజాడ వారు ముత్యాలసరాలు కవితాఖండికల్లో ప్రస్తావించారు. కన్యక కవితలో గురజాడ వారు చారిత్రక సత్యాన్ని ప్రకటిస్తూ

"విద్యనేర్చిన వాడు విప్రుడు

వీర్యముండినవాడు క్షత్రియుడన్న పెద్దల ధర్మ పద్ధతి మరిచి....." (కన్యక కవిత, పుట 354). అనే పంక్తులు ఆంధ్ర మహాభారతంలో ఎఱ్ఱన అరణ్యపర్వశేషంలో "ఎవ్వడు బ్రాహ్మణుడు?" అనే ప్రశ్నకు "ఎవ్వడు సత్యంబ యెప్పుడు బల్కు హింసా విదూరుడు గురుజన హితార్థి.....". (అరణ్యపర్వం, పంచమాశ్వాసం, పుట 680) పద్యంలో ఎవడు బ్రాహ్మణుడో చెప్పే సందర్భంలో బ్రాహ్మణ గుణాలు, ధర్మాలు పేర్కొనబడ్డాయి. అలాగే ఎవడు క్షత్రియుడు? అనే ప్రశ్నకు క్షాత్రబలం కలిగిన వాడు క్షత్రియుడు అనేది సమాధానం. క్షాత్రబలంతో క్షత్రియులైన ఉదంతాలు ప్రపంచ చరిత్రలో అనేకం కలవు. ఆ విషయాన్ని గుర్తుచేస్తూ సంస్కారవంతుడైన వ్యక్తే ఉన్నత స్థానాలకు అర్హుడు కానీ అధముడైన వ్యక్తి పుట్టుక కారణంగానో, వంశం కారణంగానో ఉన్నతుడిగా నిర్ణయించరాదనే వాస్తవాన్ని ప్రకటించారు గురజాడ. అంతరాలు తగ్గించుకుంటూ పరస్పర గౌరవంతో వ్యక్తులు మెలగాలని సూచిస్తూ

"యెల్ల లోకము వొక్కయిల్లై వర్ణభేదములెల్లకల్లై"..... (ముత్యాలసరాల కవిత, పుట 333) అని పేర్కొన్న పంక్తుల్లో వర్ణభేదం అనే భావనే లేకుండా మానవులంతా మసలుకొని ఒకరికొకరు సహకరిస్తూ ఉన్నతిని సాధిస్తూ విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, వసుధైక కుటుంబ భావాన్ని కలిగి ఉండాలనే ఆకాంక్ష ప్రకటించారు.

ముగింపు: ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మలుపుతిప్పిన గురజాడ వారు తాను సృష్టించిన నూతన ఛందస్సు ముత్యాలసరాలను తెలుగు తల్లికి ప్రేమపూర్వకంగా సమర్పించారు. ముత్యాలసరాలు నిత్య నూతనంగా ప్రకాశించే

విధంగా వాటికి భాషా నవ్యత, వస్తునవ్యతలను అద్దించారు. ముత్యాలసరాలలో వస్తునవ్యతతో కూడిన అనేక విషయాలు ఉన్నప్పటికీ కుల, మత, వర్ణ ప్రస్తావన పరిశీలనకు మాత్రమే ఈ వ్యాసం పరిమితం చేయబడింది. అందులో భాగంగానే ముత్యాలసరాలు, లవణరాజుకల, కన్యక, దేశభక్తి వంటి కవితా ఖండికల్లోని విషయాలను విశ్లేషించడం జరిగింది. ఈ వ్యాసంలో గురజాడ వారి భావజాలాన్ని వ్యాసకర్త దృష్టితో పరిశీలించి విశ్లేషించిన తీరు గమనించవచ్చు. ఈ వ్యాసం కుల, మత, వర్ణ ఆవిర్భావ వికాసాల లోతులను పరిశీలించడం, వాటి గుణదోషాల విశ్లేషణలు చెయ్యడం వంటి వాటి గురించి కాదు. కుల, మత, వర్ణ ప్రస్తావనలో గురజాడ వారికి గల తార్కిక దృష్టి, సాంఘిక పరిస్థితుల పట్ల గల సమగ్ర అవగాహనా విషయాన్ని విశ్లేషించడం జరిగింది. కుల, మత, వర్ణ వ్యవస్థలు ఉన్నపళంగా నశించిపోయి, కవి(గురజాడ వారు జీవించిన కాలం) కాలంలోనే అద్భుతమైన నూతన సమాజం ఏర్పడి పోవాలనే ఆశకంటే సమాజ పరిణామ క్రమంలో కుల, మత, వర్ణ వ్యవస్థల ప్రాధాన్యత క్రమంగా క్షీణిస్తూ ఒకనాటికి అవి పాతబడి క్రమంగా కనుమరుగు కావాలనే దార్శనిక దృక్పథం, ఆకాంక్ష వ్యక్తీకరించిన తీరు ప్రస్తావన జరిగింది. గురజాడ వారు కుల, మత, వర్ణ వ్యవస్థలను నిరసించారా? ఖండించారా? ప్రోత్సహించారా? అనే విషయాలను పరిశీలించినప్పుడు సాంఘిక పరిస్థితులను అర్థం చేసుకోవడం, కుల, మత, వర్ణ వ్యవస్థ బలీయతను అంచనా వేయడం, అవి ఏకకాలంలో నశించిపోవు అనే వాస్తవిక దృష్టికోణాన్ని ఎరిగిన వ్యక్తిగా కాలప్రవాహంలో అవి బలహీనపడి ఒకనాటికి కనుమరుగు కావాలనే దృక్పథం వ్యక్తమౌతుంది.

ఉపయుక్త గ్రంథ పట్టిక

1. రమణమూర్తి ఆర్.వి. ప్రధాన సంపాదకులు, (2012). గురజాడ సమగ్ర సాహిత్యం. తెలుగు అకాడమీ ప్రచురణ; హైదరాబాదు.
2. ప్రొఫెసర్ సిమ్మన్న వెలమల. (2018) యుగకర్త గురజాడ, దళిత పీఠం; విశాఖపట్నం.
3. ఆచార్య యాదగిరి కె. సంపాదకులు. (2015). తెలుగులో కవిత్వోద్యమాలు. తెలుగు అకాడమీ ప్రచురణ; హైదరాబాదు.
4. లక్ష్మీరంజనం ఖండవల్లి. ఆధునికాంధ్ర కవిత్వము, వ్యాసం, విజ్ఞాన సర్వస్వం, తెలుగు సంస్కృతి, పుట 62.
5. నరసింహా శాస్త్రి నోరి. నవ్య కవిత్వం దాని ఉద్దేశం, వ్యాసం, ప్రతిభ జనవరి (1938).
6. డాక్టర్ నాగయ్య, జి. (2009). తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటం. నవ్య పరిశోధక ప్రచురణలు: తిరుపతి.
7. డాక్టర్ శాస్త్రి, ద్వా.నా. తెలుగు సాహిత్య చరిత్ర (2014). ప్రగతి పబ్లిషర్స్: హైదరాబాద్.
8. డాక్టర్ సుబ్రమణ్యం జి.వి. ప్రధాన సంపాదకుడు, (2011). కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, సంపుటి 3, భాగం 2, తిరుమల తిరుపతి దేవస్థానములు; తిరుపతి.
9. ప్రకాశిక, గురజాడ సమగ్ర సాహిత్య వ్యాస సంకలనం. (2018). యూనివర్సల్ ప్రింటర్స్; చెన్నై.

గురజాడ తెలుగు కవులకు అడుగుజాడ

శ్రీ మహ్మద్ షరీఫ్
98665 60527



1 కం:
ముత్యాల సరములందున
యత్యంత మనోహరముగ యల్లిన కావ్యాల్
నిత్యము మహిళాహృదయము
యత్యవసరమనుచు దెలిపి యవనిని వెలిగెన్

2 తే.గీ:
మట్టి కాదని దేశమ్ము మనుజులనుచు
గొప్ప సత్యాన్ని జెప్పిన గురువరేణ్య
పాడి పంటలు పండించి పరిఢవిల్లె
దక్కు నంటివి భాగ్యమ్ము దొరినడువ

3 తే.గీ:
కత్తి వైరము వద్దన్న కర్మయోగి
పోరుగు వాడికి తోడ్పడ్డ ప్రజ్ఞమనుచు
స్వంత లాభమ్ము మానుము కాంత యనుచు
నీతి చెప్పిన వెడవ ప్రీతి తోడ

4 కం:
స్త్రీ సంక్షేమము కోరుచు
కాసులు, పూర్ణమ్మ, కన్యకా కావ్యమ్ముల్
క్రొసియు నింతుల జాగృతి
జేసిన మీ కీర్తి నిలుచు చిరకాలమ్మున్

5 కం:
గురజాడకు సాహితిలో
సరిజోడెవ్వరు, మగువల సంక్షేమముకై
నిరతమ్ముగ కావ్యాలను
విరచించెను నద్భుతముగ వేదనబాపన్!

6 కం:
నాటిక కన్యాశుల్కము
మీటెను ప్రతి తెలుగువారి మేధస్సులలో
చాటెను వితంతువుల వో
రొటమ్ముకు బాట వేసె రమణుల కిలలో

7 కం:
నాటికలును గేయములును
పాటలు పద్యాల లోని పరమార్థముతో
మాటల ముత్యాలసరము
బాటలు వేశారు జనుల భాగ్యము కొరకై!

8 ఆ.వె:
తెలుగు కవుల లోన దిట్టగా వెలుగొంది
నిలిచినాడు ప్రజల తలపులోన
గొప్ప మార్పు దెచ్చె గురజాడ కావ్యాలు
స్త్రీల బ్రతుకులోని చింత దీర్చ

'ప్రతిభారత్న' 'శ్యామ్యుక వతంస'
మహ్మద్ షరీఫ్

అమెరికాలో తెలుగు కవిత్వం

డాక్టర్ రాజేశ్వరి దివాకర్ల
rajeswari.diwakarla@gmail.com



అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన మొదటి తరం తెలుగు కవులు రాసిన కవిత్వ సంకలనం "అమెరికా తెలుగు కవిత". ఈ సంకలనాన్ని డాక్టర్ పెమ్మరాజు వేణుగోపాల రావు గారి సంపాదకత్వంలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు 1998లో ప్రచురించారు.

"అమెరికా తెలుగు కవిత" సంకలనంలో కవులు పరాయి దేశంలో జీవన విధానానికి తమలో కలిగిన ప్రతిస్పందనను వెల్లడించారు. ఈ కవుల శైలిలో సరళత, భావాలలో నిజాయతీ కనిపిస్తాయి. దాదాపుగా కవులందరూ మాతృభూమిని వదిలిన మానసిక పరివేదనను వ్యక్తం చేసారు. తమ భాషను, సంప్రదాయాలనూ కాపాడుకోవాలనే సంకల్పాన్ని తెలిపారు. తిరిగి తమ దేశానికి వెళ్ళిపోవాలనే గుప్తమైన భావాన్ని దాచుకున్నారు. అమెరికాలో అంతా బాగున్నా, ఈ ఆరంభ కవిత్వంలోని ఇంటి బెంగ ఖాళీలను పూరించలేని అంతరంగాల లోతులను ప్రతిబింబించింది.

ఈ సంకలనంలోని కవయిత్రులు ఆనాటికి భారతదేశంలో విరివిగా సాగుతున్న స్త్రీవాద ధోరణిని, హక్కులను గురించి ప్రస్తావించక, కేవలం ఆర్ద్రమైన కవితా భావనలను వ్యక్తపరిచారు.

ఆనాటి నుంచీ, తమ కీర్తిశేషాన్ని మనకు వదిలి వెళ్ళిన నిన్న మొన్నటి కాలం వరకూ అమెరికా తెలుగు సాహిత్యానికి పట్టభద్రురాలుగా వెలుగొందారు శ్రీమతి శారదా శొంఠి. Three Hundred Poems, Three Hundred Poets in 60 Countries అనే కవితా ఆంథాలజీలో వారి కవితలు ప్రచురితమయ్యాయి. "శబ్ద్" అనే నాల్గవ కవితా సంపుటిని ప్రచురించారు. శారదా దేవి మీద, విద్య మీద పద్యాలు వేయి వరకూ చెప్పగలిగిన ప్రతిభావంతులు.

శ్రీ ఏ.వి. రమణ గారు అమెరికాలో అడుగిడిన వనితను గురించి "...అమెరికా ఖండం లో మారు మూల ఇంటిలో /అలిగిన ఆలకించే గోడలే ప్రపంచముగ /...అంతే లేని ఇంటి పనులను మనసులో /అనునిత్యం నిందించుకుంటూ /అడుగులో అడుగులేస్తోంది" అని అమెరికాలో అడుగిడిన ఆ స్త్రీల దృక్పథం నుంచి కవితను రాసారు.

డయస్పోరా కవిత్వంగా పరిగణింపబడుతున్న కవిత్వం రెండు విభిన్నమైన లోకాల సంక్లిష్ట సంగమ జీవన విధానాన్ని గురించి చింతిస్తుంది. ఒకటి కవికి మరపురాని నేపథ్యం. రెండవది వర్తమానంలో ఆ అనుభవాల పునర్నిర్మాణం. డయస్పోరా సాహిత్యం గురించి అమెరికా రచయిత్రులలో అగ్రగణ్యులు మాచిరాజు సావిత్రి గారు "తరగని దూరం" కవితలో ఒకప్పుడు విదేశ ప్రవాసానికి వచ్చిన వారు "ఇల్లు కదలడంతో

ఇరుకైన అవకాశాలకే కాదు
ఇరుకైన భావాలకి కూడా

> పవాసాంధ్ర సాహిత్యంలో తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిన డా. వేలూరి వేంకటేశ్వర రావు (1938-2026) గారు ఒడియా కవి సౌభాగ్య కుమార్ మిశ్ర రచించిన "అవ్యయ", "ద్వాసుపర్ణా" వంటి కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు



తిలోదకాలిచ్చారు" అంటూ చెపుతూ, "నేటి ప్రవాసుల మాటేమిటి?" అన్న ప్రశ్నను వేసుకుని "ఆత్మవిమర్శకి అదనివ్వని

ఆత్మజ్ఞానాన్ని పెంపొందించని
విజ్ఞాన సౌకర్యాలవల్ల
ఒరిగిందేమిటి?... దేశాల మధ్య దూరాలని
మాపే ఈ సాధనాలే
మనిషికీ మనిషికీ మధ్య
దూరాన్నెక్కువ చేస్తున్నాయ్

ఈ దూరం తరిగేదెప్పుడు?" అని తెలుగువారి విదేశీ నివాస సంఖ్య పెరిగిన కొలదీ మనుషుల మానసిక అంతరాల దూరం పెరుగుతోందని గమనించారు (ఈమాట, అక్టోబర్ 1998). ఈ కవిత దాదాపు మూడు దశాబ్దాలకు చేరుతున్న అమెరికా తెలుగు కవిత ఆంతర్యాన్ని పసిగట్టిందని చెప్పవచ్చు. మాచిరాజు సావిత్రి గారు "తెలుగు డయస్పోరా సాహిత్యం" గురించి తమ వ్యాసంలో (ఈమాట, సెప్టెంబర్ 2002) విశ్లేషించారు. "డయస్పోరాకీ ప్రవాసానికీ తేడా"ను వివరిస్తూ, "రచయిత పుట్టి పెరిగిన సంస్కృతి ప్రభావమూ, ప్రస్తుతం తానుంటున్న సంస్కృతి ప్రభావమూ, రెండూ రచనలో స్పష్టంగా కనిపిస్తాయి. ఇలాంటి సాహిత్యాన్ని డయస్పోరా సాహిత్యం అనొచ్చు" అని అభిప్రాయం తెలిపారు. "ఇంకో విధంగా చెప్పాలంటే, ఇలా భిన్న సంస్కృతుల ప్రభావాలు కనిపించని సాహిత్యం, రచయిత ఎక్కడ ఉండి రాస్తున్నా, డయస్పోరా సాహిత్యం అనిపించుకోదు అని కూడా నా ఉద్దేశం" అన్నారు. వారు చెప్పిన అభిప్రాయం డయస్పోరా సాహిత్యానికీ, ఈనాటి అమెరికాలో తెలుగు కవిత్వ ధోరణికీ వర్తిస్తుంది.

ప్రవాసాంధ్ర సాహిత్యంలో తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిన డా. వేలూరి వేంకటేశ్వర రావు (1938–2026) గారు ఒడియా కవి సౌభాగ్య కుమార్ మిశ్ర రచించిన "అవ్యయ", "ద్వాసుపర్ణా" వంటి కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. అనేక వ్యాసాలను, విమర్శలను రచించిన వారు "నా భావనలో తెలుగు డయాస్పోరా"ను విశదీకరించారు (ఈమాట, నవంబరు 2022).

కవిత్వ విషయానికొస్తే, అమెరికాలో "తెలుగు వచన కవిత్వం" విరివిగా వెలువడుతోంది. కాని కథలతో పోల్చి చూస్తే కవిత్వం సంఖ్యాపరంగా తక్కువగానే వుందని విమర్శకుల పరిశీలన. దానికి తగిన కారణాలను గురించి చెప్పాలంటే, కవిత్వం క్లుప్తతను, భావాభివ్యక్తి సాంద్రతను కోరుతుంది. కవికి అనేక భావాలు, అనుభవాలు కలిగినా, వివరించి చెప్పలేని పదాల వెలితి అడ్డుపడుతుంది. అంతేకాక అమెరికా తెలుగు కవులు చాలామటుకు కథకులుగా, విమర్శకులుగా సామాజిక జీవన విశ్లేషణ కావించిన సమర్థులు. కవిత్వ పరిధిలో తమ అనుభూతికి ప్రాధాన్యం ఇచ్చి, విస్తారమైన సృజనశీలతను తదితర ప్రక్రియలలో కనబరిచారని చెప్పవచ్చు.

ఇంకొక వైపు చూస్తే పద్య కవిత్వం అమెరికాలో అభిమాన విషయంగా నిలిచింది. సాహిత్య సమావేశాలలో అష్టావధానానికి ప్రాచుర్యం కలిగింది. పద్య శిక్షణా తరగతుల ప్రభావంతో కవులు తమ ప్రతిభను చూపుతున్నారు. శ్రీ కొల్లూరం ప్రకాశ రావు గారు "ప్రాజ్ఞ శిక్షక" బిరుదును పొందారు (Sidvi Foundation, సెప్టెంబర్ 2026).

సాహిత్య లోకంలో బ్రహ్మశ్రీ నేమాని సోమయాజులు గారు ఉత్తమ అవధానిగా, శతక కర్తగా గుర్తింపు పొందారు. స్వచ్ఛమైన తెలుగు ఛందస్సుతో పద్యాలు రాయడంలో, అవధానాలు చేయడంలో ప్రముఖులైన పాలడుగు శ్రీచరణ్ గారు అనేక అష్టావధానాలు, శతావధానాలు చేస్తున్నారు. అమెరికాలో పుట్టి పెరుగుతున్న తర్వాతి తరానికి, బాల అవధాని గన్నవరం లలిత్ వంటి వారికి, తెలుగు పద్య సంస్కృతిని అందించడంలో వీరు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. సురేష్ కొలిచాల పద్య శాస్త్రాన్ని (Prosody) విశ్లేషించే నిపుణుడిగా, కవులకు సాంకేతిక సాయం అందించే మార్గదర్శిగా ఉన్నారు.

శ్రీ వెంకట్ కొత్తూర్ రోజుకొక పద్యం ధారావాహికగా 100 పద్యాలను రచించారు. వీరు "అంతర్జాతీయ ప్రతిభ"

పురస్కారాన్ని (Sidvi Foundation, సెప్టెంబర్ 2026) అందుకున్నారు.

"తెలుగది తెరమరుగగునను/తలపులు ఎదపొరల నడుమ తపనలు రేపన్/పిలిచిన పలికెను 'మనబడి'/తెలుగు బడిన మన బుడతడు తెలివిగ చేరెన్" – ఇత్యాదిగా సర్వలఘు కందంలో అమెరికాలోని తెలుగు బుడుతల తెలుగుబడి చదువుల ప్రాపకత్వాన్ని గురించి రాసారు.

"అనేక" 2000 నుండి 2009 వరకు వెలువడిన తెలుగు వచన కవిత్వంతో కూడిన ఒక ప్రసిద్ధ దశాబ్ది కవితా సంకలనం. దీనికి డా.అఫ్సర్, వంశీకృష్ణ సంపాదకత్వం వహించారు. పదేళ్ళ కాలంలో వెలువడిన కవితల నుంచి 182 కవితలను "అక్షరం, అనుభవం, అస్తిత్వం, అలజడి, ఆందోళన, అతడు ఆమె, ఆవలితీరం, అనంతరం" అని అ, ఆ లతో మొదలయ్యే విభాగాలుగా కూర్చారు. ఇవి వివిధ కవుల కవిత్వ దృక్పథాలను తెలుపుతాయి.

అమెరికాలోని హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి ఆగస్ట్ 8, 2026 నాడు స్వర్ణోత్సవాలను నిర్వహించింది. గత యాభై ఏండ్లుగా ఈ సమితి కావిస్తున్న సాహిత్య కృషి అభినందనీయం. ఈ సమావేశంలో అమెరికాలోని తెలుగు ప్రముఖులు, వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అమెరికా తెలుగు కథ, కవిత్వాల పరిపోషకులు, ప్రచురణకర్తలు, హాస్య రచనలకు రారాజు శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారికి జీవన సాఫల్య పురస్కారమిచ్చి గౌరవించడం పేర్కొనదగినది. తదితర అనేక సాహిత్య, సాంస్కృతిక సంఘాలు ప్రతి సంవత్సరం జరుపుకుంటున్న బృహత్తర సమావేశాలు తెలుగు సాహిత్యానికి ప్రాధాన్యమునిస్తున్నాయి. ఆయా సమావేశ సావనీర్లలో కవిత్వం ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తుంది. ఈ సంస్థలు నిర్వహించే పోటీలు కవిత్వ స్వరూప స్వభావాల రచనా ప్రణాళికను నిర్దేశిస్తాయి. ఈ పోటీల కవిత్వం సంక్షిప్తతను కోరుతుంది. స్వరూపం మారిన స్వభావం కవిత్వానికి కొత్త ప్రమాణాలను సూచిస్తుంది.

మనం ఇప్పుడు అత్యాధునిక సాహిత్య పరిణామ క్రమంలో ఉన్నాం. 2000 నుండి 2025 వరకు గల కాలంలో సాంకేతిక ప్రభావం సాహిత్యాన్ని విస్తారం కావించింది. అంతర్జాలం అందరికీ అందుబాటులోనికి వచ్చింది. మాధ్యమాలలో సమూహాలు వెలసాయి. భూమి దూరాలు భావనా సముద్ర కెరటాల నురగలలో విలీనమయ్యాయి. ఇప్పుడు కవిత్వం స్థానికం కాదు, జంగమమై విశ్వవ్యాప్తిని పొందింది. అమెరికా తెలుగు కవిత్వపు ప్రథమ సంకలనం ఇంటర్నెట్లో లభ్యం అయింది. ఆనాటి కవిత్వమే ఈనాటి వలస కవిత్వానికి ప్రాతిపదికగా బహుముఖాల విస్తరించింది.

జ్ఞాపకం అనేది గొప్ప కవిత్వ ధాతువు. అస్తిత్వ జ్ఞాపకాలు కవి హృదయానికి ఊరటను, ఉదారతను కలిగిస్తాయి. దైనందిన జీవితంలో అలవాట్లు, ఆహార పద్ధతులు, పండుగలు, సంప్రదాయాలలో భారతీయ భూమికను బలంగా నాటుకున్న అమెరికా తెలుగు కవులు ఇప్పటికీ ఎక్కువగా "నేను" అనేటువంటి వైయక్తిక అభివ్యక్తి కవితలను రాస్తున్నారని గమనించవచ్చు. వెన్నంటిన జ్ఞాపకాలు, ఉనికిని కోల్పోక నిలుపుకునే ఆరాటాలు అంతరంగ ఆవిష్కరణకు ప్రాధాన్యమునిస్తున్నాయి.

కరోనా సంక్షోభం సంచలనం కలిగించింది. అత్యాధునికమైన సాహిత్య సందర్భం అవతరించింది. సాంకేతిక పరమైన ఆవశ్యకత కలిగింది. భూగోళమంతా జూమ్ తెరపై తమ సాహిత్య సాంస్కృతిక భావనా వినిమయం చేసుకునే అవకాశానికి తెర

మనం ఇప్పుడు అత్యాధునిక సాహిత్య పరిణామ క్రమంలో ఉన్నాం. 2000 నుండి 2025 వరకు గల కాలంలో సాంకేతిక ప్రభావం సాహిత్యాన్ని విస్తారం కావించింది. అంతర్జాలం అందరికీ అందుబాటులోనికి వచ్చింది

లేచింది. మాధ్యమాల విస్తరణ సాహిత్య ఆవరణను విపులం చేసింది. దేశ, విదేశ ప్రాంతమంతా ఉమ్మడి సాంగత్య రచనా ప్రక్రియల నిలయం అయింది.

తెలుగు ఫాంట్లు: కంప్యూటర్ల వాడకం, ఇంటర్నెట్ విస్తరిస్తున్న తొలిరోజులలో, 1995 చికాగో తానా సమావేశాల సందర్భంగా, తెలుగులో కంప్యూటరీకరణపై తానా ఒక ప్రత్యేక వర్క్షాప్ను నిర్వహించింది. ఆ రోజుల్లో ఇంటర్నెట్లో, పర్సనల్ కంప్యూటర్లలో తెలుగు వాడకం కోసం కృషి చేస్తున్న తిరుమల దేశికాచారి, ముక్కవల్లి లక్ష్మణరావు, కన్నెగంటి రామారావు తదితరులు ఈ వర్క్షాప్లో పాల్గొన్నారు. ఆ సంవత్సరం శ్రీ దేశికాచారి గారు తయారు చేసిన పోతన తెలుగు ఫాంటును తానా ఖరీదు చేసి ఇంటర్నెట్లో తెలుగువారికి ఉచితంగా అందుబాటులో ఉంచింది. ఒక దశాబ్దం పాటు, వ్యాపార ఫాంట్లు వ్యాప్తిలోకి వచ్చేవరకూ, ఔత్సాహికులందరూ ఇంటర్నెట్లో, వెబ్

> కవి రవి వీరెల్లి "దూప" (దాహం), "కుందాపన" (దిగులు) అనే తెలంగాణ పలుకుల పేర్లతో వచ్చిన కవిత్వ సంపుటుల ముందుమాటలో బాహాటంగా తన ఊరి తాలూకు జ్ఞాపకాలే తనని ఈ కవిత్వపు త్రోవలో అడుగులేయించాయని చెప్పుకున్నారు.



సైట్లలో, పర్సనల్ కంప్యూటర్లలో ఈ పోతన ఫాంటునే వాడుతుండేవారు. 1995 తానా సావనీరు తెలుగు విభాగం మొత్తం ఈ పోతన ఫాంటుతోనే ముద్రించారు.

ప్రస్తుతం అమెరికాలోని తెలుగు కవులు దేశ దూరం తప్ప దాదాపుగా సమకాలీన భారతీయ కవిత్వ సందర్భంతో మమేకం అయ్యారని చెప్పవచ్చు. అమెరికా ప్రసిద్ధ కవుల కవిత్వాన్ని భారతదేశ కవిత్వ విమర్శకులు పరిశీలించి ప్రశంసించారు. అమెరికా నివాస ప్రసిద్ధ కవి అఫ్సర్ గారి "వలస", "ఊరిచివర", "ఇంటివైపు" వంటి ఆనాటి నుండీ ఈనాటి వరకూ గల కవిత్వ సంపుటులను పరిశీలించినపుడు, "మరణం కడుపులోంచి పుట్టిన యుద్ధం నా కవిత్వం

మరణించలేకపోవడమే కవిత్వం" అంటున్న వారి కవిత్వంలో కొత్త కవితా వస్తువుల నిరంతర అన్వేషణ కనిపిస్తుంది.

నారాయణ స్వామి వెంకట యోగి గారు సంక్లిష్టమైన విషయాలను సరళంగా చెప్పగలిగిన కవి. వారి "వానొస్తద" శీర్షిక వారిలోని ఉద్యమ చైతన్యానికి ప్రతీక. వారి ప్రగతిశీల భావాలు

"విగ్రహాలు కూలగొట్టేవాడి కోసం" వంటి కవితలలో వ్యక్తం అవుతాయి.

కవి రవి వీరెల్లి "దూప" (దాహం), "కుందాపన" (దిగులు) అనే తెలంగాణ పలుకుల పేర్లతో వచ్చిన కవిత్వ సంపుటుల ముందుమాటలో బాహాటంగా తన ఊరి తాలూకు జ్ఞాపకాలే తనని ఈ కవిత్వపు త్రోవలో అడుగులేయించాయని చెప్పుకున్నారు.

"కుందాపన"లోని కవిత్వం జ్ఞాపకాల పునరావృతంలో...

"పొద్దుగాలనంగా ఊరేగింపుకెళ్ళిన

కప్పతల్లి/ పొద్దుగూకినా ఇల్లు చేరకపాయె" – అంటూ వానలు పడాలని రోటికి కప్పను గట్టి ఊరేగించే ఒక ప్రాంతపు సంప్రదాయాన్ని నమోదు చేసారు.

విన్నకోట రవిశంకర్ గారు – "దుమ్ము పట్టిన ఫొటోని

తుడిచి ముద్దు పెట్టుకున్నట్టే/సజీవమైన నవ్వుల్లో కూడా ఓలలాడగలగాలి/మనుషుల్లాగా, అనుభవాల్ని కూడా/గతిస్తేనేగాని గుర్తించలేకపోవటం/ఎంత విషాదకరం!" (వేసవి వాన – ఆనంద గీతం) – అంటూ పాఠకుడిని ఏకాంతమైన తలపోతలకు లోను చేస్తారు. మనకు తెలిసిన పరిసరాలు కావ్యాత్మలో ప్రతిఫలిస్తాయి.

"రాలిన శిథిల పత్రాలు/నగ్న పాదాలతో/చప్పుడు చేస్తూ/నడుస్తూ వెళ్ళకు/అవి నీ ప్రతిబింబాలు/ఏరుకొని/భద్రంగా గుండెమీది/జేబులో దాచుకో/నడక సాగించు నిన్ను నీవు పోగొట్టుకోకు" – అని హెచ్చరిస్తూ, కవికి స్వీయ భావనా శక్తి ముఖ్యం. సాంఘిక, ఆర్థిక, రాజకీయ వార్తా కథనాలకు కవి ప్రభావితుడు కాకూడదు. పరిశీలనా శక్తి పెంచుకోవాలి. కవికి చిత్తశుద్ధి ముఖ్యం. "నిన్ను నీవు పోగొట్టుకోకు" అని కవిత్వ విమర్శకునిగా, కవిగా హెచ్చరిస్తారు తమ్మినేని యదుకుల భూషణ్.

వేణు నక్షత్రం సమాజ స్పృహతో కూడిన అనేక రచనలు అందిస్తున్నారు.

"మూసుకున్న పిడికిలి పైకెత్తి మన సంఘీభావాన్ని ఘోషిద్దాం" అంటూ

"వేగుచుక్క పొడిచే వేకువల్లోనూ/కోడిపుంజుల కొక్కొరొకోల్తోనూ మొదలయ్యే /దినచర్యల జీవన ప్రయాణం లోనూ/అరుణారుణ సంధ్యాసమయాలలోని ఆరాటాల్లోనూ/ గజ్జెకట్టి ఆడే జానపదాల జాడల్లోనూ/తాటాకు గుడిసె రెక్కవిప్పి పాడే శ్రమైక జీవన ప్రతిధ్వనుల్లోనూ/మనం కోల్పోయిన మనల్ని తిరిగి వెతుక్కుందాం" అని ఆరాటపడ్డారు.

శంకర ప్రసాద్ అమెరికా కవితలో

"ఎట్టకేలకు చేరుకున్నాను అమెరికా /కలల తీరం చేరుకుని చూస్తే కనిపించేది /ఎడారిలో ఎండమావులు నీరు లేని బావులు/ ఆకాశం లో కనిపించే దాహం తీర్చని మబ్బులు" – అంటూ రాసారు (సంచిక, మార్చి 17, 2024).

"మనోళ్ళను అమెరికా వెళ్ళగొడుతున్నా /మనకు అది /భూతల స్వర్గం" – అన్నారు వెన్నెల సత్యం (సంచిక, సెప్టెంబర్ 9, 2018).

తెలుగు సాహిత్యానికి ప్రపంచ సాహిత్యంలో గుర్తింపు రావాలంటే, నాణ్యత గల అనువాదాలు, ఆ అనువాదాలను అందరికీ అందించగల ప్రసిద్ధ ప్రచురణకర్తలు చాలా ముఖ్యం. ఈ ఉద్దేశంతో విస్కాన్సిన్ యూనివర్సిటీ వారు అంతర్జాతీయ పాఠకులు మొదటిసారిగా ఆధునిక తెలుగు కవిత్వాన్ని ఆస్వాదించటం కోసం Hibiscus on the Lake: Twentieth-Century Telugu Poetry from India (2003) ప్రచురించటంలో తానా ప్రముఖ పాత్ర వహించింది. అమెరికా తెలుగు కవులు చాలామంది విద్యాధికులు. స్వీయ కవిత్వాన్ని ఆంగ్లంలోకి, తదితర భాషల కవిత్వాన్ని తెలుగులోకి అనువదించి, కవిత్వానికి అంతర్జాతీయ స్థాయిని కల్పించారు.

కవయిత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి, "నెచ్చెలి" సంచికా సంపాదకురాలు శ్రీమతి కె. గీత "అమెరికా తెలుగు కవయిత్రులు ఏం రాసారు? ఏం రాస్తున్నారు? ఏం రాయాలి?" ప్రసంగ వ్యాసంలో "(వంగూరి ఫౌండేషన్ 10వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు)", అమెరికా తెలుగు రచయిత్రులలో వచన ప్రక్రియల్లో రాసేవారు సంఖ్యాపరంగా ఎక్కువగానే ఉన్నా, చాలా విచిత్రంగా కవయిత్రులు కేవలం వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినంత మందే ఉన్నారన్నారు.

కె. గీత కవిత్వ మాధ్యమంతో స్త్రీలు దృష్టిని సారించవలసిన వివిధ అంశాలను వివరించారు. డిపెండెంట్ వీసా సమస్యను గూర్చి తొలుతగా "డిపెండెంట్ స్వర్గం" కవితలో

"డిపెండెంట్ ముఖానికి మార్పులేం వుంటాయి?/ఇస్త్రీ చేయాల్సిన ఇంటిల్లపాదీ బట్టల్లా బద్ధకం పేరుకు పోతూంది...ఎంత చదూకున్నా నిరుద్యోగ వీసా గడప దాట నివ్వదు/ఏ రోజూ ఏ అద్భుత దీపమూ ప్రత్యక్షమవ్వదు/అతడి కెరీరే నా జీవిత గమ్యం" అంటూ రాసారు.

"పని కోసం పయనం /వీసా ముద్రలోనే ఆగిపోయిన ఆశలు... /గగన చుంబి అద్దాల కట్టడాల్లో /నా ప్రతిబింబం మాత్రం కనిపించలేదు /డాలర్ల తలుపు తడితే /ఋణపు కార్డులు మాత్రమే తలుపు తెరిచాయి" – అన్నారు శిరీష పద్మ యర్రం శెట్టి (సంచిక, అక్టోబర్ 12, 2025).

పురిటికయినా పుట్టింటికెళ్లే యోగం లేకుండా చేసిన "డాలర్ లైఫ్"లో ఉన్న రకరకాల భావోద్వేగాలను గురించి అమెరికా తెలుగు కవయిత్రులు రాసి తమ ప్రతిభను చూపారు. కాని ప్రత్యేకించి, ఉద్యమపరమైన కవిత్వానికి ప్రతినిధిత్వాన్ని వహించలేదు.

మమత కొడిదెల "కవిత్వం నాకు నక్స్ వామికా" (హోమియోపతి మందు లాంటిది) అన్నారు. మట్టి వాసన, చెమట వాసన వేసే రచనలను ఇష్టపడతారు.

"ఒంటరిగా ఒక పిలగాడు. వాడంటే చీకటికి ఇష్టమే. చల్లగా కమ్మేస్తుంది వాడిని. మరెవరూ, మరేదీ ఇవ్వలేనంత ప్రేమతో, వాడు అందర్లో చీకటిని వెతుక్కుంటాడు." అంటూ ఒంటరితనంలోని అన్వేషణను వ్యక్తం చేసారు.

"మెత్తని ఈటె" కవితలో విరుద్ధమైన పదాలతో గాఢమైన సంవేదనను ప్రకృతితో ముడిపెట్టి సున్నితంగా చెప్పారు. ఈ కవితను "A Downy Spear"గా అనువదించారు.

పాలస్తీనా జాతీయ కవిగా గుర్తింపు పొందిన మహమూద్ దార్విష్ (Mahmoud Darwish)తో పాటు ఇతర సమకాలీన పాలస్తీనా కవుల రచనలను ఆమె తెలుగు పాఠకులకు పరిచయం చేశారు.

> **"పని కోసం పయనం /వీసా ముద్రలోనే ఆగిపోయిన ఆశలు .../గగన చుంబి అద్దాల కట్టడాల్లో /నా ప్రతిబింబం మాత్రం కనిపించలేదు /డాలర్ల తలుపు తడితే /ఋణపు కార్డులు మాత్రమే తలుపు తెరిచాయి**

అమెరికా తెలుగు కవిత్వం, అమెరికా నేలపై నడిచే మనిషి అడుగుల శబ్దాన్ని కూడా వినాలి. ఆ నేల చరిత్రను, అక్కడి అట్టడుగు వర్గాల జీవితాలను, వలసదారుల కలలను, వర్ణవివక్షను, ఆర్థిక అసమానతలను, సాంకేతిక అభివృద్ధి వెనుక దాగిన మానవ ఒంటరితనాన్ని ఆహ్వానించాలి. 'స్వదేశాన్ని గుర్తు చేసుకునే కవిత్వం' నుంచి 'నివాస దేశ వాస్తవికతను పలకరించే కవిత్వం' వైపు సాగాలి. అగ్రరాజ్యాన్ని గురించిన పగటి కలలకు మెలుకువను కలిగించాలి. కవిత్వం సామాజిక బాధ్యత అని గుర్తించాలి.

ఆటా (అమెరికా తెలుగు సంఘం) వారి 19వ కన్వెన్షన్ (జూలై 31 – ఆగస్ట్ 2, 2026) జ్ఞాపక సంచిక "మంజరి"లోని కవితలు సరళమైన భావాభివ్యక్తిని కలిగి, మంచి రూప చిత్రాలతో పత్రికకు పరిపుష్టిని కలిగించాయి. అమెరికా తెలుగు సంస్థలు ప్రకటిస్తున్న సంచికలలో దేశ విదేశ కవులందరికీ స్థానం లభిస్తుంది.

సాహిత్యం అంతర్జాతీయమైన తరుణంలో అటునుంచి ఇటు, ఇటునుంచి అటు సమావేశ సమారంభాలు సాధారణం అయ్యాయి.

విజయనగర రాజులు, గోలకొండ సుల్తానుల కాలంలో విదేశీ యాత్రికులు భారతదేశ సాహిత్య వైభవాన్ని, కవుల సభలను తమ యాత్రా చరిత్రల్లో నమోదు చేసారు. అదేవిధంగా ఆధునిక కాలంలో తెలుగు కవులు కొందరు విదేశీ యాత్రలు చేసి, అక్కడి అనుభవాలతో కవిత్వం రాశారు.

ఆటా సభలకు ఇదివరలో అతిథిగా వచ్చిన కీ.శే. ఎండ్లూరి సుధాకర్ గారు తమ యాత్రానుభవ కవితా సంపుటం "ఆటా జని కాంచె" (2006)లో 134 కవితలను రచించారు. అందులో స్వదేశ విదేశ జీవన ప్రమాణాల తులనాత్మకత కనుపిస్తుంది. "మన వాళ్ళ దగ్గర కంటే/ప్రవాసాంధ్రుల వద్దే/పసి గట్టాను /సాహిత్య సంస్కారం/ ...పల్లెటూరి 'రచ్చ బండ'ల్లా /ఈ మాటలూ /ఆ మాటలూ/" ఇత్యాదిగా ప్రశంసించారు.

"మనం/మన జనం/అమెరికాను /ఎలా అడుక్కుంటున్నామో /మనల్ని సైతం అడుక్కునే/యాచకులు/ఎదురవుతారు... 'వన్ డాలర్ ప్లీజ్' అంటూ/బడుగు మొహాలతో కంపిస్తారు/రోడ్డు కచేరీలు చేస్తూ /రొట్టె సంపాదించు కుంటారు/ఆకలికి అవమానం లేదు/కడుపు నిండిన విశ్వ మానవుడు /అమెరికాలోనూ కనబడలేదు/" అని వాస్తవాన్ని తెలిపారు.

పర్యటన కోసం వచ్చిన శ్రీ వి.ఆర్. విద్యార్థి రాసిన కవితా సంకలనం "ఖండాంతర కవిత్వం". ఈ సంకలనంలో అమెరికాలోని అడవులు, సరస్సులు, గుహలు మొదలైన పర్యాటక ప్రదేశాల్ని వర్ణించే కవితలనేకం ఉన్నాయి. చక్కని పదచిత్రాలతో ప్రకృతిని దర్శించిన కవి సౌందర్య దృష్టి కవిత్వానికి విలువను తెచ్చింది.

శాంతిశ్రీ బెనర్జీ అమెరికాలో శైశవాన్ని గూర్చి "...కళ్ళు విప్పార్చుకు చూసే /చిన్న పిల్లల వీడియోలలోని /బ్లిప్పీ కేటీ మాట్లాడే పెప్పా పిగ్/చేరువయ్యారు స్నేహితుల్లా /వాడి అమెరికన్ యాసతో/పడతాము మేం తికమక" అంటూ మనుమని బాల్యాన్ని గురించి రాసారు (సంచిక, ఆగస్ట్ 2025).

అమెరికా, కెనడా, తదితర దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహిత్య సభలలో కవిత్వ సంపుటులు, శతక, ముక్తకాల ఆవిష్కరణలు జరిగాయి. కెనడాలో శ్రీమతి ఎన్నెలమ్మగా పేరు పొందిన లక్ష్మీ రాయవరపు, ప్రపంచ మాధ్యమంగా "తెలుగుతల్లి కెనడా", బాలల పత్రిక "గడుగ్గాయి" వంటి సంచికా నిర్వహణలతో చేస్తున్న తెలుగు భాషా వ్యాప్తి కొనియాడదగినది. అమెరికా దేశవ్యాప్తంగా "తెలుగుబడి" నిర్వహణ బాలలకు అపారమైన భాషా జిజ్ఞాసను, కవిత్వ రచనా పాటవాన్ని ప్రోత్సహిస్తోంది.

నేడు అనేక వైయక్తిక, కౌటుంబిక కారణాల వల్ల స్వదేశంలోని తలిదండ్రులు, విశ్రాంత ఉద్యోగులు పచ్చ చీటీ (గ్రీన్ కార్డ్) అర్హతతో అమెరికా నివాసం కొనసాగిస్తున్నారు. వారి రచనలు ద్వైదేశీయ నివాసానుభవాలను తెలుపుతాయి. వీటి వల్ల నవతరానికి పూర్వ కావ్య వైభవం, తెలుగు సంస్కృతుల అవగాహనకు దోహదం కలుగుతుంది.

అమెరికాలో స్థిర నివాసానికి వచ్చిన మొదటి తరం మనుమలు కూడా కవులుగా ఎదిగి వచ్చిన కాలానికి, కవనాపేక్షకు కావలసినంత విషయ వస్తువును అందిస్తుంది AI. అమెరికాలో పుట్టి పెరిగిన యువత, అక్కడి విద్యార్థులుగా, తమ తండ్రులు, తాతలు కావించిన భాషా, సంస్కృతుల రక్షణా కృషికి వారసులుగా, తమకు అదనంగా కలిగిన సాంకేతిక, దేశ విదేశీయ భాషా పటిమతో, తెలుగు కవిత్వాన్ని అంతర్జాతీయ స్థాయిలో సుసంపన్నం కావించగలరు. దేశ పౌరసత్వం స్థగితం కాక విశ్వాన్ని సందర్శిస్తుంది. సరికొత్త వైజ్ఞానిక సాంస్కృతిక మిశ్రితమైన కవన సంపుటాలను వెలువరిస్తుంది.

ఆధారాలు:


"అమెరికా తెలుగు కవిత" (1998);

ఈమాట, నెచ్చెలి, సంచిక పత్రికల వ్యాసాలు;

వంగూరి ఫౌండేషన్ 10వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు ప్రసంగ వ్యాసాలు.

చాసో కథాశిల్పం – ఆయన స్థానం

డాక్టర్ సేనాపతి సత్యనారాయణ
99516 83999



తెలుగు కథా సాహిత్య రంగంలో వాస్తవికతకు, మానవతా దృక్పథానికి నిలువెత్తు రూపం చాగంటి సోమయాజులు (చాసో). జీవితాన్ని దాని సహజ రూపంలో దర్శిస్తూ, అట్టడుగు వర్గాల ఆర్థిక, సామాజిక వేదనలను ఎటువంటి అతిశయోక్తులు లేకుండా పచ్చి నిజాలతో చిత్రించిన అపురూప కథకుడు ఆయన. కేవలం కథావస్తువు ఎంపికలోనే కాకుండా, వర్ణనలు, సంభాషణలు, పాత్రచిత్రణ, ఆరంభ – ముగింపుల శిల్పంలో చాసో అనుసరించిన విధానం తెలుగు కథారంగానికి ఒక దిక్సూచిగా నిలిచింది. ఎలాంటి కృత్రిమ అలంకారాలు, అభూతకల్పనలు లేకుండా, సామాన్య మానవుడి అంతరంగిక సంఘర్షణలను అత్యంత క్లుప్తంగా, హృద్యంగా ఆవిష్కరించిన చాసో కథాశిల్ప వైశిష్ట్యాన్ని, తెలుగు కథా సాహిత్య జగత్తులో ఆయన స్థానాన్ని విశ్లేషించే ఒక సమగ్ర పరిశీలనే ఈ వ్యాసం.

కథాశిల్పంలో వస్తువు, ఇతివృత్తం, సన్నివేశ కల్పన వంటి అనేక అంశాలు అంతర్భాగాలైనప్పటికీ, ఈ వ్యాసంలో చాసో కథల్లోని వర్ణనలు, సంభాషణలు, సంఘర్షణ, సన్నివేశాలు – సంఘటనలు, పాత్రచిత్రణ, ఆరంభం, ముగింపులు, కథాసాహిత్యంలో ఆయన స్థానం వంటి నిర్దిష్ట శిల్ప పరికరాలకే పరిమితమవుతున్నాను. చాసో కథల్లోని అద్భుతమైన క్లుప్తతను, నిర్మాణ సౌష్ఠవాన్ని ఆవిష్కరించడానికి ఈ ఏడు శిల్పాంశాల విశ్లేషణ అత్యంత కీలకమైనది. అనవసరమైన సాగతీత లేని ఆయన వర్ణనలు, కళింగాంధ్ర జీవద్భాషను ప్రతిబింబించే సంభాషణలు, పాత్రల అంతరంగిక, సామాజిక సంఘర్షణలు, మానవేతర అంశాలను సైతం సజీవ పాత్రలుగా మలచిన విధానం... ఈ పరిధుల లోపలే సమగ్రంగా విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నాను. నిర్మాణ సౌష్ఠవం పేరుతో చవకబారు కొసమెరుపుల జోలికి వెళ్లకుండా, కథా ప్రారంభాన్ని, ముగింపును ఆయన నిర్వహించిన తీరును పరిశీలిస్తూ, తెలుగు సాహిత్య జగత్తులో చాసో ముద్రను అంచనా వేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

వర్ణనలు:

కథకు వర్ణనలే ప్రాణం. అయితే నవలలోని వర్ణనలకు, కథలోని వర్ణనలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. కథకుడు తన ప్రక్రియ యొక్క నిడివిని దృష్టిలో పెట్టుకొనే వర్ణనలకు పూనుకోవాలి. కథలో 'పరిమితి' (Limit) అనే నియమానికి ఎంతో విలువ ఉంది; ఎందుకంటే పనిగట్టుకొని చేసే వర్ణనలు కథా గమనాన్ని దెబ్బతీస్తాయి. సరైన మోతాదులో చేసే వర్ణనలే కథకు ఒక చక్కటి రూపాన్ని అందించి, కథావస్తువు పాఠకుని మనస్సును హత్తుకునేలా చేస్తాయి.

చాగంటి సోమయాజులు (చాసో) ప్రయోగించిన వర్ణనాత్మక వాక్యాలు పాఠకుడిలో అనుభూతిని, ఆలోచనను, ఆచరణాత్మక చైతన్యాన్ని రగిలిస్తాయి. 'నల్లగుమ్మడికాయ లాంటి పిల్లాడు', 'తూరుపు ఫాసు లాంటి కూతురుంది', 'గవిరి వింటిల్లి బద్దలా వంగిపోయింది', 'జడ మెడ చుట్టూ నాగుపాములా బుసలు కొట్టడం ప్రారంభించింది', 'బడి గోల సముద్రపు ఘోషలా వినబడుతున్నది', 'ఏనుగంత సత్తువ వచ్చింది', 'కొంగలాగా మెడ సాగదీసుకొని ఎగిరెగిరి చూసింది', 'వెన్నెల పట్టపగల్లాగుంది' మొదలైన పోలికలను చాసో తన చుట్టూ ఉన్న సమాజం నుంచే యథాతథంగా స్వీకరించారు. దీన్నే మనం అచ్చమైన 'వాస్తవికతా వర్ణన' (Realist Description) గా చెప్పవచ్చు.

చాసో వర్ణనల్లో అపూర్వమైన కొత్తదనం కనిపిస్తుంది.

చాసో వర్ణనల్లోని మరొక విశిష్టత ఆయన పేదవారి పట్ల చూపిన పక్షపాతం. అందుకే ఆయన వర్ణనల్లో అలంకారాలుగా వచ్చే పూలు కూడా అట్టడుగు వర్గాలకు, గ్రామీణ జీవితానికి చేరువగా ఉన్నవే అయి ఉంటాయి.



గతంలో ఎవరూ ఊహించని విలక్షణమైన పోలికలను సృష్టించడం ఆయన శైలి. "నా చుట్టూ ఆనందం గువ్వపిట్టలా గుబాళించింది" అనడంలోనే ఆయన విలక్షణత వ్యక్తమవుతుంది. అలాగే "ఊటీ కొండలకు మేఘాలెంత అందమో, ఊటీ బంగళాలకు లూసీ అంత అందం", "రెక్కలతో నల్ల గొడుగులు పట్టింది?", "కాలం కదిలిపోతున్నది, కోటేశ్వరరావు కదలలేదు", "చెరువులో తామరలా ఆశ బుర్రంతా అల్లుకుంది", "స్వరాలు చిక్కుపడ్డ కురుల్లాగా అవకతవక అయిపోయాయి", "శొంఠి గంధం పూసినట్లు ఒళ్లంతా సెగలూ పొగల్లాగా లేచాయి", "నిప్పుల్లో వంకాయలాగ నా గుండె ఉడికిపోయింది", "నా సంతోషం నీళ్లు పోసిన నిప్పు అయింది" వంటి వాక్యాలలో ఏ అలంకారం ఉందో వెతకడం కంటే, అవి పాఠకుడి హృదయంపై చెరగని ముద్ర వేస్తాయని చెప్పడమే సమంజసం.

చాసో వర్ణనల్లోని మరొక విశిష్టత ఆయన పేదవారి పట్ల చూపిన పక్షపాతం. అందుకే ఆయన వర్ణనల్లో అలంకారాలుగా వచ్చే పూలు కూడా అట్టడుగు వర్గాలకు, గ్రామీణ జీవితానికి చేరువగా ఉన్నవే అయి ఉంటాయి. చాసో తొలినాళ్ల నుంచి నలుగురూ మెచ్చే ఆడంబరమైన పూలను ప్రేమించలేదు. ఆయన కథల్లో సన్నజాజులు విరియలేదు, సంపెంగలు గుబాళించలేదు. ఎవరో పెంచి పోషించవలసిన అవసరం లేకుండా, ప్రకృతిలో తమంత తాముగా విరిసి సుగంధాలు వెదజల్లే సాధారణ గ్రామీణ పుష్పాలంటే చాసోకు ఎంతో అభిమానం. ఆయన కథాశిల్పం ఆ మట్టి వాసనల్లోంచే పుట్టి పెరిగింది. అంగడిలో అమ్మే పువ్వులు ఆయన మనసుకెక్కవు. ఒకవేళ తన కథల్లో వాటిని ఉపయోగించినా ఆ సందర్భాలు వేరుగా ఉంటాయి. తెలుగు కథా సాహిత్యంలో చాసోలో తప్ప మరే రచయితలోనూ ఈ విధమైన విలక్షణత కనిపించదు. అందుకే ఆయన "నాగజెముడు పువ్వు నాకిష్టం" అన్నారు. యు.ఎ. నరసింహమూర్తి గారి ఈ విశ్లేషణ అక్షరసత్యం. దీన్ని బట్టి చాసో వర్ణనలు ఎంత సహజంగా, సమాజానికి ఎంత దర్పణంగా ఉంటాయో స్పష్టమవుతుంది.

సంభాషణలు:

ప్రధానంగా ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తుల మధ్య సాగే ఆలోచనల మార్పిడిని మనం సంభాషణగా పిలుస్తాం. కథలో సంభాషణల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) ఇలా అన్నారు: "ఏదైనా ఒక విషయం గురించి మన ఇంగితాన్ని ఇతరులకు తెలియజేయటానికీ, వారి ఇంగితాన్ని గ్రహించడానికీ మనమూ వారూ చేసే చర్యలే సంభాషణలు." ఒక వ్యక్తి తన అంతరంగ భావాలను వ్యక్తీకరించేటప్పుడు కేవలం మాటలనే కాక, ముఖకవళికలు, సైగల ద్వారా కూడా కోపతాపాలను, మనోవికారాలను వ్యక్తపరచవచ్చు. అంతేకాదు, కథా గమనంలో కథకుడు పాఠకుడితో జరిపే అంతర్గత సంభాషణ కూడా ఇందులో భాగమేనని ఆయన చక్కగా వివరించారు.

చాసో ప్రసిద్ధ కథ 'వాయులీనం'లో ఈ సంభాషణల శిల్పం అత్యున్నత స్థాయికి చేరింది. కథానాయకుడు వెంకటప్పయ్య తన ప్రాణప్రదమైన వాయులీనాన్ని అమ్మి, 'పాపపరిహారం' చేసుకొని ఇంటికి వస్తాడు. అప్పుడు భార్యాభర్తల మధ్య జరిగే ఈ సంభాషణను గమనించండి:

"అప్పుడే వచ్చేశారేం?" అన్నది రాజ్యం.

"పాపపరిహారం అయిందా?"

"కొంచెం అయ్యింది."

"ఈ మధ్య ఎక్కడికో వెళ్లారు కాబోలు."

"రామ రామ..." అంటూ వెంకటప్పయ్య తాను తెచ్చిన జరీచీరను చూపిస్తాడు.

ఈ సంభాషణలో వెంకటప్పయ్య వాయులీనాన్ని అమ్మిన విషయాన్ని వాచ్యంగా (నేరుగా) చెప్పకపోయినప్పటికీ, రాజ్యం ఆ విషయాన్ని సులభంగా గ్రహిస్తుంది. "వాడే పట్టుకెళ్లి రెండు వందల యాభైకి అమ్మేశాడు. అంత డబ్బు వస్తుందని నేను అనుకోలేదు. పాతదానికే విలువ ఎక్కువట" అని భర్త అన్నప్పుడు రాజ్యానికి పరిస్థితి అంతా అర్థమవుతుంది. "నేను చేసింది తప్పే" అన్నట్లు నేరస్తుడిలా నిలబడ్డ భర్తను చూసి ఓదార్పుగా రాజ్యం ఇలా అంటుంది:

"ఏ తప్పూ చేయలేదు. ఏ సంసారైనా అదే చేస్తాడు.

చేయవలసి వచ్చి చేశారు. మీరేం తినేశారా?" అంటూ గుడ్ల నిండా నీళ్ల నింపుకుంటుంది.

ఈ సంభాషణ 'వాయులీనం' కథకు గుండెకాయ వంటిది. ఇందులోని ఆర్ద్రత, మానవీయ కోణం పాఠకుడి హృదయాన్ని ద్రవింపజేస్తాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే; చాసో తన కథల్లోని సంభాషణలను అత్యంత సహజమైన సామాజిక వాతావరణం నుంచే స్వీకరించారు. ఎక్కడా పాత్రలు కృత్రిమంగా మాట్లాడుతున్నట్లు అనిపించదు. కథా నిడివిలో క్లుప్తత అనే కొలబద్దను పాటించిన చాసో, సంభాషణల్లోనూ అదే మితభాషిత్వాన్ని, పదునును ప్రదర్శించారు. అందుకే ఆయన సంభాషణల్లో ఎక్కడా నాటకీయ అతిశయోక్తులకు తావుండదు.

సంఘర్షణ, సన్నివేశాలు – సంఘటనలు:

మానవ సంబంధాలలో, సమాజంలో నిరంతరం జరిగే మార్పుల వల్ల మనిషి అనేక రకాల అంతరంగిక, సామాజిక సంఘర్షణలకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో, కథ మరింత ప్రభావవంతంగా మారడానికి 'సంఘర్షణ' (Conflict) అనేది ప్రధాన కథావస్తువుకు ప్రాణవాయువులా సహాయపడుతుంది. నిజమైన సామాజిక సంఘర్షణల ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రముఖ విమర్శకులు వల్లంపాటి సుబ్బయ్య ఇలా అన్నారు: "జీవితంలోని ముఖ్యమైన సంఘర్షణల జోలికి పోకుండా జీవితపు పైపై మెరుగులను చిత్రిస్తూ కథలు రాసిన రచయితలు తెలుగులో చాలామందే ఉన్నారు. ఎలాంటి సంఘర్షణనూ చిత్రించని కథలు కాలక్షేపం కథలు లేదా వ్యాపార కథలు మాత్రమే అవుతాయి." చాసో కథలు ఈ కాలక్షేప పరిధిని దాటి, సమాజంలోని వర్గ సంఘర్షణను, నిశ్శబ్ద మానసిక వేదనను అత్యంత శక్తివంతంగా ఆవిష్కరించాయి.

ఇక కథా నిర్మాణంలో కీలకమైన 'సన్నివేశం', 'సంఘటన'ల మధ్య గల సూక్ష్మ భేదాన్ని కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) ఒక సులువైన ఉదాహరణతో వివరించారు: "రైలు బోగీలో ప్రయాణీకులు ఎవరి గొడవలో వారుంటారు. తనిఖీ ఉద్యోగి టికెట్లు తనిఖీ చేస్తుంటాడు. అది సన్నివేశం. టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ఓ ఆడమనిషి పట్టుబడిపోతుంది. అది సంఘటన."

చాసో కథల్లో సన్నివేశాలు – సంఘటనలు:

చాసో ప్రసిద్ధ కథ 'ఎందుకు పారేస్తాను నాన్నా?'లో సన్నివేశం – సంఘటనల నిర్వహణ అత్యంత విలక్షణంగా సాగుతుంది. తండ్రి చుట్టలు తీసుకురమ్మని పంపగా, ఆ త్రోవలోనే ఉన్న బడి (స్కూలు) వైపు ఆకర్షితుడై కృష్ణుడు అక్కడే ఉండిపోవడం, అనంతరం తండ్రి అక్కడికి చేరుకోవడం, అంతకుముందు మిత్రులు కలిసిన సందర్భంతో కలిసి ఒక బలమైన 'సన్నివేశం' (Scene) గా రూపుదిద్దుకుంటుంది. సాధారణంగా చాలా కథల్లో సన్నివేశం నుండి సంఘటనలు పుట్టుకొస్తాయి. కానీ, ఈ కథలో కృష్ణుడు స్కూలు మాని వేయవలసి రావడం అనే 'సంఘటన' (Incident) కథా ప్రారంభానికి ముందే జరిగిపోతుంది.

ఈ ముందస్తు సంఘటన నేపథ్యంలో ఒక తెలివిగల పేద విద్యార్థి బడికి దూరం కావడం వల్ల అనుభవించే మానసిక వేదనను, అతని అంతరంగిక సంఘర్షణను చాసో అత్యంత హృద్యంగా చిత్రించారు. చదువుకోవాలనే తపన ఒకవైపు, దారిద్ర్యం తెచ్చిన నిస్సహాయత మరోవైపు కృష్ణుడి పాత్రను నిరంతరం రగిలిస్తుంటాయి. ఈ విలక్షణ శిల్ప చమత్కృతి వల్లే, ఒక సామాన్య సన్నివేశం ద్వారా అట్టడుగు వర్గాల విద్యావకాశాల లోపాన్ని ఎత్తిచూపిన ఈ కథ చాసో రచనల్లోనే ఒక మహోత్కృష్టమైన కథగా నిలిచింది.

చాసో తన కథల్లో 'క్లుప్తత'కు ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే


"జీవితంలోని ముఖ్యమైన సంఘర్షణల జోలికి పోకుండా జీవితపు పైపై మెరుగులను చిత్రిస్తూ కథలు రాసిన రచయితలు తెలుగులో చాలామందే ఉన్నారు. ఎలాంటి సంఘర్షణనూ చిత్రించని కథలు కాలక్షేపం కథలు లేదా వ్యాపార కథలు మాత్రమే అవుతాయి"

ఆయన కథాశిల్పం అత్యంత సంక్షిప్తంగా, సునిశితంగా, ప్రభావవంతంగా రూపుదిద్దుకుంది. ఒకే సన్నివేశం లేదా పరిమిత సంఘటనల పరిధిలోనే జీవిత సత్యాన్ని ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. ఉపసన్నివేశాలు, ఉపసంఘటనలు ఉన్నప్పటికీ, అవి ప్రధాన కథాంశాన్ని పక్కదారి పట్టించకుండా, దానికి అదనపు బలాన్ని చేకూర్చే పోషకాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఈ పరిమిత చట్రంలోనే సమాజంలోని శ్రమజీవుల నిస్సహాయతను, ఆర్థిక అసమానతలను చాసో అత్యంత శక్తివంతంగా చిత్రించగలిగారు.

చాసో కథల్లో పాత్రచిత్రణ:

ఇ.ఎం. ఫార్స్టర్ తన 'ఆస్పెక్ట్స్ ఆఫ్ ది నావెల్' (Aspects of the Novel, 1927) గ్రంథంలో పాత్రలను ఒకే భావం లేదా లక్షణం చుట్టూ నిర్మించిన "ఫ్లాట్ క్యారెక్టర్స్" (Flat Characters) గానూ, నమ్మదగిన రీతిలో పాఠకుణ్ణి ఆశ్చర్యపరచగల సంక్లిష్టమైన "రౌండ్ క్యారెక్టర్స్" (Round Characters) గానూ రెండు

> చాసో కథాసాహిత్యంలో పాత్రలు పరిమితంగానే ఉంటాయి. అవి వాస్తవిక కథన నేపథ్యం నుంచి పుట్టుకొస్తాయి. చాలా సహజంగా, మనం చూస్తున్నట్లుగా మన కళ్లముందు కదలాడుతుంటాయి. చాసో కథాసాహిత్యంలో పురుష పాత్రలు సామాన్య పాత్రలుగా కనిపిస్తాయి



విధాలుగా విభజించారు. సాధారణంగా రచయితలు తమ పరిశీలనాశక్తితో సమాజం నుంచే ఇటువంటి పాత్రలను స్వీకరిస్తారు. అయితే చాసో కథల్లో 'క్లుప్తత'కు అత్యధిక ప్రాధాన్యత ఉండడం వల్ల, ఎక్కువ పాత్రలు ప్రవేశించడానికి అవకాశం ఉండదు. ఈ పరిమిత పరిధిలోనే ఆయన సమాజంలోని మనుషులను అద్భుతంగా చిత్రించారు. అంతేకాదు, చాసో సృష్టిలో పాత్రలు అనగానే కేవలం స్త్రీ, పురుషులే కాదు; ఆయన కథాశిల్పంలో పశుపక్ష్యాదులు, ఇతర చైతన్యవంతమైన అంశాలు (ఉదాహరణకు: 'బూర్జువా కుక్క' కథలోని కుక్క, లేదా 'వాయులీనం') కూడా సజీవమైన పాత్రలుగా రూపాంతరం చెంది కథను నడిపిస్తాయి.

చాసో కథాసాహిత్యంలో పాత్రలు పరిమితంగానే ఉంటాయి. అవి వాస్తవిక కథన నేపథ్యం నుంచి పుట్టుకొస్తాయి. చాలా సహజంగా, మనం చూస్తున్నట్లుగా మన కళ్లముందు కదలాడుతుంటాయి. చాసో కథాసాహిత్యంలో పురుష పాత్రలు సామాన్య పాత్రలుగా కనిపిస్తాయి. ఏ ఒక్క పాత్రకూ అద్భుతాలను సృష్టించే లక్షణాలు ఉండవు. ఇంకొక విధంగా చెప్పాలంటే, అసహాయత, క్రియాశూన్యత, ఉన్మత్తస్థితి వంటి లక్షణాలున్నవారు, సమస్యలకు భయపడేవారు, గౌరవం లేకపోయినా సానుభూతి కోసం ఎదురు చూసేవారు ఒక్కొక్కరిగా కనిపిస్తారు. ఆయన కథల్లో ఆదర్శ పురుషులు కనిపించరు; లోపాలున్న వారే కనిపిస్తారు. అసమర్థత, స్వార్థం, న్యూనతాభావాలు ఎక్కువగా ఉన్న పాత్రలు కూడా కనిపిస్తాయి. ఈ విధమైన పాత్రల ద్వారా భవిష్యత్తులో లోపరహితమైన వ్యక్తిత్వాన్ని భావితరాలు ఏర్పరచుకోవాలనే సోమయాజుల దూరదృష్టిని పాఠకులు గ్రహించవచ్చు.

చాసో కథల్లోని స్త్రీ, పురుష పాత్రలను, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని విశ్లేషిస్తే ఈ కింది విషయాలు కనిపిస్తాయి.

చాసో కథల్లో పాత్రలకు పేర్లు లేని కథలు – 12:

1) దుమ్ములగొండె 2) కొండగెడ్డ 3) బూర్జువా కుక్క 4) ఆవిష్కరణ 5) ఊళ్లో వానలేదు 6) కప్ప 7) బదిలీ 8) ఏకరువు 9) కుక్కుటేశ్వరం 10) పరబ్రహ్మం 11) బొండుమల్లెలు 12) గుడిసె – దీర్ఘరోగి

చాసో కథల్లో స్త్రీ పాత్రలు లేని కథలు – 8:

1) భల్లూక స్వప్నం 2) బబ్బబ్బా 3) దుమ్ములగొండె 4) కొండగెడ్డ 5) బూర్జువా కుక్క 6) ఆహా ఆహా 7) ఊళ్లో వానలేదు 8) కప్ప

నైతిక విలువల పతనానికి సంబంధించిన కథలు – 11:

1) లేడీ కరుణాకరం 2) బదిలీ 3) ఊహా ఉర్వశి 4) ఏలూరెళ్లాలి 5) కర్మసిద్ధాంతం 6) చెప్పకు చెప్పకు 7) కవలలు 8) ప్రెసిడెంటు లక్ష్మీకాంతం 9) బుగ్గిబూడిదమ్మ 10) వజ్రహస్తం 11) పోనీ తిను

స్త్రీ పాత్రలు ప్రధాన భూమికగా ఉన్న కథలు – 21; పురుష పాత్రలు ప్రధాన భూమికగా ఉన్న కథలు – 17; స్త్రీ–పురుష పాత్రలు ప్రధాన భూమికగా ఉన్న కథలు – 3.

అర్నాల్డ్ బెన్నెట్ పాత్రల గురించి చెబుతూ, "ఏ రచయిత ఎప్పటికీ కొత్త పాత్రలను సృష్టిస్తూ ఉండలేడు. కాని అతను ముఖ్యంగా చేయవలసిన పని పాత్రల ద్వారా పాఠకుడి హృదయంపై తన సామర్థ్యం కొలదీ ఒక గాఢమైన ముద్ర వేయడం" అని అంటారు. ఇది చాసో పాత్రచిత్రణలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

చాసో కథల్లోని ఆరంభం (Beginning) **– ముగింపు** (Ending):

అరిస్టాటిల్ తన 'పోయటిక్స్' (Poetics) గ్రంథంలో నాటకానికి ఆద్యంతాల (ఆది, మధ్య, అంతం) మధ్య సమన్వయం అత్యంత ప్రధాన లక్షణమని పేర్కొన్నారు. అయితే, ఈ శిల్ప సూత్రాన్ని కథలకు కూడా అన్వయించుకోవచ్చని ప్రసిద్ధ ఆంగ్ల రచయిత సోమర్సెట్ మామ్ అభిప్రాయపడ్డారు. కథలో ఆది – మధ్యాంతాలను నేర్పుగా 'అల్లటం' ఎంత అవసరమో, అది మితిమీరకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. 'అల్లిక' (Plot) పూర్తిగా లేని కథ నీరసంగానూ, అది మరీ ఎక్కువైన కథ కృత్రిమంగానూ తయారయ్యే ప్రమాదం ఉంది. నిర్మాణ సౌష్టవం పేరుతో కథనంలో అనవసరమైన మలుపులూ, అసహజమైన

కొసమెరుపులూ ప్రవేశపెట్టడం చాలా చవకబారు శిల్పం.

అయితే ఏది గొప్ప ఆరంభం, ఏది గొప్ప ముగింపు అన్న దానికి సరైన సమాధానం చెప్పడం కష్టం. ఏ మొదటి వాక్యం లేదా పేరా పాఠకుణ్ణి ఆకట్టుకుంటుందో అదే మంచి ప్రారంభం. అలాగే "కథ కోసం ముగింపే గాని, ముగింపు కోసం కథ కాదు" అన్న దృష్టితో రచన జరిగినప్పుడు అది గొప్ప ముగింపుగా భావించవచ్చు. అందువల్ల కథలోని ముగింపును పాఠకుని ఆలోచనకే విడిచిపెట్టాలి. అప్పుడే ఆ రచయితకు పాఠకుల పట్ల గౌరవభావం ఉన్నట్లు అవుతుంది. తద్వారా పాఠకుడు కథ గురించి ఆలోచించడం మొదలుపెడతాడు.

'వాయులీనం':

ప్రారంభం: "రాజ్యానికి ఒంటిమీద స్పృహ పూర్తిగా తప్పిపోయింది. అది ఈ ప్రపంచంలో లేదు. వెంకటప్పయ్య ప్రాణాలు ఎక్కడివక్కడ ఎగిరిపోయాయి. పరీక్షగా పెళ్లాం మొహంలోకి చూశాడు."

ముగింపు: "నాలుగు కాలాలపాటు ఉంటుంది కదా అని కొనేశాను" అని చీర సగం విప్పేసి రాజ్యం భుజం మీద కప్పేశాడు వెంకటప్పయ్య.

ఈ కథలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి సమస్యతో కథ ప్రారంభమైంది. రాజ్యం, వెంకటప్పయ్య జీవితంలో సంగీతం లేదు. కథ అంతా సంగీతంతో అల్లుకున్నా, శ్రుతి తప్పిన జీవితాన్ని సాగిస్తున్న వెంకటప్పయ్యకు, ఆమె జబ్బు మందుల కోసం, చీర కోసం వాయులీనాన్ని అమ్మడం తప్ప వేరే మార్గం కనబడదు. అక్కడితో కథ ముగుస్తుంది. ప్రారంభ వాక్యాలు పాఠకునికి ఉత్కంఠ, ఆసక్తి కలిగించి కథను చదివిస్తాయి. కథాంతంలో కలిగే స్పృహ, జ్ఞాపకంగా నిలిచిపోతుంది. అంటే కథ ముగింపులోనే ప్రారంభం ప్రతిధ్వనించినట్లుగా అనిపిస్తుంది.

'ఎందుకు పారేస్తాను నాన్నా?':

కథ ప్రారంభం ఇలా ఉంటుంది: "చెల్లిని ఒడిలో కూర్చోబెట్టుకొని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెప్పుతున్నాడు."

"ఎందుకు పారేస్తాను నాన్నా?" అన్న వాక్యం చివరిది. ఇదే కథకు పేరు. చదువుకోలేకపోవడం, అన్నీ వదులుకున్నా చుట్టను వదులుకోలేక కొడుకును చదువు మానిపించానని బాధపడే తండ్రీకొడుకుల వేదనతో కథ నడిచింది. ప్రారంభంలో చుట్టలకని తండ్రి ఇచ్చిన డబ్బు గురించి తండ్రి అడుగుతాడు. వాటి విలువ తెలిసిన కొడుకు "ఎందుకు పారేస్తాను నాన్నా?" అని సమాధానం ఇస్తాడు. ఈ ఒక్క మాటే కథ అంతటినీ అనుసంధానిస్తూ ఆద్యంతాలను కలుపుతుంది. ఎంత చక్కటి ముగింపో అర్థమవుతుంది.

చాసో కథల్లో ఆరంభ వాక్యాలు చక్కగా ఆకర్షిస్తాయి. కానీ ముగింపు మాత్రం సాధారణ వాతావరణం నుంచే వచ్చినదిగా ఉంటుంది. ఆ ముగింపు వాక్యం మాత్రం పాఠకుడి మనస్సును తాకి ఆలోచింపజేస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

తెలుగు కథాసాహిత్యంలో చాసో స్థానం:

తెలుగు కథా ప్రక్రియకు పితామహుడైన మహాకవి గురజాడ అడుగుజాడల్లో నడిచిన అచ్చమైన సాహిత్య వారసుడు చాసో. అందుకే, తెలుగు కథా జగత్తులో రెండో తరానికి చెందిన రచయితలలో చాసో మొదటి వారని ప్రముఖ కవి, విమర్శకులు ఆరుద్ర స్పష్టంగా పేర్కొన్నారు (జననీరాజనం – చాసో స్ఫూర్తి సాహితీ పురస్కార ప్రదానోత్సవ విశేష సంచిక: చాసో స్ఫూర్తి, తిరుపతి, జనవరి 1995). ప్రసిద్ధ విమర్శ గ్రంథమైన 'తెలుగు కథకులు, కథన రీతులు' అన్న వ్యాససంకలనంలో పందొమ్మిదవ వ్యాసంగా చాసో కథా ప్రస్థానాన్ని విశ్లేషించడం జరిగింది. ఆ సంకలనంలో చాసో స్థానాన్ని ప్రత్యేకంగా క్రోడీకరించకపోయినప్పటికీ, ఆయన అద్భుత కథాశిల్పాన్ని బట్టి

> **అరిస్టాటిల్ తన 'పోయటిక్స్' గ్రంథంలో నాటకానికి ఆద్యంతాల (ఆది, మధ్య, అంతం) మధ్య సమన్వయం అత్యంత ప్రధాన లక్షణమని పేర్కొన్నారు. అయితే, ఈ శిల్ప సూత్రాన్ని కథలకు కూడా అన్వయించుకోవచ్చని ప్రసిద్ధ ఆంగ్ల రచయిత సోమర్సెట్ మామ్ అభిప్రాయపడ్డారు.**

రెండో తరంలో అగ్రతాంబూలం ఆయనకే దక్కుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి, అట్టడుగు ప్రజల ఆర్థిక ఇబ్బందులు చాసో కథల్లో ప్రధాన భూమిక పోషించడం వల్ల, ఆయన కథలు నిఖార్సైన సామాజిక వాస్తవికతకు (Social Realism) సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి. కథా ప్రారంభం, సన్నివేశ కల్పన, పాత్రల నేపథ్యానికి తగిన జీవద్భాషను వాడటం, ఆద్యంతాల సమన్వయం వంటి శిల్పాంశాల్లో చాసో అపారమైన ప్రజ్ఞను కనబరిచారు. సంక్షిప్తత, ఏకసూత్రత, ఉద్రేకం లేని భావుకత్వం వంటి నియమాలను పాటించిన ఆయన కథలు, ఆధునిక కథారచనకు నిఘంటువులుగా నిలుస్తాయి. పాత్రల సంస్కార స్థాయికి మించిన కృత్రిమ సంభాషణలుగానీ, పాత్రచిత్రణను పక్కదారి పట్టించే సుదీర్ఘ ఉపన్యాసాలుగానీ చొప్పించడం చాసోకు ఏమాత్రం ఇష్టం లేదు.

చాసో ఆచరణాత్మక మార్క్సిస్టువాది అయినప్పటికీ, తన

> **చాసో గారి కథాశిల్పాన్ని, సామాజిక దృక్పథాన్ని నిశితంగా సమీక్షిస్తూ ప్రముఖ హేతువాద రచయిత, విమర్శకులు కొడవటిగంటి కుటుంబరావు (కొకు) ఇలా అన్నారు: "చాసో ఈ కథల ద్వారా ఆధునిక జీవితాన్ని వాస్తవ దృష్టితో చూసి, చూపించాడు.**



కథల్లో ఎక్కడా పనిగట్టుకొని ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేయలేదు; సిద్ధాంతాన్ని కథనంలో అంతర్లీనంగా ప్రవహింపజేశారు. మనోవిశ్లేషణకు చెందిన కొన్ని కథలను మినహాయిస్తే, ఆయన మిగిలిన కథలన్నింటికీ అంతస్సూత్రం 'ఆర్థికాంశాలే'. చాసో కథల్లోని ప్రధాన పాత్రలు ఆర్థిక ప్రభావానికి లోనై ఏ విధంగా నలిగిపోయాయో, తద్వారా మానవ సంబంధాలలో ఎటువంటి వికృతులు లేదా మార్పులు సంభవించాయో ఆయన నిశితంగా చూపించారు. మరికొన్ని కథల్లో, మనుషులు సమాజం నిర్దేశించిన అనైతిక విలువలను సైతం ఎటువంటి సందేహం లేకుండా తమ జీవితంలో భాగం చేసుకోవడానికి వెనుక ఉన్న మూల కారణం కూడా 'ఆర్థిక దారిద్ర్యమే'నని చాసో నిరూపించారు.

చాసో పాత్రల నిశ్శబ్దం తిరుగుబాటు లేకపోవడం కాదు, అది వ్యవస్థలోని నిస్సహాయతకు అద్దం పడుతుంది. సమాజంలోని పీడిత వర్గాల, శ్రమజీవుల హక్కుల పట్ల చాసో చూపిన గౌరవమే ఆయనను ప్రజాస్వామ్యవాదిగా నిలబెట్టింది. అదే సమయంలో, సమాజంలో వేళ్ళూనుకున్న ఆర్థిక అసమానతలను తూర్పారబట్టడం ద్వారా ఆయన తన సామ్యవాద (మార్క్సిస్టు) భావజాలాన్ని బలంగా చాటారు.

ఆర్థికపరమైన అంశాలు మానవ జీవితాన్ని ఏ విధంగా శాసిస్తాయో, దారిద్ర్యం మానవ హృదయాన్ని ఎలా సంక్షుభితం చేస్తుందో చాసో తన కథలకు ప్రధాన ఇతివృత్తాలుగా స్వీకరించారు.

చాసో కథలు చాలా సామాన్యమైన, చిన్న వాక్యంతో ప్రారంభమవుతాయి. కానీ ఆ ఆరంభమే పాఠకుడి ఆలోచనల్లో ఒక సరికొత్త కాంతిని ('లైట్' – Light) వెలిగిస్తుంది. ఆయన కథల ముగింపులో ఎలాంటి కృత్రిమ పరిష్కారాలు గానీ, చవకబారు కొసమెరుపులు గానీ ఉండవు. అవి పాఠకుని మనస్సును సుకుమారంగా తాకుతూ, వ్యవస్థపై నిరంతర ప్రశ్నలను రేకెత్తించి ఆలోచింపజేస్తాయి. ఇదే చాసో ముగింపులోని అసలైన శిల్ప ప్రత్యేకత.

చాసో గారి కథాశిల్పాన్ని, సామాజిక దృక్పథాన్ని నిశితంగా సమీక్షిస్తూ ప్రముఖ హేతువాద రచయిత, విమర్శకులు కొడవటిగంటి కుటుంబరావు (కొకు) ఇలా అన్నారు: "చాసో ఈ కథల ద్వారా ఆధునిక జీవితాన్ని వాస్తవ దృష్టితో చూసి, చూపించాడు. ఈనాటి జీవితంలో గల కల్మషాన్ని కడగటానికి అవసరమైన అభ్యుదయ భావాలను పుష్కలంగా అందించాడు. ఎక్కడా తిరోగమనవాదంతో రాజీపడలేదు. కాలస్రష్టగా అభూతకల్పనలు చేయలేదు. తాను ద్వేషించే అంశాలపై హద్దుమీరిన ఆవేశం చూపలేదు. తనకు సానుభూతి ఉన్న విషయాలను అందలాలెక్కి ఊరేగించలేదు."

మహాభారతంలోని ద్రౌపది, భీముడు, ధర్మరాజు మొదలైన పౌరాణిక పాత్రలు మన కంటికి కనిపించనప్పటికీ – మహాకవి తిక్కన తన సహజ వర్ణనా చాతుర్యంతో వారు మన కళ్లముందే సజీవంగా ఉన్నట్లు భ్రమింపజేస్తారు. తిక్కన ఆయా పాత్రలను అంతలా తీర్చిదిద్దడానికి కారణం ఆయన పాటించిన నాటకీయ శిల్పంతో పాటు, 'అల్పాక్షరములలో అనల్పార్థమును' "(తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని) స్ఫురింపజేయడమే". సరిగ్గా అదే శిల్ప రహస్యాన్ని ఆధునిక కథా సాహిత్యంలో చాగంటి సోమయాజులు (చాసో) అద్భుతంగా పునఃసృష్టించారు. చాసో తన కథల్లోని పాత్రల స్వభావాన్ని, వాటి నిస్సహాయ తత్వాన్ని అత్యంత చిన్నచిన్న వాక్యాల ద్వారా పాఠకుల కళ్లముందు ప్రత్యక్షమయ్యే విధంగా వాస్తవీకరించారు. ప్రాచీన నాటకీయ శిల్ప వైశిష్ట్యాన్ని ఆధునిక సామాజిక వాస్తవికతకు అన్వయించిన ఇటువంటి విలక్షణ కథాకథన శిల్పం ఒక్క చాసోకే సొంతం.

మూడు తరాల తెలుగు కథలకు ప్రతినిధిగా, డెబ్భై తొమ్మిది సంవత్సరాల తన జీవితకాలంలో మానవ జీవన విధానాన్ని నిరంతరం పరిశీలించి, కథలకు అవసరమైన ముడిసరుకును సమకూర్చుకున్న విశిష్ట కథకుడు చాసో. ఆయన రాశికన్నా వాసికే అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. సాహిత్య ప్రయాణంలో సుదీర్ఘ విరామాలు తీసుకోవడం వల్ల ఒక దశలో ఆయనను 'విరమించిన కథకుడు'గా భావించినప్పటికీ, అంతర్గతంగా ఆయన నిరంతరం కథా సృజనలో నిమగ్నమైన 'విరమించని కథకుడు' అని చెప్పవచ్చు. చాసో కథాశిల్పం కేవలం తెలుగు

సరిహద్దులకే పరిమితం కాలేదు. ఆయన కథల్లోని సార్వజనీనత, వాస్తవికత వల్ల అవి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక భాషల్లోకి అనువదించబడి ప్రశంసలు పొందాయి. చాసో గారి ప్రసిద్ధ కథ 'బండపాటు' 1986లో "The Fall of the Boulder" పేరుతో 'Panorama' సంకలనంలో అచ్చయింది. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన 'Anthology of Modern Indian Short Stories'లో చాసో కథకు సముచిత స్థానం లభించింది. జర్మనీలో జరిగిన అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో (Book Fair) 'ఏలూరెళ్లాలి' కథ 'Must Visit Eluru' పేరుతో అనువాదమై పలువురి ప్రశంసలు పొందింది. 'Classical Short Stories' సంకలనంలో 'కుంకుడాకు' కథ ప్రచురితమైంది. పీడిత ప్రజల పట్ల చాసోకున్న సామ్యవాద దృక్పథానికి నిదర్శనమైన 'లేడీ కరుణాకరం' కథ 1997లో రష్యన్ భాషలోకి అనువదించబడింది. చాసో కథల్లో చాలా కథలు ఒడియా భాషలోకి కూడా అనువదించబడ్డాయి.

ఆధునిక కథారచనకు నిదర్శనాలుగా నిలిచిన చాసో కథలు విద్యా రంగంలోనూ పాఠ్యాంశాలుగా ప్రాచుర్యం పొందాయి. ఇంటర్మీడియట్ ఇంగ్లీషు సిలబస్‌లో 'వాయులీనం' కథను 'The Violin' పేరుతో చేర్చారు. అలాగే పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మానవతా విలువలను, వాస్తవిక కథాశిల్పాన్ని పరిచయం చేయడం కోసం పదవ తరగతి పాఠ్యపుస్తకంలో 'బొండుమల్లెలు' కథను ఉంచారు. ఉన్నత విద్యా రంగంలో, ఆధునిక వచన రచనా రీతులను పరిచయం చేస్తూ డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (BRAOU) వారు 'ఎందుకు పారేస్తాను నాన్నా?' కథను తమ పాఠ్యాంశంగా పొందుపరిచారు.

చాసో ప్రతిభ కేవలం కథా సాహిత్యానికే పరిమితం కాలేదు. ఆయన నాటకరంగంలోనూ తన ముద్రను వేశారు. ఆయన రాసిన 'మెరుగు' అనే నాటిక 1958లో ప్రతిష్ఠాత్మక రాఘవ నాటకోత్సవాల్లో ఉత్తమ రచనగా బహుమతి పొందింది. కేవలం నాటక కర్తగానే కాకుండా, ఎన్నో ప్రముఖ నాటక కళాపరిషత్తులకు ఆయన గౌరవ న్యాయనిర్ణేతగా (Judge) వ్యవహరించి నాటకరంగ వికాసానికి తోడ్పడ్డారు. అలాగే తన రచనా ప్రస్థానం ఆరంభమైన తొలి దశలో (1940–45 మధ్య కాలంలో) ఆయన పది అద్భుతమైన కవితలను కూడా రచించారు.

సమాజంలోని ఆర్థిక అసమానతలను, మానవ సంబంధాలలోని పతనాలను ఎక్కడా కృత్రిమత్వం లేకుండా వాస్తవికతకు అద్దం పట్టిన మహాకథకుడు చాసో. ఆయన కథలు కేవలం కాలక్షేపానికి పనికొచ్చేవి కావు; అవి పాఠకుడి అంతరాత్మను తట్టిలేపే ఆలోచనాత్మక దీపాలు. ఏకసూత్రత, క్లుప్తత, ఉద్రేకం లేని భావుకత్వం వంటి విశిష్ట శిల్ప లక్షణాలతో తెలుగు కథా సాహిత్య స్వరూపాన్నే మార్చివేసిన చాసో – మహాకవి గురజాడ అడుగుజాడల్లో నడిచి, ఆయన వారసత్వాన్ని అద్భుతంగా అందిపుచ్చుకున్న రెండో తరపు కథకులలో అగ్రగణ్యులు. తెలుగు నేల ఉన్నంతవరకు, మానవతా విలువలు వర్ధిల్లినంతవరకు ఆయన కథలు, ఆయన ప్రదర్శించిన కథాశిల్పం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా వెలుగొందుతూనే ఉంటాయి. ఆయన ఎంచుకున్న మార్గం గురజాడది. కానీ, శిల్ప సృష్టిలో ఆయనది ఒక విలక్షణమైన శైలి. అందుకే, ఆయన

> **మూడు తరాల తెలుగు కథలకు ప్రతినిధిగా, డెబ్భై తొమ్మిది సంవత్సరాల తన జీవితకాలంలో మానవ జీవన విధానాన్ని నిరంతరం పరిశీలించి, కథలకు అవసరమైన ముడిసరుకును సమకూర్చుకున్న విశిష్ట కథకుడు చాసో. ఆయన రాశికన్నా వాసికే అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు**

శిల్పాన్ని మరెవరితోనూ పోల్చలేము; చాసో శిల్పాన్ని కేవలం ఆయనతోనే పోల్చగలం. అటువంటి యుగకర్త, మహాకథకుడు చాసో.

పరామర్శ గ్రంథాలు (Reference Books):

1) చాసో కథలు, చాగంటి సోమయాజులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ – 1988.
2) జననీరాజనం – చాసో స్ఫూర్తి సాహితీ పురస్కార ప్రదానోత్సవ విశేష సంచిక: చాసో స్ఫూర్తి, తిరుపతి, జనవరి 1995.
3) కథాకథనం, కాళీపట్నం రామారావు, స్వేచ్ఛా సాహితీ ప్రచురణ, నాగేంద్ర ప్రెస్, విజయవాడ – 1990.
4) సాంఘిక నవల, కథన శిల్పం – డా.సి.మృణాళిని, తెలుగు పరిశోధన ప్రచురణ – 1988.
5) కథాశిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ – 1995.
6) కథాశిల్పి చాసో, డా.యు.ఎ.నరసింహమూర్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్ – 2001.
7) ఆస్పెక్ట్స్ ఆఫ్ ది నావెల్ (Aspects of the Novel), ఇ.ఎం. ఫార్టర్, ఎడ్వర్డ్ ఆర్నాల్డ్, లండన్ – 1927.



మనిషి రోసిన శిక్ష

మున్నంగి శ్రీనివాస్, హైదరాబాదు
msmsr24@gmail.com

భీతోర్ నదులు పొంగి ఊళ్లను మింగిన వేళ
పసి గుడిసెలు నీటిలో కాగితం పడవలాయె
నిన్న మొన్న వార్త కాదు, ఇది నిత్య వేదన
అటు చూస్తే మయన్మార్, నేల కుంగిన రోదన
చెట్లు కూలె, కొండలు విరిగె, భూమి బీటలు వారె
ప్రకృతి ఉగ్రరూపమా? కాదు, ఇది హెచ్చరికే
వరద నీరు కాదు, మన కన్నీటి ప్రతిబింబమే

భూకంపం కాదు, భూమి గుండె బద్దలైన శబ్దమే
అడిగితే అందరూ అంటారు - ప్రకృతి చేసిందని
కానీ నిజం చెప్పమంటే - మనిషే చేసిందని
అడవిని నరికి మేడలు కట్టిన చేతులే
నది గొంతు నులిమి ఇసుకను దోచిన ఆశలే
ప్లాస్టిక్తో భూమి ఊపిరిని ఆపిన స్వార్థమే
పొగ గొట్టాలతో ఆకాశాన్ని చీల్చిన గర్వమే
భీతోర్ ముంపుకు కారణం వాన కాదు
మయన్మార్ కూలిపోవటకు నేల తప్పు కాదు
తప్పంతా మనిషి తొందరపాటు తెప్రతయానిదే
తరాల భవిష్యత్తును తాకట్టు పెట్టిన దురాశదే
ప్రకృతిని ప్రేమిస్తే అమ్మలా ఒడిలో దాచుకుంటుంది
ప్రకృతిని 'పీడిస్తే' శ్మశానంగా మార్చి శిక్షిస్తుంది
ఇప్పటికైనా ఐను, చెట్టును నాటు, నదిని వదులు
నేలను గౌరవించు, నీటికి దారిని ఇవ్వు
లేకుంటే భీతోర్ కథే ప్రతి ఊరి కథవుతుంది
మయన్మార్ విషాదమే మనందరి భవిష్యత్తవుతుంది

అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజాజీవితం

డాక్టర్ మానమ మునిరత్నం
85009 60100



ఉపోద్ఘాతం :


సాహిత్యం సమాజానికి అద్దం వంటిది. ఒక కాలంలో ప్రజలు ఎలా జీవించారు, ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నారు, వారి ఆశలు, ఆకాంక్షలు ఏమిటి, వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి అనే విషయాలను సాహిత్యం మనకు తెలియజేస్తుంది. ముఖ్యంగా సామాన్య ప్రజల జీవితాలను సాహిత్యంలో ప్రతిబింబించే రచయితలు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడతారు. అటువంటి రచయితల్లో అల్లం రాజయ్య ఒకరు. తెలంగాణ ప్రాంత ప్రజల జీవితం, వారి కష్టాలు, శ్రమ, పేదరికం, సామాజిక అసమానతలు, దోపిడీ, అణచివేత, పోరాటం, చైతన్యం వంటి అనేక అంశాలు ఆయన సాహిత్యంలో బలంగా కనిపిస్తాయి. ఆయన రచనల్లోని ప్రజలు కథను నడిపించే పాత్రలుగా కనిపించడంతో పాటు, తమ కాలంలోని సామాజిక పరిస్థితులను అనుభవించే మనుషులుగా నిలుస్తారు. రైతులు, కూలీలు, కార్మికులు, గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాల జీవితాలను దగ్గరగా పరిశీలించి, సాహిత్య రూపంలో చిత్రించడం ఆయన ప్రత్యేకత.

అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజల జీవితం అనేక కోణాల్లో కనిపిస్తుంది. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం నిలబడే తత్వం, మార్పును కోరుకునే తపన కూడా ఆయన రచనల్లో వ్యక్తమవుతాయి. గ్రామీణ జీవితం, భూసంబంధాలు, శ్రమజీవుల పరిస్థితులు, గిరిజనుల జీవన విధానం, సామాజిక సంబంధాలు, ప్రజల భాష, సంస్కృతి వంటి అనేక అంశాలు ఆయన కథలు, నవలల్లో సహజంగా చోటుచేసుకున్నాయి. అందువల్ల ఆయన సాహిత్యాన్ని పరిశీలించడం అంటే ఒక రచయిత సృజనను అధ్యయనం చేయడంతో పాటు, ఒక నిర్దిష్ట కాలంలో తెలంగాణ ప్రజలు అనుభవించిన జీవితం, సంఘర్షణలు, సామాజిక మార్పులను అర్థం చేసుకోవడం కూడా. ఈ నేపథ్యంలో అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజాజీవితం ఎలా ప్రతిబింబించిందో, ప్రజల సమస్యలు, పోరాటాలు ఆయన రచనల్లో ఏ విధంగా చిత్రితమయ్యాయో ఈ వ్యాసం పరిశీలిస్తుంది.

1. అల్లం రాజయ్య సాహిత్య నేపథ్యం :

అల్లం రాజయ్య సాహిత్యం తెలంగాణ ప్రజల జీవన వాస్తవికతతో విడదీయలేని సంబంధాన్ని కలిగి ఉంది. గ్రామీణ పేదలు, రైతులు, రైతు కూలీలు, కార్మికులు, ఆదివాసీలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలు ఆయన కథలు, నవలల్లో ప్రధాన వస్తువులయ్యాయి. తాను పుట్టి పెరిగిన పల్లె జీవితం, ఉద్యోగరీత్యా కార్మికులతో ఏర్పడిన దీర్ఘకాల అనుబంధం, ఆదివాసీ ప్రాంతాలతో తనకు కలిగిన పరిచయం తన రచనలకు ప్రేరణగా నిలిచాయని రాజయ్య స్వయంగా వివరించారు. “ఆదివాసీ, వ్యవసాయిక, కార్మిక జీవితాలు. ఆ జీవితాల్లోని ఆరాట పోరాటాలు నా జీవితంలో భాగమయ్యాయి.”[1]

అల్లం రాజయ్య రచనల్లో ప్రజాజీవితం కథా వస్తువుకు కేంద్రంగా నిలుస్తుంది. గ్రామీణ సమాజంలోని పేదరికం, భూసంబంధాలు, శ్రమ, ఆకలి, దోపిడీ, అధికార వ్యవస్థల ప్రభావం వంటి అంశాలు వ్యక్తుల జీవితాలతో ముడిపడి కనిపిస్తాయి.



ఈ అనుభవాల ప్రభావం రాజయ్య రచనల్లోని పాత్రలు, వాటి జీవన పరిస్థితుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం, కొమురం భీం, వసంతగీతం, టైగర్ జోన్ వంటి నవలలు, సృష్టికర్తలు, తల్లిచేప, అతడు వంటి కథా సంపుటాలు ఆయన సాహిత్య పరిధిని తెలియజేస్తాయి. ఆయా రచనల్లో తన చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులతో తలపడే మనుషుల జీవితాలను ఆయన కథనంలోకి తీసుకువచ్చారు.

ఈ విధంగా అల్లం రాజయ్య సాహిత్య నేపథ్యాన్ని పరిశీలిస్తే వ్యక్తిగత అనుభవం, ప్రజా ఉద్యమాలు, పల్లె జీవితం, కార్మిక, ఆదివాసీ సమాజాలతో ఏర్పడిన పరిచయం, తెలంగాణ ప్రాంతీయ పరిస్థితులు ఆయన రచనా దృష్టిపై ప్రభావం చూపినట్లు తెలుస్తుంది. ఈ అనుభవ ప్రపంచమే తరువాత ఆయన రచనల్లో శ్రమజీవులు, రైతులు, కూలీలు, గిరిజనులు, స్త్రీలు వంటి వివిధ వర్గాల జీవితాలను చిత్రించడానికి పునాదిగా నిలిచింది.

2. అల్లం రాజయ్య రచనల్లో ప్రజాజీవిత ప్రతిఫలనం :

అల్లం రాజయ్య రచనల్లో ప్రజాజీవితం కథా వస్తువుకు కేంద్రంగా నిలుస్తుంది. గ్రామీణ సమాజంలోని పేదరికం, భూసంబంధాలు, శ్రమ, ఆకలి, దోపిడీ, అధికార వ్యవస్థల ప్రభావం వంటి అంశాలు వ్యక్తుల జీవితాలతో ముడిపడి కనిపిస్తాయి. ఒక సంఘటనను చెప్పడంతో కథనం ఆగిపోదు; ఆ సంఘటన వెనుక ఉన్న సామాజిక పరిస్థితులు కూడా పాఠకుడి ముందుకు వస్తాయి. అందువల్ల పాత్రలు ఎదుర్కొనే వ్యక్తిగత సమస్యలు వాటి చుట్టూ ఉన్న సమాజపు పరిస్థితులతో సంబంధం కలిగి ఉంటాయి. రైతులు, కూలీలు, కార్మికులు తమ జీవన పరిస్థితులను ఎదుర్కొంటూ పొందే అనుభవాలు కథనానికి కదలికను కల్పిస్తాయి.

రాజయ్య కథా ప్రపంచంలో ప్రజల భాషకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. పాత్రల మాటతీరు, స్థానిక పదాలు, నుడికారాలు వారి ప్రాంతపు జీవన పరిస్థితులను సహజంగా తెలియజేస్తాయి. ప్రజలు మాట్లాడే భాషలోనే వారి జీవితాలను చిత్రించడం వల్ల ఆయన రచనల్లో తెలంగాణ ప్రాంతపు సామాజిక వాస్తవికత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో అల్లం రాజయ్య రచనల్లో ప్రజాజీవితం కథకు బయట ఉన్న నేపథ్యంగా కాకుండా, పాత్రల ఆలోచనలు, సంబంధాలు, సమస్యలు, సంఘర్షణలను నడిపించే ప్రధాన అంశంగా కనిపిస్తుంది.

3. అల్లం రాజయ్య సాహిత్యంలో శ్రమజీవుల జీవితం :

అల్లం రాజయ్య సాహిత్యంలో శ్రమజీవుల జీవితం అత్యంత ప్రధానమైన ప్రజాజీవిత కోణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల కార్మికుల జీవితం, వారి పని పరిస్థితులు, యాజమాన్య దౌర్జన్యం, శ్రమ దోపిడీ, సంఘటిత పోరాటం ఆయన రచనల్లో సామాజిక వాస్తవికతతో ప్రతిఫలించాయి. అతడు వంటి కథల నుంచి సైరన్ వంటి నవల వరకు కార్మిక జీవితం ఆయన సాహిత్యంలో నిరంతరంగా కనిపించే అంశంగా ఉంది. సైరన్ నవలలో సింగరేణి కార్మిక వర్గ జీవితం, వారి దుర్భర పని పరిస్థితులు, యాజమాన్య వర్గపు దౌర్జన్యాలు, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం, సంఘటిత చైతన్యం పెరుగుతున్న తీరును అల్లం రాజయ్య చిత్రించారని కాత్యాయనీ విద్మహే పేర్కొన్నారు. ఆమె విశ్లేషణ ప్రకారం "శ్రమ దోపిడీకి విరుగుడు పోరాటమే" అనే భావం సైరన్ నవలలో కార్మికుల అనుభవాల ద్వారా బలంగా వ్యక్తమవుతుంది.

రాజయ్య కార్మికుడి జీవితాన్ని పని, కూలి, పేదరికం వంటి అంశాలకే పరిమితం చేయకుండా, తన శ్రమకు తగిన గౌరవం, జీవించే హక్కు, మెరుగైన పని పరిస్థితుల కోసం ప్రశ్నించే మనిషిగా చిత్రించారు. సింగరేణి జీవితాన్ని చిత్రించిన రచనల్లో వ్యక్తిగత బాధ క్రమంగా సామూహిక అనుభవంగా మారుతుంది. ఒక కార్మికుడి జీవితం చుట్టూ కనిపించే సమస్యలు మరెందరో కార్మికుల జీవితాలతో ముడిపడతాయి. అక్కడి నుంచి సంఘటిత ఆలోచన, హక్కులపై అవగాహన, మార్పు కోసం ప్రయత్నం

ముందుకు వస్తాయి. శ్రమజీవుల జీవితాన్ని ఈ సామాజిక కోణంలో చూడడం రాజయ్య రచనలకు ప్రత్యేకతను ఇస్తుంది.

4. అల్లం రాజయ్య సాహిత్యంలో రైతు, కూలీ జీవితం :

అల్లం రాజయ్య సాహిత్యంలో రైతు, కూలీ జీవితం తెలంగాణ గ్రామీణ సమాజంలోని ఆర్థిక, సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. భూమిని నమ్ముకుని జీవించే రైతు, తన శ్రమను అమ్ముకుని జీవించే కూలీ ఎదుర్కొనే ఆకలి, అప్పులు, భూమిపై అసమాన హక్కులు, శ్రమకు తగిన ప్రతిఫలం లేకపోవడం వంటి సమస్యలు ఆయన రచనల్లో సహజంగా చిత్రితమయ్యాయి. రైతు, కూలీ జీవితాన్ని వారి బాధలతో మాత్రమే పరిమితం చేయకుండా, ఆ బాధల నుంచి పుట్టే ప్రశ్న, చైతన్యం, సంఘటిత భావన, ప్రతిఘటనలను కూడా రాజయ్య తన రచనల్లో ముందుకు తెస్తారు. ఈ దృష్టి కొలిమంటుకున్నది నవలలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల రైతు, కూలీ జీవితాన్ని, వారి కష్టాలను, పోరాటాలను ఈ నవల కథలో భాగం చేస్తుంది. శ్రమజీవుల రోజువారీ జీవితంతో పాటు, తమపై జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి సంఘటితంగా స్పందించే క్రమాన్ని కూడా రచయిత చిత్రించారు. ఈ నవలను పరిశీలిస్తూ సంగ్రామ్, "పోరాట చైతన్య రూపమైన రైతు–కూలి సంఘాల ద్వారా వ్యవస్థనే ఎదిరిస్తోన్న ప్రజా జీవితానికి అక్షరచిత్రం" అని పేర్కొన్నారు.ట

రాజయ్య రచనల్లో రైతు, కూలీ తమ కష్టాలను భరించే వ్యక్తులుగా మాత్రమే కనిపించరు. తమ జీవితం ఎందుకు ఇలా ఉందో ఆలోచించే మనుషులుగా, తమ హక్కులను గుర్తించే వ్యక్తులుగా, అన్యాయాన్ని ప్రశ్నించే సమూహ సభ్యులుగా కనిపిస్తారు. పొలంలో చేసే శ్రమ, కూలి కోసం చేసే పోరాటం, అప్పుల బాధ, భూసంబంధమైన అసమానతలు, గ్రామంలోని అధికార సంబంధాలు ఇవన్నీ వారి జీవిత అనుభవాలతో ముడిపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో రైతు, కూలీ జీవితం రాజయ్య సాహిత్యంలో ఒక సామాజిక వర్గం జీవన వర్ణనగా ఆగిపోదు. శ్రమకు గౌరవం కావాలనే ఆకాంక్ష, జీవించే హక్కుపై అవగాహన, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, సమష్టిగా మార్పును కోరుకునే చైతన్యం ఇందులో వ్యక్తమవుతాయి. రైతు చెమట, కూలీ శ్రమ, వారి మాట, వారి ఆత్మగౌరవం ఇవన్నీ రాజయ్య కథా ప్రపంచంలో ప్రజా జీవితానికి ముఖ్యమైన వ్యక్తీకరణలుగా నిలుస్తాయి. అందువల్ల అల్లం రాజయ్య సాహిత్యంలో రైతు, కూలీ జీవితం శ్రమ నుంచి చైతన్యానికి, వ్యక్తిగత బాధ నుంచి సామూహిక ప్రతిఘటనకు సాగిన ప్రజా జీవన అనుభవంగా నిలుస్తుంది. ఇదే ఆయన రైతు, కూలీ పాత్రల చిత్రణకు ప్రత్యేకతను ఇస్తుంది.

5. అల్లం రాజయ్య సాహిత్యంలో గిరిజన జీవన చిత్రణ :

అల్లం రాజయ్య సాహిత్యంలో గిరిజన జీవితం తెలంగాణ సామాజిక వాస్తవికతలో ఒక ముఖ్యమైన పార్శ్వంగా కనిపిస్తుంది. అడవి, భూమి, జీవనోపాధి, పంట, సమూహ జీవనం, సంప్రదాయాలతో గిరిజనుల అనుబంధాన్ని ఆయన రచనలు ప్రతిబింబిస్తాయి. ప్రకృతితో ముడిపడిన వారి జీవన విధానంలోకి అధికార వ్యవస్థలు, అటవీ అధికారులు, షావుకార్లు ప్రవేశించినప్పుడు ఏర్పడే దోపిడీ, అన్యాయం, అసమానతలు

> **రాజయ్య రచనల్లో రైతు, కూలీ తమ కష్టాలను భరించే వ్యక్తులుగా మాత్రమే కనిపించరు. తమ జీవితం ఎందుకు ఇలా ఉందో ఆలోచించే మనుషులుగా, తమ హక్కులను గుర్తించే వ్యక్తులుగా, అన్యాయాన్ని ప్రశ్నించే సమూహ సభ్యులుగా కనిపిస్తారు.**

కూడా రాజయ్య కథా ప్రపంచంలో భాగమవుతాయి. ఈ కారణంగా గిరిజన జీవితం ఆయన రచనల్లో ఒక సామాజిక వర్గం జీవన చిత్రంగా మాత్రమే కాకుండా, హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవంతో ముడిపడిన ప్రశ్నగా ముందుకు వస్తుంది. ఈ దృష్టికి కొమురం భీం నవల మంచి ఉదాహరణ. అల్లం రాజయ్య, సాహు కలిసి రచించిన ఈ చారిత్రక నవలలో గోండు సమాజ జీవితం, అడవిపై వారి ఆధారపడటం, భూమితో ఉన్న అనుబంధం, అటవీ అధికారుల ఆంక్షలు, షావుకార్ల దోపిడీ వంటి అంశాలు కథలో భాగమవుతాయి. అడవిలో తమ జీవనాధారాలను ఉపయోగించుకునే హక్కు కూడా అధికారుల నియంత్రణకు లోనైన పరిస్థితిని సారంగ పత్రికలోని 'పాఠకచేరి' శీర్షికలో వచ్చిన ఒక సమీక్ష ప్రస్తావిస్తూ, "అడవిలో చెట్టు పుల్లలు విరిచినా వేళ్లు తెగ్గొట్టే జంగ్లాత్తోల్లు ళిఅటవీ అధికారులురి అరాచకాలు" అని పేర్కొంది.4 ఈ వర్ణన గిరిజనులపై కొనసాగిన అధికార దౌర్జన్యాన్ని, వారి సహజ జీవనానికి ఎదురైన అడ్డంకులను స్పష్టంగా తెలియజేస్తుంది.

ఈ పరిస్థితుల మధ్య కొమురం భీం పాత్ర గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. తన చుట్టూ జరుగుతున్న

> అల్లం రాజయ్య కథల్లో మాండలిక భాష ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఎ.కె. ప్రభాకర్, "తెలంగాణ ప్రాంతపు సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం తెలంగాణ మాండలిక కథకు విశిష్టతను సాధించి పెట్టింది" అని పేర్కొన్నారు.



అన్యాయాలను అనుభవించిన భీం, తన ప్రజల జీవన పరిస్థితులను అర్థం చేసుకుని వారి హక్కుల కోసం పోరాడే నాయకుడిగా ఎదుగుతాడు. అతని పోరాటంలో వ్యక్తిగత ప్రయోజనం కంటే తన సమాజపు భూమి, అడవి, జీవన హక్కులకు ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల భీం పాత్ర ఒక వ్యక్తి జీవితాన్ని చెప్పే కథగా కాకుండా, గిరిజన సమాజంలో పెరిగిన సామూహిక చైతన్యానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. రాజయ్య గిరిజన జీవితాన్ని చిత్రించినప్పుడు వారి బాధలను మాత్రమే ముందుకు తేలేదు. ప్రకృతితో వారి అనుబంధం, సమూహ జీవన పద్ధతి, శ్రమ, ఆత్మగౌరవం, తమ జీవన హక్కులను కాపాడుకోవాలనే తపనలను కూడా కథలో భాగం చేశారు. అందువల్ల ఆయన సాహిత్యంలో గిరిజన జీవితం ప్రకృతితో ముడిపడిన జీవన విధానం నుంచి తమ భూమి, అడవి, ఆత్మగౌరవాన్ని కాపాడుకునే పోరాటం వరకు విస్తరించిన ప్రజా జీవన అనుభవంగా నిలుస్తుంది.

6. అల్లం రాజయ్య సాహిత్యంలో స్త్రీల జీవన చిత్రణ :

అల్లం రాజయ్య సాహిత్యంలో స్త్రీల జీవితం కుటుంబం, సమాజం, ఆర్థిక పరిస్థితులు, పురుషాధిక్య సంబంధాలతో ముడిపడి ఉంటుంది. ముఖ్యంగా అట్టడుగు వర్గాల స్త్రీలు ఎదుర్కొనే పేదరికం, శ్రమ, సామాజిక ఒత్తిడి, అవమానం, హింస వంటి అనుభవాలు ఆయన కథలు, నవలల్లో కనిపిస్తాయి. అయితే స్త్రీలను బాధలు అనుభవించే పాత్రలుగా మాత్రమే చూపకుండా, ఆ పరిస్థితులను ప్రశ్నించే ధైర్యం, ఆత్మగౌరవం, చైతన్యం ఉన్న వ్యక్తులుగా కూడా రాజయ్య చిత్రించారు.

ఈ దృష్టికి అగ్నికణం నవలలోని బయ్యక్క పాత్ర మంచి ఉదాహరణ. బయ్యక్క అట్టడుగు వర్గానికి చెందిన స్త్రీ. ఆమె జీవితంలో ఎదురయ్యే అనుభవాల ద్వారా స్త్రీలపై జరిగే శారీరక, లైంగిక అణచివేతను రాజయ్య సామాజిక సమస్యగా ముందుకు తెచ్చారు. బయ్యక్క పాత్ర గురించి ఎ.కె. ప్రభాకర్, "స్త్రీలపై జరిగే అన్ని రకాల అమానవీయ శారీరక హింసనీ అనుభవించిన 'బయ్యక్క' అనే అట్టడుగువర్గ స్త్రీ -- స్త్రీ విముక్తి కోసమే కాదు -- సమస్త మానవాళి విముక్తికోసం ఉద్యమం బాట బట్టడం" అని పేర్కొన్నారు.5 బయ్యక్క పాత్రలో బాధను భరించడం కంటే దాన్ని ప్రశ్నించే స్వభావం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం ప్రధానంగా కనిపిస్తాయి. అందువల్ల అగ్నికణంలోని బయ్యక్క పాత్ర అణచివేతను అనుభవించిన స్త్రీ నుంచి సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించే చైతన్యవంతమైన వ్యక్తిగా ఎదిగిన ప్రజా జీవన అనుభవానికి ప్రతిరూపంగా నిలుస్తుంది.

7. అల్లం రాజయ్య సాహిత్యంలో మాండలిక భాషా ప్రయోగం :

అల్లం రాజయ్య సాహిత్యంలో తెలంగాణ మాండలికం ప్రజల జీవనానికి సహజమైన భాషగా కనిపిస్తుంది. రైతులు, కూలీలు, పల్లె ప్రజలు మాట్లాడే మాటలను ఆయన కథలు, నవలల్లోకి తీసుకురావడం వల్ల పాత్రల జీవితం సహజంగా పాఠకుడి ముందు నిలుస్తుంది. మాండలికం ద్వారా వారి ఆలోచనలు, బాధలు, కోపం, ఆశలు, పోరాటాలు వ్యక్తమవుతాయి. కొలిమంటుకున్నది నవలలో చంద్రం మాటగా వచ్చే "అందరికి ఆడికేస్తన్నం" (అందరినీ నిలదీస్తున్నాం) అనే ప్రయోగం ఇందుకు ఉదాహరణ.6 ఈ మాటలో ప్రాంతీయ భాషతో పాటు, పాత్ర జీవిస్తున్న సామాజిక పరిస్థితి కూడా వ్యక్తమవుతుంది.

అల్లం రాజయ్య కథల్లో మాండలిక భాష ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఎ.కె. ప్రభాకర్, "తెలంగాణ ప్రాంతపు సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం తెలంగాణ మాండలిక కథకు విశిష్టతను సాధించి పెట్టింది" అని పేర్కొన్నారు. అందువల్ల రాజయ్య సాహిత్యంలో మాండలికం పాత్రల మాటతీరుకు మాత్రమే సంబంధించిన అంశం కాదు. అది వారి జీవన అనుభవాలను, సామాజిక నేపథ్యాన్ని, ప్రజా చైతన్యాన్ని పాఠకుడికి దగ్గర చేసే భాష. ప్రజలు మాట్లాడే భాషను సాహిత్యంలో సహజంగా నిలబెట్టడం ద్వారా అల్లం రాజయ్య ప్రజాజీవితానికి ప్రత్యేక స్వరాన్ని ఇచ్చారు.

8. అల్లం రాజయ్య సాహిత్యంలో సామాజిక చైతన్యం :

అల్లం రాజయ్య సాహిత్యంలో సామాజిక చైతన్యం ఒక ముఖ్యమైన అంతస్సూత్రం. రైతులు, కూలీలు, కార్మికులు, గిరిజనులు, పేదలు తమ జీవితాల్లో ఎదుర్కొనే ఆకలి, దోపిడీ, అసమానత, భూమి సమస్య, అధికారుల పెత్తనం వంటి సమస్యలను ఆయన రచనలు చూపిస్తాయి. ఈ సమస్యలు ఎందుకు వస్తున్నాయో ఆలోచించడం, వాటిని ప్రశ్నించడం, తమ హక్కులను తెలుసుకోవడం, కలిసి స్పందించడం వంటి మార్పులు కూడా ఆయన పాత్రల జీవితాల్లో కనిపిస్తాయి. తన రచనా దృక్పథాన్ని వివరిస్తూ అల్లం రాజయ్య, "ఈ సంఘర్షణను భావోద్వేగాలతో అర్థమైనంత మేరకు, శక్తి మేరకు అన్ని రకాల సాహితీ మాధ్యమాల ద్వారా చిత్రించడానికి మిగతా విప్లవ రచయితల లాగే నేనూ ప్రయత్నం చేశాను" అని పేర్కొన్నారు.8

ఈ మాటల ద్వారా ప్రజల జీవితాలు, వారి కష్టాలు, పోరాటాలే ఆయన రచనలకు ప్రధాన ఆధారమని అర్థమవుతుంది. రాజయ్య సాహిత్యంలో సామాజిక చైతన్యం ప్రజల జీవితాల్లోని సమస్యలను గుర్తించడం నుంచి మొదలై, వాటిని ప్రశ్నించే స్థాయికి, తమ హక్కులను తెలుసుకునే స్థాయికి, కలిసి మార్పు కోరుకునే స్థాయికి తీసుకువెళ్తుంది. ప్రజల జీవితాన్ని చెప్పడంతో పాటు, ఆ జీవితంలోని సమస్యలను అర్థం చేసుకుని ప్రశ్నించే ఆలోచనను పెంచడం ఆయన సాహిత్యంలో కనిపించే ముఖ్యమైన లక్షణం.

9. అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజా వాస్తవికత :

అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజా వాస్తవికతకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆయన రచనల్లోని మనుషులు కల్పిత ప్రపంచానికి చెందినవారు కాదు; తమ చుట్టూ ఉన్న పరిస్థితులతో పోరాడుతూ జీవించే సాధారణ ప్రజలు. వారి పని, నివాసం, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సంబంధాలు కథలో సహజమైన భాగాలుగా కనిపిస్తాయి. బొగ్గులు కథ ఇందుకు మంచి ఉదాహరణ. ఈ కథను 1979లో రాసినట్లు, 1981 ఫిబ్రవరిలో అగ్నిపూలు పత్రికలో ప్రచురితమైనట్లు అల్లం రాజయ్య తన కథ నేపథ్యాన్ని వివరిస్తూ తెలిపారు. సింగరేణి ప్రాంతంలోని కార్మిక జీవితాన్ని దగ్గరగా చూసిన అనుభవం ఈ కథకు నేపథ్యంగా మారింది. కార్మికుల పని, బస్తీల పరిస్థితులు, దుమ్ము, దగ్గు, నీటి కొరత, ప్రమాదకరమైన పని, శ్రమకు సంబంధించిన ఒత్తిడి వంటి అనుభవాలు కథలో జీవన వాస్తవాలుగా చిత్రితమయ్యాయి.

కార్మికుల రోజువారీ జీవితాన్ని గుర్తుచేసుకుంటూ రాజయ్య, "సైరన్ కూతతో పరుగులెత్తడం ఏదో భూతం తరిమినట్టుగా ఉండేది" అని రాశారు.? ఈ ఒక్క మాటలోనే పని ప్రదేశంలోని తొందర, భయం, ఒత్తిడి, కార్మికుల జీవన క్రమం వ్యక్తమవుతాయి. ఫ్యాక్టరీలోని పని, కార్మిక బస్తీల జీవనం, శ్రమతో ముడిపడిన శారీరక ఇబ్బందులు, కుటుంబాలపై పడే ప్రభావం, కార్మికుల సంఘటిత జీవితం వంటి అంశాలు ప్రజా వాస్తవికతకు విస్తృతమైన రూపాన్ని ఇస్తాయి. అందువల్ల రాజయ్య ప్రజా వాస్తవికత ప్రజల జీవితాన్ని బయట నుంచి చూసిన వర్ణనగా కాకుండా, వారి పని, బాధ, సంబంధాలు, ఆశలు, పోరాటాల మధ్య నుంచి వెలువడిన జీవన చిత్రంగా నిలుస్తుంది. ప్రజల నిజమైన అనుభవాలను కథా వస్తువుగా మలచడం ద్వారా

కార్మికుల రోజువారీ జీవితాన్ని గుర్తుచేసుకుంటూ రాజయ్య, "సైరన్ కూతతో పరుగులెత్తడం ఏదో భూతం తరిమినట్టుగా ఉండేది" అని రాశారు.? ఈ ఒక్క మాటలోనే పని ప్రదేశంలోని తొందర, భయం, ఒత్తిడి, కార్మికుల జీవన క్రమం వ్యక్తమవుతాయి.

వారి జీవితానికి సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన స్వరాన్ని అల్లం రాజయ్య కల్పించారు.

10. అల్లం రాజయ్య సాహిత్యంలో మానవీయ విలువలు :

అల్లం రాజయ్య సాహిత్యంలో సామాజిక పోరాటాల నడుమ మనుషుల మధ్య ఏర్పడే అనుబంధాలు, పరస్పర సహకారం, ఆత్మగౌరవం, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా అగ్నికణంలోని బయ్యక్క పాత్ర ద్వారా స్త్రీ జీవితంలోని చేదు అనుభవాలతో పాటు, ఆమె వ్యక్తిత్వం, ఆత్మగౌరవం, మానవ సంబంధాల పట్ల ఆమె స్పందనను రచయిత చిత్రించారు. బయ్యక్క పాత్రను విశ్లేషించిన రత్నమాల, "స్త్రీల లైంగిక అణచివేతల మీద సామాజిక రాజకీయ అంతర్గత బహిర్గత సాహిత్య ప్రతిఫలన ఈ నవల" అని పేర్కొన్నారు. (అంటే స్త్రీలపై జరిగే లైంగిక అణచివేతకు సంబంధించిన సామాజిక, రాజకీయ, వ్యక్తిగత సమస్యలు ఈ నవలలో ప్రతిబింబించాయని ఆమె భావించారు.) అలాగే బయ్యక్క పాత్ర "తెలుగు సాహిత్యంలో ఒక శాశ్వత జ్ఞాపకంగా నిల్చిపోతుంది" అని రత్నమాల పేర్కొన్నారు.

బయ్యక్క పాత్రను ఈ దృష్టితో పరిశీలిస్తే, ఆమె జీవితం

> అల్లం రాజయ్య సాహిత్య ప్రాధాన్యం ఇక్కడే ఉంది. ప్రజల జీవితాన్ని సాహిత్యానికి వస్తువుగా స్వీకరించి, వారి అనుభవాలకు విలువనిచ్చి, వారి స్వరాన్ని సహజమైన భాషలో పాఠకుడి ముందుకు తీసుకురావడం ద్వారా ఆయన తెలుగు కథా, నవలా సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారు.



బాధలతో నిండినదిగా మాత్రమే కనిపించదు. ఎదురైన అన్యాయాన్ని ప్రశ్నించే స్వభావం, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలనే ఆత్మగౌరవం, తన చుట్టూ ఉన్న మనుషుల పట్ల స్పందించే స్వభావం కూడా ఆ పాత్రలో కనిపిస్తాయి. అందువల్ల అగ్నికణంలో మానవీయ విలువలు సామాజిక పోరాటానికి దూరంగా ఉన్న అంశాలు కావు; మనిషి గౌరవంగా జీవించాలనే ఆకాంక్షతో ముడిపడి ఉంటాయి. అణచివేతను ఎదుర్కొంటున్న మనిషిలో కూడా ప్రేమ, అనుబంధం, సహకారం, త్యాగం వంటి విలువలు నిలిచి ఉంటాయని రాజయ్య పాత్రల ద్వారా చూపించారు. ఈ విధంగా మానవ గౌరవాన్ని కేంద్రంగా చేసుకున్న దృక్పథం అల్లం రాజయ్య సాహిత్యంలో కనిపించే ముఖ్యమైన లక్షణంగా నిలుస్తుంది.

ముగింపు :

అల్లం రాజయ్య సాహిత్యాన్ని సమగ్రంగా పరిశీలించినప్పుడు, ఆయన రచనలు ఒక కాలానికి చెందిన ప్రజల జీవన అనుభవాలను సాహిత్య రూపంలో నమోదు చేసినవని స్పష్టమవుతుంది. ఆయన కథలు, నవలల్లో కనిపించే మనుషులు సమాజానికి దూరంగా ఉన్న పాత్రలు కాదు; తమ చుట్టూ ఉన్న పరిస్థితులతో ముడిపడి జీవించే సాధారణ మనుషులు. వారి జీవితాల్లోని కష్టాలు, కోరికలు, సంబంధాలు, ఆలోచనలు, ఎదురుదెబ్బలు కథలో సహజమైన భాగాలుగా మారాయి. అందువల్ల రాజయ్య సాహిత్యంలో ప్రజాజీవితం ఒక నేపథ్యంగా మాత్రమే ఉండకుండా, కథను నడిపించే ప్రధాన శక్తిగా పనిచేస్తుంది. ఆయన పాత్రల మాటలు, ప్రవర్తన, నిర్ణయాలు, పరస్పర సంబంధాల ద్వారా ఒక ప్రాంతపు సామాజిక జీవనాన్ని పాఠకుడు దగ్గరగా అర్థం చేసుకోగలుగుతాడు. ఈ జీవన చిత్రణలో కృత్రిమతకు చోటు లేకుండా, ప్రజలు ఎలా జీవించారో, ఎలా ఆలోచించారో, తమ పరిస్థితులను ఎలా ఎదుర్కొన్నారో సహజంగా చూపించడం రాజయ్య రచనల ప్రత్యేకతగా నిలుస్తుంది.

ఈ పరిశీలన ద్వారా అల్లం రాజయ్య సాహిత్యంలో ప్రజల జీవితం స్థిరంగా నిలిచిపోయిన చిత్రం కాదని తెలుస్తుంది. పరిస్థితులను అనుభవించే మనిషి, వాటి గురించి ఆలోచించే మనిషిగా, తన జీవితానికి అర్థం వెతుక్కునే మనిషిగా, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునే మనిషిగా మారుతాడు. ఈ మార్పును చూపించడంలో రాజయ్య రచనలకు ప్రత్యేకమైన సాహిత్య విలువ ఉంది. ఆయన ప్రజల తరపున మాట్లాడటం కంటే, ప్రజల జీవితాన్నే వారి అనుభవాల ద్వారా పాఠకుడి ముందుకు తీసుకువచ్చారు. అందువల్ల ఆయన సాహిత్యం ఒక నిర్దిష్ట కాలపు సామాజిక జీవితానికి దర్పణంగా నిలవడమే కాదు, మనిషి జీవితం, గౌరవం, సంబంధాలు, భవిష్యత్తుపై అతని ఆకాంక్షలను అర్థం చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తుంది.

అల్లం రాజయ్య సాహిత్య ప్రాధాన్యం ఇక్కడే ఉంది. ప్రజల జీవితాన్ని సాహిత్యానికి వస్తువుగా స్వీకరించి, వారి అనుభవాలకు విలువనిచ్చి, వారి స్వరాన్ని సహజమైన భాషలో పాఠకుడి ముందుకు తీసుకురావడం ద్వారా ఆయన తెలుగు కథా, నవలా సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారు. కాలం మారుతున్న కొద్దీ జీవన పరిస్థితులు మారినా, మనిషి గౌరవం, సమానత్వం, న్యాయం, మెరుగైన జీవితం పట్ల ఉన్న ఆకాంక్షలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అల్లం రాజయ్య రచనలు ఒక కాలాన్ని మాత్రమే గుర్తుచేసే సాహిత్యంగా కాకుండా, ప్రజల జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, సమాజాన్ని పరిశీలించడానికి, మనిషి విలువను గుర్తించడానికి ఉపయోగపడే సాహిత్యంగా నిలుస్తాయి. ప్రజాజీవితాన్ని సాహిత్యంలో నిలబెట్టిన రచయితగా అల్లం రాజయ్యకు తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రత్యేకతను ఈ పరిశీలన స్పష్టం చేస్తుంది.

పాదసూచికలు

1. శివరాత్రి సుధాకర్, "ప్రజాపోరాటాలే నా రచనలకు ప్రేరణ: అల్లం రాజయ్య," కొలిమి, కొలిమి సాహిత్య వేదిక, జూన్ 2020.
2. కాత్యాయనీ విద్మహే, "మనకాలపు విప్లవకర కార్మిక శక్తి వికాస చరిత్ర: సైరన్ నవల," కొలిమి, మే 2022.

3. సంగ్రామ్, "ప్రజలకోసం, అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నది' నవల," భూమిక, నవంబర్ 2023, పుట 195.
4. "ఆదివాసీల ఉత్తేజిత ఊపిరి, కొమురం భీం," సారంగ ('పాఠకచేరి' శీర్షిక), 29 అక్టోబర్ 2014. ఈ వ్యాసంలో అల్లం రాజయ్య, సాహు రచించిన కొమురం భీం నవలలో గోండు ప్రజల జీవన పరిస్థితులు, అటవీ అధికారుల ఆంక్షలు, షావుకార్ల దోపిడీ, కొమురం భీం పోరాటాన్ని వివరించారు.
5. ఎ.కె. ప్రభాకర్, "పోరు దారిలో కొండ గుర్తులు, అల్లం రాజయ్య నవలలు," వరవరరావు సంపాదకత్వంలోని అల్లం రాజయ్య సాహిత్యం 1, కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, 2008.
6. అల్లం రాజయ్య, కొలిమంటుకున్నది, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, 2008, పుట 82.
7. కాసుల ప్రతాపరెడ్డి, "అల్లం రాజయ్య కథల్లో సారమా, భాషా..," వన్‌ఇండియా తెలుగు, 8 ఫిబ్రవరి 2013.
8. పాదసూచిక 1 చూడండి.
9. అల్లం రాజయ్య, "బొగ్గులు (కథ నేపథ్యం)," కొలిమి, తెలుగు సాహిత్య అంతర్జాల మాసపత్రిక, ఫిబ్రవరి 2020.
10. రత్నమాల, అల్లం రాజయ్య నవలాసాహిత్యంపై సాహిత్య చర్చ, హైదరాబాద్, 21 మార్చి 2008. ఈ చర్చలో అగ్నికణం నవలలో స్త్రీలపై జరిగే లైంగిక అణచివేతకు సంబంధించిన సామాజిక, రాజకీయ అంశాలు ప్రతిఫలించాయని, బయ్యక్క పాత్ర తెలుగు సాహిత్యంలో శాశ్వత జ్ఞాపకంగా నిలుస్తుందని రత్నమాల పేర్కొన్నారు.

ఆధార గ్రంథాలు :


1. అల్లం రాజయ్య, కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం, సంపాదకుడు వరవరరావు, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, 2008.
2. అల్లం రాజయ్య, సృష్టికర్తలు, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 2011.
3. అల్లం రాజయ్య, సాహు, కొమురం భీం, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, జనవరి 2013.
4. అల్లం రాజయ్య, "బొగ్గులు (కథ నేపథ్యం)," కొలిమి, తెలుగు సాహిత్య అంతర్జాల మాసపత్రిక, ఫిబ్రవరి 2020.
5. ఎ.కె. ప్రభాకర్, "పోరు దారిలో కొండ గుర్తులు, అల్లం రాజయ్య నవలలు," వరవరరావు సంపాదకత్వంలోని అల్లం రాజయ్య సాహిత్యం 1, కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, 2008.
6. కాత్యాయనీ విద్మహే, "మనకాలపు విప్లవకర కార్మిక శక్తి వికాస చరిత్ర: సైరన్ నవల," కొలిమి, తెలుగు సాహిత్య అంతర్జాల మాసపత్రిక, మే 2022.
7. సంగ్రామ్, "ప్రజలకోసం, అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నది' నవల," భూమిక, నవంబర్ 2023, పుట 195.
8. శివరాత్రి సుధాకర్, "ప్రజాపోరాటాలే నా రచనలకు ప్రేరణ: అల్లం రాజయ్య," కొలిమి, తెలుగు సాహిత్య అంతర్జాల మాసపత్రిక, జూన్ 2020.
9. ఎం. వెంకటేశ్వర్లు, కొమురం భీం, పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, మార్చి 2015.
10. రత్నమాల, "అల్లం రాజయ్య నవలాసాహిత్యంపై సాహిత్య చర్చ," హైదరాబాద్, 21 మార్చి 2008.
11. "ఆదివాసీల ఉత్తేజిత ఊపిరి, కొమురం భీం," సారంగ ('పాఠకచేరి' శీర్షిక), 29 అక్టోబర్ 2014.
12. అల్లం రాజయ్య, సైరన్ (సింగరేణి కార్మికోద్యమ నవల), మలుపు బుక్స్, హైదరాబాద్, 2022.
13. కాసుల ప్రతాపరెడ్డి, "అల్లం రాజయ్య కథల్లో సారమా, భాషా..," వన్‌ఇండియా తెలుగు, 8 ఫిబ్రవరి 2013.



"నిశ్శబ్దానికి ఒక చిరునామా"

శైలజామిత్ర
9290900879

రాత్రి గుండెల్లో
నక్షత్రాలు ధ్వనిన వేళ,
నా ఒంటరితనం
ఆకాశాన్ని అడిగింది...
"నాకూ ఒక చిరునామా ఉందా?" అని.
గాలి సమాధానం చెప్పలేదు,
కానీ వెళ్లిపోయిన ప్రతి ఆకు
ఒక జ్ఞాపకాన్ని
నా పాదాల దగ్గర వదిలిపోయింది.
కాలం ఒక నది...
మనల్ని అడగకుండా
మన తీరాలను మార్చేస్తుంది;
నిన్ను మనవారనుకున్నవారు
నేడు అపరిచితులవుతారు.
అయినా...
ఒక చిన్న నవ్వు కోసం
గుండె ఇంకా ఎదురు చూస్తూనే ఉంటుంది,
విరిగిన కలల శిథిలాల్లో కూడా
ఒక ధ్వని మొలుస్తూనే ఉంటుంది.
కన్నీరు కేవలం నీరు కాదు...
మాటలు దొరకని వేళ
మనసు రాసుకునే
అత్యంత విషాదమైన కవిత.
నేను ఇంకా బతికే ఉన్నాను
అంటే అది శ్వాస వల్ల కాదు...
ప్రతి చీకటి వెనుక
వెలుగు ఉంటుందనే
అమాయకమైన నమ్మకం వల్ల.
ఒకరోజు
నా జీవితమంతా వెనక్కి తిరిగి చూసినప్పుడు...
"ఎంత ఏడ్చానో" అని కాదు,
"ఎన్ని తుఫాన్లను దాటి
ఇంకా ప్రేమించగలిగానో" అని
నా మనసే నాకు నమస్కరిస్తుంది.



గురజాడవారితో మధురవాణి

సముద్రాల హరికృష్ణ
99865 59905

"ఎవరదీ, వీధి గుమ్మం దగ్గరా?!", గురజాడ వారు అడిగారు అక్కడేదో అలికిడి అవటంతో!

బాగా పెద్ద ప్రాంగణం.

గురజాడవారున్న మండువా లోంచి, గుమ్మం కాస్త దూరంగా ఉండటంతో, స్పష్టంగా తెలియలేదు, ఆ వ్యక్తి ఎవరో!

అవతలి నుంచి సన్నని కంఠంతో వినబడింది,

"ఆఁ.... నేనే నండీ", అని!

"నేనే నంటే?", వీరి ప్రశ్న!

అప్పుడు సుమారు ఒక ముప్పైలోపే వయసున్న అందమైన యువతి – సంస్కారం, విద్యా గంధం కొట్టొచ్చినట్లు కనబడుతున్న కళతో ముందుకొచ్చి గురజాడ వారికి నమస్కారం పెట్టి, నిలుచుంది.

కళ్ళజోడు సరిచేసుకుంటూ, గురజాడ, "ఎవరమ్మా నీవు, ఈ ఊరేనా?!", అన్నారు 'ఎవరబ్బా' అని మనసులో అనుకుంటూ!

"నేనూ... మధురవాణి నండీ", అన్నది అవతలి కంఠం, ఏమంటారో అన్న ఆదుర్దా, ఉత్సాహమూ రెండూ గొంతులో స్పష్టంగా తెలుస్తుండగా!

"మధురవాణా, మా మధురవాణే... ఎంతాశ్చర్యం! రారా ఇలా వరండాలోకి", అని సాదరంగా పిలిచారు.

ఆమె వచ్చి మొహమాటంగానే వారు చూపించిన, అక్కడే ఉన్న వేగిస బల్ల మీద కూర్చుంది.

గురజాడ వారు తమకు అలవాటైన పడక్కుర్చీలో కూర్చుని ఆమె వంక చూశారు పరీక్షగా.

తల పంకించారు తృప్తిగా.

తను వర్ణించిన స్వభావానికీ, చురుకుదనానికీ తగ్గ రూపం అనుకున్నారు.

"ఏంటమ్మా ఇలా వచ్చావు", అని అడిగారు గురజాడ.

ఆమె కాస్త సంకోచంగానే, "ఏమీ లేదండీ, మీకు నమస్కారాలు చెప్పి నా కృతజ్ఞతలు చెప్పుకు వెళ్దామని వచ్చానండీ.

మీకు శ్రమ కలిగిస్తున్నందుకు మన్నించాలి" అన్నది వినయంగా!

"అయ్యో శ్రమేవుండీ, చాలా సంతోషంగా ఉన్నది, నిన్ను కళ్ళారా చూసేటప్పటికీ.

పాత్ర సృష్టించానే కానీ ఇట్లా సాకారమై రావటం అది ఒక విచిత్రమైన అనుభూతి కల్గిస్తోంది నాకు కూడా!

ఇంతకీ కృతజ్ఞతలన్నావూ, అవి దేనికమ్మా", అన్నారు గురజాడ!

"నన్నొక స్వతంత్రమైన భావాలూ, ఆలోచనా ఉన్న మనిషిగా చిత్రించినందుకు,

కులం ఏదైనా, ఒక నియమం నీతీ అనేది ఎక్కడ ఉన్నా స్వీకార్యమే అన్న ధోరణిలో నన్ను చిత్రీకరించినందుకూ నండీ", అన్నది మధురవాణి తన మనసులోని కృతజ్ఞతా భావమంతా ఉట్టిపడేట్టు!

"సమాజంలో చలామణీలో ఉన్న భావాలకు వ్యతిరేకంగా వెళ్ళి, తగనిది ఏదైనా వెనకేసుకొచ్చానా అనేనా?! నలుగురు నడిచినదెల్లా బాటౌతుందేమో కానీ మంచి బాట కావాలని లేదమ్మా!



"ఓహో, అదా! అదంతా నేను గట్టిగా నమ్మిన విషయమేనమ్మా రాశాను.

నీ ద్వారా చెప్పాను,

మగేవిఁటి ఆడేవిఁటీ; వృత్తి కూడా ఏదైతేనేమి – వ్యక్తిత్వం, నీతీ ఉండాలి అనీ, అవే మనిషిని నిలబెట్టేవీ అని!"

"ఎంత ఆదర్శవంతమైన భావాలు, ఆహా", అనుకున్నది మధురవాణి వారిని గౌరవభావంతో చూస్తూ!

మెల్లగా, సంభాషణ వివిధ విషయాల మీద ముందుకు సాగింది.

★ ★ ★

"కానీ ఒక్క విషయం అడగాలనిపిస్తుందయ్యా మిమ్మల్ని ఈ నాటకం విషయంలో.

అదీ, మీ అనుమతి అయితే అడుగుదామనీ....."అన్నది కాస్త ధైర్యం తెచ్చుకుని మధురవాణి ఓ రెండు నిముషాలు తరువాత.

"సరే అడుగు", అన్నారు గురజాడ గంభీరంగా!

"వేశ్యావృత్తిలో ఉన్న నన్ను ఇంత స్వతంత్రమైన ఆలోచనా, వివేకమూ పరేంగితజ్ఞానమూ ఉన్న ఆడదానిగా చిత్రీకరించారు కదా తమరు, ఏమీ అభ్యంతరాలు ఆక్షేపణలు రాలేదా?!", అన్నది మధురవాణి, సమాధానం కోసం ఆసక్తిగా చూస్తూ!

అప్పారావుగారు ఒక నమ్మకమూ, నిశ్చితాభిప్రాయము ధ్వనిస్తున్న గొంతుతో ఇలా అన్నారు:

"సమాజంలో చలామణీలో ఉన్న భావాలకు వ్యతిరేకంగా వెళ్ళి, తగనిది ఏదైనా వెనకేసుకొచ్చానా అనేనా?!

నలుగురు నడిచినదెల్లా బాటౌతుందేమో కానీ మంచి బాట కావాలని లేదమ్మా!

కంటకాల కంపలూ ఉండొచ్చు మధ్యలో!

రచయితగా నాకు బాధ్యత లేదూ సమాజం పట్ల?!

ఉన్నది.

ఉన్నది కనుకనే, ఒక ఔన్నత్యం కల్పించి, జవమూ జీవమూ, ఒక గుణ సంబంధమైన ఆభిజాత్యమూ ప్రవేశపెట్టాను నీలో.

అదే... అదే... నీ పాత్రలోకి.

ఏ వృత్తి సంక్రమిస్తే అది చేస్తూ నీతిగా ఉండటమే దాని సారం, అదే నీలో చిత్రించాను.

నువ్వు ఏ సన్నివేశంలోనూ నీ వృత్తిని తగ్గించినట్లు కానీ, ఏవగింపో హేయభావమో దాని పట్ల కనబరచినట్లు కానీ ఎక్కడా లేదు.

ఎక్కడ రాబట్టాలో ధనం రాబట్టావు, ఎక్కడ చేతనైన దాన సహాయం చేయగలననుకున్నావో, నిండు మనసుతో చేశావు.

ధనమే ప్రధానమనే దృష్టి లేదు నీలో, ఈ వృత్తిలో సాధారణంగా కనబడే దానికి భిన్నంగా!

అందుచేత పాత్రా నిలబడ్డదీ, చెడును నేనేదో వెనకేసుకొచ్చాననే అపప్రథకు తావూ లేకుండా పోయింది.

మంచితనం ఎక్కడ ఉన్నా స్వీకార్యమే కాదూ?!

వేశ్య అయినంతమాత్రాన సుఖదుఃఖాలతో తేడా ఏముంటుంది?!

ఉండదే.

ఆమెకు కూడా 'మామూలు', మగా ఆడా వ్యక్తులకుండే అనుభూతులు సామాన్యమేగా!

ఆ దృష్టి మనవాళ్ళలో కలిగించాలనే నా ప్రయత్నం.

పైగా నీ చేత చేయించింది గొంతులు కోసే మోసాలేవీ కాదు,

ఒక అమాయక బాలికను ఆపదలో నుంచి కాపాడేందుకు చిన్నపాటి నాటకం.

అంతమటుకు తప్పేం లేదు, సబబే అన్నదే నా ఉద్దేశం.

ముల్లును ముల్లుతో గాక, పూవుతోనా తీస్తాం?

తీస్తే మటుకు వస్తుందా, పూవుకి నష్టం అవటం తప్ప!", అన్నారు గురజాడ!

ఆయన చెప్తూ ఉంటే మధురవాణి శ్రద్ధగా విన్నది.

విని, వీరివి ఎంత ఈ కాలానికి ముందున్న భావాలు అని కూడా అనుకున్నది, గౌరవాదరాలతో!

గురజాడ గారు రెండు క్షణాలు ఆగి, మళ్ళీ ఇట్లా కొనసాగించారు తన భావపరంపర, వినదగ్గ వివేకి తన ఎదురుగా ఉందన్న భావంతో కాబోలు!

"అసలు ఈ వివాహ వ్యవస్థ, వ్యవస్థగా మంచిదేనమ్మా నేనేమీ వ్యతిరేకిని కాను.

తరువాత దూరిన పిదప బుద్ధుల వలనే అరిష్టాలూ, అదీ ఆడవారికి!

గ్రంథసాంగులైన మగవారు బలాదూర్ తిరుగుతూనే ఉంటారు!

ఇంట్లో ఆడవారు మాత్రం కుక్కిన పేన్లల్లే పడి ఉండాలి.

అదీ ఈ వ్యవస్థ దిగజారి చేరుకున్న అట్టడుగు!

ఇదేదో ఛేదించరాని బంధం అంటూ, బోధలూ,

దానిలో నుండి పుట్టుకొచ్చిన బాధలూ!

ప్రధానంగా మానవీయతే నమ్మా మనిషి ఆలోచనకు ఆధారంగా ఉండవలసినది.

సామూహికంగా ఏర్పరచే ఏ ఆచారానికైనా, అలవాటుకైనా అంతే.

ఛాందసంలో కొట్టుకుపోయి, తాము రాసినవాటినే రాళ్ళమీద గీసిన గీతలు చేసేసి, ఆంక్షలు పెట్టటం మహా దారుణం.

అందునా మగవారికొక నీతి, స్త్రీలకు ఒకటీ, ఎంత ద్వంద్వ ధోరణులు మన వాళ్ళలో.

అందుకు కాదూ నీ చేత వాతలు పెట్టించింది, ఆ పంతుళ్ళకీ, అవధాన్లకీ, సమయం చిక్కిందనప్పుడల్లా!",అని చిరునవ్వు నవ్వారు.

మధురవాణి కూడా చిరునవ్వుతో వారి అభ్యుదయ భావాలను ఆమోదిస్తూ, ఇంతటి సంస్కారి కనుకనే నాటకాన్నీ, నన్నూ ఆ తరహాలో మలచ కలిగారు అనుకున్నది మనసులో, కృతజ్ఞత ఉప్పొంగుతుండగా!

గురజాడ వారు ఇంకా ఇలా కొనసాగించారు తన వాదాన్ని–

"అసలు ఈ సమాజంలో ఈ అక్కరకు రాని, కాలు నింపని కడుపు నింపని వేదాంత బోధలు ఆగాలమ్మాయ్.

అందరూ అరిషడ్వర్గాలను అరికట్టి ముక్కుమూసుకుని

సన్యాసులు కమ్మని ఏ శాస్త్రమూ చెప్పదు, చెప్పలేదు.

మనకు గృహస్థాశ్రమం మహా దొడ్డగా చెప్పబడ్డది.

ఎటొచ్చీ అది సజావుగా నడుపుకోలేక, నువ్వు తక్కువ నేనెక్కువా అలానే కుంచిత బుద్ధితో ఆడవారి నణచివేయటం, వల్లమాలిన లాలస వల్లే ఈ అనర్థాలు!

జీవితమూ, సౌందర్యము అన్నీ నిలవవు, అశాశ్వతాలు అనే శుష్కవేదాంతాలు కాదు కావలసినది.

ఆచరణ లేని బోధలు ఎందుకూ? వృథా కాకపోతే!

ఈ జాతిని సత్కర్మ మీద, కృషి మీదా ముందుకు నడిపించాలి కానీ గాలి మాటలతో ఏమి ఉపయోగం?!

అనుభవించాలి, కానీ మితం తెలిసీ, హద్దులెరిగీ!

కళ్ళు మూసుకుంటే కంటి ముందు జరిగే సంగతులు ఆగిపోతాయా, లేనట్లవుతాయా?!

నిజాన్ని ఒప్పుకోలేని మానసిక దౌర్బల్యమూ,

దౌర్భాగ్యమూను ఇది!

అందరూ కాములే, కానీ వేషం మాత్రం శుద్ధ మోక్షకామిది.

ప్రేమ, ప్రణయం ఎంత మోతాదులలో వుండాలో అంత మితిలో ఉంటే, ఏ గొడవా లేదు.

ఆ నియతి తప్పిన దగుల్బాజీతనమే కళ్ళముందు జరుగుతున్నదంతానూ!

ఈ చట్రంలో మగవారి అధికారం కింద నలుగుతున్నది

బానిసత్వంలో స్త్రీలే, అది అందరికీ తెలిసినదే, కానీ ఎవరూ బయటకు అనగూడదు, విడ్డూరం!

విడ్డూరమూ కాదు, బుద్ధి వక్రత!

మధురవాణి కూడా చిరునవ్వుతో వారి అభ్యుదయ భావాలను ఆమోదిస్తూ, ఇంతటి సంస్కారి కనుకనే నాటకాన్నీ, నన్నూ ఆ తరహాలో మలచ కలిగారు అనుకున్నది మనసులో, కృతజ్ఞత ఉప్పొంగుతుండగా!

ఈ చాటు వ్యవహారాల ధోరణి సుతరామూ పనికిరాదు.

మగరాయణ్ణి తను తొక్కే అడ్డదారుల గురించి ఎవరూ ఏమి అనకూడదు, కానీ ఇంటి స్త్రీలు మాత్రం పవిత్రులుగా ఉండాలనుకోవటం కాదూ ఇంతటి వ్యత్యాసాలకూ కారణం.

కనుక, ఇక్కడే ఒక సంఘంగా, మన లోపలికి మనం – తేరిపార చూసుకోవాల్సిన సమయం ఇది."

ఇదంతా చెప్పి ఓ క్షణం ఆపారు గురజాడ,

మధురవాణినే చూస్తూ–

అప్పుడన్నారు, "ఇవన్నీ లోతుగా ఆలోచించే స్థాయీ, పరిణతి నీలో ఉన్నాయనే నమ్మకంతో నీతో చెపుతున్నానమ్మాయ్, సరీగ్గానే బోధ పడుతోందిగా నీకు?!" అని అడిగారు సూటిగా.

మధురవాణి, "అయ్యా చిత్తం అర్థమైతోందండీ.

మీలాంటి పెద్దలు చెప్పే ఓ నాలుగు మాటలు వినే అవకాశం రావటమే నాకొక పాఠం వింటున్న భాగ్యం లాగా అనిపిస్తోందండీ" అన్నది ఆ విశ్లేషణను మెచ్చుకుంటూ!

వివాహ బంధంలో ఉండి దొంగ వ్యవహారాలు నడిపే వ్యక్తులకన్నా-(స్త్రీ గానీ పురుషుడు కానీ-) తన వృత్తి పట్ల నిజాయితీ ఉండి, ఏదో ఆ వృత్తి ధర్మంగా డబ్బు తీసుకోవడమే తప్ప కొంపలు కూల్చే పనులు చేయని నా నాయిక సానిదే అయినా అది ఉచితమే అని నా ఖండితాభిప్రాయం.



"ఎన్ని విన్నా, ఇంకొక సందేహం వేధిస్తుంటుంది స్వామీ", అన్నది మధురవాణి ఇంకో ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలన్న ఉత్సాహంతో.

"ఇంతటి సమర్థులైన రచయితలు కదా, మీరు చెప్పదలచినదీ, ఇంకే విధంగానైనా చెప్పి యుండ కల్గుదురు కదా;

అంతటి ఆంటీనాచ్‌లై యుండికూడా,

నా వంటి ఒక సానిదానిని నాయికను చేసి నడిపించారేమిటా అని!"

"ఆహా, నువ్వే నాయికవి అని నిర్ధారణకు వచ్చేశా వన్నమాట ఈ నాటకంలో!" గురజాడ వారు చిరునవ్వుతో సాగించారు జవాబు–

"సరే అదట్లా ఉంచు.

నీ అసలు ప్రశ్నకు జవాబు ఇదిగో చెపుతున్నా విను.

వివాహ బంధంలో ఉండి దొంగ వ్యవహారాలు నడిపే వ్యక్తులకన్నా – (స్త్రీ గానీ పురుషుడు కానీ–) తన వృత్తి పట్ల నిజాయితీ ఉండి, ఏదో ఆ వృత్తి ధర్మంగా డబ్బు తీసుకోవడమే తప్ప కొంపలు కూల్చే పనులు చేయని నా నాయిక సానిదే అయినా అది ఉచితమే అని నా ఖండితాభిప్రాయం.

వారి లాగా ఆ వివాహ వ్యవస్థకు తూట్లు పొడిచి పలుచన చేయట్లేదే ఆమె!?

ఆ అర్హత చాలదూ, ప్రధాన పాత్ర అయి, కేంద్రబిందువుగా నిలవడానికి!" అన్నారు నిదానంగా.

"మరి మీరు హాస్యధోరణితో, ఒక తేలికదనంతో వ్రాసినట్లనిపిస్తుంది ఈ రచన అన్నవారి మాటా మీ చెవిన పడే ఉంటుంది కదండీ", అన్నది అర్థోక్తిగా మధురవాణి – గురజాడ వారు గుప్పించిన హాస్యపు తీపికారపు పలుకులను తలుచుకుంటూ!

"నిజమే ఈ శైలి ఎన్నుకోవటానికీ కారణం మరింకేమీ లేదు,

నాలుగు చురకలంటిస్తే కానీ విషయం బుర్రకెక్కదన్న ఉద్దేశమే!

ఆ మాటో, ఆ వాక్యమో వినగానే నవ్వు రావచ్చు కానీ,

దాని వెనుక కొన్ని సందర్భాల్లో ఒక ఆవేదనో, తరచూ ఒక హెచ్చరికో, ఇంత నీతిమాలిన బుద్ధులేమిటీ అన్న ధర్మాగ్రహమో గోచరించక పోదు, నీ వంటి సూక్ష్మగ్రాహులకు.

నిజానికి నేనొక గంభీరమైన తత్త్వం కల మనిషిననే నన్నెరిగిన వారు అనుకునేమాట! అనుకోవటమేమిటీ, నిజమే అది!

నా మీసాలు చూసి కూడా అనుకుంటారేమోలే", అని నవ్వారు గురజాడ.

మధురవాణి, "ఏది ఏమైనా మా బోటి వారికి మాత్రం మార్గదర్శకులైన సత్పురుషులూ, మేధావులూనూ" అన్నది తను నిజంగా మనసులో అనుకున్న విషయమే, సందర్భోచితంగా!

★ ★ ★

"అన్నట్టు కవిగారూ, మీకు ఈ కన్యాశుల్కం దురాచారం మీద రాయాలి అని అనిపించటానికి బలమైన కారణమేదైనా ఉన్నదా, తెలుసుకోవచ్చా?!", అడిగింది మధురవాణి, సంభాషణను మరో వైపుకు మళ్ళిస్తూ!

"అది సరే చెపుతాను కానీ, నేను వ్రాసినదీ నాటకమైతే, 'కవిగారూ' అని పిలిచావేం", అన్నారు గురజాడ చిరునవ్వుతో

"మా చదువుకోని వాళ్ళకి మీ బోటివారు ఎవరు, ఏది రాసినా 'కవిగారు' అనటమే పరిపాటండీ.

ఏదైనా మీ బుర్రలో, మీ తెలివిలో నుంచి పుట్టినది రాస్తేనే కద, అందరికీ అందేదీ!",అన్నది జవాబుగా!

ఆమె సరళతకు సంతోషించారు గురజాడ గారు.

"సరే, ఈ రచనకు కారణం అన్నావు కదూ....

ఈ కన్యాశుల్కం రాయటానికి నేను చూసిన అనేక సన్నివేశాలూ సందర్భాలూ కారణం అయినాయి.

నిజానికి అందులో నేను చూసిన ఒక వివాహమే, నా చేత కలం పట్టించి ఆరంభం చేయించింది అనవచ్చేమో!

యాభై ఏళ్ళ ఒక జమీందారు గారికి ఒక పన్నెండేళ్ళ పాపాయి నిచ్చి చేసిన పెళ్ళి అది.

అది మా నాన్నగారితో వెళ్ళి చూసినది –

అందులో ఏదో అసంబద్ధతా, అన్యాయమూ నాకు బలంగా

తోచాయి.

పైగా విజయనగరం రాజావారు ఒక సర్వే చేయించారు, దీని ప్రథమ ముద్రణకు కొన్నేళ్ళ ముందర, సుమారు 1880-90లలో అనుకో.

బ్రాహ్మణ వివాహాల్లో కన్యాశుల్కం తీసుకుని జరిగిన వివాహాల గురించి. ఒక మూడేళ్ళ నిడివిలో, సగటున ఏడాదికి 345 దాకా అట్టివి జరిగాయని తెలిసింది.

అయిదేళ్ళ ఆడపిల్లల దగ్గర్నుంచి పుట్టబోయే - అంటే గర్భంలో ఉండే శిశువు వరకు బేరాలు కుదుర్చుకున్న సంఘటనలు వెలికి వచ్చాయి.

బయానాలు కూడా తీసుకునేవారట తండ్రులు, ఇదిగో నాకు పుట్టబోయే అమ్మాయికి ఇంత రొక్కం ఇస్తే ఆ పిల్లను నీకిచ్చి పెళ్ళి చేయిస్తానని ఒప్పందం.

తలుచుకుంటే ఈ నాటికీ ఒంటి మీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్న అనుభూతి కలిగే విషయాలు.

మనిషై పుట్టినవాడు సిగ్గుతో తలదించుకోవాల్సిన దారుణమైన విషయాలు.

ఇవన్నీ కలసి తరువాత కారణభూతాలైనాయి, ఈ రచనకు." అన్నారు గద్గదమౌతున్న గొంతుకతో గురజాడ వారు.

వారి గుండెలో ఎంత ఆవేదన గూడు కట్టుకుంటే ఇటువంటి రచన చేశారో మధురవాణికి బాగా అర్థమైంది ఈ ఆశ్చర్యకరమైన విషయం విని.

ఈ నాటకం ఏదో పైకి హాస్యంగా వేళాకోళంగా వ్రాసినట్లనిపించినా, దీని వెనుక ఒక మహాప్రయోజనం ఆశించే వారు వ్రాశారని, జాతిని జాగృతం చేయాలి తన రచన ద్వారా అనే మహోద్దేశంతో వ్రాశారనీ ఆమెకు బాగా అవగతమైంది.

అయితే మధురవాణికి అనుమానం వచ్చింది, మరి ఆ పుట్టినది ఆడపిల్ల కాకపోతే....అని!

అదే విషయం, అడగనూ అడిగింది గురజాడ వారిని.

దానికి ఆయన "అదేనమ్మా, అంత ధనలుబ్ధులైపోయారు తండ్రులు, ఏ గడ్డి మేయటానికైనా సిద్ధమైపోయి.

ఆ డబ్బు ఇంక తిరిగి ఇవ్వటం అనే ముచ్చటే లేదనుకో!" అన్నారు ముక్తాయిస్తూ!

రెండు నిముషాలు గడిచాయి, మౌనంగా!

కాస్త ఆ ఆలోచనా స్రవంతిలో నుంచి తేరుకుని గురజాడ వారే మళ్ళీ అన్నారు:

"సంఘ ప్రయోజనం ఆశించే ఏ రచయిత అయినా తన ప్రథమ కర్తవ్యంగా భావించవలసినది కాదూ -

ఈ దారుణాన్ని నలుగురి దృష్టికీ తీసుకురావటం!

అది సాహిత్య రచనల ద్వారానే జరగాలి.

కాకపోతే మన దగ్గర చదువుకున్న వారి సంఖ్య తక్కువ కాబట్టీ, అందరూ చూడ కలిగేది నాటకం కాబట్టి,

నేను ఆ ప్రక్రియ నెన్నుకుని ఈ కన్యాశుల్క నాటకం వ్రాశానమ్మా!

మరి సామాన్యుల బుర్రలోకి వెళ్ళాలంటే మామూలుగా మాట్లాడుకునే భాషేగా ఉండాలి కనుక అదే ఎన్నుకున్నాను.

సరళమైన వాడుకభాష!

దీనితో ఏదో బ్రహ్మాండం బద్దలైపోయే ప్రమాదమనీ, భాష పలుచనై విషయం తేలికైపోతోందనీ గునిసిన వారూ, ధ్వజమెత్తిన వారూ లేకపోలేదు.

మన లక్ష్యం జనహితకరం.

అందుకని ముందుకు వెళ్ళడమే అని నమ్ముకుని అదే పని చేశాననుకో, ఈ విషయంలో!

బయానాలు కూడా తీసుకునేవారట తండ్రులు, ఇదిగో నాకు పుట్టబోయే అమ్మాయికి ఇంత రొక్కం ఇస్తే ఆ పిల్లను నీకిచ్చి పెళ్ళి చేయిస్తానని ఒప్పందం. తలుచుకుంటే ఈ నాటికీ ఒంటి మీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్న అనుభూతి కలిగే విషయాలు.

ఏదో కాస్త జనరంజకత్వానికి ఇంత హాస్యమూ, నసాళానికి అంటడానికి ఇంత వ్యంగ్యమూ కలిపి వండి వార్చాను, నాకు తోచిన రీతిలో.

ఒక్క విషయం గమనించాలమ్మా ఇక్కడ.

ఏదో ఇంత చమత్కారమైన మాట వైనమూ, ఇంత గడుసుదనమూ, హాస్యపు పోకడా, నీ పాత్రలో మొదటి నుంచీ ఉన్నంత మాత్రాన, ఈ వృత్తిలో ఉన్న ఒకే కారణం వల్ల -

ఒక తేలిక భావం ఏర్పరుచుకోవటం ఏమి న్యాయం?!

ఎద సౌకుమార్యమూ, కరుణా, మంచి వైపుకి మారాలనే కోరికా నీ వంటి వారిలో ఉండకూడదని లేదే!

ఈ పరిణతి క్రమంగా నీలో వచ్చినట్లు చిత్రించడం కూడా కొంతమందికి నచ్చినట్లు తోచదు.

సరే, 'లోకో భిన్న రుచిః' అన్నారు కాదూ, అందుకని వీరి అభ్యంతరాన్ని పెద్దగా గణించ నవసరం లేదనుకోవచ్చును!

జీవితాన్ని లోతుగా చూడాలంటే ఎంత కంఠదఘ్నంగా మునిగి

> ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం ఇవీ నీలో పొదిగిన లక్షణాలు. ఒక స్త్రీ పురుషాహంకార నియమాల కింద అణిగిపోకుండా తన వ్యక్తిత్వం నిలబెట్టుకుంటూ మనుగడ సాగించే నవీన యుగపు స్త్రీగా నిన్ను కల్పన చేశాను.



లీనమై పనులు చేయాలో, అంత నిర్లిప్తతా అలవరచుకోవాలి మరి.

అనుభవాలను ఆలోచనతో మథించే జీవి కదా మనిషి, రెంటినీ సమన్వయిస్తూనే సాగించాలి

బతుకునావను, అసలు విజయాన్ని అతను గుర్తించాలంటే!

లేదో ఏ కోణం నుంచి వచ్చిందో కూడా తెలియని తరంగం ఒకటేదో, తనతో పాటే కలిపేసుకోదూ!

దీనికి హాస్యం బాగా ఉపకరించే బలమైన సాధనం. అందుకూ వాడుక భాషతో హాస్య స్ఫోరకంగానే చేసిన ప్రయత్నమిది.

దాని పాలు నీ సంభాషణల్లో, నీ ప్రకృతిలోనే ఉన్నట్టు చేశాను.

అది నీకు గుణమే కానీ, వేరే కాదని నా అభిప్రాయం!

విద్యాగంధమూ, కళాసురభిళమూ ఉన్నదానివీ, పైగా లోక వృత్తం తెలిసినదానివి – ఆ మాత్రం చమత్కార వచోవైఖరి కలిగి ఉండటంలో ఏమి ఆశ్చర్యం ఉంది?!

అంతే తప్ప ఎటువంటి తృణీకారభావం కానీ, జీవితాన్ని చులకన చేయటం కానీ నా భావనలో కానీ, ఈ రచనలో కానీ లేశమంత కూడా లేదు.

అది జనం మెచ్చారు, చర్చ చేశారు చేస్తున్నారూ – అంతవరకు సంతోషమే!

ఏది ఏమైనా, ఇట్లాంటి జాడ్యాలు అంత తేలిక కాదమ్మా వదిలించడం!

ఏళ్ళూ పట్టవచ్చు, తరాలే పట్టవచ్చు.

కానీ ఒక్కమాట చెప్పవచ్చు.

రాబోయే కాలం స్త్రీలదేనమ్మా!

వారే చక్రం తిప్పుతారు, సంఘ దిశనూ, గతినే మార్చే స్థాయికి వస్తారు.

ఇది నా ఆశే కాదు, మహా గట్టి విశ్వాసం కూడా!",

ఒకింత ఆవేశంగా తన సమాధానం ముగించారు గురజాడ వారు, మధురవాణి శ్రద్ధగా వింటుంటే!

"నాకు మీ ఊహాపోహలకు ఆశ్చర్యం కలుగుతుందయ్యా!

ఆలోచించిన కొద్దీ మీ కల్పనా చాతురికి అబ్బుర పాటూ, ఆనందమూ కూడా కలుగుతుంటాయి.

ఒక మగ పెళ్ళికూతురు, అబద్ధపు ఆత్మహత్య,

అదే దయ్యమైపోవడమూ, ఆ లేని దెయ్యాన్ని

సీసాలో పెట్టి బిరడా వేయడమూ....ఆహా నవ్వులతో

నాటక శాల నిండిపోవటంలో వింతేమున్నది స్వామీ!"

"ఆ గ్రంథం సాంతం నడపడంలో నీదేగా వ్యూహమూ, ముఖ్య పాత్రా...",అన్నారు గురజాడ!

మధురవాణి కాస్త సిగ్గుపడుతూ, "అయ్యో, అంతా మీ చలవేనండీ, నాదేమున్నది ఇందులో", అన్నది తృప్తిగా!

ఆత్మీయుల దగ్గర మనసు విప్పి మాట్లాడే వైనంలో, గురజాడ వారు తమ అంతరంగం వివరించారు, తన కళ్ళ ముందున్న తన సృష్టి, తన అభిమాన పాత్ర మధురవాణితో...

"నిన్ను నా ఆశయ ప్రతిరూపంగా తీర్చి దిద్దానమ్మా!

రాబోయే ఆధునిక స్త్రీ చైతన్యానికి సాకృతివి నీవు –

అని నా విశ్వాసం.

ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం ఇవీ నీలో పొదిగిన లక్షణాలు.

ఒక స్త్రీ పురుషాహంకార నియమాల కింద అణిగిపోకుండా తన వ్యక్తిత్వం నిలబెట్టుకుంటూ మనుగడ సాగించే నవీన యుగపు స్త్రీగా నిన్ను కల్పన చేశాను.

ఒడిదుడుకులు ప్రతి స్త్రీ జీవితంలో వస్తాయి, వివాహిత కానీ, కాకపోనీ, మీ లాంటి వారిలా ఈ వృత్తిలో ఉండనీ –

వాటిని ఎదుర్కొని నిలబడటంలోనే ఆడవారు సకారాత్మకంగా మారాలి.

కల్లబొల్లి మాటలు చెప్పే గిరీశాల, రామప్పంతుళ్ళ

మోసకారితనమూ, డొల్లతనమూ బయటపెట్టి ఎండగట్టే మధురవాణులు కావాలి ఈ సమాజానికి!

తగిన బుద్ధి చెప్పు కలిగే మనోధైర్యమూ, సమయస్ఫూర్తీ అలవర్చుకోవాలి, సాధించాలి.

ఇది ఎవరి కోసమో కాదు, ఒక స్త్రీ తన కోసమే చేసే

పోరాటంలో భాగంగా!

ఇదీ, అచ్చమైన ఆత్మోద్ధరణ!

ఈ జీవన వేదానికి సాటి ఏ వేదాంతబోధలూ రావు, రాలేవు కూడా!

జీవితం సత్యం!

పోరాటం చేయాలన్నదీ సత్యమే!

మహిళలకు అది మరీ అవసరమన్నదీ వాస్తవమే!

కళ్ళు మూసుకుని లేవనుకుంటే పోయేవి కాదు సమస్యలు, ఎదుర్కొని జీవించాల్సిందే!

దానికి తగ్గ మనోధైర్యం పెంపొందించుకోవాలి అందరూ నీ వంటి మహిళలను చూసి, అనేది నా ఆశయం!

పోరాటం చేసే ఖలేజా చూపించావు, మానవత్వమూ;

దయ, కారుణ్యమూ చూపావు అవసరమైనచోట.

పసిపిల్ల సుబ్బి పెళ్ళి తప్పించావు సాహసించి, బుచ్చమ్మ విషయంలో సానుభూతి చూపావు, సహాయం చేశావు, మానవత్వం ప్రదర్శించి.

చివరకు, ఆ లుబ్ధుడైన అవధాన్లకు మరణశిక్ష తప్పించావు, ఆ కరటకశాస్త్రికి జైలు శిక్షను కూడా.

కారుణ్యమూర్తివి!

హక్కులపై పోరాడిన, అదీ తెలివిగా గడుసుగా, చాకచక్యంగా – లోకం పోకడ తెలిసి – పోరాడి నెగ్గిన నాయికవే నువ్వు, నా దృష్టిలో.

నీలోని ఈ చైతన్యాన్ని అందరూ స్త్రీలూ అందిపుచ్చుకుని

భావి కాలంలో అభివృద్ధి సాధిస్తారనీ, సాధించాలనీ, నా ప్రగాఢమైన ఆశ.

సమస్యలు వేరువేరు కావచ్చు, పోరాటపటిమ అనేది ఒకటి ఉంటే, గట్టెక్కటం ఖాయం, నెగ్గుకు రావటమూ ఖాయమేనమ్మా!

చివర్లో, తన అనుకోదగ్గ ఒక్క మనిషి అచ్చపు ప్రేమ కోసం నీ తపన అంతా తేటతెల్లం చేశావు కదమ్మా!

భర్తకు పొలంలో సాయం చేసే మనిషిగా పుట్టినా, జీవితాంతం ఓ రక్షణా, కాపుదలైనా దొరికేవేమో అంటూ!

మధురవాణీ! ఈ నాటక రచయితగా చెప్తున్నానమ్మా,

నా మనసులోని మాట ఇదే –

నువ్వే ఈ నాటకానికి నిజమైన ప్రాణశక్తివీ, జీవశక్తివీ!

కథలో పురుష జంబుకాలకు చిక్కులు కలిగించి నీ స్థానం నువ్వు నిలబెట్టుకునేట్టు చేయాల్సిన పరిస్థితిలో, ఆ పని చేసినదీ;

చిక్కుముడి విప్పాలన్నప్పుడు తెలివిగా దాన్ని విప్పినదీ కూడా నువ్వే ఈ నాటకంలో!

రెండూ నీ ద్వారానే జరిగాయి"

ఏకబిగిన తన దృఢమైన అభిప్రాయాలు చెప్పారు స్త్రీలు ఉన్న స్థానం మీద, తాను వారుండాలని ఆశిస్తున్న స్థానం

గురించీ, స్త్రీ హక్కుల గురించీ, స్త్రీ స్వాతంత్ర్యం గురించీ!

అంతా విని మధురవాణి కాస్త చనువు ఏర్పడటంతో గురజాడవారిని గురించి తన అభిప్రాయమూ చెప్పటం ఆరంభించింది:

"అయ్యో చేసిన కృషీ, వాడిన మేధస్సూ మీవై ఉండగా, నాకు ఆ గొప్పదనం ఆపాదిస్తున్నారయ్యా, అంతే.

మీది విశాల హృదయమూ, బహు ఉదారబుద్ధీని!

ఎంతోమంది ఎన్ని రకాలుగా అపవాదులు పుట్టించినా మీరు నమ్మిన వాటి మీద దృఢంగా నిలబడ్డారు. ఈర్ష్యాళువులై విమర్శించిన వారిని క్షమించి మిన్నకున్నారు.

రచయితలను, వారి భావదారిద్ర్యమే సమకాలీన సమాజ సమస్యల మీద రాయనీయకుండా ఉంచిందని భావించారు

హక్కులపై పోరాడిన, అదీ తెలివిగా గడుసుగా, చాకచక్యంగా– లోకం పోకడ తెలిసి– పోరాడి నెగ్గిన నాయికవే నువ్వు, నా దృష్టిలో.

నీలోని ఈ చైతన్యాన్ని అందరూ స్త్రీలూ అందిపుచ్చుకుని

భావి కాలంలో అభివృద్ధి సాధిస్తారనీ, సాధించాలనీ, నా ప్రగాఢమైన ఆశ.

కాబట్టి, మీరే ఆ అడుగు ముందుకేసి ఈ నాటక రచనకు పూనుకున్నారు.

నిరసించే కూటమిలో నుంచుని ఎవరినీ ద్వేషించకుండ నిలిచి, మీరనుకున్న మంచి చేసిన స్థితప్రజ్ఞులే మీరు నిస్సందేహంగా, నా దృష్టిలో.

ఈ భావమే నాకు మా యావత్తు ఆడవారి పక్షాన మీకు నమస్సులూ, కృతజ్ఞతలూ చెప్పుకునేట్టు చేస్తున్నాయని మరొక్కసారి విన్నవించుకుంటున్నాను, స్వామీ!

ముఖ్యంగా స్త్రీల పట్ల, వైవాహిక బంధాలలో, దాంపత్య జీవనాలలో స్త్రీల అణచివేత, వారి విషాదమూ మిమ్మల్ని బాగా కదిలించినట్లు అనిపిస్తుంది.

అందుకే,

నేను ఈ మాట అనడానికి అర్హురాలిని కాదని లోకమంటుందని తెలిసినా,

లోకమెందుకు మా స్త్రీలే అంటారని తెలిసినా మనసులోని

మాట చెపుతున్నాననయ్యా –

ఇటువంటి మీ ధర్మబుద్ధికి మా స్త్రీ జాతి తరఫున, నేను మీకు పాదాభివందనం చేస్తున్నాను.

నేడు నాకొక సుదినం.

మీ వంటి మహాత్ములను కలిసి మీ మాటలు వినే భాగ్యం కలిగింది నాకు.

మీ మాటల్లో స్త్రీల పట్ల ఎంత సానుభూతి, ఎంత ప్రోత్సహించే నైజం!

వారు ఎట్లాగైనా ఆలోచనలో ధైర్యం అలవరుచుకుని, మానసిక పురోగతి సాధించాలని గట్టిగా కోరుకున్నారు",

మధురవాణి మనసులోని భావాలు స్పష్టంగా చెప్పి ముగించింది.

ప్రసన్నత ఆవహించిన మనసుతో గురజాడ వారన్నారు:

"ఒక్క మాట చెపుతానమ్మా, స్పష్టంగా.

సమాజాన్ని అప్రతిష్ఠ పాలు చేసే ఆ పరిస్థితిని ప్రజల కళ్ళ ఎదుట పెట్టి, నైతిక భావాల ఉన్నత ప్రమాణాన్ని ప్రాచుర్యానికి తేవడం కంటే సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేదీ లేదమ్మా!

ఇదే నా ఖచ్చితమైన అభిప్రాయం, సమాజానికీ సాహిత్యానికీ మధ్యనున్న సంబంధం గురించి.

నా శాయశక్తులా నేను చేసిన ప్రయత్నం ఇదే, ఈ రచన ద్వారా కూడా!"

★ ★ ★

"ఇక వెళ్ళొస్తానండీ", అన్నది సుమారు రెండుగంటల పాటు గురజాడ వారితో మాట్లాడిన తరువాత, మధురవాణి.

"మంచిదమ్మా శుభం", అని, "ఒక్క క్షణం ఉండు" అని లోపలకు వెళ్ళారు.

మళ్ళీ ఐదు నిముషాల్లో తన శ్రీమతితో సహా బయటకు వచ్చారు.

"మా ఆవిడ", అన్నారు గురజాడ.

మధురవాణి కాస్త తడబాటుతో ఎంతో మర్యాదగా ఆమె కాళ్ళకు నమస్కారం పెట్టింది.

ఆమె కూడా సాదరంగా చూస్తూ, చీర రవికె పండుతాంబూలం ఇచ్చింది కుంకుమ భరిణె అందిస్తూ.

ఆ మర్యాదలు కొత్తే అయినా అబ్బుర పడుతూ స్వీకరించింది మధురవాణి.

"ఇక వస్తాను స్వామీ", అని గురజాడ వారికీ, అట్లాగే వారి సతీమణికీ చెప్పి సెలవు తీసుకుంది మధురవాణి.

గురజాడ గారి శ్రీమతి పనుందని వెళ్ళిపోయారు ఇంటి లోపలకి.

ఆమె వెళ్ళిన అయిదు నిముషాల పాటు అక్కడే నుంచున్నారు గురజాడ వారు, ఏదో ఊహాలోకంలో ఉన్నట్టు!

ఎంత పరమాశ్చర్యకరమైన సన్నివేశం జరిగిందీ అనుకుంటూ!

లోపలకు వెళ్ళగానే, "ఇందాకా అడిగావుగా, 'ఎవరండీ ఆమె' అనీ, ఇప్పుడు చెపుతున్నా విను.

మన కన్యాశుల్కంలోని మధురవాణి ఆ వచ్చింది, నమ్ముతావా", అన్నారు నవ్వుతూ.

శ్రీమతి గారు కూడా ఆఁ అంటూ ఉండిపోయారు తమ వంతు ఆశ్చర్యం వ్యక్తపరుస్తూ, వేళాకోళం కాదు కదా అని అనుకుంటూ!

★ ★ ★

గురజాడ వారికి మెలకువ వచ్చింది.

పడక్కుర్చీలోంచి మెల్లగా లేచి, తనకు వచ్చిన విచిత్రమైన కలను తలచుకుని నవ్వుకున్నారు!

"సరిసరి, కలలోనా ఇంత సంభాషణా జరిగింది", అనుకున్నారు ఉత్సాహంగా!

దివాణం నుంచి వచ్చి భోజనం చేసి ఒక అరగంట విశ్రమించటం వారికి కొన్నేళ్ళుగా అలవాటు.

ఆ వేళా అదే చేశారు, ఆ నిద్రలోనే ఈ అపూర్వమైన సమావేశం జరిగిందన్నమాట, స్వప్న లోకంలో.

రచయిత సృష్టించిన ఒక పాత్ర ఆకారం దాల్చి ఆ సృజనకారుడితో మాట్లాడింది.

"ఎంత ఆశ్చర్యం – తను సృష్టించిన పాత్రే, మధురవాణి, తనకు కలలో కనబడటం!" – అనుకున్నారు, శ్రీ గురజాడ వేంకట అప్పారావు గారు, ఆ పాత్రతో ఏదో అవ్యాజమైన అపేక్షతో, అనుబంధంతో!

ఒక ఆనందపు హేల కనబడ్డది, కాస్సేపటి తరువాత – కళ్ళజోడు సర్దుకుంటూ, ఏదో ఇంగ్లీషు పుస్తకం చదవటం ఆరంభించిన ఆయన ముఖంలో!

దాని అట్ట మీద ఈ అక్షరాలు కనబడ్డాయి స్పష్టంగా అచ్చై:

"The future belongs to Women!"

★ ★ ★

కవిదీ నాటకకర్తదీ ఒక విలక్షణమైన మానసిక ప్రపంచం.

అందులో వారి వ్యక్తిగత జీవితంలోని మనుష్యులే కాదు మెలిగేది; వారితో సమాంతరంగా భావనావిశ్వంలో, వారు సృజన చేసిన పాత్రలు కూడా తిరుగాడుతుంటాయి కాబోలు!

అందుకే గురజాడ వారికి బహు ప్రీతిపాత్రమైన పాత్ర, మధురవాణి – కలలోకి వచ్చి ఆత్మీయమైన సంభాషణ చేసి వెళ్ళినట్లున్నది.

భావనాకాశంలో విహరించే మానస రాజహంసకు అవరోధాలేముంటాయీ, అవధులేముంటాయీ?!

అది ఒక అచ్చమైన స్వేచ్ఛా విహంగం కాదూ!

'రాధికా సాంత్వనము' అవతారిక – ముద్దుపళని అంతరంగం



ఆచార్య వెంకటరామయ్య గంపా
99586 07789

దక్షిణాంధ్ర సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న విలక్షణ కవయిత్రి ముద్దుపళని. తాళ్ళపాక తిమ్మక్క, రంగాజమ్మ వంటి కవయిత్రుల పరంపరలో, శృంగార రస ప్రధానమైన ప్రబంధాన్ని రచించి స్త్రీ ప్రబంధ కర్తృత్వాన్ని బలంగా నిలబెట్టిన కవయిత్రి ఆమె. తంజావూరు మరాఠా పాలకుడు ప్రతాపసింహుని (క్రీ.శ. 1739–63) ఆస్థానంలో విదుషీమణిగా పేరుపొందిన ఈమె పేరు అవతారికలో 'ముద్దుపళని'గానే వస్తుంది (పద్యం–30). 'ముద్దు' అనే పూర్వపదం ఆ కుటుంబంలో ముద్దుతంజనాయకి, ముద్దులక్ష్మి, ముద్దుకొమరువరుడు వంటి పేర్లలోనూ కనిపిస్తుంది. సంగీత, నాట్యాలలో, సాహిత్య సృజనలో అపారమైన ప్రవేశమున్న, ప్రతాపసింహుని రాజాశ్రయం పొందిన ముద్దుపళని, లౌకిక రాజాశ్రయాన్ని పొందినప్పటికీ కేవలం రాజుల మెప్పు కోసం కాకుండా, పోతన వంటి పూర్వకవుల మార్గంలో, తన 'రాధికాసాంత్వనము' కావ్యాన్ని భక్తితో శ్రీకృష్ణుడికి అంకితమిచ్చింది. కవిత్వ అభివ్యక్తిలో గానీ, రస నిర్వహణలో గానీ స్త్రీల సృజనాత్మక ప్రతిభ పురుషులకు ఏమాత్రం తీసిపోదని ఆమె తన కావ్య నిర్మాణం ద్వారా నిరూపించింది.

'ఇళాదేవీయము' అనే నామాంతరమున్న ఈ నాలుగు ఆశ్వాసాల ప్రబంధం ప్రధానంగా రాధాకృష్ణుల ప్రణయ తత్త్వాన్ని ఆవిష్కరిస్తుంది. 'సాంత్వనము' అంటే ఓదార్పు. చిన్ననాటి నుంచి తన లాలనలోనే పెరిగిన ఇళాదేవికి యుక్తవయసు రాగానే, రాధ స్వయంగా కృష్ణుడితో వివాహం జరిపిస్తుంది. అయితే కొత్త మోహంలో పడి కృష్ణుడు రాధను విస్మరించడంతో కథ మలుపు తిరుగుతుంది. ఆ తర్వాత తన తప్పిదాన్ని గుర్తించి వచ్చిన కృష్ణునిపై రాధ ప్రణయ కోపాన్ని చూపడం, చివరకు అతడు ఆమెను అనునయించి ఓదార్చడమే కావ్యంలోని ప్రధాన వృత్తాంతం. కేవలం బాహ్య శృంగార వర్ణనలకే పరిమితం కాకుండా, రాధ అంతరంగ వేదనను, ఆమె ఆత్మగౌరవాన్ని ప్రధాన సూత్రంగా నిలబెట్టడం వల్లే ఈ కృతికి 'రాధికాసాంత్వనము' అనే పేరు సంపూర్ణంగా సార్థకమైంది.

తెలుగు సాహిత్య చరిత్రలో అత్యంత తీవ్రమైన విమర్శనాత్మక ప్రతిఘటనను ఎదుర్కొన్న ప్రాచీన కావ్యాల్లో ఈ గ్రంథం ఒకటి. నాటి పురుష కవులు రాసిన ప్రబంధాల్లో ఇంతకంటే విచ్చలవిడి శృంగార వర్ణనలు చెల్లుబాటు అయ్యాయి. అయితే, కళావంతుల నేపథ్యం గల ఒక స్త్రీ తన రచనలో స్త్రీ కాంక్షలను, భావోద్వేగాలను అంత నిర్భయంగా ప్రకటించడాన్ని ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలోని సంస్కరణవాద సమాజం

ప్రాచీన తెలుగు కవులు కావ్యకథను ఆరంభించేముందు సంప్రదాయబద్ధంగా సాగించే స్తుతిప్రశంసల రూపమే కావ్యావతారిక. సంస్కృత నాటకాల్లోని నాందీ ప్రస్తావనలకు, ప్రాచీన శాసన శైలికి దేశీయ రూపంగా తెలుగులో ఇది స్థిరపడింది.



అంగీకరించలేకపోయింది. ఫలితంగా ఈ కావ్యం ముద్రణలో కోతలకు, ప్రభుత్వ నిషేధానికి కూడా గురైంది (ఈ చరిత్రను వ్యాసం చివరి భాగంలో చూద్దాం). నిషేధం తొలగిన తర్వాత ఈ కావ్యంపై స్త్రీవాద, సామాజిక కోణాల్లో అధ్యయనాలు వెలువడినప్పటికీ, అవతారికను కావ్యావతారికా లక్షణాల చట్రంలో సమగ్రంగా పరిశీలించిన అధ్యయనాలు తక్కువ.

ఈ చారిత్రక నేపథ్యంలో, ఒక కవయిత్రిగా ముద్దుపళని తన గొంతును ఎలా వినిపించిందో, తన రచనా స్వేచ్ఛను సంప్రదాయ చట్రంలోనే ఎలా నిలబెట్టుకుందో అర్థం చేసుకోవడానికి 'రాధికాసాంత్వనము' అవతారికే మనకు ప్రధాన ఆధారం.

ప్రాచీన తెలుగు కవులు కావ్యకథను ఆరంభించేముందు సంప్రదాయబద్ధంగా సాగించే స్తుతిప్రశంసల రూపమే కావ్యావతారిక. సంస్కృత నాటకాల్లోని నాందీ ప్రస్తావనలకు, ప్రాచీన శాసన శైలికి దేశీయ రూపంగా తెలుగులో ఇది స్థిరపడింది. అయితే ఈ అవతారిక కేవలం ఆచారబద్ధమైన లాంఛనం మాత్రమే కాదు, సమాజంలో తమ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి ప్రాచీన కవులు పన్నిన బలమైన సాంస్కృతిక వ్యూహం. ఇక్కడ కవి తన ఇష్టదైవాన్ని ప్రార్థిస్తాడు, పూర్వకవులను స్మరిస్తాడు, ఆశ్రయమిచ్చిన ప్రభువులను కీర్తిస్తాడు. ఈ ఆధారాలన్నింటితో తన రచనకు చారిత్రక ప్రామాణికతను సమకూర్చుకుంటాడు. కావ్యావతారికలకున్న ఈ బహుముఖ ప్రాధాన్యాన్ని జి. నాగయ్య తమ "తెలుగు కావ్యావతారికలు" గ్రంథంలో విపులంగా చర్చించారు.

ప్రాచీన కాలపు కవుల జీవిత చరిత్రలను తెలిపే ప్రత్యేక గ్రంథాలు మన సాహిత్యంలో లేవు. అందువల్ల కవుల వ్యక్తిగత వివరాలు, వంశ క్రమం, కవితా దృక్పథంతో పాటు, ఆనాటి సామాజిక, రాజకీయ, మత పరిస్థితులను తెలియజేసే చారిత్రక ఆధారాలుగా కావ్యావతారికలే నిలుస్తాయి. రచయిత ప్రాచీన సంప్రదాయాన్ని ఎలా ఆహ్వానించాడు? సమకాలీనుల నుంచి ఎలాంటి ఆదరణ కోరాడు? తన ప్రతిభను ఏ ప్రాతిపదికన నిరూపించుకున్నాడు? అనే సందేహాలన్నింటికీ అవతారికలోనే సమాధానాలు లభిస్తాయి. ముద్దుపళని 'రాధికాసాంత్వనము' అవతారికను పరిశీలిస్తే ఈ విషయాలు స్పష్టమవుతాయి. రాజాశ్రయం, కుటుంబ కళా సంప్రదాయం, దైవాదేశం, గురుకృప, విద్వత్సభ మన్ననలు, ప్రాచీన కవుల వారసత్వం వంటివన్నింటినీ ఆలంబనగా చేసుకుని ఆమె తన కవితా ప్రతిభను నిస్సంకోచంగా ప్రకటించుకుంది. ఈ అవతారిక కేవలం ఆమె జీవిత విశేషాల సమాహారం మాత్రమే కాదు, తన సాహిత్య కర్తృత్వాన్ని సగౌరవంగా చాటుకునే ప్రయత్నం. ఈ ఆధారాలన్నీ చూస్తే, ముద్దుపళని నాటి సంప్రదాయాన్ని పాటిస్తూనే తనదైన స్థానాన్ని ఎంత పకడ్బందీగా నిలబెట్టుకుందో అర్థమవుతుంది.

అవతారికలోని స్వీయ విశేషాలు కేవలం చారిత్రక వాస్తవాలు మాత్రమే కావు, ముద్దుపళని తన సాహిత్య వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్న క్రమాన్ని కూడా అవి తెలుపుతాయి. అలాగే రచయిత్రి అవతారికలో ఆమె 'వాయిస్'ను అర్థం చేసుకోవడం ముఖ్యం. కావ్యావతారికలలో సాధారణంగా కవి ఉత్తమ పురుషలో గానీ, ప్రథమ పురుషలో గానీ స్వీయ వృత్తాంతాన్ని ప్రస్తావించడం ఒక పద్ధతి కాగా, ముద్దుపళని ఇక్కడ అత్యంత నేర్పరితనంతో సభా దృక్కోణాన్ని ఆశ్రయించింది. సభ ఆమెను ప్రశంసిస్తూ పలికిన పద్యం చివర 'అనిరి' అనే మాట స్పష్టంగా కనిపిస్తుంది.

"ఆ మహారాజు కృపఁ జెందినట్టి నీకు
నిట్టి భాగ్యంబు లద్భుతం బేమి తెల్ప?
సార మగు నీదు విస్తార చర్య లెల్ల
వినుము, వినుపింతు, మని యిట్టు లనిరి కరుణ!"
(ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–15).

అంటే, అవతారికలో సాగే పొగడ్తలన్నీ కవయిత్రి స్వయంగా చెప్పుకున్నవి కావు, విద్వత్సభ ఆమెను మెచ్చుకుంటూ పలికిన మాటలు. పద్యాల్లో వచ్చే 'నీ', 'నీదు' అనే సంబోధనలే ఇందుకు స్పష్టమైన నిదర్శనం. సభ పలికిన ఈ ప్రశంసలే ఆమె రచనకు ప్రామాణికమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి.

తెలుగు కావ్యావతారికలలో కృతిభర్త వంశ గుణాలను వర్ణించడం అనివార్యమైన లాక్షణిక సంప్రదాయం. ఈ సభ మొదట 'వాఁడు నృప మాత్రుఁడే!' (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–13) అంటూ ప్రతాపసింహుని ఔన్నత్యాన్ని వేనోళ్ల కొనియాడుతుంది. రఘువంశానుగ్రహంతో విలసిల్లిన భోసల వంశంలో తుళజేంద్రుని తనయుడిగా అతడిని పరిచయం చేస్తుంది. ఆ వెంటనే 'ఆ మహారాజు కృపఁ జెందినట్టి నీకు' అంటూ ముద్దుపళనిని ఆ రాజు ఆదరణ పొందిన విదుషీమణిగా సభ గుర్తిస్తుంది. అంటే, ఆమె సాహిత్య ప్రయాణానికి తంజావూరు కళాసంస్కృతితో పెనవేసుకున్న 'రాజాశ్రయమే' తొలి ఆలంబనగా నిలిచింది. రాజసభ ఆమోదమే ఆమె సాహిత్య స్థానానికి తిరుగులేని గౌరవాన్ని సమకూర్చింది.

రాజాశ్రయంతో పాటు ఆమె ప్రతిభకు బలమైన ఊతమిచ్చిన మరో శక్తి ఆమె కుటుంబం. కావ్యావతారిక లక్షణాలలో కృతికర్త వంశావళిని, పాండిత్య ప్రాభవాన్ని చాటుకోవడం ప్రధానభాగం. సభ ఆమె వంశంలోని స్త్రీపురుషుల ప్రతిభను ఒక్కొక్కరిగా పరిచయం చేస్తూ సాగుతుంది. సంగీతం, నాట్యం, గానం, సాహిత్యం, దాతృత్వం, భక్తి వంటి రంగాల్లో వారు సాధించిన ఘనతను వివరిస్తుంది. సాధారణంగా సాహిత్య చరిత్రలో గురుశిష్య పరంపరలు, రాజాస్థానాలు, పురుష పండితుల పేర్లే ప్రముఖంగా కనిపిస్తాయి. కానీ ముద్దుపళని అవతారికలో తన వంశంలోని స్త్రీల కళా ప్రతిభకు కూడా సమాన గౌరవం దక్కింది. ఆమె సృజనకు తన ఇంటి తరతరాల కళా వారసత్వమే అసలైన బలంగా నిలిచింది.

కుటుంబ నేపథ్యం శూద్రజాతి ప్రస్తావనతో కూడిన పద్యంతో మొదలవుతుంది.

"ఆ మహీనాథు పద పద్మమందుఁ బుట్టి
సురుచిర ఖ్యాతిఁ గనె నీతి శూద్ర జాతి,
దాన 'నయ్యావయ' సెలంగె 'దాన కర్ణుఁ
డితఁడె' యం చని జను లెనుఁ జతురుఁ డగుచు" (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–17).

శ్రీమహావిష్ణువు పాదపద్మాల నుంచి ఉద్భవించిన శూద్రజాతి మంచి కీర్తిని గడించిందని, ఆ వంశంలో 'అయ్యావయ' విలసిల్లాడని ఈ పద్యం పేర్కొంటోంది. 'అయ్యావయ' అనేది వ్యక్తి పేరా లేక బిరుదా అనే విషయాన్ని పద్యం ఆధారంగా తేల్చలేం. 'దాన కర్ణుఁడితఁడె' అని జనం మెచ్చుకునేంత ఉదార స్వభావుడిగా అతడిని వర్ణించింది. కుటుంబ గౌరవాన్ని చాటుతూనే, తన సామాజిక మూలాలను దాచకుండా ఔదార్యానికి, ధర్మవర్తనానికి ముద్దుపళని విశేష స్థానం కల్పించింది. ఈ సామాజిక, నైతిక మూలాలతో పాటు, ఆ కుటుంబంలో తరతరాలుగా వర్ధిల్లిన కళా సంప్రదాయాన్ని అవతారిక ఆవిష్కరిస్తుంది. తర్వాత పద్యాల్లో చెంగాతి, ముద్దు తంజనాయకి, ముత్యాలు వంటి పేర్లు వస్తాయి. 'తంజనాయకి వారలఁ దత్తు గొనియె' అనే మాట ఈ కుటుంబంలో దత్తత ఆచారం కూడా ఉండేదని సూచిస్తుంది. వీరిలో తంజనాయకి వర్ణన ఎంతో విశిష్టంగా కనిపిస్తుంది.

'వీణ వాయించెనా? వివిధ చిత్రాద్భుత
ప్రతిమ లెల్లను తలల్ పరఁగ నరిఁచు,
ఠీవి నటించెనా? దేవలోకపు రంభ
కొంచక యౌదల వంచుకొనును,
గానంబు వినుపింపఁ బూనెనా? యా మహా
గిరిరాజ మైనను గరఁగిపోవు,
సభల మాటాడెనా? చల్లగాఁ బన్నీరు

రాజాశ్రయంతో పాటు ఆమె ప్రతిభకు బలమైన ఊతమిచ్చిన మరో శక్తి ఆమె కుటుంబం. కావ్యావతారిక లక్షణాలలో కృతికర్త వంశావళిని, పాండిత్య ప్రాభవాన్ని చాటుకోవడం ప్రధానభాగం. సభ ఆమె వంశంలోని స్త్రీపురుషుల ప్రతిభను ఒక్కొక్కరిగా పరిచయం చేస్తూ సాగుతుంది.

చిలికిన లేవను
జెలువుమీఱు,'
నని దొరాదొర లెన్నఁగాఁ ఘనత కెక్కి,
ప్రౌఢ చేడెలలో నీడు జోడు లేక,
తత సుగుణ పేటి, దివ్య సౌందర్య వాటి,
యతను మదఘోటి, తంజనాయకి వధూటి." (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–20).

ఈ పద్య నిర్మాణంలో ఒక లయ ఉంది. నాలుగు ప్రశ్నలు ఒకదాని వెంట ఒకటి వస్తాయి. వీణ వాయించినా, నటించినా, పాడినా, సభలో మాట్లాడినా ఏమవుతుందో వివరిస్తూ, ప్రతి ప్రశ్నకు ఒక విశేషాన్ని సమాధానంగా నిలబెట్టారు. వీణానాదానికి చిత్రాల్లోని బొమ్మలు తలలూపుతాయి, నాట్యానికి రంభ సైతం సిగ్గుతో తలవంచుకుంటుంది, గానానికి పర్వతాలు సైతం కరిగి నీరవుతాయి, సభలో మాట్లాడితే పన్నీటి జల్లు కురిసినంత చల్లదనం కలుగుతుంది. ఇది కావ్యోచిత అతిశయోక్తి అయినప్పటికీ, ఆమె ప్రతిభ కేవలం నాట్యానికే పరిమితం

> కుటుంబంలోని స్త్రీల ప్రతిభతో పాటు, సభ ఆ వంశానికి చెందిన పురుషుల ఘనతను కూడా విస్మరించలేదు. ముత్యాలు గురించిన పద్యం అతడిని నారదుడు, రాముడు, భోజరాజు వంటి పౌరాణిక, చారిత్రక పురుషుల ఉదాత్త గుణాలతో పోలుస్తుంది.



కాకుండా, సభలను మెప్పించే వాక్చాతుర్యం దాకా సాగిందని అర్థమవుతుంది. బాహ్య సౌందర్యానికి మించి రాజసభల్లో ఆమె వాక్చాతుర్యానికి దక్కిన గౌరవాన్ని ఈ పద్యం చాటుతోంది. 'దొరాదొర లెన్నఁగాఁ' అన్న మాట రాజసభల్లో ఆమెకున్న పలుకుబడిని చెబుతోంది. 'ప్రౌఢ చేడెలలో నీదు జోడు లేక' (నేర్పరులైన, ప్రజ్ఞావంతులైన స్త్రీలందరిలోనూ తనకు సరితూగగల సాటిగానీ, పోటీ రాగల జోడుగానీ ఎవరూ లేకుండా ఒంటరి మేటిగా నిలిచింది) అనే విశేషణం తోటి కళాకారిణుల్లో ఆమె ప్రత్యేకతను చాటుతోంది.

అవతారికలోని తర్వాత పద్యం ఆమె రూప లావణ్యాలతో పాటు ఉదార స్వభావాన్ని ఇలా వర్ణిస్తుంది.

"ఈవిచేతనె కాదు, తీవి చేతను గూడ
శశిరేఖ నెంతయుఁ జక్కడంచుఁ....."

• • •

హరి గుణ, ముద్దు తంజనాయకి మిటారి" (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–23).

ఇక్కడ ప్రతి పాదంలో రెండు గుణాలు జంటగా నడుస్తాయి. ఈవి (దానగుణం)తో పాటు తీగవంటి నడుమును, చూపులతో పాటు మనోహరమైన రూపాన్ని, చేతిగోటితో పాటు వయ్యారాన్ని, తళుకుతో పాటు కులుకును మేళవిస్తూ వర్ణన సాగుతుంది. పద్యం ముగింపులో ఆమె 'సకల విద్యా ప్రవీణ'గా, 'ముద్దు తంజనాయకి మిటారి'గా నిలుస్తుంది. అంటే కేవలం సౌందర్యం మాత్రమే కాదు, దానగుణం కూడా సమానంగా నడుస్తుంది. ఈ వర్ణనలు ఆనాటి తంజావూరు సమాజం గౌరవించిన ఆదర్శ స్త్రీ రూపాన్ని ఆవిష్కరిస్తున్నాయి.

ఈ వర్ణనల్లో స్త్రీ ప్రతిభకు విస్తృతమైన అర్థం కనిపిస్తుంది. కళను కేవలం కంటికి ఇంపుగా ఉండే వినోదంగా చూడలేదు. దానికి వాక్చాతుర్యాన్ని, సభా ప్రావీణ్యాన్ని, దానగుణాన్ని జోడించారు. ఒక స్త్రీ వీణ వాయించగలదు, నాట్యం చేయగలదు, పాడగలదు అనడమే కాకుండా, సభను తన మాటలతో మెప్పించగలదని చాటిచెప్పారు. కళను మెచ్చిన ఆనాటి సమాజం ఆమె ఆలోచనా శక్తికి, మేధస్సుకు తగిన ప్రాధాన్యం ఇచ్చిందా అనే విమర్శనాత్మక ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది.

అవతారికలో ముద్దుపళని ముద్దుతంజనాయకి కుమార్తె అయిన రామామణిని అత్యంత ఉదాత్తంగా వర్ణించింది. రామామణి గురించిన వివరాలు మరో కోణాన్ని వెలుగులోకి తెస్తాయి. అవతారిక ఆమె లోకోపకార కార్యాలను ప్రస్తావిస్తుంది. రామాంబాపురం అనే అగ్రహారాన్ని నిర్మించడం, ఒక శివాలయాన్ని కట్టించి, లింగప్రతిష్ఠ చేయడం, పుష్పవనాన్ని పెంచడం, సేతుమార్గంలో బాటసారుల కోసం చెరువు తవ్వించడం, గండరకోటలో నిత్యాన్నదానం చేస్తూ ఉత్సవాలు నిర్వహించడం వంటివన్నీ ఇందులో ఉన్నాయి. పద్యంలో లేని విషయాలను మనం కల్పించి చెప్పకూడదు. ఆ అగ్రహారాన్ని ఎవరికి దానం ఇచ్చారో పద్యంలో లేదు. పూలవనం ఏ గుడి కోసమో చెప్పలేదు. సేతుమార్గం కాబట్టి అది యాత్రికుల దాహం తీర్చడానికే అని ఊహించవచ్చు, కానీ అది కేవలం ఊహే. రామామణి దానధర్మాల వివరాలు ఆ కుటుంబానికి సమాజంలో ఉన్న ఉన్నతమైన సాంస్కృతిక స్థాయిని నిరూపిస్తున్నాయి. కావ్యావతారికలలో సప్తసంతాన కార్యాలను కీర్తించడం ప్రధానమైన ఆచారంగా ఉండేది. వాపి, కూప, తటాక, అగ్రహార, దేవాలయ నిర్మాణాల వంటి సప్తసంతాన కార్యాలను నిర్వహించిన పుణ్యశీలిగా రామామణిని చూపడం ద్వారా, స్త్రీలను కళా ప్రదర్శనలకే పరిమితం చేయకుండా, తమ సంపదను శాశ్వత ధర్మకార్యాలకు వెచ్చించే వ్యక్తులుగా సభ కీర్తించింది.

కుటుంబంలోని స్త్రీల ప్రతిభతో పాటు, సభ ఆ వంశానికి చెందిన పురుషుల ఘనతను కూడా విస్మరించలేదు. ముత్యాలు గురించిన పద్యం అతడిని నారదుడు, రాముడు, భోజరాజు వంటి పౌరాణిక, చారిత్రక పురుషుల ఉదాత్త గుణాలతో పోలుస్తుంది. నారదుని భక్తి, మేఘుం వంటి దాతృత్వం, రాముని దయ, చంద్రుని కళ, చక్రవర్తి పరాక్రమం, భోజరాజు కీర్తి, ఇంద్రుని వైభవం, చివరగా కృష్ణుని 'భరత శాస్త్రీయ జాతి'గా

పేర్కొంటుంది. ఇందులో నాట్యశాస్త్ర ప్రావీణ్యం చివరి లక్షణంగా వస్తుంది.

'గృష్ణుడు భరత శాస్త్రీయ జాతి' అన్నప్పుడు 'జాతి' అనే మాటకు సంగీత నాట్యాల్లో ఒక నిర్దిష్టమైన అర్థం ఉంది. నాట్యశాస్త్రంలో కృష్ణుడితో సరితూగే పాండిత్యమని అనుకోవచ్చు, అంతకుమించి పద్యం ఏమీ స్పష్టం చేయదు. ఈ గుణాలన్నీ కలిసి ముత్యాలు సర్వతోముఖ ప్రతిభను నిలబెట్టాయి. అదే పద్యం చివరలో తిరుమల తాతయాచార్యుల పాదాల చెంత భ్రమరంలా నిలిచిన భక్తుడిగా అతడిని వర్ణించారు. గురుభక్తికి ఇచ్చిన ఈ విలువ గమనించదగ్గది. అయినప్పటికీ స్త్రీల ప్రతిభను విస్తృతంగా వర్ణించిన తీరే ఈ అవతారికలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది.

అయితే ఈ కుటుంబ వివరాలన్నింటినీ చూసి, ఆనాటి కళావంతుల సమాజంలోని స్త్రీలందరికీ ఇంతే ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక గౌరవం ఉండేవని నిర్ధారించలేం. కుటుంబంలో కొందరికి ఉన్న ప్రాధాన్యతను బట్టి మొత్తం కళావంతుల సమాజ స్థితిగతులను సాధారణీకరించలేం. కుటుంబంలో స్త్రీలకు ప్రాధాన్యం ఉన్నంత మాత్రాన అది మాతృస్వామిక వ్యవస్థ అని తేల్చేయడమూ తొందరపాటే అవుతుంది. దత్తత ప్రస్తావనలు ఆ కుటుంబ సంబంధాలు ఎంత సంక్లిష్టంగా ఉండేవో చెబుతాయి. ఆస్తి హక్కులు, దత్తత నియమాలు, కుటుంబ నిర్మాణం గురించి స్పష్టత రావాలంటే ఇంకా చారిత్రక పరిశోధనలు జరగాలి. అవతారిక గొప్పతనం చారిత్రక వివరాలను యథాతథంగా పేర్కొనడంలో కాక, సంక్లిష్ట కుటుంబ సంబంధాలను ఆవిష్కరించడంలో ఉంది.

ఈ కుటుంబ కళా వైభవాన్ని, సంక్లిష్ట నేపథ్యాన్ని ఆవిష్కరించిన అనంతరం, సభ ముద్దుపళని వ్యక్తిత్వాన్ని కీర్తించడం మొదలుపెడుతుంది. తోబుట్టువులైన వేలాయుధుడు, ముద్దుకొమరువరుడు, ముద్దులక్ష్మి, ముద్దయ, పద్మావతి, రామస్వామిల పేర్లను చెప్పిన తర్వాత వచ్చే పద్యం ఆమె స్థానాన్ని తేటతెల్లం చేస్తుంది.

"వెలసితివి వారిలో
న్దెలి చుక్కలలోనఁ జెలఁగు నెల రేక యనన్
లలిత కళా విభవంబులు
వల నొప్పఁగ మేటి ముద్దుపళని వధూటీ!" (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–31).

చుక్కల మధ్య చంద్రరేఖలా తోబుట్టువుల నడుమ ఆమె వెలిగిపోయిందని పద్యం చెబుతోంది. తోబుట్టువుల నడుమ ఆమెకున్న ఈ విశిష్ట స్థానం ఆమె ప్రతిభకు కుటుంబం ఇచ్చిన తొలి గుర్తింపు.

ఆ వెంటనే సభ ఆమె బహుముఖ ప్రజ్ఞను అయిదు వరుస ప్రశ్నల ద్వారా ప్రశంసిస్తుంది.

"ఏ నాతి నీరీతి నెంతొ భక్తి చెలంగ వ్రాయించె...

• • •

ప్రబల గుణపేటి, శ్రీ ముద్దుపళని బోటి." (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–32).

భక్తి, దాతృత్వం, కవిత్వం, రాజాస్థానాల్లో మన్ననలు, గురుభక్తి అనే అయిదు రంగాలనూ ప్రశ్నలుగా మలచి, చివరకు 'కలరె నీ సాటి?' అంటూ ముగిస్తుంది. ఆ అయిదు ప్రశ్నలూ ముద్దుపళని సమగ్ర ప్రజ్ఞ సమకాలీనుల్లో అసమానమైనదని చాటడానికే. కుటుంబ దానగుణం, గురువు, రాజసభ, కావ్యం అన్నీ మళ్లీ ఇక్కడే కేంద్రీకృతమవుతాయి.

సభా వర్ణనల ముగింపు పద్యం ఆమె సృజనాత్మక శక్తిని నేరుగా ప్రకటిస్తుంది.

ఈ కుటుంబ కళా వైభవాన్ని, సంక్లిష్ట నేపథ్యాన్ని ఆవిష్కరించిన అనంతరం, సభ ముద్దుపళని వ్యక్తిత్వాన్ని కీర్తించడం మొదలుపెడుతుంది. తోబుట్టువులైన వేలాయుధుడు, ముద్దుకొమరువరుడు, ముద్దులక్ష్మి, ముద్దయ, పద్మావతి, రామస్వామిల పేర్లను చెప్పిన తర్వాత వచ్చే పద్యం ఆమె స్థానాన్ని తేటతెల్లం చేస్తుంది.

"ఘటియింప నేర్తువు కవన
జాతు లెఱింగి పలుకులకల్కి...

• • •

భక్తి హరి కిమ్ము శ్రీ ముద్దుపళని బోటి!" (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–36).

ఈ పద్యం ద్వారా ముద్దుపళనిలోని కవిత్వం, దానగుణం, సత్యసంధత, అభినయ నైపుణ్యం అనే నాలుగు ప్రత్యేక పార్శ్వాలు వెల్లడవుతాయి. సరస్వతి సైతం అబ్బురపడేలా కవిత్వం అల్లడం, పార్వతీదేవిలా కోరిన వరాలివ్వడం, ద్రౌపది భర్త ధర్మరాజులా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, నవరసాలను ఒలికిస్తూ సాక్షాత్తూ రంభను నిశ్చేష్టురాలిని చేసేలా అభినయించడం ఆమె లక్షణాలుగా కనిపిస్తాయి. కవిత్వం, నాట్యంతో పాటు దాతృత్వం, సత్యసంధతలు ఆమె వ్యక్తిత్వంలో భాగమని సభ చాటిచెప్పింది. "నీదె... నీదె..." అన్న ప్రయోగం ఆ ప్రతిభాపాటవాలు ఆమెకే సొంతమని నిరూపిస్తోంది. చివరి పాదం రాధికాసాంత్వనాన్ని రమణీయంగా తీర్చిదిద్ది భక్తితో భగవంతుడికి అంకితం ఇవ్వాలనే

> లౌకికమైన ఈ గుర్తింపులతో పాటు, కావ్యానికి తిరుగులేని సాంస్కృతిక ప్రామాణికతను చేకూర్చుకోవడానికి ముద్దుపళని దైవాదేశాన్ని ఆలంబనగా చేసుకుంది. తెలుగు కావ్యావతారికల్లో 'కావ్యోత్పత్తి ప్రశంస' ఒక ప్రధానభాగం



కర్తవ్యాన్ని నిర్దేశిస్తోంది. అంతకుముందు పద్యంలో (పద్యం–33) సభ ఆమెకు ఇచ్చిన 'భవ్య వాగ్ధాటి' అనే బిరుదు కూడా ఆమె సంభాషణా చాతుర్యానికి, సభలను మెప్పించే ప్రతిభకు నిదర్శనం.

ఈ ప్రశంసలన్నింటినీ తన నోటితో తాను చెప్పుకోకుండా, విద్వత్సభ చేత పలికించడం వెనుక ఆమె చూపిన లౌక్యమైన నేర్పు కనిపిస్తుంది. సమాజం తనను ఎలా గుర్తించాలో, ఏ స్థానంలో కూర్చోబెట్టాలో నిర్దేశించే ఒక బలమైన ప్రకటనగా ఈ సభా వర్ణన నిలుస్తుంది. అయితే కుటుంబం ఇచ్చిన నేపథ్యం, సభ ఇచ్చిన గుర్తింపు తన కవితా శక్తికి ప్రాథమిక పునాదులు మాత్రమే.

లౌకికమైన ఈ గుర్తింపులతో పాటు, కావ్యానికి తిరుగులేని సాంస్కృతిక ప్రామాణికతను చేకూర్చుకోవడానికి ముద్దుపళని దైవాదేశాన్ని ఆలంబనగా చేసుకుంది. తెలుగు కావ్యావతారికల్లో 'కావ్యోత్పత్తి ప్రశంస' ఒక ప్రధానభాగం. కావ్య రచనకు దైవాదేశం కలగడం, కలలో దేవుడు సాక్షాత్కరించి కావ్యాన్ని ఫలానా వారికి అంకితమివ్వమని ఆదేశించడం అనే స్వప్న వృత్తాంత సంప్రదాయం ఆంధ్ర మహాభాగవతం, ఆముక్తమాల్యద, మొల్ల రామాయణం మొదలైన తెలుగు రచనలలో సుప్రసిద్ధం. ముద్దుపళని కూడా ఆ సంప్రదాయాన్ని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకుంది. కవయిత్రికి స్వప్నంలో బాలకృష్ణుడు కనిపించి కావ్యాన్ని తనకు అంకితం ఇవ్వమని ఆజ్ఞాపించినట్లు అవతారిక స్పష్టంగా చెబుతోంది.

"చిన్ని కృష్ణుండ నే, నాదు చిత్తమునకు
సమ్మతం బైన రాధికా సాంత్వనంబు
తగ నొనర్పు మదీయాంకితముగ నీవు,
లలిత గుణ పేటి! శ్రీ ముద్దుపళని బోటి!" (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–11).

'మదీయాంకితముగ' అంటే సాక్షాత్తూ శ్రీకృష్ణుడే తన కావ్యాన్ని స్వీకరిస్తున్నాడని అర్థం. కావ్యావతారికలలో దేవతాస్తుతిని కవుల మతాభిమానానికి ప్రతీకగా భావిస్తారు. ముద్దుపళని తన ఇష్టదైవమైన శ్రీకృష్ణుని కీర్తిస్తూ, స్వచ్ఛమైన భక్తితో గ్రంథాన్ని సమర్పించింది. సభా ప్రశంస చివరి పాదం 'భక్తి హరి కిమ్ము' అని స్పష్టం చేస్తుంది. అవతారికలోని షష్ఠ్యంతాలు సైతం శ్రీకృష్ణుడినే కీర్తిస్తాయి. కృతిపతికి ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ షష్ఠీ విభక్తి ప్రయోగార్థంలో పద్యాలు లేదా గద్యాలు కూర్చడం తెలుగు కావ్యావతారికల్లోని అత్యంత విశిష్టమైన దేశీయ సంప్రదాయం. ముద్దుపళని కూడా శ్రీకృష్ణుడికే ఈ షష్ఠ్యంతాలను సమర్పించింది. ఆ తర్వాత వచ్చే 'అంకితంబుగా నా యొనర్పం బూనిన' అనే వచన భాగం కూడా దీన్నే స్థిరపరుస్తుంది. రాధికాసాంత్వనం తనకెంతో ఇష్టమైన ఇతివృత్తమని కృష్ణుడే చెప్పడం, ఆమెను 'లలిత గుణ పేటి' అని సంబోధించడం వల్ల రచనకు తిరుగులేని పవిత్రత చేకూరింది.

దైవం తర్వాత గురువు, విద్వత్సభల వంతు వస్తుంది. కావ్యావతారికల్లో గురుస్తుతి ఆయా కవుల విద్యా సంప్రదాయాన్ని, మతాచార్య పరంపరను నిరూపిస్తుంది. అవతారికలోని వచనంలో కవయిత్రి తన స్వప్న వృత్తాంతాన్ని గురువు వీరరాఘవ దేశికులకు నివేదిస్తుంది. ఆమె గురుపాదాలను ఆశ్రయించినందువల్లే సాక్షాత్తూ దేవుడు సాక్షాత్కరించాడని, ఈ స్వప్నం వల్ల ఆమెకు గొప్ప శ్రేయస్సు కలుగుతుందని సభలోని పండితులు దీవిస్తారు. కావ్యం రాయడానికి గురువు లేదా పండితులు అనుమతి ఇచ్చినట్లు ఎక్కడా రాసి లేదు. అయినా ఈ సన్నివేశానికి ఎంతో విలువుంది. ఆ కల ఆమె వ్యక్తిగత అనుభవంగా మిగిలిపోకుండా, సభలోని పండితుల ఆశీస్సులతో ఒక సత్సంకల్పంగా రూపుదాల్చింది. దైవాదేశం పైనుంచి వచ్చిన ఆజ్ఞ అయితే, పండితుల ఆమోదం సమకాలీన లోకం ఇచ్చిన గుర్తింపు.

దైవాదేశాన్ని కావ్యానికి ఆలంబనగా చేసుకోవడం ముద్దుపళనితో మొదలైన పద్ధతేమీ కాదు. శ్రీకృష్ణదేవరాయలు, పోతన, మొల్ల వంటి కవులందరూ ఇదే మార్గాన్ని అనుసరించారు. అయితే రాయలకు దైవాదేశం తన

సార్వభౌమాధికారాన్ని బలపరుచుకునే సాంస్కృతిక సాధనమైతే, కళావంతుల నేపథ్యం నుంచి వచ్చిన ముద్దుపళనికి తన రచనపై సమాజంలో ఎలాంటి ఆక్షేపణలు రాకుండా కాపాడుకునే బలమైన రక్షణ కవచం. ప్రక్రియ ఒకటే అయినా రచయిత సామాజిక స్థానాన్ని బట్టి దాని ప్రయోజనం మారుతుందని ఇక్కడ స్పష్టమవుతుంది.

ఈ ఆధారాల తర్వాత పూర్వకవులతో ఆమె సంబంధాన్ని చూడాలి. కావ్యావతారికల్లో 'సుకవి స్తుతి' అనేది కవుల సాహిత్య దృక్పథాన్ని, పూర్వ కావ్య రసానుభూతిని వ్యక్తం చేసే ప్రధానభాగం. ముద్దుపళని పాత సంప్రదాయాన్ని తోసిరాజని విడిగా కొత్త దారి చూసుకోలేదు. ఒక పద్యంలో వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు వంటి సంస్కృత మహా కవులను, నన్నయ, తిక్కన, సోమన, భాస్కరుడు, శ్రీనాథుడు, భీముడు వంటి తెలుగు కవులను భక్తితో స్మరించింది. సాధారణంగా కవులు పూర్వకవులను స్తుతిస్తూ, తమ కావ్యంలో దోషాలు ఉండవచ్చని వినయం ప్రదర్శించడం ఒక సాహిత్య ఆచారం. కానీ ముద్దుపళని పూర్వకవులను గౌరవిస్తూనే, వారి తోడ్పాటుతో తన కావ్యం కూడా గట్టిగా నిలబడాలని ఆశించింది.

"....నాఁ గృతు లౌ నాంధ్ర కవీంద్రులం దలఁతు యుక్తిన్ మత్కృతి ప్రౌఢికిన్." (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–5).

'మత్కృతి ప్రౌఢికిన్' అంటే 'నా రచన ప్రౌఢత్వం సాధించడం కోసం' అని అర్థం. పూర్వకవుల స్మరణ కేవలం వినయం కోసం కాదని, తన రచనకు బలం చేకూర్చుకోవడానికేనని ఆమె చెబుతుంది. ఈ ఆత్మవిశ్వాసం మరో పద్యంలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

"చెలువుగఁ బూర్వ సత్కవులు చేసిన కబ్బము లెన్నో యుండఁగాఁ...

యితరపుష్ప మరందము లోలిఁ గ్రోలవే?" (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–7).

పూర్వకవులు రాసిన దివ్య కావ్యాలు ఎన్నో ఉండగా, నీ కావ్యాన్ని సత్కవులు ఆదరిస్తారా అనే ఒక సందేహాన్ని లేవనెత్తి, దానికి తుమ్మెద ఉదాహరణతో సమాధానం చెప్పింది. తామరపూవు తేనెను తాగినంత మాత్రాన తుమ్మెద ఇతర పూల మకరందాన్ని అసహ్యించుకోదు కదా, ఆశతో తాగుతుంది. పూర్వకవులను గౌరవిస్తూనే కొత్త రచనల ఆవశ్యకతను తుమ్మెద దృష్టాంతంతో ఆమె సమర్థించుకుంది. కావ్యావతారికలలో తమ కవితా రీతిని సమర్థించుకునే 'కవితా పరామర్శ' లక్షణానికి ఇది నిండైన నిదర్శనం. ప్రాచీన కవుల గొప్పతనాన్ని అంగీకరిస్తూనే, సంప్రదాయ చట్రంలో తన స్వతంత్ర గొంతును వినిపించే ధైర్యం ఇక్కడ కనిపిస్తుంది.

ఈ పూర్వకవుల వరుసలో ఒక ఆసక్తికరమైన విషయముంది. ఆమె పేర్కొన్న ప్రాచీన కవులంతా పురుషులే, ఒక్క కవయిత్రి పేరూ ఇందులో కనిపించదు. స్త్రీల వారసత్వం ఇక్కడ సాహిత్య రూపంలో కాకుండా కుటుంబ కళల రూపంలో వచ్చింది. అంతకుముందు ప్రస్తావించిన తంజనాయకి, రామామణి, ముద్దులక్ష్మి వంటివారే ఆమెకు అసలైన కళా ప్రేరణగా నిలిచారు. ముద్దుపళని పూర్వకవుల స్తుతిలో కవయిత్రుల పేర్లు లేకపోవడం నాటి సాహిత్య పరిమితిని చూపుతోంది.

సాహిత్య పరంపరలో కేవలం పురుషుల పేర్లే ఉన్నప్పటికీ, కావ్యారంభ మంగళాచరణం వైపు దృష్టి సారిస్తే, ఆమె ఎంచుకున్న దేవతా ప్రతీకలు సంప్రదాయ పితృస్వామ్య భావజాలానికి భిన్నమైన విలక్షణ స్త్రీ దృక్కోణాన్ని ఆవిష్కరిస్తాయి.

తామరపూవు తేనెను తాగినంత మాత్రాన తుమ్మెద ఇతర పూల మకరందాన్ని అసహ్యించుకోదు కదా, ఆశతో తాగుతుంది. పూర్వకవులను గౌరవిస్తూనే కొత్త రచనల ఆవశ్యకతను తుమ్మెద దృష్టాంతంతో ఆమె సమర్థించుకుంది. కావ్యావతారికలలో తమ కవితా రీతిని సమర్థించుకునే 'కవితా పరామర్శ' లక్షణానికి ఇది నిండైన నిదర్శనం.

అవతారికలోని ప్రార్థనా పద్యాల్లో భూదేవి, సత్యభామలను కలిపి స్తుతించిన తీరు ముద్దుపళని ప్రత్యేక అంతరంగానికి అద్దం పడుతుంది.

"నెఱి గమనంబు, వేణియును, నిక్కు చనుంగవ, ...

....గతి, నన్ గృప నెప్పుడుఁ బ్రోచుఁ గావుతన్!"

(ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–3).

ఈ పద్యంలో గజరాజుల వంటి నడక, ఆదిశేషుని వంటి జడ, కులపర్వతాల వంటి ఉన్నత వక్షోజాలు, ఆది కూర్మం వంటి దృఢమైన పాదాలు భూభారాన్ని మోసే ప్రాకృతిక శక్తులు కాగా, 'గంధవతి' (గంధవతియైన భూదేవి), 'భామ' (సత్యభామ) అనే శ్లేష ఇద్దరి అభేదాన్నీ అద్భుతంగా నిరూపిస్తుంది. సాధారణంగా పురాణాల్లో సత్యభామ అనగానే నరకాసుర వధలో శ్రీకృష్ణుడి పక్కన నిలిచి విల్లు ఎక్కుపెట్టిన వీరనారి రూపమే గుర్తుకొస్తుంది. కానీ ముద్దుపళని ఇక్కడ ఆ యుద్ధ వీరత్వాన్ని పక్కనపెట్టి, సాక్షాత్తూ భూదేవి అంశతో "నరకుని గాంచి పెంచుగతి" అంటూ

> సంప్రదాయ చట్రంలో ముద్దుపళని సగౌరవంగా నిలబెట్టుకున్న సాహిత్య స్థానం, తర్వాతి కాలపు ఆధునిక నైతిక తీర్పుల ముందు తీవ్రమైన పరీక్షకు గురైంది



నరకాసురుడిని కని పెంచిన కన్నతల్లిగా ఆమెలోని నిండైన వాత్సల్యాన్ని ముందుకు తెచ్చింది. లోకానికి శత్రువైన కొడుకునైనా తల్లి ఎలా నిష్కల్మషంగా ప్రేమిస్తుందో గుర్తుచేస్తూ, అదే మాతృప్రేమతో తనను కూడా కాపాడాలని వేడుకుంది. యుద్ధ వాతావరణంలోని వీరవనితను ఆర్ద్రమైన మాతృమూర్తిగా చిత్రించడమే ఈ పద్యం సాధించిన శిల్ప వైభవం. కావ్యావతారికా మంగళాచరణంలో ఇష్టదేవతా స్తుతితో పాటు కావ్య కథార్థాన్ని ధ్వనింపజేసే 'సూచ్యార్థ సూచన' నైపుణ్యం ఇందులో వ్యక్తమవుతోంది.

పురాణ ప్రతీకలను ఇలా నవ్య దృష్టితో పునర్నిర్మించడమే కాకుండా, తన విలక్షణ రచనపై దూసుకొచ్చే సంప్రదాయ ఛాందస విమర్శలను తిప్పికొట్టే స్పృహ కూడా ఆమెకు పుష్కలంగా ఉంది. అందుకే కావ్యావతారికలోని 'కుకవి నింద'ను ఆమె నిరాధార విమర్శలను తిప్పికొట్టే వివేకవంతమైన సాధనంగా మలచుకుంది.

"పొత్తమున నుండు శల్యంబు లెత్తివైచి,
శాస్త్ర యుక్తిని గొని భేషజంబు సేయఁ
గఁ దగు నాక్షేప జీవ కవులఁ దీర్పఁ
జనదు కృతుల, నమంగళ జనులు వారు." (ముద్దుపళని. రాధికాసాంత్వనము. పద్యం–6).

ఈ పద్యంలో ఆమె కుకవులను 'అమంగళ జనులు' అని నిరసించిన తీరు ప్రత్యేకంగా గమనించదగ్గది. పుస్తకంలోని ముళ్లను, అంటే లోపాలను తొలగించి, శాస్త్ర నియమాలతో దాన్ని సరిదిద్దడమే నిజమైన విమర్శకుడి కర్తవ్యమని ఆమె అంగీకరించింది. వైద్యుడు రోగాన్ని గుర్తించి నయం చేసినట్లుగానే, విమర్శకుడు కూడా రచనలోని లోపాలను సరిదిద్దే దారి చూపాలి. అయితే తర్వాత పాదమైన 'ఆక్షేప జీవ కవులఁ దీర్పఁ జనదు కృతుల' అనే మాటకు రెండు అర్థాలు వస్తాయి. నిందలతోనే పొట్టపోసుకునేవారిని ఎవరూ మార్చలేరని ఒకటి, అలాంటి అల్పబుద్ధులు ఇతరుల కావ్యాలపై తీర్పులు చెప్పకూడదని మరొకటి. ఎలా చూసినా అలాంటివారిని ఆమె ఏమాత్రం మొహమాటం లేకుండా 'అమంగళ జనులు' అని కొట్టిపారేసింది. కావ్యాన్ని నిర్మాణాత్మకంగా విమర్శించడం వేరు, కవిని వ్యక్తిగతంగా కించపరచడం వేరు అనే విచక్షణ ఆమెకు ఆనాడే ఉంది. కుకవి నింద ద్వారా ఆమె తన కవిత్వాన్ని విమర్శకుల దాడి నుంచి సమర్థవంతంగా కాపాడుకుంది.

ముద్దుపళని అవతారికలో ఈ విమర్శనా దృష్టి స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాచీన కావ్యాలను గౌరవించడం, కొత్త రచనలకు చోటుండాలని వాదించడం, విమర్శకు ఒక బాధ్యత ఉండాలని చెప్పడం ఆమె అవతారికలోని ముఖ్యమైన అంశాలు. ఆమె నేటి సిద్ధాంత పరిభాషను వాడకపోయినా, స్త్రీల పాండిత్యం, సాహిత్య గౌరవం, రచనా స్వేచ్ఛ, విమర్శనాత్మక ఆలోచన వంటి అంశాలను చర్చించడానికి తిరుగులేని ఆధారాలను అందించింది. ఆనాటి సమాజ పరిమితులు, తంజావూరు కళా సంస్కృతుల వెలుగులోనే ఆమె విమర్శనాత్మక విచక్షణను పరిశీలించాల్సి ఉంది.

సంప్రదాయ చట్రంలో ముద్దుపళని సగౌరవంగా నిలబెట్టుకున్న సాహిత్య స్థానం, తర్వాతి కాలపు ఆధునిక నైతిక తీర్పుల ముందు తీవ్రమైన పరీక్షకు గురైంది. 'రాధికాసాంత్వనము' ఎదుర్కొన్న విమర్శలను ఈ చారిత్రక పరిణామ కోణం నుంచే చూడాలి. కావ్యంలోని శృంగార వర్ణనలను పట్టుకుని, దాన్ని నైతికత అనే తూనికరాళ్లతో కొలిచే ధోరణి మన సాహిత్య చరిత్రలో కనిపించింది. కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంస్కర్తలు మొల్ల వంటి కవయిత్రులను మెచ్చుకున్నప్పటికీ, ముద్దుపళని రచనను మాత్రం భిన్నమైన దృక్కోణంతో చూశారు. మొల్ల రామాయణంలోని భక్తిని, ముద్దుపళని కావ్యంలోని శృంగారాన్ని స్త్రీల శీలపరీక్షకు గీటురాళ్లుగా మార్చడం ఒక చారిత్రక వైరుధ్యం. ఒక స్త్రీ రాసినంత మాత్రాన శృంగారాన్ని తప్పుపట్టడం సమంజసం కాదు, కావ్యంలోని శృంగారాన్ని కథా సందర్భంతో, కావ్యశిల్పంతో కలిపి చూడాలి. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహం వంటి రంగాల్లో సంస్కర్తలు చేసిన కృషి ఎనలేనిదే అయినప్పటికీ, స్త్రీల భావ ప్రకటనా స్వేచ్ఛను అంగీకరించడంలో

వారి ఆలోచనలకు స్పష్టమైన పరిమితులు ఉన్నాయి. ఈ పరిమితులను గుర్తించినప్పుడే ముద్దుపళని కావ్యం చుట్టూ అల్లుకున్న వివాదాల అసలు స్వభావం బయటపడుతుంది.

ఈ ఘర్షణ 'రాధికాసాంత్వనము' ముద్రణ చరిత్రలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. 1887లో వెలువడిన పైడిపాటి వెంకటనరసు ముద్రణ శృంగార భాగాలతో పాటు అవతారికను కూడా తొలగించింది. 1910లో బెంగళూరు నాగరత్నమ్మ ఈ కావ్యాన్ని సమగ్రంగా వెలుగులోకి తేవడానికి చేసిన ప్రయత్నం సాహిత్య చరిత్రలోనే ఒక కీలకమైన ఘట్టం. ఒక స్త్రీ రాసిన గ్రంథాన్ని మరో స్త్రీ పరిష్కరించి, అసలు పాఠాన్ని వెలుగులోకి తేవడం సాహిత్యంలో నిశ్శబ్ద విప్లవమే అయింది. అయితే కందుకూరి వీరేశలింగం వంటి సంస్కర్తల తీవ్రమైన నైతిక విమర్శల నేపథ్యంలో 1911లో మద్రాసు ప్రభుత్వం ఆ ప్రతులను స్వాధీనం చేసుకుని నిషేధించింది. 1947లో టంగుటూరి ప్రకాశం ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. ఒక రచనలో ఏది ఉండాలి? ఏది ఉండకూడదు? దేన్ని ప్రామాణికంగా తీసుకోవాలి? అనే నిర్ణయాలు సాహిత్య చరిత్ర గమనాన్నే మారుస్తాయి.

అవతారికలో కవయిత్రి తనకు తాను కల్పించుకున్న సాహిత్య స్థానంతో ఆ రచన ప్రయాణం ముగిసిపోలేదు. ఒక కాలంలో నైతిక అభ్యంతరాలను ఎదుర్కొన్న కావ్యం, మరో కాలంలో స్త్రీల కర్తృత్వానికి, భావ ప్రకటనా స్వేచ్ఛకు ప్రతీకగా నిలవడం చూస్తే సాహిత్య వారసత్వం ఎప్పుడూ నిశ్చలంగా ఉండదని స్పష్టమవుతుంది. తర్వాత తరాల రాజకీయ, సామాజిక అభిరుచులే ఒక రచన ప్రాధాన్యాన్ని పునర్నిర్మిస్తాయి. ముద్దుపళని తన అవతారిక ద్వారా ఒక గొప్ప వారసత్వాన్ని స్వీకరిస్తూనే, అందులో తనదైన స్థానాన్ని ధైర్యంగా ప్రకటించుకుంది. ఆ ప్రకటనకు తర్వాతి తరాలు ఇచ్చిన స్పందనలే వివాదాలుగా, సంపాదకత్వ ప్రయత్నాలుగా, నేటి కొత్త పఠనాలుగా మన ముందు నిలుస్తున్నాయి.

ముద్దుపళనిని కేవలం శృంగార కావ్యం రాసిన కవయిత్రిగా చూస్తే ఆమె ప్రతిభలో ఒక చిన్న భాగాన్ని మాత్రమే చూసినట్లవుతుంది. కావ్యావతారికా లక్షణాల సమగ్ర చట్రంలో 'రాధికాసాంత్వనము' అవతారికను నిశితంగా చదివినప్పుడే ఆమె అంతరంగం సంపూర్ణంగా ఆవిష్కృతమవుతుంది. ఆమె విస్తృతమైన సాహిత్య దృష్టి, కుటుంబ కళల పట్ల ఆమెకున్న స్పృహ, ప్రాచీన కవులతో ఆమె నడిపిన సంభాషణ, ఆమె విమర్శనా విచక్షణ, ఆత్మగౌరవం అన్నీ ఇందులో పెనవేసుకుని ఉన్నాయి. ప్రాచీన కావ్యావతారికా సంప్రదాయంలోనే ఉంటూ తన ప్రత్యేక స్థానాన్ని బలంగా నిలబెట్టుకున్న అరుదైన కవయిత్రిగా ముద్దుపళని తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోతుంది.

ఆధార గ్రంథాలు

ముద్దుపళని. రాధికాసాంత్వనము. (గౌరవ సంపాదకులు. బొమ్మకంటి వేంకట సింగరాచార్య, బాలాంత్రపు నళినీకాంతరావు) విజయవాడ: ఎమెస్కో బుక్స్. 2009.

నాగయ్య, జి. తెలుగు కావ్యావతారికలు. మద్రాసు: ఫ్రీడం ప్రెస్. 1968.

విజ్ఞాన వనరులు


ఎం. అనంతలక్ష్మి
89784 32973



గ్రంథాలయాలు
మన విజ్ఞాన భాండాగారాలు,
పఠనాసక్తిని పెంచుతూ,
పోటీ ప్రపంచానికి ఫునాదులు వేస్తాయి.
మనిషికి మౌన మిత్రుడు,
మనసుకు మార్గదర్శి,
జ్ఞానదీపము పుస్తకము.
ఏకాగ్రతకు ఆలయమై,
ప్రశాంతతను ప్రసాదించునవి,
ఎందరో మహానీయుల అనుభవ సంపదను
ఒకే చోట చేర్చే విజ్ఞాన వనరులు.
పరిశోధనా పథాలకు పేరణనిచ్చి,
సృజనాత్మకతను చిగురింపజేస్తూ,
నూతన ఆలోచనలకు నందనవనములైనవి.
ఆత్మవిశ్వాసానికి అద్దమై,
అంతరంగంలో వెలుగులు నింపుతూ,
అవగాహనను పెంపొందిస్తూ,
ఆలోచనా శక్తిని మెరుగుపరుస్తాయి.
పుస్తకాలు -
మన మస్తకాలను శుద్ధి చేస్తాయి.

రఘునాథనాయకుని "వాల్మీకి చరిత్రము" - లఘు పరిచయము!

శ్రీ పొన్నపల్లి శ్రీరామారావు
98490 21056



కవిత్వమనే వృక్షశాఖపై కూర్చుని, 'రామ రామ' అనే అత్యంత మధురమైన అక్షరాలను అమృతంలా గానం చేస్తున్న వాల్మీకి అనే కోకిలకు వందనం చేస్తూ, రఘునాథనాయకుడు రచించిన "వాల్మీకి చరిత్రము" అనే గ్రంథ సారాన్ని ఈ వ్యాసంలో పరిచయం చేస్తున్నాను.

సంగీత సాహిత్యవైదుష్యం గల తంజావూరు పాలకుడు – రఘునాథ నాయకుడు (1600–34) అపర కృష్ణదేవరాయలుగా పరికీర్తితుడు. భారత కథాసంగ్రహం, రామాయణ కథాసారం అను సంస్కృత కావ్యాలు వ్రాసిన రఘునాథ నాయకుడు చిన్ననాటనే పారిజాతాపహరణ ప్రబంధరచన చేసి తండ్రి అచ్యుతప్ప నాయకునిచే కనకాభిషేక గౌరవమునందినాడు. తండ్రి ప్రశస్తిని "అచ్యుతాభ్యుదయ"మను పేర ద్విపదగా సంతరించి తెలుగులో అభ్యుదయకావ్యాలకు శ్రీకారం చుట్టినాడు. గజేంద్రమోక్షం, రుక్మిణీకల్యాణం యక్షగానాలు, జానకీపరిణయం చాటుకావ్యం వ్రాసినాడు. ఇవన్నియు నేడలభ్యములే. ఆయన కావ్యములు మూడు మాత్రమే మనకు లభించినవి.

నలచరిత్ర – ఎనిమిదాశ్వాసముల ద్విపద
రామాయణం – పాక్షికంగా లభ్యం
వాల్మీకి చరిత్రం – మూడాశ్వాసముల ప్రబంధం

ఈ మూడును రామాంకితములే. శృంగార సావిత్రి ఈయన రచించెనా? లేదా? ఇంకను తేలలేదు.

వాల్మీకి చరిత్రము

నా పరిశీలనలో, ఒక మహాకవి చరిత్రను కావ్యంగా మలచిన తొలి తెలుగుకవి రఘునాథుడే. సంస్కృతధర్మఖండములోని చిన్ని కథనాధారముగా వ్రాసిన మూడాశ్వాసముల ప్రబంధమీ వాల్మీకి చరిత్రము.

తెలుగులో ప్రతిపద్యచమత్కృతితో విజయవిలాస ప్రబంధమును రచించిన చేమకూర వేంకటకవి రఘునాథ నాయకుని ఆస్థానకవి. చేమకూరకవి మాటలలో

"సారసారస్వతాధారిసారికాశుకవనకృతముఖశు
కకళాకలనహృష్టబుధజనాస్థాని రఘునాథ భూజాని!"

అన్నిటమేటి! నవరసనిష్యందియగు వాల్మీకి చరిత్ర విరచించిన చక్కని అభిరుచిగల భావుకుడాయన!

"చెప్పవలె గప్పురంబులు
కుప్పలుగాబోసినట్లు కుంకుమపైపై
గుప్పినక్రియ విరిపొట్లము
విప్పినగతిఘుమ్మనం గవితము సభలన్"
(వాల్మీకి చరిత్ర 1–15)

తిక్కన భారతరచన నాటినుండి ప్రాచీనకవులు పలువురకు –

స్వప్నప్రబోధమే కావ్యరచనాహేతువు! మన రఘునాథ నాయకునికి శ్రీరఘునాథుడు కలలో కనిపించి– "నీ కవితా విలాసముగణింపసుధారసధారకంటె నింపై కనిపించు" –నని ప్రశంసించి – పూర్వం రామాయణం రచించినావుగనుక ఇపుడు వాల్మీకి మహర్షి చరిత్రను వ్రాయుమని ఆనతిచ్చెను.

ఈ మూడాశ్వాసముల ప్రబంధములో మొదటి ఆశ్వాసము – బదరీవనవర్ణనతో మొదలగును. నరనారాయణులు తపమొనరించినట్టిది ముక్తికాంతకు ఆటపట్టైనదియగు బదరీవనమున శౌనకాదిమునులు పుణ్యకథామృతలహరిలో నోలలాడుచుండగా అచటికి నారదమహర్షి రాగా – శౌనకాదులాయనను విష్ణుస్మరణకథను వచింపుమనిరి. నారదుడంత సంతసించి – నా సఖుడగు పర్వతుడు వివరింపగలడని పలికి విష్ణుసేవకు వెడలెను. అపుడు పర్వతుడు నారాయణస్మరణమహిమానుభావము వివరింపనారంభించెను:

హరినామకీర్తనమహిమ తెల్పు ఇతిహాసము చెప్పసాగెను. పాలకడలిలో శ్వేతద్వీపము అచటనున్న విష్ణుసేవకై సప్తర్షులు విచ్చేసి, దండకరూపమున విష్ణుస్తుతిని గావించి, దేవదేవుని దర్శించుకొని, పలుద్వీపములకు తీర్థయాత్రకు వెళ్లి, గజతీర్థమున కరిమకరివృత్తాంతమను గజేంద్రమోక్షగాథ వినిరి. ఇది ప్రథమాశ్వాసము.

పర్వతుడు శౌనకాదులకు అనంతరకథను ప్రవచింపసాగెను. సప్తర్షులు అచటనుండి ధనుష్కోటిని, రామనిర్మిత సేతువును దర్శించిరి. మధురలో హాలాస్యనాథుని, శ్రీరంగక్షేత్రమును దర్శించిరి. తంజావూరు ప్రాంతములలో త్యాగరాజుల సేవించి కుంభకోణము, చిదంబరము, అరుణాచల శేషాచల శ్రీశైలవాస దైవములను దర్శించుకొని అటనుండి నర్మదలో మునింగి పయనించి కాశికాపురి చేరిరి. అప్పటికి ఎండకాలమేతెంచినది. అటుపిమ్మట తమసానదిని తరించి చీమదూరని వనసీమజొచ్చిరి. అదియొక బోయపల్లె. అచట ఒక కిరాతుడు సప్తర్షులను నిల్పి ధనమునకై పీడించెను.

తాపసులను కొట్ట నీకు చేతులెట్లాడెననుచు నిందింప ఆలుబిడ్డలకోసము దోపిడీచేయుచున్నానని వ్యాధుని సమాధానము. మరి నీపాపఫలమును వారు పంచుకుందురేమో తెలిసికొనిరమ్మని వానిని పంపగా – కిరాతుని కుటుంబసభ్యులు పాపఫలము పంచుకోమని నిష్కర్షించిరి. బుద్ధి తెచ్చుకొని కిరాతుడా మునులను వేడుకొనగా...

"భక్తిమై మరామరా" అని రామనామమును ప్రతిలోమముగ బోధించి – జపింపుమని వారు తమ యాత్రను కొనసాగించిరి. కిరాతుడు తీవ్రతపమాచరింపగా తక్కిన బోయలు వీనికి బాపనదయ్యముపట్టెనని గేలిసేసినను, తన కుటుంబమువారు నివారింపయత్నించినను తపముమానలేదు. వ్యాధులు అతనిని మహావ్యాధులవలె పీడించిరి.

"తపముమరామరాయని
పల్కనంతంత యది రామ
నామపర్యాయమయ్యె!"

అతడు అంతర్ముఖత్వమున, అంతరంగమంతయు నిర్గుణతేజముతో, ఉత్తమయోగులు సైతము ప్రశంసించు స్థాయినందెను. ఇది ద్వితీయాశ్వాసము.

అనంతరకథను శౌనకాదులకు పర్వతుడు చెప్పసాగెను. కిరాతుని తీవ్రతపోగ్ని ఇంద్రలోకము వరకును వ్యాపించెను. ఇంద్రుడాతని తపము భగ్నమొనర్ప రంభను, ఊర్వశిని నియోగించెను. వారి సంగీతనాట్యకళావిలాసములా ముని తపమును భంగము చేయజాలకపోయెను. మట్టిపుట్టలనడుమ అతడు పార్థివకళేబరములోపల వెలుగు అంతరాత్మ వలె తేజరిల్లుచుండెను.

రెండేడులకచటికి సప్తర్షులు పునరాగమించిరి. వైరివర్గజంతువులెల్ల సఖ్యముతో జీవించు ఆ ప్రాంతమహిమకు వారు ఆశ్చర్యపడిరి. అంత ఆ కిరాతతాపసి పుట్టచించుకొనివచ్చి మునులను సేవించి ప్రణమిల్లెను. గజదొంగ తపసియగుట – శ్రీజానిస్మరణమహిమయని తలంచి – ఇదియెల్ల రామనామ ప్రభావమని స్తుతించి వారు చనిరి. వల్మీకోద్భవుడగువానికి వాల్మీకి యని చక్కని నామమేర్పడినది.

నిరంతరజపశీలుడగు వాల్మీకిమహర్షి చిత్తశుద్ధికి అలరి శ్రీరామచంద్రుడు అతనికి సాక్షాత్కరించెను. తన గాథను రామాయణముగా రచింపుమని ఆనతిచ్చి ఆ దేవదేవుడు అంతర్ధానుడయ్యెను. అట్టి రామాయణము సకలలోకప్రసిద్ధమైనదని పర్వతుడు శౌనకాదులకు వృత్తాంతమునెల్ల ముగించెను.

ఈ చిన్నికబ్బమున కవి సప్తర్షుల తీర్థయాత్రావర్ణనమున సుదీర్ఘవచనము నాశ్రయించెను. గ్రీష్మర్తువర్ణనము, బోయపల్లెవర్ణనము, రంభ, ఊర్వశి కళావిన్యాస విలాసవర్ణనము విశిష్టముగనున్నవి.

శ్రీరామచంద్రవర్ణనము:–

"పనిఁడిగింటెంపుదుప్పటికప్పులో హోహొ!
కమ్మకస్తురితిలకమ్ముబళిర!

శరచాపములుపూనుసరవి యమ్మమ్మ! మాణిక్యకోటీరంబు నీటువాపు

నిగనిగమను చిన్నినగవులాహా! మణి
మకరకుండలములమహిమ మేలు

తళుకుఁగుంకుమపుగందపుఁబూత యయ్యారె!
హారవల్లికలయొయ్యారమౌర!

మించెనన నెంచఁదగు లీలఁ గాంచి మంచి
మించుజిగిమించునెమ్మేనిమెలఁతఁగూడి
చల్లఁజూపులఁగరుణారసంపుజల్లు
జల్లుచునునిల్చెశ్రీరామచంద్రుఁడెదుట!"

ఈ రీతి వర్ణించి రఘునాథ మహారాజు తన కవితా ప్రతిభను చక్కగా చాటెను. ఈ కావ్యమున రఘునాథ నాయకుని పద్య రచనాపాటవం, పలు గ్రంథపరిశీలనానుభవము, అనువాదప్రజ్ఞ, తెనుగునుడికారము, సంస్కృత సమాసఘటనాచాతుర్యము సుస్పష్టమగును.

"చెవులుచల్లగ"
"ఓహరిసాహరి"
"సిరికిపుట్టినయిల్లు"
"ఈడుజోడుగలరె?!"
"అట్టివెట్టచే నుడికివడవె?!"
"చేతులెట్టాడె?!"
"ఇట్టట్టు బాపనదయ్యముపట్టెనో?!"...

వంటి జాతీయములు ఈ కవి వాడిన అచ్చతెనుగునకు మచ్చుతునకలు.

"శ్రీ భూమినీళా విచిత్ర పాదన్యాసధన్యాసమానసౌధవ్రజంబు"
"రవిసుధాంశూపాధిరహితనిత్యోజ్జ్వలన్నైజతేజోభరభ్రాజితంబు"
"ఉల్లసితసారసహంసరథాంగ భృంగ సమ్యక్కలనాదమేదురనిరంతరతుంగతరంగ ఘోషముల్"

... మున్నగు సంస్కృత సమాసఘటన ఈయన గైర్వాణీపాండితికి నికషోపలములు.

ప్రసిద్ధశ్లోకాలను తెనిగింపక వదలలేదీరాజకవి –

"యత్రయత్రరఘునాథకీర్తనమ్
తత్రతత్రకృతమస్తకాంజలిమ్
బాష్పవారిపరిపూర్ణలోచనమ్
మారుతింనమతరాక్షసాంతకమ్"

రఘునాథ నాయకుని అనువాదం:

"ఎక్కడరామకీర్తనమొకయించుకయేవిననైనవేడ్కదా
నక్కడనిల్చిరంజిలికృతాంజలియైప్రమదాశ్రుపూరముల్
పిక్కటిలంగమైఁబులకబృందముజాదుకొనంగఁబాడుచున్
జొక్కుచునాడునయ్యనిలసూనుప్రభానతభానుఁగొల్చెదన్."

ఒకయించుక – పిక్కటిలంగ – జాదుకొను– చొక్కుచు– వంటి జానుతెనుగు పదాలు చొప్పించి స్వతంత్రపద్యముగ భాసింపజేసినాడీకవిరాజు.

"తెలుగు కవితా మతల్లికి దక్షిణాదిలో పూలపందిళ్లు వేసిన రసికప్రభువు రఘునాథ నాయకుని కలానికీ– తెలుగువారిమగటిమి సింహళంలో కత్తిమెరుపులుమెరిపించిన ఆ రాజవీరుని ఖడ్గానికీ– నతులు!"

– అంటారు ఆచార్య శ్రీ బిరుదురాజు రామరాజుగారు.

రఘునాథ నాయకుని భార్యలలో ఒకరు, ఆస్థానకవయిత్రి అయిన రామభద్రాంబ 12 సర్గల్లో వ్రాసిన సంస్కృత మహాకావ్యము – రఘునాథాభ్యుదయము, రఘునాథుని రాముడు–కృష్ణుడు–విష్ణువు అంశగా కీర్తించుచు రచించినది.

ఇంక, రఘునాథ నాయకుడు తన అరుదైన కృతి వాల్మీకి చరిత్రమునకు కావ్యఫలశ్రుతి నిట్లు వినిచెను:

"శ్రీకరమై తగునవ్వా
ల్మీకిచరిత్రంబుభక్తిమెఱయఁగనెపుడున్
జేకొనిచదివిన వినినన్
చేకురువారలకభీష్టచిరశోభనముల్"

భారతీయసాహిత్యంలో ఆదికావ్యంగా ప్రఖ్యాతమైన మహాగ్రంథం శ్రీమద్రామాయణం. దానిని రచించిన వాల్మీకిమహర్షి మనకు పరమపూజనీయుడు. ఆ మహర్షి మనజాతికందించిన రామాయణ మహాగ్రంథము – మనజాతిసంస్కృతిదర్శనము!

రఘునాథ నాయకుని భార్యలలో ఒకరు, ఆస్థానకవయిత్రి అయిన రామభద్రాంబ 12 సర్గల్లో వ్రాసిన సంస్కృత మహాకావ్యము – రఘునాథాభ్యుదయము, రఘునాథుని రాముడు–కృష్ణుడు–విష్ణువు అంశగా కీర్తించుచు రచించినది.

"యావత్స్థాస్యంతిగిరయః
సరితశ్చ మహీతలే
తావద్రామాయణకథా
లోకేషు ప్రచరిష్యతి"

....మనభారతీయసాహిత్యమునకు ఓంకారము చుట్టిన మహనీయుని చరిత్ర మన భారతీయులకు అవశ్యపఠనీయము. రామకథనెందరో మహాకవులు రచించి ధన్యులైరి; ఆ కథను లోకానికందించిన ఆదికవినే కావ్యనాయకునిగా నిలిపి తెలుగు పద్యకావ్యము సంతరించిన రఘునాథ నాయకుడు మనకు సదా మూర్ధన్యుడు!

తెలుగుజాతికి తెలుగుదారి గురజాడ కథలు

డా. శివరాత్రి సుధాకర్
94911 24112



తెలుగు సాహిత్య చరిత్రను మలుపుతిప్పిన 'ఆధునిక యుగకర్త' గురజాడ వేంకట అప్పారావు. జనం జీవితాలతో ఏమాత్రం సంబంధం లేకుండా రాజ్యమేలుతున్న తెలుగు సాహిత్యాన్ని భూమార్గం పట్టించాడు. గురజాడ ప్రజాతంత్రవాది. మానవీయతే ఆయన తత్వం. ప్రజాదృక్పథ సాహితీ సృజనే ఆయన అసలు దారి.

గురజాడ వేంకట అప్పారావు 1862 సెప్టెంబర్ 21న పుట్టాడు. తల్లి కౌసల్యమ్మ, తండ్రి వేంకట రామదాసు. తెలుగు, సంస్కృతం, తత్వశాస్త్రం, గ్రీకు, రోమన్ చరిత్రలతో పాటు ఆంగ్ల విద్యనూ ఇష్టంగా చదివాడు. విస్తృతంగా అధ్యయనం చేశాడు. సంగీతం, సాహిత్యం, క్రీడల్లో అభినివేశం ఉంది. దీంతో తొలి యవ్వన కాలాన సొంత వ్యక్తిత్వం ఏర్పడింది. మానసిక వికాసం కలిగింది. విశాల ఆలోచనలు చిగురించాయి.

యూరప్లో వెల్లువెత్తిన సాంస్కృతిక పునరుజ్జీవనం అతనిలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. దీంతో సమాజానికీ, సాహిత్యానికీ ఉన్న సంబంధాన్ని నిశితంగా పరిశీలించాడు. సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని పునాది జనం దగ్గరికి తీసుకెళ్లాలని కలలుగన్నాడు. గ్రాంథిక భాషను సంస్కరించి వాడుక భాషగా మార్చేందుకు 'పండితవర్గం'తో పెద్ద యుద్ధమే చేశాడు. కాల్పనికవాద అబద్ధపు సౌందర్యాన్ని దరిచేరనీయలేదు. సామాజిక భౌతిక వాస్తవికతే ఆయన సృజనకు మూలం. గురజాడ కేవలం 53 ఏళ్ల జీవితంలో తెలుగుజాతి ఆలోచనా విధానాన్నే మార్చేశాడు. అందుకే ఆయన సాహిత్యం వేగుచుక్కయింది. తెలుగు సమాజానికి దిక్సూచిలా నిలిచింది. భావితరానికి బాటగా నిలిచింది.

గురజాడ వందేళ్ల క్రితమే లేవనెత్తిన ప్రశ్నలకు ఇంకా సమాధానం దొరకలేదు. అందుకే గురజాడ పరిశోధన ఒక సాహిత్య అధ్యయనం కాదు, అదొక సామాజిక అవసరం. గురజాడ అనే హేతువాది, మానవతావాది, సంఘ సంస్కర్త, భాషా విప్లవకారుడు తన కథల ద్వారా తెలుగుజాతిని ఎలా మేల్కొల్పడానికి ప్రయత్నించాడో విశ్లేషించడమే ఈ పరిశోధన పత్రం ముఖ్య ఉద్దేశం.

పత్రం ముఖ్య లక్ష్యాలు:

1. గురజాడ వేంకట అప్పారావు దృక్పథంలోని ఆధునికత, మతం, కులం, స్త్రీ విద్యపై ఆయన చూపిన హేతుబద్ధ దృక్పథాన్ని పరిశీలించడం.

2. ఆయన శైలిలోని విప్లవాత్మకతను, గ్రాంథిక భాషనుండి వాడుక భాషకు ఆయన చేసిన ప్రయాణాన్ని, నాటకం, కథలు, ముత్యాల సరాలు అనే కొత్త ప్రక్రియలను ఎలా సృష్టించాడో అధ్యయనం చేయడం.

3. నేటి సమాజంలో గురజాడ ప్రాసంగికతను పునఃప్రతిష్ఠించడం.

గురజాడ వేంకట అప్పారావు కవిత్వం, నీలగిరి పాటలు,

నాటకాలు, కథానికలు, వ్యాసాలు, డైరీలు, ఉత్తరాలు రాశాడు. కవిత్వంలో గురజాడకు శంభుచంద్ర ముఖర్జీ మార్గదర్శకుడు. ఆనందగజపతి జీవిత గురువు. వీళ్లిద్దరి ప్రభావంతో సమాజాన్ని నిశితంగా పరిశీలించి అర్థంచేసుకున్నాడు. విశాల ఆలోచనల వల్ల సంఘంలోని ద్వంద్వ విలువల్నీ, స్వార్థపరుల్నీ, అవకాశవాదుల్నీ సహించలేకపోయాడు. దీంతో లోకంలోని సమస్త మోసాలనూ, ముసుగు నీతివర్తనుల జీవితాలనూ రచనలోకి తీసుకొచ్చాడు. అదొక సామాజిక బాధ్యతగా భావించాడు. ఈ నిబద్ధతను సహించలేని శిబిరాలు గురజాడపై అనేక నిందలేశాయి. ఒంటరిగా మిగలాల్సి వచ్చినా ఆయన వెరవలేదు. "నాది ప్రజల ఉద్యమము, దానిని యెవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను" అని స్పష్టంచేశాడు. ఈ తెగింపు వల్ల ఆయనకు శత్రువులు ఎక్కువయ్యారు. గురజాడ అప్పారావు 'అకవి' అంటూ అనేకమంది 'పండిత భిషక్కులు' ఆయనపై దాడిచేశారు. ఆకాశరామన్న ఉత్తరాలు రాశారు. బుక్లెట్లు ముద్రించి పంచారు. అలాంటి ప్రత్యర్థుల్లో కొక్కొండ వేంకటరత్నం, వేదం వేంకటరాయశాస్త్రి, బి.ఎస్.శర్మ, గిడుగు వేంకట సీతాపతి, జయంతి కుమారస్వామి, మోచర్ల రామచంద్రరావు, పారనంది జగన్నాథ స్వామి (గిడుగు రామమూర్తి శిష్యుడు) ముఖ్యులు. పండితవర్గ దాడులకు గురజాడ ఏనాడూ భయపడలేదు. తన సమకాలీన కవుల్లో ఎక్కువ మంది 19వ శతాబ్దంలో పుట్టి 17వ శతాబ్దంలోకి పయనించారు. 'పాత' దారుల్లో నడుస్తూ పరవశించారు. తిరోగమనం వైపు మళ్లారు. సమాజాన్ని యథాతథంగా ఉంచాలనుకున్నారు. కానీ, గురజాడ మాత్రం 20వ శతాబ్దం దాటి ఆలోచించాడు. సమాజాన్ని పురోగామి భావాలవైపు నడిపించాలనుకున్నాడు. తలకిందుల సమాజాన్ని నిటారుగా నిలబెట్టాలనుకున్నాడు. తాను నమ్మిందే రాశాడు. ఎవ్వర్నీ నమ్మించడానికి రాయలేదు. ఇంతకుముందెవ్వరూ ఆలోచించని కొత్త దారుల్లో పయనించాడు. తిరోగమన కవుల్ని ప్రశ్నించినందుకు ఆయనపై మూకుమ్మడి భావజాల దాడులు. వెలివేతలు. ఐనా, వెనుకంజ వేయలేదు. అతని అన్వేషణంతా కొత్తదనం కోసమే. సాహితీ సృజనలో కొత్త ఒరవడి సృష్టించాడు. "తెలుగులో నవ్యరీతులకు నూతన ప్రమాణాలకు ప్రయత్నించిన మొదటి కవిని నేనే. నా కావ్యకళ నవీనం. కావ్య ఇతివృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలను ఉపలక్షించాను. జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి, కథా, కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను" అని తన దృక్పథం గురించి రాసుకున్నాడు. (గురజాడ లేఖలు, పుట.205)

గురజాడ పాతిక గేయాల కంటే ఎక్కువేమీ రాయలేదు. ఐనా 'మహాకవి' అయ్యాడు. ఆయన సాహిత్యంలో ఇతివృత్తాల నవ్యత, సమకాలీనత, ఛందస్సు దేశీయత, కావ్యభాష సౌలభ్యం, ఉపదేశ బలం వల్ల భావితరాలకు బాటలు వేశాడు. వస్తువులో, దృక్పథంలో కొత్తదారులు వేశాడు. అందుకే ఆయన మహాకవి. గురజాడ గురించి శ్రీశ్రీ, "ఏ కవి యొక్క ఆవిర్భావం వల్ల ఈ ప్రపంచం ఇంకో అడుగు ముందుకు వేసిందో ఆ కవే మహాకవి" అని 'తెలుగుతల్లి' పత్రిక (25 అక్టోబర్, 1945)లో రాశాడు.

గురజాడ వేంకట అప్పారావు కేవలం నాలుగు కథానికలు మాత్రమే రాశాడు; 1904లో ఇంగ్లీషులో రాసిన "Stooping to Raise" అనే కథను అవసరాల సూర్యారావు గారు తెలుగులోకి 'సంస్కర్త హృదయం' అనే పేరుతో ఆంధ్రీకరించారు. 1. దిద్దుబాటు (కమలిని), 2. దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి? 3. మతము: 4. మెటిల్డా. ఈ కథానికలు వందేళ్ల క్రితం రాసినా వాటి ప్రాసంగికత ఇప్పటికీ ఉన్నది. ఈ కథానికలన్నీ తెలుగు జాతికి గురజాడ ఇచ్చిన వెలుగు జాడలు.

> **గురజాడ కేవలం 53 ఏళ్ల జీవితంలో తెలుగుజాతి ఆలోచనా విధానాన్నే మార్చేశాడు. అందుకే ఆయన సాహిత్యం వేగుచుక్కయింది. తెలుగు సమాజానికి దిక్సూచిలా నిలిచింది. భావితరానికి బాటగా నిలిచింది.**

'దిద్దుబాటు' – పరిచయం:

ఇది తెలుగులో తొలి ఆధునిక కథానికగా ప్రసిద్ధి పొందింది. అయితే ఈ అభిప్రాయానికి భిన్నంగా అనేక చర్చలూ వచ్చాయి. ఈ కథ రాసేనాటికి భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉంది. ఆనాటికి ఇక్కడ స్త్రీలకు విద్యలేదు. విద్య నేర్చుకొనే అవకాశాలు చాలా తక్కువ. కులీన స్త్రీలకు మాత్రమే చదువు. మిగతావాళ్లకు లేదు. దీంతో స్త్రీలు కుటుంబ వ్యవస్థకు కట్టుబానిసలుగా మారారు. దీన్ని బ్రిటిష్ పాలకులూ పెద్దగా పట్టించుకోలేదు. పితృస్వామ్య ఆధిపత్యం కింద నలిగే స్త్రీలకు స్వేచ్ఛలేదు. స్వాతంత్ర్యం లేదు. దీంతో తీవ్రమైన మానసిక వేదనతో బతికేవాళ్లు. విద్య వల్ల మానసిక వికాసం కలిగి, స్త్రీలు తమ చెప్పుచేతల్లో ఉండరనే భయంతోనే పితృస్వామ్య భావజాలం

కమలిని చదువుకున్న ఆధునిక స్త్రీ. గుణవతి. విద్యానిధి. వినయ సంపన్నురాలు. గురజాడ సృష్టించిన తొలి ఆధునిక స్త్రీ పాత్ర. ఆమె ఏడవదు, గొడవ చేయదు. తెలివితో, చాకచక్యంతో, నాటకీయంగా భర్తను దిద్దుబాటు చేస్తుంది.



స్త్రీలకు విద్యను నిరాకరించింది. గురజాడ చదువుకున్న స్త్రీలు ఇంటినీ, సమాజాన్నీ ఎలా మారుస్తారో ఈ కథానిక ద్వారా చెప్పాడు.

ఇది సంస్కరణవాద దృక్పథంతో రాసిన కథ. ఆ కాలంలో పితృస్వామ్య భావజాలాన్ని ప్రశ్నించిన కథ. ఆ ప్రశ్న ధిక్కారంగా కాకుండా సున్నితంగా ఎక్కుపెట్టిన ప్రశ్న. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడానికి స్త్రీలు ఎంత సంఘర్షణ అనుభవిస్తున్నారో చెప్పిన కథ. ఇది 1910 జనవరి–ఫిబ్రవరి 'ఆంధ్రభారతి' సంచికలో అచ్చయింది. ఇందులో పాత్రలు: గోపాలరావు, కమలిని, రావుడు. గోపాలరావు భార్య కమలిని. గ్రాంథికచ్ఛాయలు నిండేటట్లుగా రాసిన 'దిద్దుబాటు' కథను గురజాడ తన స్వహస్తంతో 'కమలిని' పేరుతో మార్చి రెండవ వెర్షన్ రాశారు.

పాత్రలు:

1. కమలిని:

కమలిని చదువుకున్న ఆధునిక స్త్రీ. గుణవతి. విద్యానిధి. వినయ సంపన్నురాలు. గురజాడ సృష్టించిన తొలి ఆధునిక స్త్రీ పాత్ర. ఆమె ఏడవదు, గొడవ చేయదు. తెలివితో, చాకచక్యంతో, నాటకీయంగా భర్తను దిద్దుబాటు చేస్తుంది. ఈ పాత్ర ద్వారా గురజాడ 'స్త్రీ విద్య ఆవశ్యకత'ను చెప్పాడు. చదువుకున్న స్త్రీలు మగవాళ్ల అడ్డదారులను కూడా సరిదిద్దగలరని నిరూపించాడు.

2. గోపాలరావు:

గోపాలరావు ద్వంద్వ ప్రమాణాలు గల సంఘ సంస్కర్త. పైకి సంస్కర్త, లోపల వేశ్యాలోలుడు. నాటి సమాజంలోని మేధావుల, పెద్ద మనుషుల ముసుగును ఈ పాత్ర బయటపెట్టింది. సంఘ సంస్కర్తలుగా ముసుగులు వేసుకొని సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నవాళ్ల నిజ స్వరూపాన్ని, ద్వంద్వ విలువల్ని గురజాడ ఈ కథలో నిలదీశాడు. విమర్శించాడు.

3. రావుడు (నౌకరు):

రావుడు సామాన్య ప్రజా ప్రతినిధి. వ్యావహారిక భాషలో మాట్లాడే పాత్ర. 'ఆడారు చదువు నేరిస్తే యేటైతది?' అని అమాయకంగా అడిగే పాత్ర. అతని భాషే కథకు జీవం.

కమలిని ఆధునిక స్త్రీ. సంఘంలోని ద్వంద్వ విలువల్ని అర్థం చేసుకున్న స్త్రీ. ఆమె చదువుకున్నది. అందుకే గోపాలరావుకు గర్వం. ఆమె తెలివితేటలపట్ల మెప్పు ఉంది. అతడు వేశ్యా సంస్కరణ, సంఘ సంస్కరణ పేరుతో లోకం మీద పడ్డాడు. ఇంటికి ఎప్పుడు వచ్చేదీ తెలియదు. ఇంట్లో కమలిని ఒక్కతే అతనికోసం ఎదురుచూస్తూ ఉంటుంది. అతడు వేశ్యాగృహాల్లో తేలియాడుతుంటాడు. అక్కడ కచేరీలు వినడమంటే ప్రాణం. అర్ధరాత్రుల దాకా అక్కడే పాటల సరదాలో లీనమవుతుంటాడు. ఓ రోజు అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంటికి వచ్చాడు. తలుపు తీయలేదు. అతడే తలుపు తీసి లోపలికి వెళ్ళాడు. మంచంపై కమలిని లేదు. దీపం వెలిగించి ఇల్లంతా వెతికాడు. ఆమె ఎక్కడా కనిపించలేదు. పిలిచాడు. పలకలేదు. వీధిలో చుట్ట కాలుస్తున్న నౌకరు రావుడు కనిపించగా, కోపంతో అతని వీపుపై రెండు గుద్దులు గుద్దాడు; వెంటనే పశ్చాత్తాపపడ్డాడు. తరువాత బల్లపై ఒక ఉత్తరం కనిపించింది. అది కమలిని చేతిరాత. "అయ్యా... పది దినములాయె. రాత్రులనింటికి మీ రాకయే నేనెరుగను. మీటింగులకు బోవుచుంటి మంటిరి. లోకోపకారకరములగు నుద్యమముల నిదుర మాని చేయుచుంటిమంటిరి. మా చెలుల వలన నిజము నేర్చితిని. నేనింట నుండుటను గదా మీరు కల్లలు పలుకవలసివచ్చె. నేను పుట్టింట నున్న మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశమును కలుగకుండును. మీచే దిన దినమును అసత్యమాడించుటకన్న మీ త్రోవకు అడ్డుగ నుండకుండుటయే, పతి మేలు కోరిన సతికి కర్తవ్యము కాదా? నేనీ రేయి కన్నవారింటికి జనియెద సంతసింపుడు. వెచ్చముగాక యేపాటి మిగిలియున్నను దయ నుంచుడు." అని రాసింది.

(గురుజాడలు, 2012, పుట.526)

ఉత్తరం చదవడం పూర్తవగానే గోపాలరావు మనసులో దిగులు నిండింది. తన భార్య పుట్టింటికి వెళ్లిందని బాధపడ్డాడు. లోలోపల అలజడి రగిలింది. 'నీకు తెలియకుండా ఎలా వెళ్లిందిరా?' రావుడిని అడిగాడు. రావుడు, స్త్రీలకు విద్య ఉంటే

చెప్పినమాట వినరన్నాడు. అతనికి స్త్రీల విద్యపట్ల సదభిప్రాయమే ఉన్నా ఆ క్షణానికి దానికి విరుద్ధంగా మాట్లాడాడు. దీంతో గోపాలరావుకు కోపం వచ్చింది. "ఓరి మూర్ఖుడా... భగవంతుడి సృష్టిలోకల్లా ఉత్కృష్టమైన వస్తువ విద్య నేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహము పంచి యిచ్చాడు. యింగ్లీషువాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగునికన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డదా?" అని స్త్రీ విద్యా అవసరాన్ని చెప్పాడు. (గురుజాడలు, 2012, పుట.527)

ఈ మాట ద్వారా గోపాలరావులో స్త్రీ విద్యపట్ల ఇష్టమే ఉన్నట్టు చిత్రించాడు గురజాడ. గోపాలరావూ, రావుడూ ఇద్దరూ సమాజానికి ప్రతిబింబాలే. అలాంటి మనుషులు మన చుట్టూ ఎందరో ఉన్నారు. రావుడి మాటలు సమాజంలో పితృస్వామ్యాన్ని బలపరిచేవి.

గోపాలరావు తప్పు తెలుసుకుని, 'ఇక వేశ్యల ఇంటికి వెళ్లనని' ప్రమాణం చేశాడు. నౌకరుకు పది రూపాయలిచ్చి భార్యను బతిమాలి తీసుకురమ్మన్నాడు. అక్కడ ఆమెతో ఏమేం మాట్లాడాలో ముందే చెప్పాడు. "నువ్వు చెప్పవలసిన మాటలు చెబుతాను. బాగా విను. పంతులికి బుద్ధి వచ్చింది. యిక ఎన్నడూ సానుల పాట యినరు. రాత్రులు ఇల్లు కదలరు. యిది ఖరారు. మిమ్ములను గెడ్డము పట్టుకొని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదలిచి ఆయన లోపములు బయలు పెట్టక రెండు మూడు రోజులలో వెళ్ళిపోయి రమ్మన్నారు. మీరులేని రోజో యుగముగా గడుపుతున్నారు. అని నిపుణతగా చెప్పు" అన్నాడు. గోపాలరావుతో మాట్లాడిన రావుడు ఇంట్లోంచి వేగంగా బయటకు వెళ్లాడు. ఇంతలో మంచం కిందినుంచి నవ్వులతో కలగలిసిన గాజుల సవ్వడి వినిపించింది. అప్పుడు మంచం కింద దాక్కున్న కమలిని కిలకిలా నవ్వుతూ బయటకు వచ్చింది. ఆ సన్నివేశం, సందర్భం, ఆమె నవ్వులు గోపాలరావులో తీవ్రమైన పశ్చాత్తాపం కలిగించాయి. దిద్దుబాటు దిశగా ఆలోచించాడు.

సమాజ-సాహిత్య సంబంధం:

1. సాహిత్యం సమాజ ప్రతిబింబం:

నాటి కాలంలో ధనవంతులు, విద్యావంతులు ఎక్కువగా వేశ్యా వ్యామోహంలో పడేవాళ్లు. గురజాడ దాన్ని యథాతథంగా కథనం చేశాడు. సాహిత్యం అంటే కల్పన కాదు, సమాజంలోని వైరుధ్యాలను చూపాలని ఆయన నమ్మాడు.

2. సాహిత్యం దిద్దుబాటు చేయాలి:

సాహిత్యం కేవలం విమర్శిస్తే సరిపోదు, పరిష్కారం చూపాలి. కమలిని పాత్ర ద్వారా గురజాడ పరిష్కారం చూపాడు. స్త్రీ విద్య, చాకచక్యమే సంఘ దురాచారాలకు విరుగుడు.

3. భాషలో నవ్యత:

ఈ కథలో పాత్రల సంభాషణ వాడుక భాషలో, కథనం సులభ గ్రాంథికంలో ఉండటం వల్లే ఇది ప్రజల్లోకి వెళ్లింది. సాహిత్యం ప్రజల భాషలో ఉంటేనే సమాజాన్ని దిద్దగలదని గురజాడ నిరూపించాడు. గురజాడ అప్పారావు ఈ నాలుగు పేజీల చిన్న కథ ద్వారా నాటి సమాజానికే కాదు, నేటి సమాజానికి కూడా గొప్ప సందేశమిచ్చాడు.

1. సంస్కరణ ముసుగులోని ద్వంద్వ నీతిని నిలదీయడం:

గోపాలరావు పాత్ర: బయటకు 'వేశ్యా సంస్కరణ' కోసం వెళ్తున్నానని చెప్పి, లోపల వారి పాటలకు, వ్యామోహానికి లొంగిపోయాడు. గురజాడ దృష్టిలో 'సంఘ సంస్కర్త అంటే 'ఉపన్యాసాలు ఇచ్చేవాడు కాదు, తన జీవితాన్ని మొదట సంస్కరించుకున్నవాడు.' ముసుగు సంస్కర్తలను గురజాడ ఈ కథలో ఎండగట్టాడు.

2. స్త్రీ విద్యే సమాజ దిద్దుబాటుకు మూలం:

> **ఓరి మూర్ఖుడా... భగవంతుడి సృష్టిలోకల్లా ఉత్కృష్టమైన వస్తువ విద్య నేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహము పంచి యిచ్చాడు. యింగ్లీషువాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగునికన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డదా?**

కమలిని ఏడవలేదు, తిట్టలేదు, పుట్టింటికి నిజంగా వెళ్లలేదు. చదువుకున్న తెలివితో, నౌకరు రావుడి సహాయంతో ఒక చిన్న నాటకమాడి భర్త వైఖరినీ, ఆలోచననూ మార్చింది.

ఈ కథ ద్వారా గురజాడ సంఘ సంస్కరణ అనేది తమ ఇళ్లల్లోనే మొదలై, తర్వాత సమాజాన్ని సంస్కరించాలని చెప్పాడు. 'ఆడారు చదువు నేరిస్తే యేటైతది?' అని నౌకరు అడిగిన ప్రశ్నకు గోపాలరావు ద్వారా గురజాడ సమాధానం చెప్పించాడు. చదువుకున్న స్త్రీలు ఇల్లు దిద్దుతారు. మగవాడిని దిద్దుతారు. చివరికి సమాజాన్నే దిద్దుబాటు చేస్తారు. స్త్రీ విద్య అనేది కుటుంబ సంస్కరణకు మొదటి మెట్టు.

భారతదేశంలో 1910 నాటికి వేశ్యాలోలత్వం ఒక సామాజిక వ్యసనంగా ఉండేది. ధనవంతులు, విద్యావంతులు కూడా అర్ధరాత్రి వరకు వేశ్యావాటికల్లో గడిపేవాళ్లు. దానివల్ల కుటుంబాలు చితికిపోయేవి. ఈ వ్యసనం వల్ల నష్టపోయేది బయటి స్త్రీ కాదు, ఇంట్లోని భార్య, పిల్లలు. కాబట్టి మగవాడు

> దేవుడు మనిషిని చేస్తే, మనిషి కులాన్ని, మతాన్ని, దేవుళ్లను ఎందుకు చేస్తున్నాడు? అసలు మీ అస్తిత్వం ఏమిటి? అని గురజాడ నిలదీశాడు. ఇది 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే భావనకు కొనసాగింపు.



తన బాధ్యతను గుర్తించాలి. "లెంపలు వాయించుకుంటున్నాను, రేపటి నుంచి మరి పాటకు వెళ్లను" అని గోపాలరావు అనుకోవడమే గురజాడ కోరుకున్న దిద్దుబాటు. కమలిని భర్తను కొట్టలేదు, తిట్టలేదు. అతను చేసిన తప్పే అతనికి తెలిసేలా చేసింది. తాను లేకపోతే అతని జీవితం ఎంత శూన్యమో అర్థమయ్యేలా చేసింది. సమాజంలోని దురాచారాలను తిట్టడం, శిక్షించడం వల్ల పోవు. ప్రేమతో, తెలివితో దిద్దుబాటు చేయడం వల్లనే మనుషులు మారుతారు. అందుకే ఈ కథకు 'దిద్దుబాటు' అని పేరు పెట్టాడు.

దిద్దుబాటు – ప్రాసంగికత:

ఈ రోజు వేశ్యాగృహాల స్థానంలో పబ్బులు, సోషల్ మీడియా వ్యసనాలు వచ్చాయి. అర్ధరాత్రి వరకు బయట తిరిగే భర్తలు, నిర్లక్ష్యానికి గురయ్యే కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయి. కాబట్టి 116 ఏళ్ల క్రితం గురజాడ ఇచ్చిన సందేశం, చదువుకున్న స్త్రీలు చాకచక్యంతో కుటుంబాన్ని, సమాజాన్ని దిద్దగలరనేది ఇప్పటికీ నిజం.

2

'మీ పేరేమిటి?'

ఇది గురజాడ రాసిన ఈ నాలుగు కథానికల్లో అత్యంత తాత్వికమైన కథ. దీని ఉపశీర్షికే దీని తిరుగుబాటు తత్వాన్ని చెబుతుంది. "దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా! మీ పేరేమిటి?". ఈ శీర్షికే ధిక్కారంగా ఉంది. ఇది కుటుంబ కథ కాదు. మతాన్ని, గురువు వ్యవస్థను ప్రశ్నించే కథ. శాస్తులుగారు, విద్యార్థి రామ్మూర్తి మధ్య చర్చతో మొదలయ్యే ఈ కథ, రామగిరి (రామతీర్థాలు) అనే విష్ణు క్షేత్రంలో జరిగిన శైవ – వైష్ణవ ఘర్షణను కథలో కథగా చెబుతుంది. పురాణ కథలపై విద్యార్థులు శంకలు వేస్తే, శాస్తులుగారు "వెధవ చదువు! మీ మతులు పోతున్నాయి. మీరు వొట్టి బౌద్ధులు" అని తిట్టేవారు.

"బౌద్ధులు ఎటువంటివారు శాస్తులుగారూ?" అని రామ్మూర్తి అడిగాడు. దానికి శాస్తులుగారు ఆదివారం రాజుగారి పూలతోటలో ఉపన్యాసం ఇస్తానన్నారు. ఆదివారం మధ్యాహ్నం పూల తోటలో పాతిక మంది విద్యార్థులు ఇసుకలో కూర్చుంటే, శాస్తులుగారు గావంచా పరచుకుని బౌద్ధమతంపై ఉపన్యసించారు. పది నిమిషాలు అయ్యేసరికి రామ్మూర్తి "శాస్తులుగారూ, తాము శలవిస్తూన్నదంతా సర్వదర్శన సంగ్రహములోనిది కాదండీ" అని అడ్డుకున్నాడు. శాస్తులుగారి ఉపన్యాసం సర్వదర్శన సంగ్రహం నుంచి వల్లించినదేనని బయటపడింది. ఆశ్చర్యపడిన శాస్తులుగారు రామ్మూర్తి దగ్గరున్న 'బుద్ధ చరిత్ర' పుస్తకం అందుకుని చదివి, అర్థం చెప్పడం మొదలుపెట్టారు.

పాత్రలు:

శాస్తులుగారు: డొల్ల జ్ఞానానికి, గ్రాంథిక పాండిత్యానికి ప్రతీక. ప్రశ్నను భరించలేని, అణచివేసే పాత తరం గురువు. ఆయనకు దేవుడి గురించి తెలియదు, దేవుడి గురించి రాసిన పుస్తకాల గురించి మాత్రమే తెలుసు.

రామ్మూర్తి: గురజాడ కోరుకున్న కొత్త తరం విద్యార్థి. ప్రశ్నించేవాడు, పరిశీలించేవాడు, గుడ్డిగా నమ్మనివాడు. ఇతడే నిజమైన హేతువాది.

'మీ పేరేమిటి?' అనే ప్రశ్న తాత్వికతకు సంబంధించింది. ఈ ప్రశ్న మనుషుల్ని ఉద్దేశించినది కాదు, మనుషులు సృష్టించిన కులాన్ని, మతాన్ని, దేవుడిని ఉద్దేశించింది. దేవుడు మనిషిని చేస్తే, మనిషి కులాన్ని, మతాన్ని, దేవుళ్లను ఎందుకు చేస్తున్నాడు? అసలు మీ అస్తిత్వం ఏమిటి? అని గురజాడ నిలదీశాడు. ఇది 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే భావనకు కొనసాగింపు. శాస్తులుగారు 'బౌద్ధులు' అని తిట్టుగా వాడితే, గురజాడ దాన్ని గౌరవంగా తీసుకున్నాడు. ఎందుకంటే బౌద్ధం దేవుడిని, వేదాన్ని, కులాన్ని ప్రశ్నించిన తొలి భారతీయ హేతువాద ఉద్యమాల్లో ఒకటి. ప్రశ్నించే ప్రతి విద్యార్థిని బౌద్ధుడు అంటే, అది గురజాడకు గర్వకారణం.

ఈ కథ ద్వారా గురజాడ సమాజానికి ఇచ్చిన సందేశం ఒక్కటే. 'దేన్నీ గుడ్డిగా నమ్మవద్దు, ప్రతీదాన్నీ ప్రశ్నించండి' అని. 'మత గ్రంథాలను, గురువులను, సంప్రదాయాలను 'మీ పేరేమిటి?' అని ప్రశ్నించండి. మీ అసలు స్వరూపం ఏమిటి, మీరు మనిషికి మేలు చేస్తున్నారా, కీడు చేస్తున్నారా? అని

నిలదీయండి' అనే సందేశమిచ్చాడు. నేటి సోషల్ మీడియా యుగంలో ఫేక్ న్యూస్, మత విద్వేషాలు, మాయల బాబాల మోసాలు చూస్తుంటే, 1910లో గురజాడ అడిగిన ఈ ప్రశ్న ఇంకా ఎంత అవసరమో అర్థమవుతుంది.

3

మతము: విమతము

మతం అనేది మనుషుల మధ్య ఎట్లాంటి అగాధాల్ని సృష్టిస్తుందో చెప్పిన కథ 'మతము: విమతము'. ఇది వాస్తవిక కథ. చరిత్రలో జరిగిన యథార్థ సంఘటన కేంద్రంగా రాసిన కథ. గోల్కొండ పాదుషాల ఫర్మానుల సీలు అక్కడ విప్పడం వల్ల దానికి సికాకోల్ అనే పేరు వచ్చిందని స్థానికులు అంటారు గానీ, అది నిజం కాదని గురజాడ రాశాడు. నిజానికి ఆ పట్టణం చాలా ప్రాచీనమైంది. అది శ్రీకాకుళము. అక్కడ శ్రీకాకుళేశ్వర క్షేత్రం ఉన్నది. దాన్ని పడగొట్టి షేరు మహమ్మదు పెద్ద మసీదు కట్టాడు.

మతాలన్నీ మనుషుల్ని నిలువునా చీల్చేవే. ఏ మతమూ మనుషుల ఆకలి తీర్చలేదు. బాధలు తీర్చలేదు. ఇవి రెండూ తీర్చని మతం మానవాళికి వద్దని చెప్పడానికే గురజాడ ఈ కథ రాశాడు. మతం కంటే మానవత్వమే గొప్పదని చాటిన కథ ఇది.

అది కార్తీకమాస శుక్లపక్ష దశమి నాటి సాయంత్రం. ముప్పయేళ్ల నారాయణభట్టు, ఇరవై ఏళ్ల లోపు వయసున్న పుల్లంభట్లు అనే ఇద్దరు యువకులు కలిసి తూర్పు నుంచి పట్టణానికి వస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతానికి రాగానే నారాయణభట్టులో ఆనందం వెల్లువెత్తింది. "పుల్లా... మా వూరొచ్చాంరా. యిట్టి వూరు భూప్రపంచములో వుండబోదురా. కాళిదాసు అవంతిని ఉద్దేశించి చెప్పిన మాటలు దీనియందు వర్తిస్తున్నాయిరా, యేమి నది, యేమి వూరు. ఇది శ్రీకాకుళేశ్వరుడి క్షేత్రము, యెట్టి మహా క్షేత్రమని చెప్పను" అన్నాడు పుల్లంభట్లతో. (గురుజాడలు, 2012, పుట.544)

నారాయణ నడుస్తూ నడుస్తూనే ఓచోట నిలబడ్డాడు. మాటలు తడబడుతున్నాయి. 'యేమైంది స్వామీ?' అని పుల్లంభట్లు అడిగాడు.

"యేమి చెప్పనురా పుల్లా... కోవిల గోపురం మాయమైపోయిందిరా" అని నేలపై కూలబడ్డాడు. కోవెల గోపురం లేని ఈ వూరిలో ఉండలేమనీ, మళ్ళీ కాశీకి వెళ్దామన్నాడు. పుల్లంభట్లు ఒప్పుకోలేదు. ఇంతకాలమూ నడుచుకుంటూ వచ్చింది గోపురం కోసమా? అని ప్రశ్నించాడు. 'ఆకలి కంటే గోపురమే ముఖ్యమా?' అనే ప్రశ్న ఇది. ఇంకాస్త ముందుకు నడిచిన తర్వాత అక్కడ రెండు మసీదు స్తంభాలు కనిపించాయి. ఒక్కసారిగా నిలిచిపోయి ఆ స్తంభాలను నిశితంగా చూశాడు. "కాకుళేశ్వరుడి గుడి పగలగొట్టి మ్లేచ్ఛుడు మసీదు కట్టాడు" అనుకొనెను. (గురుజాడలు, 2012, పుట.545)

"దేవుడెందు కూరుకున్నాడు స్వామీ" అని పుల్లంభట్లు ప్రశ్నించాడు. ఇది వ్యంగ్యం కూడా. ఈ ప్రశ్న ద్వారా గురజాడ సమాజ వాస్తవికతను, హేతుబద్ధ ఆలోచనను రేకెత్తించాడు. గుడి కూల్చేస్తుంటే ఆ దేవుడెందుకు ఆపలేకపోయాడు అనే ప్రశ్న ఇది. నిజంగా దేవుడుంటే కోవెల గోపురాన్ని కూల్చేస్తుంటే అడ్డుకోవాలి కదా? ఈ పాత్ర ద్వారా శాస్త్రీయతను, సమాజ వాస్తవికతను చెప్పాడు. గురజాడ అప్పారావులో వ్యంగ్యంతోనూ సామాజిక వాస్తవికతను చెప్పే టెక్నిక్ ఉన్నది. అందుకే కథలో ఇలాంటి మెరుపులు సృష్టించాడు. ఆ మెరుపుల కాంతుల్లో మానవాళిని వెలుగు దారుల్లోకి నడిపించాడు.

ఈ కథలో నారాయణభట్టు గుడి, గోపురం, మసీదు, వాటి స్తంభాలు అంటూ మాట్లాడుతున్నాడు. పుల్లంభట్లు మాత్రం ఆకలి అనే యథార్థం గురించి ఆలోచిస్తున్నాడు. మసీదు ముందు యాభై ఏళ్ల ఓ గెడ్డం ముస్లిం కూర్చొనివున్నాడు. చిలుము

మతాలన్నీ మనుషుల్ని నిలువునా చీల్చేవే. ఏ మతమూ మనుషుల ఆకలి తీర్చలేదు. బాధలు తీర్చలేదు. ఇవి రెండూ తీర్చని మతం మానవాళికి వద్దని చెప్పడానికే గురజాడ ఈ కథ రాశాడు. మతం కంటే మానవత్వమే గొప్పదని చాటిన కథ ఇది.

పీలుస్తున్నాడు. అతని దగ్గరికి వెళ్లి, "భాయీ... యిక్కడే కదా పూర్వం శివాలయం వుంటూ వచ్చింది?" అన్నాడు.

"తురక ఒక నిమిషమూరుకొని నోటిలోని పొగ నెగనూది 'హా సైతాన్కాఘర్' అని యుత్తరమిచ్చెను."

"యేం పాట్లొచ్చాయి దేవుళ్ళకి"

"దేవుళ్ళకి యే పాట్లూ లేవు – మన సాపాటు మాట ఆలోచించరేం?" (గురుజాడలు, 2012, పుట.545)

ఈ పాట్లన్నీ మనుషులకే. దేవుళ్లకు కాదు. 'మన సాపాటు మాట ఆలోచించరేం?' అనే మాట వెనక సామాజిక వాస్తవికత ఉన్నది. ఆకలి సత్యం. దేవుడు నమ్మకం. విశ్వాసం. వీటికీ సామాజిక వాస్తవికతకీ పొసగదు.

నారాయణభట్టు ఆ వూరిలో ఉన్న తన బంధువులు చేబ్రోలు వారి గురించి, 'ఈ దేవాలయం దగ్గరే వారి బస ఉండేది' వారున్నారా? అని ఆ సాయిబును అడిగాడు. అతడు లేరని

స్వచ్ఛమైన తెలుగులో సమాధానం చెప్పాడు.

అప్పుడు నారాయణభట్టులో ఆందోళన కలిగింది. తన బంధువులు అక్కడ లేకపోవడం కలిచివేసింది. చిన్ననాడు ఆడుకున్న కోవెల, అక్కడి పరిసరాలు పూర్తిగా మారిపోవడం చూసి తల్లడిల్లాడు.

"అయ్యో... మా పెద మావ రామావధానులు, చిన్నమామ లక్ష్మణభట్టు దేశాంతరగతులైనారా? మృతులైనారా?" అన్నాడు.

"సాయిబూ చేతనుండి చిలుము నేలరాలి ముక్కలై నిప్పులు నలు దెసలా చెదర, 'నారాయణా' అని సమ్మోదముగా పిలిచెను." (గురుజాడలు, 2012, పుట.546)

మతం అనేది మనుషుల్ని గుర్తుపట్టకుండా మార్చేసింది. మతం వల్ల మనుషుల వేషం మారుతుంది. భాష మారుతుంది. ఆచారాలు, సంప్రదాయాలు మారుతాయి. ఎన్ని మారినా అది మనుషుల్లో మానవత్వాన్ని చంపేస్తుంది. సహజీవన తత్వాన్ని మంటగలుపుతుంది. ఒకే తల్లి బిడ్డలుగా కలిసి బతకాల్సిన మనుషుల మధ్య మారణకాండ సృష్టిస్తుంది. అందుకే గురజాడ,

"మతములన్నియు మాసిపోవును,

జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అన్నాడు. ఎప్పటికైనా జ్ఞానం, మానవీయతే సమాజానికి వెలుగుదారులు వేస్తాయి. తెలుగుజాతిని వెలుగు దారుల్లోకి నడిపించడానికి గురజాడ అడుగుజాడగా నిలిచాడు.

4

'మెటిల్డా':

ఇది అత్యంత కవితాత్మకమైన, మెరుపుతీగ లాంటి కథ. "పసుపు రాసుకొని స్నానమాడిన పైని బంగారు చాయలు దేరిన మేని సొంపు, నెమలి పింఛమువలె ఒడలును కమ్మి చెదిరిన తలకట్టూ" వంటి కవితా వాక్యాలు ఇందులో ఉన్నాయి. విమర్శకులు దీనిని "మేని సొంపు నెమలి పింఛం వలె ఒడలును కమ్మి" అంటూ వర్ణించే కవితా వాక్యాలతో కూడిన కథ అన్నారు. దీని ప్రచురణ తేదీ ఖచ్చితంగా తెలియదు. ఇందులో మూడు పాత్రలున్నాయి. 1. ముసలి భర్త, 2. అతని చిన్న వయసు భార్య మెటిల్డా, 3. ఒక కాలేజీ యువకుడు.

పాత్రలు:

మెటిల్డా: గురజాడ సృష్టించిన అత్యంత అందమైన, విషాద స్త్రీ పాత్ర. ఆమె 'మల్లెపువ్వులాంటి బట్టలు కట్టి' తిరిగే గంధర్వ కన్యలాంటిది. కానీ, అందమే ఆమెకు శాపమైంది. ఆమె తప్పు చేయదు, కానీ సమాజం, భర్త ఆమెను అనుమానించారు. ఆమె లేఖలోని "నా కాపురం మన్ననివ్వరా?" అనే ప్రశ్న నాటి స్త్రీలందరి ఆవేదన.

ముసలి భర్త: అసూయ, అనుమానం, పురుషాధిక్యతకు ప్రతీక. చిన్న వయసు భార్యను అదుపులో పెట్టాలని కళ్లెం వేశాడు. కానీ చివరికి దిద్దుబాటు చెందాడు. ఇతడు గోపాలరావు లాంటి దుష్టుడు కాదు, అమాయక అనుమానపరుడు.

కాలేజీ యువకుడు: నాటి ఆధునిక విద్యావంతుడైన యువతకు ప్రతీక. అతని చూపులు అమాయకమైన ఆకర్షణే కానీ, దురుద్దేశం కాదు. ఈ యువకుడు రోజూ మెటిల్డా ఇంటి ముందునుంచి వెళ్తూ ఆమెను చూసేవాడు. కొన్ని క్షణాల పాటు అక్కడే నిలబడేవాడు. ఇది ఆమె భర్త చూశాడు. సహించలేని అనుమానపరుడైన ముసలి భర్త, ఆ యువకుడిని ఇంట్లోకి పిలిచాడు. "ఈ ముండని తీసుకుపో. నీకు దానం చేశాను తీసుకో, నాకు శని విరగడైపోతుంది" అని కోపంగా అన్నాడు.

ఈ అవమానం తర్వాత మెటిల్డా ఆ యువకుడికి, "మీరూ, మీ నేస్తులు నా కాపురం మన్ననివ్వరా? మీకు నేనేం అపకారం చేశాను? తలవంచుకు మీ తోవను మీరు పోతే నే బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్ధం" అని ఉత్తరం రాసింది. ఆ తరువాత కొన్ని రోజులకు ముసలి భర్తకు తన భార్య యోగ్యురాలని, నిజాయితీపరురాలని అర్థమైంది. తన తప్పు తెలుసుకుని, ఆ కాలేజీ యువకుడిని తన ఇంటికే పిలిపించాడు. కూర్చోబెట్టి మెటిల్డాతోనే కాఫీ ఇప్పించాడు. "మీ మాటలవల్లా, చేష్టల వల్లా నా భార్య యోగ్యురాలని తెలుసుకొన్నాను. ఆలోచించుకోగా ఆనాటి నుంచి కళ్లెం వదిలేశాను" అని చెప్పాడు. ఆనాటి నుండి భార్య స్వేచ్ఛకు వేసిన కళ్లెం తీసివేశాడు.

ఈ కథ ద్వారా గురజాడ చెప్పిన సందేశం, "భార్యా భర్తలు స్వేచ్ఛగా కుటుంబ జీవనం సాగిస్తూ ఒకరి స్వేచ్ఛను మరొకరు గౌరవించుకోవడం మూలంగానే కుటుంబ జీవితం అర్థవంతమౌతుంది" అని. మెటిల్డా కథ 'దిద్దుబాటు' కథకు కొనసాగింపు. దిద్దుబాటులో భర్త తప్పు చేస్తే భార్య దిద్దింది. మెటిల్డాలో భార్యను అనుమానించిన భర్త తన తప్పును తానే దిద్దుకున్నాడు. రెండు కథల్లోనూ గురజాడకు కావలసింది స్త్రీకి స్వేచ్ఛ, గౌరవం ఇవ్వడం.

విమర్శకుల మాటల్లో 'మెరుపుతీగ లాంటి మెటిల్డానే కాదు కథ కూడా మెరుపుతీగ లాగానే ఉంటుంది. కథంతా ఒక నిగూఢ కవితా వాక్యాలతో కదిలిపోతుంది'. గురజాడ ఇందులో వ్యావహారిక భాషతో పాటు, కవితాత్మక వర్ణనలను వాడాడు. మెటిల్డా కథకు నేటికీ ప్రాసంగికత ఉన్నది. నేటికీ అందమైన అమ్మాయిలను చూసి వేధించే యువకులు, అనుమానించే భర్తలు ఉన్నారు. 'నా కాపురం మన్ననివ్వరా?' అని మెటిల్డా వందేళ్ల క్రితం అడిగిన ప్రశ్న, 2026లో కూడా ప్రతి స్త్రీ అడుగుతున్న ప్రశ్నే. అందుకే గురజాడ కథలు కాలాన్ని దాటి నిలబడ్డాయి. అవి భావి తరానికి బాటలు వేశాయి.

భారతీయ జ్ఞాన వ్యవస్థలు జ్ఞాన సాధన పద్ధతులు

శ్రీ సుంకరణం సీతారామమూర్తి
94900 75429



భారతీయ జ్ఞాన వ్యవస్థలు ప్రధానంగా రెండు రకాలుగా ఉన్నవి. అవి: 1. పరా విద్య, 2. అపరా విద్య. పరా విద్య ఆధ్యాత్మిక లేదా పరమజ్ఞానమునకు సంబంధించినది. అపరా విద్య భౌతిక లేదా లౌకిక జ్ఞానమునకు సంబంధించినది.

భారతీయ జ్ఞాన వ్యవస్థలలో జ్ఞానమును వివిధ రకాలుగా చెప్పవచ్చును. అవి:

1) ఆధ్యాత్మిక మరియు తాత్విక జ్ఞానం
2) శాస్త్రీయ మరియు సాంకేతిక జ్ఞానం
3) భాషా మరియు సాహిత్య జ్ఞానం
4) కళా మరియు సాంస్కృతిక జ్ఞానం
5) సామాజిక మరియు నైతిక జ్ఞానం
6) పర్యావరణం మరియు వ్యవసాయ జ్ఞానం
7) ప్రాయోగిక మరియు వృత్తి జ్ఞానం

1) ఆధ్యాత్మిక మరియు తాత్విక జ్ఞానం:

ఈ జ్ఞానం జీవితం, చైతన్యం, నైతికత మరియు మోక్షం గురించి అవగాహనను కల్పిస్తుంది. భారతీయ తాత్విక జ్ఞానం ధర్మం, కర్మ, సంసారం, దుఃఖం, వైరాగ్యం వంటి భావనలను ప్రముఖంగా చర్చిస్తుంది. భారతీయ తత్త్వ జ్ఞానాన్ని తత్త్వ దర్శనం అని అంటారు. దీని అంతిమ లక్ష్యం వ్యక్తిని దుఃఖం మరియు సంసార చక్రం నుండి విముక్తి చెయ్యడం, అంటే మోక్షాన్ని సాధించడం. భారతీయ తత్త్వ శాస్త్రం సత్యం మరియు వాస్తవికత కోసం చేసే అన్వేషణ. అది విశ్వవ్యాప్తమైనది మరియు ప్రత్యేకమైనది.

భారతీయ తాత్విక జ్ఞానం ఆరు పద్ధతులలో అభివృద్ధి చెందినది. అవి: సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం, పూర్వ మీమాంస మరియు ఉత్తర మీమాంస. ఈ ఆరు తాత్విక పద్ధతులలో భారతీయ తత్త్వశాస్త్రం పరిపూర్ణతను సాధించినదని మాక్స్ ముల్లర్ చెప్పెను. ఇంకా భారతీయ తాత్విక చింతన అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం మొదలగు విధాలుగా అభివృద్ధి చెందినది. వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు భారతీయ తాత్విక చింతనకు మూలాలు. అంతే కాకుండా, చార్వాకం, బౌద్ధం, జైనంలతో కూడిన భారతీయ తాత్విక చింతన విశిష్టమైనది.

2) శాస్త్రీయ మరియు సాంకేతిక జ్ఞానం:

తార్కిక మరియు తాత్విక చింతన భారతీయ సంస్కృతికి మరియు విజ్ఞానానికి మూలం. భారతీయ తాత్విక ధోరణి ప్రకృతి పరిశీలన నుండి, శాస్త్ర విజ్ఞానం నుండి మనిషిని నిషేధించలేదు. ఆధునిక కాలంలో శాస్త్రజ్ఞులు ఏ జిజ్ఞాసతో కృషి చేస్తున్నారో, ప్రాచీన కాలంలో మన దేశంలోని ఋషులు కూడా అదే జిజ్ఞాసతో

> గణిత శాస్త్రంలో సున్నా, దశాంశ పద్ధతిలో అంకెలు వ్రాయడం, ఋణాత్మక సంఖ్యలు, బీజగణిత సంజ్ఞలు మొదలైనవి కనిపెట్టిన ఘనత హిందువులకే దక్కుతుంది.



ఆధ్యాత్మిక చింతన చేసిరి. ప్రాచీన భారత ఋషులు జ్ఞాన సముపార్జనకు కొన్ని పద్ధతులు ప్రవేశపెట్టిరి. అవి ప్రత్యక్ష ప్రమాణం, హేతు ప్రమాణం, అంతఃశిక్ష మొదలైనవి.

భారత దేశం సాధువులను, యోగులను, సన్యాసులను, తత్త్వవేత్తలను మాత్రమే తయారు చేసిందనుట హాస్యాస్పదం; భారతీయ జీవనం వివిధ రంగాలలో ప్రతిఫలించినదని సర్ జాన్ వుడ్రాఫ్ చెప్పెను. జ్యోతిషం, గణితం, వైద్యం, ఇతర శాస్త్రాలలో భారతీయులు ప్రవీణులని అల్ జాహిజ్ చెప్పెను. ఖగోళం, జ్యోతిషంలో హిందువులు కచ్చితమైన జ్ఞానం కలిగి ఉండిరని యాకోబి పేర్కొనెను. సూర్య చంద్రుల గమనాలను హిందువులు కచ్చితంగా పరిశీలించిరని కోల్బ్రూక్ పేర్కొనెను. ప్రాచీన జాతులు అన్నింటికంటే హిందువులే భూమి యొక్క విషువత్ చలనమును కచ్చితంగా గణించిరని బాల గంగాధర తిలక్ తెలియజేసెను.

విజ్ఞాన శాస్త్రాలు – ప్రాచీన హైందవ విజ్ఞానం:

1. గణిత శాస్త్రం: ప్రాచీన హిందూ గణిత శాస్త్రం నిరుపమానమైనది. గణిత శాస్త్రంలో సున్నా, దశాంశ పద్ధతిలో అంకెలు వ్రాయడం, ఋణాత్మక సంఖ్యలు, బీజగణిత సంజ్ఞలు మొదలైనవి కనిపెట్టిన ఘనత హిందువులకే దక్కుతుంది. యజ్ఞ యాగాలను నిర్వహించుటకు ప్రాచీన కాలంలోనే జ్యామితి ఉపయోగించబడినది.

2. వైద్యశాస్త్రం: వైద్యశాస్త్రంలో హిందువులు విశేషమైన కృషి చేసిరి. ఆయుర్వేదం మన ప్రాచీన వైద్య శాస్త్రం. ధన్వంతరిని దీని అధిష్ఠాన దేవతగా పరిగణిస్తారు. శరీరం పంచభూతాలచే నిర్మించబడినదని ఆయుర్వేదం చెబుతుంది. అవి గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశం. వీటిలో మొదటి మూడు ముఖ్యమైనవి. వీటి మధ్య సమతౌల్యం లోపించడం వలన వాత, పిత్త, కఫ అనే దోషాలు ఏర్పడి, రోగాలు వస్తాయని ఆయుర్వేదం చెబుతుంది. మహర్షి సుశ్రుతుడు శస్త్రచికిత్సలు చేశాడని చెబుతారు. చరకుడు చరక సంహిత అనే ఆయుర్వేద గ్రంథాన్ని రచించాడు. వాగ్భటుడు గొప్ప ఆయుర్వేద పరిశోధకుడు.

3. ఖగోళం, జ్యోతిషం: పైన పేర్కొన్నట్లు, ఖగోళం, జ్యోతిషంలో హిందువులు ప్రవీణులు. తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలతో పంచాంగాలను రూపొందించిరి.

4. కాలం, ఆకాశం: కాలం, ఆకాశం గురించి కూడా మన ఋషులు సూక్ష్మంగా ఆలోచించిరి. తృటి, నిమేషాలను కాలగణనలో అత్యంత చిన్న ప్రమాణాలుగా పెట్టుకొని కాలాన్ని లెక్కించిరి. యుగం, కల్పాలలో కాలాన్ని పెద్ద పరిమాణంలో కూడా లెక్కించిరి.

5. సూర్య సిద్ధాంతం, భూమి ఆకారం: ప్రాచీన భారత ఖగోళ విజ్ఞానంలో సూర్య సిద్ధాంతం ముఖ్యమైనది. ప్రసిద్ధ ఖగోళ శాస్త్రవేత్త వరాహమిహిరుడు తన ప్రఖ్యాత గ్రంథం పంచసిద్ధాంతికలో సూర్య సిద్ధాంతాన్ని గురించి ప్రస్తావించెను. తరువాత రెండవ భాస్కరాచార్యుడు వంటి గణిత, ఖగోళ శాస్త్రవేత్తలు ఈ గణిత, ఖగోళ సంప్రదాయాన్ని మరింత అభివృద్ధి చేసి శాస్త్రీయంగా వివరించిరి.

సూర్య సిద్ధాంతంలో సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాల స్థానాలు, గ్రహ గమనాలు, గ్రహణాలు, కాల గణన మొదలైన విషయాలు చెప్పిరి. పంచాంగ గణితం, పంచాంగ నిర్మాణానికి అవసరమైన గణనలకు సూర్య సిద్ధాంతం ముఖ్యమైన ఆధారం. నేటి సంప్రదాయ పంచాంగాలలో కూడా సూర్య సిద్ధాంతానికి సంబంధించిన గణిత పద్ధతులు ఉపయోగించబడుచున్నవి.

ఆర్యభటుడు (క్రీ.శ. 476) భూమి గుండ్రంగా ఉందని, తన చుట్టూ తాను తిరుగుతుందని చెప్పెను. చంద్రుని నీడ భూమిపై పడటం వలన సూర్య గ్రహణం, భూమి నీడ చంద్రునిపై పడటం వలన చంద్ర గ్రహణం ఏర్పడతాయని స్పష్టం చేసెను. రెండవ భాస్కరాచార్యుడు భూమికి ప్రత్యేకమైన ఆకర్షణ శక్తి ఉన్నదని చెప్పెను.

భాస్కరాచార్యుడు తన సిద్ధాంత శిరోమణి అనే గ్రంథంలోని గోళాధ్యాయంలో భూమి ఆయతాకారంలో ఉంటే మేరు పర్వతం మీద బంగారు వన్నె గల చెట్లు మనకు ఉన్నచోటు నుండే

ఎందుకు కనబడుట లేదని ప్రశ్నించెను. అలాగే లల్లాచార్యుడు కూడా భూమి బల్లపరుపుగా ఉండి ఉంటే ఎత్తైన కొండలు, వాటిపైన చెట్లు కూడా మనం కూర్చున్న చోట నుండే కనపడాలి కదా? అందువలన భూమి గుండ్రంగా ఉన్నట్లు తెలియుచున్నదనెను.

6. ఉష్ణం: మన పూర్వీకులు అగ్ని యొక్క రెండు గుణాలను చెప్పిరి. అవి వేడి, వెలుగు. సూర్య సిద్ధాంతం ప్రకారం విశ్వంలోని వేడి అంతటికీ సూర్యుడే ఆధారం.

7. కాంతి: ఉద్యోతకర మహర్షి భౌతిక వస్తువులు, వాటి నీడలను గురించి అధ్యయనం చేసెను. మహర్షి జయంతుడు కూడా వెలుగు రసాయనిక పరిణామాలను గురించి వివరించెను. ఋగ్వేదం (1.50.4) పై సాయణాచార్యుని (14వ శతాబ్దం) భాష్యంలో ఉదహరించిన ఒక శ్లోకం, సూర్యుడు అర్ధ నిమేషంలో 2,202 యోజనాలు ప్రయాణిస్తాడని చెబుతుంది. దీనిని కొందరు కాంతి వేగంగా వ్యాఖ్యానించారు; అయితే సుభాష్ కాక్ వంటి పండితులు ఇది సూర్యుని కక్ష్యా వేగానికి సంబంధించినదని భావించారు.

8. ధ్వని: మన పూర్వీకులు ధ్వని తరంగాలను గురించిన జ్ఞానం కలిగియుండిరి. శబరస్వామి గాలిని ధ్వనికి వాహకంగా పేర్కొనెను. మహర్షి విజ్ఞాన భిక్షువు ప్రతిధ్వనులను గురించి విశ్లేషణ చేసెను. ఉద్యోతకరుడు, వాచస్పతి ధ్వనులు, సంగీత స్వరాలను గురించి వివరించిరి.

9. అయస్కాంతం: శంకరమిశ్రుడు అయస్కాంతం యొక్క ప్రాథమిక విషయాలను చెప్పెను. అయస్కాంతానికి ఆకర్షించే శక్తి ఉందనెను. ఇనుము, గుండు సూదులను అయస్కాంతం ఆకర్షిస్తుంది.

10. విద్యుత్: మన పూర్వీకులకు విద్యుత్ యొక్క ప్రాథమిక పరిచయం ఉంది. ఉమాపతి ప్రకారం, విరుద్ధ స్వభావం ఉన్న పరమాణువులు పరస్పరం ఆకర్షించుకొనును. సమాన గుణాలు ఉన్న పరమాణువులు ఒకదానికొకటి దూరంగా జరుగును.

11. అణు విజ్ఞానం: కణాదుని వైశేషిక దర్శనం ప్రకారం, ప్రపంచం అణుకల్పితం. అణువులు, పరమాణువులను గురించి హిందూ దర్శనాలు వస్తునిష్ఠతో విమర్శించినవి. చలనం లేకుండా ఏ శక్తి ఉత్పన్నం కాదని మన పూర్వీకులు చెప్పిరి. పరమాణువు లోపలి అవయవాలలో కూడా చలనం ఉన్నట్లు గుర్తించిరి.

12. లోహ శాస్త్రం: మన పూర్వీకుల యశస్సు సాధించిన వివిధ రంగాలలో లోహ శాస్త్రం ఒకటి. బంగారం, వెండి, రాగి, ఇనుము లోహాలను గురించి మన ప్రాచీన నాగరికతలకు తెలిసియున్నది. ఇనుము ఉత్పత్తిలో మనం సాధించిన ప్రగతి శ్లాఘనీయమైనది. ఖనిజ పదార్థాల నుండి యశదం (జింక్) పొందడాన్ని మన పూర్వీకులు గుర్తించిరి. ఆచార్య నాగార్జునుడు రస శాస్త్రం, లోహ శాస్త్ర పరిశోధకులలో ముఖ్యుడు.

13. సస్య శాస్త్రం: సస్య శాస్త్ర అధ్యయనం ప్రాచీన కాలం నుండి మన దేశంలో జరిగింది. సస్య క్షేత్రంలో పరాశర మహర్షి రచించిన వృక్షాయుర్వేద గ్రంథానికి ప్రముఖ స్థానం ఉంది.

14. వాస్తు శాస్త్రం: మన పూర్వీకుల వాస్తు శాస్త్ర విజ్ఞానం విశిష్టమైనది. గృహ నిర్మాణం, దేవాలయాల నిర్మాణం, అపురూప కట్టడాల నిర్మాణాలలో మనకు ప్రముఖ స్థానం ఉంది.

15. అర్థశాస్త్రం: చాణక్యుడు కుశాగ్ర బుద్ధి గల మేధావి. ఆయన వేదాలు, వేదాంగాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నింటిని గురించి వివరంగా అధ్యయనం చేసాడు. అర్థశాస్త్రం రచించాడు.

కణాదుని వైశేషిక దర్శనం ప్రకారం, ప్రపంచం అణుకల్పితం. అణువులు, పరమాణువులను గురించి హిందూ దర్శనాలు వస్తునిష్ఠతో విమర్శించినవి. చలనం లేకుండా ఏ శక్తి ఉత్పన్నం కాదని మన పూర్వీకులు చెప్పిరి పరమాణువు లోపలి అవయవాలలో కూడా చలనం ఉన్నట్లు గుర్తించిరి

ఇందులో ప్రభుత్వ పాలనా పద్ధతులు, ప్రభుత్వ రాబడి మార్గాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి విశదీకరించాడు.

3) భాషా మరియు సాహిత్య జ్ఞానం:

ఇది భాష, సంభాషణ, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం మరియు సాహిత్యానికి సంబంధించిన జ్ఞానం. సంస్కృతం భారతదేశంలో ప్రాచీనమైన భాష. మన సాహిత్యం, తత్వశాస్త్రం, మతం, శాస్త్ర విజ్ఞానంపై సంస్కృతం ప్రభావం గొప్పది. సంస్కృతం మన సాంస్కృతిక వారసత్వంలో ముఖ్య భాగం. భారతదేశంలోని అనేక భాషలపై సంస్కృతం అపారమైన ప్రభావాన్ని చూపింది. తెలుగుతో సహా అనేక భారతీయ భాషల సాహిత్యాన్ని, సంస్కృతిని సంస్కృతం ఎంతగానో పోషించింది. సంస్కృత వాఙ్మయంలో పాణిని అష్టాధ్యాయి, రామాయణం, మహాభారతం, భగవద్గీత, పురాణాలు, పంచమహాకావ్యాలు ప్రధానమైనవి.

> శ్రవణం అంటే గురువు చెప్పే విషయాలను శ్రద్ధగా మరియు ఏకాగ్రతతో వినడం. మననం అంటే విన్న విషయాలను గుర్తుచేసుకొంటూ, వాటిని గురించి ఆలోచించి, అర్థం చేసుకోవడం.



4) కళా మరియు సాంస్కృతిక జ్ఞానం:

ఇది సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నృత్యం, నాటకం, 64 కళలకు సంబంధించిన జ్ఞానం. ఇందులో భరతముని నాట్య శాస్త్రం, భరతనాట్యం, హిందుస్తానీ సంగీతం, కర్ణాటిక సంగీతం, దేవాలయ కళలు, ప్రదర్శన కళలు ప్రధానమైనవి.

5) సామాజిక మరియు నైతిక జ్ఞానం:

ఇది కుటుంబం, సామాజిక వ్యవస్థలు, ఆర్థిక శాస్త్రం, న్యాయం, పరిపాలన, నైతిక విలువలు మొదలగు విషయాలకు సంబంధించిన జ్ఞానం. ఇందులో ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక శాస్త్రం, న్యాయం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు ప్రధానమైనవి. చాణక్యుని అర్థశాస్త్రం ప్రభుత్వ పాలనలో ప్రధానమైన గ్రంథం.

6) పర్యావరణం మరియు వ్యవసాయ జ్ఞానం:

ఇది ప్రకృతి, వ్యవసాయం, నీటి నిర్వహణ మొదలగు విషయాలకు సంబంధించిన జ్ఞానం. ఇందులో ప్రకృతితో సామరస్య జీవనం, పవిత్ర వనాలు, జీవ వైవిధ్య పరిరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, ఋతుకాల పంచాంగం మొదలైన విషయాలు ముఖ్యమైనవి. కృషి పరాశరం, కాశ్యపీయ కృషిసూక్తి, చాణక్యుని అర్థశాస్త్రం ఇందులో ప్రధాన గ్రంథాలు.

7) ప్రాయోగిక మరియు వృత్తి జ్ఞానం:

ఇది సంప్రదాయం మరియు ఆచరణాత్మక అభ్యాసం ద్వారా తరతరాలకు సంక్రమించిన నైపుణ్య ఆధారిత జ్ఞానం. ఇందులో చేతి మగ్గాలతో బట్టలు నేయడం, చెక్క కలప పనులు (వడ్రంగం పనులు), వెదురు పనులు (మేదరి పనులు), కుండల తయారీ (కుమ్మరి పనులు), లోహ పనులు (కమ్మరి పనులు), బంగారం పనులు (కంసాలి పనులు), సంప్రదాయ నిర్మాణ పద్ధతులు ముఖ్యమైనవి.

భారతీయ జ్ఞాన వ్యవస్థలలో జ్ఞాన సాధన పద్ధతులు: భారతీయ తత్త్వ శాస్త్రంలో జ్ఞానం ప్రమాణాల ద్వారా పొందబడుచున్నది. ఇందులో 6 ముఖ్య ప్రమాణాలు చెప్పబడినవి. అవి:

1) ప్రత్యక్షం 2) అనుమానం 3) శబ్దం 4) ఉపమానం 5) అర్థాపత్తి 6) అనుపలబ్ధి

ప్రత్యక్షం: ఇది ఇంద్రియాల ద్వారా పొందే జ్ఞానం. గులాబీ పువ్వు ఎరుపు రంగులో ఉందని చూసి గ్రహించడం, అగ్నిని తాకి అది కాలుతుందని తెలుసుకోవడం మొదలైనవి దీనికి ఉదాహరణలుగా చెప్పవచ్చును.

అనుమానం: ఇది తార్కిక ఆలోచన ద్వారా పొందే జ్ఞానం. నల్లని మేఘాలను చూసి వర్షం పడవచ్చని ఊహించి చెప్పడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును.

శబ్దం: ఇది విశ్వసనీయమైన గ్రంథాలు మరియు గురువుల ద్వారా పొందే జ్ఞానం. గురువు ద్వారా భగవద్గీతను నేర్చుకొని, వ్యక్తిత్వ వికాసాన్ని పొందడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును.

ఉపమానం: ఇది పోలిక ద్వారా పొందే జ్ఞానం. గవయం ఆవు వలె ఉంటుందని తెలుసుకుని, అడవిలో గవయాన్ని చూసి గుర్తించడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును.

అర్థాపత్తి: ఇది తార్కిక ఊహ ద్వారా పొందే జ్ఞానం. పగలు తినకపోయినా, ఒక వ్యక్తి లావుగా ఉంటే, రాత్రిపూట తింటున్నాడని ఊహించడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును.

అనుపలబ్ధి: ఇది లేని దానిని గుర్తించడం ద్వారా పొందే జ్ఞానం. బల్లపై పుస్తకం కనిపించకపోవడం వలన అది అక్కడ లేదని తెలుసుకోవడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చును.

నేటి కాలంలో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో వివిధ పద్ధతుల ద్వారా జ్ఞానాన్ని పొందుతున్నారు. అయితే ప్రాచీన భారతీయ జ్ఞాన వ్యవస్థలలో జ్ఞానాన్ని పొందడానికి శ్రవణం, మననం, నిదిధ్యాసనం అనే మూడు ముఖ్యమైన పద్ధతులను అనుసరించేవారు.

శ్రవణం అంటే గురువు చెప్పే విషయాలను శ్రద్ధగా మరియు ఏకాగ్రతతో వినడం. మననం అంటే విన్న విషయాలను గుర్తుచేసుకొంటూ, వాటిని గురించి ఆలోచించి, అర్థం చేసుకోవడం. నిదిధ్యాసనం అంటే మననం ద్వారా గ్రహించిన జ్ఞానాన్ని మరింత లోతుగా ఆలోచించి, దానిని జీవితంలో

ఆచరించడం.

ఈ మూడు పద్ధతులు కేవలం జ్ఞానాన్ని పొందడానికే కాకుండా, దానిని అర్థం చేసుకోవడం, ఆలోచించడం మరియు ఆచరణలో పెట్టడం ద్వారా సంపూర్ణమైన విద్యను అందించినవి. మన ప్రాచీన భారతీయ జ్ఞాన వ్యవస్థలు గొప్ప సాంస్కృతిక మరియు విద్యా వారసత్వాన్ని మనకు అందించినవి. ఈ జ్ఞానం ప్రధానంగా తండ్రి – కొడుకుల సంవాదం, గురు – శిష్యుల పరంపర, లౌకిక సంప్రదాయాలు, ఆచరణాత్మక అభ్యాసం ద్వారా తరతరాలకు సంక్రమించింది. ఈ విధానం భారతీయ జ్ఞాన సంపదను సంరక్షించి, నేటి విద్యా వ్యవస్థకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నది.

ప్రస్తావనలు:

1) భారతీయ తత్త్వ శాస్త్రం (మూల గ్రంథం ఇంగ్లీషులో “Indian Philosophy”): డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, జార్జ్ అలెన్ & అన్విన్, లండన్

సంపుటి 1. 1923, సంపుటి 2. 1927

2) ప్రవేశ (ఇంగ్లీషు): సంస్కృత భారతి, బెంగుళూర్, 2019 (మొదటి ముద్రణ)

3) ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్తలు, డా. గుమ్మనూరు రమేష్ బాబు, లిఖిత ప్రచురణలు, విజయవాడ, 2014

4) విజ్ఞాన సర్వస్వం (తెలుగులో)

అ) సంపుటి 9: గణిత, ఖగోళశాస్త్రములు, తెలుగు భాషా సమితి: హైదరాబాద్, మద్రాస్, 1965

ఆ) సంపుటి 2: భౌతిక, రసాయనిక శాస్త్రములు, తెలుగు భాషా సమితి: హైదరాబాద్, మద్రాస్, 1955

ఇ) సంపుటి 8: వ్యవసాయం, పశుపాలన, అటవీ శాస్త్రం, తెలుగు భాషా సమితి: హైదరాబాద్, మద్రాస్, 1964

ఈ) సంపుటి 12: ఇంజనీరింగ్, టెక్నాలజీ, తెలుగు భాషా సమితి: మద్రాస్, 1970

ఉ) సంపుటి 5: అర్థ, వాణిజ్య, భూగోళ శాస్త్రములు: తెలుగు భాషా సమితి: మద్రాస్, 1961

ఊ) సంపుటి 10: సాంఘిక శాస్త్రం: తెలుగు భాషా సమితి: హైదరాబాద్, మద్రాస్, 1965

5) మాక్స్ ముల్లర్, ది సిక్స్ సిస్టమ్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ (The Six Systems of Indian Philosophy), లాంగ్మన్స్, గ్రీన్ & కో., లండన్, 1919, పీఠిక, పుట vi

6) సర్ జాన్ వుడ్రాఫ్, ఈజ్ ఇండియా సివిలైజ్డ్? ఎస్సేస్ ఆన్ ఇండియన్ కల్చర్ (Is India Civilized? Essays on Indian Culture), 3వ ముద్రణ, గణేష్ & కో., మద్రాస్, 1922, పుటలు 184–185

7) సుభాష్ కాక్, సాయణాస్ ఆస్ట్రానమీ, ఇండియన్ జర్నల్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ సైన్స్, సంపుటి 33, 1998, పుటలు 31–36

దేశమంటే మనుషులు!

పేర్లి దాసు (దాసశ్రీ), విజయవాడ
99632 49775



దేశమంటే మట్టే కాదు - మనుషుల మమతల మేలుకొలుపు!
మనిషిని మనిషిగా చూసే మానవత్వమే దేశపు వెలుగు!
మూగబోయిన గుండెల్లో మానవతా స్వరం మోగనివ్వాలి,
కన్నీటి చారలు తుడిచే కరుణకు చేతులు కలపాలి!

కన్నెకుల్లపు కట్నకాట్లు కదిలించిన కాలం మరువక,
ఆడబిడ్డను అణచే ఆచారాల సంకెళ్లను తెంచాలి;
కులమతాల కంచెలు కూల్చి మనుషుల మధ్య వంతెనలు వేయాలి,
మగ్గిపోతున్న మానవత్వానికి మళ్లీ ప్రాణం పోయాలి!

గురజాడ కలం నేటికీ గుండెల్లో గళమై పలుకుతోంది,
మొద్దునిద్రలోని మనసులను మేల్కొలుపుతూ నడిపిస్తోంది;
అజ్ఞానపు చీకట్లను జ్ఞానకిరణాలతో చీల్చివేసి,
సమానత్వపు సూర్యోదయాన్ని సమాజమంతా చూడాలి!

స్వార్థపు గోడలు కూల్చి సమాజహితానికి పునాది వేయాలి,
అణగారిన గొంతులకు అక్షర ఆయుధమై అండగా నిలవాలి;
అభ్యుదయ ఆలోచనల జ్యోతిని ప్రతి హృదయంలో వెలిగించి,
అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యానికి నాంది పలకాలి!

మనిషి విలువను కులమతాల కొలమానాలతో కాలవక,
ధనబలంతో గౌరవాన్ని నిర్ణయించే దౌర్భాగ్యాన్ని సహించక;
సమతే మన సంస్కృతిగా, మమతే మన సంపదగా నిలిపి,
ప్రతి జీవికి గౌరవమిచ్చే సమాజాన్ని నిర్మించాలి!

వేదనలకపు చీకటిలో భయనించే వారికి దీపమై నిలవాలి,
అన్యాయపు అడుగులను అడ్డుకునే అగ్నిస్వరమై నిలవాలి;
సమాజ శ్రేయస్సే సంకల్పంగా ప్రతి అడుగూ ముందుకు వేయాలి,
మానవత్వమే మతమై మన జీవన గీతమై మారాలి!

తరాలు మారినా తరగని గురజాడ ఆశయం మనదై ఉండాలి,
"దేశమంటే మట్టీ, మనుషులు" అన్న సత్యం మన నడకకు దీపమై ఉండాలి;
భావితరాల భవితకు సమానత్వపు బాటలు పరచాలి,
అభ్యుదయ ఆంధ్రతకు మన అక్షరాలే సాక్ష్యమై నిలవాలి!

విజయ విలాసము - అభివ్యక్తి సౌందర్యము



డా.దహగాం సాంబమూర్తి
+91 94401 71746

శ్లో॥ కావ్యం యశసేర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మిత తయోపదేశయుజే॥
కావ్య నిర్మాణము కీర్తి దాయకమూ, ద్వితీయ
పురుషార్థకారకమూ. లోక స్థితిని తెలుపునదీ శుభేతరముల
నశింపజేయునదియై ఇహపర సుఖ సంధాయకమూ
కాంతాసమ్మితమూ, ఉపదేశయుక్తమునై యుండవలయునని
కావ్య ప్రకాశకర్త ముమ్మటుని నిష్కర్ష. అట్లే
శ్లో॥ నియతి కృత నియమ రహితాం, హ్లాదైకమయీ
మనన్యపరతంత్రామ్
నవరస రుచిరాం నిర్మితి మాదధతీ భారతీ కవేర్జయతు
– కావ్య ప్రకాశము

అంటే కవియైన వాని ముఖాన్నుండి వెలువడే సరస్వతి లోక ధర్మ నియత నియమములు లేనిది. ఆనందమయమైనది. స్వతంత్రమైనది. నవరసాలచే మధురమైనది. అట్టి కవి యొక్క భారతికి జయమగు గాక! యని ప్రస్తుతిస్తూ ...

"కవిత్వము ఒక సృష్టి. ఈ సృష్టి బహిస్సృష్టి, అంతస్సృష్టియని ద్వివిధము. అనగా దృశ్యమాన సృష్టి యొకటైనచో దాని పరమార్థమొక సృష్టి. దృశ్యమానమైన జగత్తు అంతయూ నశ్వరమే. నశ్వరమైన సృష్టి పరమార్థమును కనుగొనలేనంత వరకు మానవులకు అదియే తథ్యము. ఆ పైగలదే పరమార్థము. కవి సృష్టికి ఈ పరమార్థమే పదార్థము. అంటే జడప్రకృతి యగు పదార్థమునకు చైతన్యము నొసగు "తేజస్సు" కవిసృష్టికి పదార్థము. కవి సృష్టి తేజోమయము.. అందు నశ్వరమగు జడత్వముండదు. ఈ దృష్ట్యా కావ్యసృష్టి తత్త్వప్రధానము" అంటూ డా. పాటిబండ మాధవశర్మ 'కవిత్వము' అను తమ వ్యాసం (సారస్వత వ్యాసములు, తృతీయ సంపుటము, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ, హైద్రాబాద్, పుట-142)లో అభిప్రాయపడిన విధంగా.. భగవంతుని మనస్సులో జనించిన సంకల్ప ఫలితమే ఒక సృష్టి.. ఆ సృష్టి భగవత్సంకల్పానుకరణము.. ఆ సృష్టికి కావ్యమనుకరణము. కవి యా సృష్టిని వీక్షించి దాని తత్త్వమును ఆకలింపు జేసుకొని ముగ్ధుడైనాడు. ఆయనలో గల రసికత్వము, తాత్త్వికతలను కలగలపి అభివ్యక్తీకరించాడు. ఈ అభివ్యక్తి కవియొక్క సత్యత, ఋషిత్వముల ఫలితము.. అందువల్లే 'నానృషిః కురుతే కావ్యం' అను మహితోక్తి. పరమమూ.. ఆ పూర్ణ సత్యమూయైనది. ఈ విషయాన్నే Moulton అను పండితుడు 'Poetry is an arrangement of reality' అని భావించాడు.

మహోన్నతమైన జగద్రహస్యమును వ్యక్తముచేయుటకు కవి.. ఋషి.. తన మనోనేత్రమున దర్శించిన సూక్ష్మజగత్తును సృష్టించును. దృశ్యమాన ప్రపంచమందు అసంబద్ధములుగా దోచు విషయ కలాపములు కావ్య ప్రపంచమందు.. ఆనందసుందరములై, ఆనుషంగికములునై, అవినాభావములనై ప్రవర్తిల్లి పాఠకలోకమును పరవశింపజేయును. అంటే ప్రత్యక్ష జగత్తులో పరస్పరాపేక్షములు కాని విషయములు కావ్య జగత్తులో ఏక సూత్రమున సంఘటింపబడును. ఉదాహరణమునకు..

> చేమకూర వేంకటకవి లక్ష్మణామాత్యుల తనయుడు. శ్రీ సూర్యనారాయణ వర ప్రసాద లబ్ధ సారస్వత సుధాసార జనిత యశోలతాంకూరము. అతడు సదారాధిత బుధసమాజుడు..



సూర్యాస్తమయంతోనే చీకట్లను పారద్రోలే చంద్రికను.. సామాన్యార్థములోనే చెప్పుకుంటాము. కాని కావ్యమందు ప్రియుల సమావేశము, చంద్రికల మధ్య కార్యకారణ సంబంధాలున్నట్లు కవి సమర్థిస్తాడు.

కవి సృష్టి పాఠకులకు శబ్దార్థరూపమున లోచనీయమవుతుంది. అంటే కావ్య ప్రపంచ వ్యక్త రూపము శబ్దార్థములు.. ఈ శబ్దార్థములు నిసర్గములు, మనోహరములు, ప్రకృతి చిత్రములు, ప్రశాంతతమములు యైననే కవి ఆశయము నెరవేరుతుంది. అలా సువ్యక్తములైన శబ్దములు వశ్యవాక్కు గల కవికి మాత్రమే తప్ప ఇతరులకు సాధ్యం కావు.. ఈ భావనాపరంపరతో భగవంతుని సృష్టివంటిదే సృష్టియని.. "The poet creates another Nature and other fortunes as if he were another God" అన్న Scaliger అను పండితుల అభిప్రాయంతోనూ

"ప్రతిభైవ చ కవీనాం కావ్యకారణ కారణమ్

వ్యుత్పత్త్యభ్యాసౌ తస్యా ఏవ సంస్కార కారకౌ, నతు కావ్యహేతూ".. అన్న రాజశేఖరుడు అను ప్రఖ్యాత ఆలంకారికుని దృష్టిలోనూ.. 'ప్రతిభా వ్యుత్పత్తోఃః ప్రతిభాశ్రేయసీ' అన్న మహితోక్తి ప్రకారం.. వ్యుత్పత్తిహీనత వలన కలుగు లోపములను ప్రతిభ కప్పిపుచ్చగలదన్న వాస్తవాలకు ప్రతిరూపంగా.. గుణవిశిష్టమైన కావ్య జగన్నిర్మాణమునకు పూనుకొనిన భావుకుడు, కవిత్వము శబ్ద చిత్ర నిర్మాణాత్మక కళయని, విద్యా పరిశ్రమ జన్మజన్యమైన చిత్త సంస్కారముతో.. కావ్య పఠనవేళ పాఠకునకు భావనాత్మక నిర్వృతిని (Imaginative Pleasure) కల్గించుటకు "నభావహీనోస్తి రసః నభావోరసవర్జితః పరస్పర కృతా సిద్ధి రసయో రసభావయోఃః" అంటే భావములేని రసము లేదు. రసవర్జితమైన భావమూ లేదు. ఈ రెండునూ అన్యోన్యాశ్రితములని దృఢముగా విశ్వసించిన ఫలితమే దక్షిణాంధ్రయుగపు తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన అపూర్వ అపురూప కావ్యము.. విజయ విలాసము.. ఆ కావ్య సృష్టికర్తయే ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసాల చేవగల కవి.. చేమకూర వేంకట కవి.

చేమకూర వేంకటకవి లక్ష్మణామాత్యుల తనయుడు. శ్రీ సూర్యనారాయణ వర ప్రసాద లబ్ధ సారస్వత సుధాసార జనిత యశోలతాంకూరము. అతడు సదారాధిత బుధసమాజుడు.. కృష్ణాధ్వరి ప్రభృత సరస కవీంద్రుల సాహచర్యముతో బాటు, సరస కవి పండితుడు, పరిపాలకుడునైన రఘునాథ నాయకుని సేవనము లభించిన యశోధనుడు. వాగ్దేవీ కటాక్షము వలన లభించిన కమనీయ కవితాశక్తికి తన దీక్షాయుత కృషిని జతచేసి.. సరసశృంగార భంగిమలను, మనోహారియైన కథా సన్నివేశములను, జాతివార్తా చమత్కారములు, శ్లేషయమకాద్యాలంకార వరవర్ధనలతో తీర్చిదిద్దిన కావ్యమే విజయ విలాసము. కవి పండిత ప్రశంసలను పొంది.. సకల కవితా గుణాధిక్యత గల్లి దక్షిణాంధ్ర యుగమున వెలువడిన ప్రబంధములలో అగ్రగణ్యమై మూడాశ్వాసములుగా ప్రవర్తిల్లుతున్న ఈ కావ్యము పంచకావ్యముల సరసన నిలువదగిన కావ్యము.

కృతిభర్త:

ఈ కావ్య కృతిభర్త కళాప్రియుడు, సౌందర్యోపాసకుడు, కవి పండిత పోషకుడు, మాన్యమత పరమార్థమును గ్రహించిన అద్వైత భావనా ప్రపూర్ణుడు. మధ్వాచార్య పీఠమునలంకరించిన సుధీంద్రులకు తమ ఆస్థానములో కనకాభిషేకమును జేసి ఆ ఆచార్యోత్తముని గౌరవించిన వాడు. అపారమేధోనిధి. తంజావూరు (రాజధాని)ను వాణీ నిలయంగా, రసరాజధానిగా తీర్చిదిద్దిన అభినవ భోజుడు.. సుకవితాభోజుడు.. చతుష్షష్టి విద్యావిదుడు.. రఘునాథ నాయకుడు.. ఆయన స్వయంగా కవి.. ఆయన సంస్థానము కవి పండితులు, కళావిదులు, రసహృదయులతో కళకళలాడుచుండెడిది. ఈ విషయాన్నే సుభాషిత రత్న భాండాగారం (183) "కళారత్నం గీతం, గగనతల రత్నం, దినమణి, సుధారత్నం విద్వాన్ శ్రవణ పుట రత్నం హరికథా, నిశారత్నం చంద్రః శయనతల రత్నం శశిముఖీ, మహేరత్నం శ్రీమజ్జయతి రఘునాథోనృపవరః" అని సకల

రాజకులశ్రేష్ఠుడుగా రఘునాథుని కొనియాడింది.

వేంకటకవి రఘునాథుని అనుయాయి. అతని ఆస్థానంలోని వాడు. ఈ దృష్ట్యా తన ప్రభువైన రఘునాథులకు నచ్చిన కవిత్వ లక్షణములను.. రసపుష్టి, ప్రతిపద చమత్కారము, జాతి వార్తలు, అర్థగౌరవము, ప్రసన్నతలను తన రచనలో మేళవించి ఏలిక మెచ్చుకొనునట్లు రమణీయార్థ గుణములతో సంపన్నమైన విజయ విలాస కావ్యాన్ని రచించాడు. ఈ నేపథ్యముతో విజయవిలాసములోని వేంకట కవి కవిత్వ పటుత్వ సంపదను చవిచూద్దాం.

ఇతివృత్తము:

విజయవిలాసము త్రివిధ సన్నివేశ చిత్రితము. ఆ సన్నివేశములు శృంగారరస సమన్వితములు. అర్జునుడు తీర్థయాత్రా సందర్భమున ఉలూచి యను నాగకన్యను, చిత్రాంగదయను రాచకన్నియను, శ్రీకృష్ణుని సహోదరియైన సుభద్రను వివాహమాడిన సరస సన్నివేశాల.. మధ్యలో.. నందాద్యప్సరసల వృత్తాంతము పెనవేసుకొని.. తన గణనీయ కవిత్వ రచనా సమర్థతా ప్రకటనకు కమనీయ పదజాల సంపదలు జోడించి కవి ఏర్చికూర్చిన ప్రబంధమిది.

ఈ ప్రబంధమందలి మూలకథ భారతమునందలిది. నన్నయ రాసిన భారత భాగం – ఆదిపర్వము అష్టమాశ్వాసమునుండి గ్రహింపబడిన ఈ వృత్తాంతమును చేమకూర కొన్ని మార్పులకు లోనుచేశాడు. అర్జునుడు పాండవ మధ్యముడు. తీర్థయాత్ర సందర్భమున క్రమముగా నాగకన్య ఉలూచిని, మానుషకన్య చిత్రాంగదను, దివ్యాదివ్యకన్య సుభద్రను వివాహమాడిన సన్నివేశాలతో బాటు సౌభద్ర సరస్సు తీరంలో నందాద్యప్సరసలకు శాపవిమోచన కల్గించిన వృత్తాంతము జతజేయబడినది. ఇందు శ్రీకృష్ణుని పనుపున ఇంద్రప్రస్థమునకు వచ్చి సుభద్ర సౌందర్యాతిశయమును గదుడు నివేదించుట. ఒక బ్రాహ్మణుడు తన అపహృత ధేనువును వెతికి పెట్టమని మొరపెట్టుకొనగా అర్జునుడు ఆ గోరక్షణార్థము రాజుననుమతి కోరుటకు ధర్మజు మందిరమునకేగుట, పాండవులు తాము అంతకు ముందు ఏర్పరుచుకున్న సమయము (నియమము – నిబంధనము – కట్టుబాటు)ను అతిక్రమించిన కారణాన అర్జునుడు తీర్థయాత్రలకేగుట నేపథ్యంతో సాగిన ఈ కథ. కాశికాపురి.. నాగలోకము.. మణిపురము.. సౌభద్రాది పంచతీర్థములు.. ద్వారక.. లతో ముగిసి తిరిగి ఇంద్రప్రస్థనగరికి సుభద్రతో కూడి అర్జునుడు వచ్చుటతో.. ఈ కావ్యం 669 (672) గద్యపద్యాలలో విస్తరించినది. ఈ యాత్రా సమయంలో విశారదుడను చెలిమికాడు అర్జునుని వెంటనంటియున్నాడు.

ఇతివృత్తములో చేమకూర కవి చేతుల మీదుగా జరిగిన మూడు వివాహాలలో ఉలూచి (నాగకన్య) ప్రౌఢగా, చిత్రాంగద (మానుషకన్య) ముగ్ధగా, సుభద్ర (దివ్యాదివ్యకన్య – శ్రీకృష్ణుని సోదరి) మధ్యగా వర్ణితమై.. వివాహకార్యాలు కూడా వరుసగా గాంధర్వము (ఉలూచి), బ్రాహ్మ్యము (చిత్రాంగద, మలయధ్వజుని కూతురు), రాక్షసము (సుభద్ర)గా.. కావ్య కథా నిర్మాణం వినూత్నమైన మలుపులతో అపూర్వముగా మువ్వురు మనోహరులైన నాయకామణులను సుందరుడు యగు దక్షిణ నాయకుడు అను సూత్రముతో కూర్చినట్లున్నను.. సుభద్రా వివాహ వృత్తాంతమే అత్యంత విపులంగా వర్ణితమై.. రసహృదయులైన పాఠకులను మరీ మరీ.. పఠనోన్ముఖులను జేయుచున్న ఈ కావ్యము దక్షిణాంధ్రయుగ సాహిత్యంగా వ్యవహరింపబడుతున్న తెలుగు సాహిత్యంలోని ఒక మణిపూసయని పండిత విమర్శకుల అభిప్రాయం.

> **వేంకటకవి రఘునాథుని అనుయాయి. అతని ఆస్థానంలోని వాడు. ఈ దృష్ట్యా తన ప్రభువైన రఘునాథులకు నచ్చిన కవిత్వ లక్షణములను.. రసపుష్టి, ప్రతిపద చమత్కారము, జాతి వార్తలు, అర్థగౌరవము, ప్రసన్నతలను తన రచనలో మేళవించి ఏలిక మెచ్చుకొనునట్లు రమణీయార్థ గుణములతో సంపన్నమైన విజయ విలాస కావ్యాన్ని రచించాడు.**

ఛందస్సు:

ఈ కావ్యమునందలి ఛందస్సు లయోత్కర్షహేతువై రసానంద ప్రాప్తికి తోడ్పడుతోంది. ఇందుకు వేంకటకవి పలు ఛందోరీతులైన వృత్తాలు, ఆటవెలదులు.. సీసములు.. తేటగీతులు.. కందములను.. ఆశ్వాసాంతమున భుజంగ ప్రయాతము, తోటకము వంటి ఇతర ఛందోవైవిధ్యములతో బాటు ఈ కవి శార్దూల మత్తేభములను, మరియు ఉపజాతులను లలిత లలిత సందర్భాలలో ఉపయోగించి పాఠకులు, విమర్శకుల దృష్టిని ఆకర్షించాడు. ఉదాహరణమునకు ఇంద్రప్రస్థ పురవర్ణనకు, ఇష్టదేవతాస్తుతులకు శార్దూలాన్ని ఎంచుకొన్నాడు. పురవర్ణనములో భాగంగా చాతుర్వర్ణాలను సీస పద్యంలో.. భవనములు, కోట, అగడ్డలను ఉత్పల, చంపకమాలలతో, కాంతామణుల విలాస గతుల వర్ణనమును సీస పద్యాల్లో, సుభద్ర యౌవనాతిశయ సూచనను పంచచామర వృత్తములో, ప్రవహించే గంగానది వర్ణనమున భుజంగప్రయాతమును, విరహాతిశయ వర్ణనమున తరలమను

> అంగిరసము శృంగారము. వీరము, కరుణము, రౌద్రము, అద్భుతము ఇత్యాదులు అంగరసములు, శృంగారము రసరాజమని ఆలంకారికుల మతం. ఈ మాట వినగానే పాఠకుల ఆలోచన సంభోగ శృంగారమన్న భావనవైపు మొగ్గుతుంది



వృత్తమును.. వివాహ సన్నద్ధుడైన పెండ్లి కొమరుడి వర్ణనమున లయవిభాతిని.. రసానుగుణ విన్యాసముతో.. భావశబలతకు, వస్తు వర్ణనమునకు, చమత్కార భావనా పుష్టిని.. దృష్టిలో పెట్టుకొని సముచితంగా.. సందర్భోచితంగా ఎంపిక చేసుకొన్న తీరు అపూర్వము. ఇలా సందర్భోచిత ఛందముల ఎంపిక చేమకూర వేంకటకవి ఛందశ్శాస్త్ర పరిజ్ఞానమునకు నిదర్శనమని చెప్పవచ్చు.

రసము:

ఈ కావ్యమందలి అంగిరసము శృంగారము. వీరము, కరుణము, రౌద్రము, అద్భుతము ఇత్యాదులు అంగరసములు, శృంగారము రసరాజమని ఆలంకారికుల మతం. ఈ మాట వినగానే పాఠకుల ఆలోచన సంభోగ శృంగారమన్న భావనవైపు మొగ్గుతుంది. ఈ భావన, శృంగార రసములో ఒక పార్శ్వమే గాని సంపూర్ణము గాదు. అంతేగాక కావ్యమునందు.. సంభోగశృంగార వర్ణనములు ఉపేక్షితములు. వాస్తవానికి శృంగారమను పదమునకు సంస్కృత నిఘంటువుల ననుసరించి సురతము, నాట్యము, రసము, ముఖాలంకారము, నుదుట ధరించు సిందూర చూర్ణము, లవంగ పుష్పము అను అర్థములున్నాయి. ఈ అర్థాలలో సురతము అను భావనకు కావ్య రచనలో స్ఫురణ యోగ్యతే తప్ప.. అక్షర బద్ధ యోగ్యత లేదు. ఒకవేళ అక్షర బద్ధం చేస్తే ఆ కావ్యం.. మలిన శృంగార ప్రబంధమౌతుంది. ఈ దృష్ట్యానే చేమకూర వేంకటకవి శృంగారమునకు గల ఇతర అర్థపార్శ్వాలను తన రచనకు స్వీకరించి.. ఆ రసాన్ని అగణిత ఆనంద రస వాహినిలో ముంచి పాఠకుల హృదయాలను రసప్లావితం చేశాడు. ఈ దృష్ట్యానే విజయ విలాసము అమలిన శృంగార ప్రధానమైన ఉత్తమ ప్రబంధముగ తెలుగు సాహిత్య ప్రపంచంలో గణుతికెక్కినది.

దక్షిణనాయకుడుగా విజయుని (అర్జునుని) శృంగార లీలలు.. ఉలూచి, చిత్రాంగద, సుభద్రలను వివాహమాడుటలు.. మూడు సన్నివేశములు ఒక్కో కథాంశములో శృంగార రసమును పండించిన వేంకటకవి.. స్త్రీ పురుషుల అన్యోన్యాను రాగాలంబనము.. రత్యంకుర పల్లవ కలికా ప్రసూన ఫల భోగావస్థలను, ప్రేమ, ప్రణయ, స్నేహ, రాగాను రాగములను వర్ణించిన తీరు అనన్యము. అట్లే నాయికా నాయకుల మధ్య అనురాగ ఫలముగా ఉదయించు స్తంభము, అశ్రువు, స్వేదము, రోమాంచము, కంపము, వైవర్ణ్యము అను సాత్త్విక భావములతో బాటు చక్షుప్రీతి, మనస్సంగము, సంకల్పము, అరతి, హ్రీత్యాగము, మున్నగు దశావస్థలను కూడా తన కవిత్వమందు ప్రస్ఫుటింపజేసిన చేమకూర కవీంద్రునకు.. గల రసనిష్ఠ.. రసపోషణాధికారము మాటలకందనిది. ఇందుకు గుట్టసియాడ (1–126), శయ్యకు దార్పగా (1–172), పంకేజాతములన్ (2–16), బంగరు బొంగరాల (1–215), ఒడలొప్పొంగు (2–149), అంగనగుబ్బచన్మొఱుగు (2–41) పద్యములు శృంగార రస భాండారములే.

కవిత్వము:

వేంకటకవి ప్రబంధ కవితామర్యాదలకు లోబడియే విజయవిలాసమును కూర్చినాడు. రసత్కవితా సంప్రదాయము.. జాతి వార్తా చమత్కారము.. అర్థగౌరవము.. సముచిత పదబంధముల నెంచుకొనుట, ప్రసన్నత, సౌకుమార్యతా గుణములను రంగరించుటలో ప్రబంధ కవులలో ప్రసిద్ధులైన వారికేమాత్రము తీసిపోలేదు. ఈ దృష్టితో ఈ కావ్యమందలి గుణములు, శయ్యా, శైలి, వృత్తులు, రీతులు, అలంకారములను సాహిత్య శాస్త్ర మర్యాదలను అవలోకిద్దాం.

శయ్యయన పడకయని సామాన్యార్థము. సామాన్యులకు నిమ్మొన్నతరహితమైన శయ్య సుఖదాయిని. కవులకు కావ్యశరీరమందలి శబ్దముల కూర్పు విషయము సముచితముగ నున్న అదికావ్య సౌందర్య హేతువగును. విశ్వనాథుని అభిప్రాయంలో యాపదానాం పరాన్యోన్యమైత్రీ శయ్యా.. అని నిర్వచనము. అంటే పదముల పొందిక. అందమైన పూమాలవలె కావ్యమందు పదములను కూర్చుట శయ్య. ఈ కావ్యము నందంతటా సముచిత సందర్భోచిత పదముల కూర్పే తప్ప

అన్యవిధముగా లేదు. అట్లే పాకము అను మరో కావ్య లక్షణము కూడా ఈ కావ్యమున ప్రతిఫలనం చెందినది. అర్థగంభీరత.. సౌకుమార్యత.. సరళ సుందరతలు కావ్యము కలిగియుండి, అర్థబోధనకు చెందినది పాకము. విశ్వనాథుని మతమున ద్రాక్షా నారికేళ పాకములలో బహిరంతఃస్ఫురద్రసతుల్యము ద్రాక్షాపాకము. గూఢత గల్గినది నారికేళపాకము.. ద్రాక్షాపాక రచనము సులభావగాహనకు తోడ్పడితే నారికేళపాకము అవగాహనకు కొంత క్లేశత కలది. ద్రాక్షాపాకమున మాధుర్యగుణము, వైదర్భీరీతి, కైశికీవృత్తుల సంయోగము యుంటే.. నారికేళపాకమున ఓజోగుణము గౌడిరీతి ఆరభటీవృత్తుల సంయోగం అధికంగా ఉంటుంది. అట్లే కదళీపాకమను మరో పాక భేదముంది. అరటిపండు తొక్కను ఒలిచి ఫలరసాస్వాదన చేసినట్లు కావ్యరచనను ఇసుమంత క్లేశంతో అర్థం చేసుకోవడానికి వీలు కల్గినపుడు ఆ రచన కదళీపాకంలో ఉందని ఆలంకారికులు అభివర్ణిస్తారు. ఈ కావ్యమంతటనూ ద్రాక్షా, కదళీపాకములైన పద్యములే హెచ్చు. నారికేళపాకముతో గల పద్యములు కేవలం కొన్ని చోట్ల మాత్రమే పాఠకులకు అవగాహనా క్లేశం కల్పిస్తాయి. ఈ ప్రబంధమున అర్థవృత్తులైన కైశికి, ఆరభటి, సాత్వతి, భారతులకు (వృత్తియన వ్యాపారము – అర్థవృత్తియన రసోచితమైన వ్యాపారము); విశిష్టమైన పదముల కూర్పు (వైదర్భి, పాంచాలి, గౌడి) రసమును వ్యంజింపజేయు రీతులను ఔచిత్యవంతముగా పోషించిన వేంకటకవి తెలుగు సాహిత్య సరస్వతిని సాలంకృత మొనర్చాడు.

ఇక కావ్యమునకు శబ్దార్థములు శరీరములైతే రసమాత్మయని, గుణాలంకారములు వరుసగా అంతర్బహిసౌందర్య సంవర్ధకములని ఆలంకారికుల అభిమతము. శౌర్యము, ధైర్యము మున్నగునవి ఆత్మ ధర్మములైతే మాధుర్యము రసధర్మము. ఇట్లు రసములు, గుణములకు అవినాభావ సంబంధమును విజయ విలాసమున స్థాపించిన చేమకూర కావ్యాన్ని అత్యంత మనోహరంగా మాగిన ఆమ్రఫల రసముగా తీర్చిదిద్దినాడు. గుణముల విషయమున (సంఖ్యా విషయమున) మత భేదములున్ననూ ప్రధానంగా శ్లేషము, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఔదార్యము, కాంతి, ఓజస్సు, సమాధి మున్నగునవి ప్రముఖమైనవి. కావ్యశోభాకరములైన ఈ గుణములు విజయ విలాస కావ్యమున అడుగడుగునా పాఠకుల ఆనందానుభూతికి కారణమవుతాయి. ఉదాహరణకు "కోపమొకింత లేదు బుధకోటికి గొంగు పసిండి" (1–88) అను పద్యం శ్లేషమునకు "ఒడలుప్పొంగునొయారి జూడ" (2–149) అను పద్యం ప్రసాదగుణమునకు, "చెక్కుల యందమున్ మొగము చెల్వను" (1–151) అను పద్యం మాధుర్య గుణమునకు; చంద్రకి పించలాంఛనుడు చంద్రికలీనెడు (3–131) అను పద్యం సౌకుమార్యతకు, 'ఎగుభుజంబుల వాడు మృగరాజ మధ్యంబు' (2–164) అను పద్యం సమతా గుణమునకు; 'సుందరి రానిచో నెదురు చూచుచు నుండినెపట్టె' (2–147) అను పద్యం అర్థవ్యక్తికి; 'చంద్రప్రస్తర సౌధఖేలన' (1–66) అను పద్యం ఔదార్య గుణమునకు; 'నలిన లీల సంచు నలినలి గావించు' (1–101) యను పద్యం కాంతి యనుగుణమునకు; 'ఘోటక ఖుర పుట క్షుణ్ణధరాజాత' (1–40) అను పద్యం ఓజస్సు అనుగుణమునకు; 'కలిగెబో యాయింతి కులుకు గుబ్బల జాడ శీతశైలాదుల సేవ ఫలము' (2–111) అను పద్యం సమాధి యనుగుణమునకు ఉత్తమోదాహరణములని డా. కలిదిండి వేంకట రామరాజుగారు 'విజయ విలాసానుశీలనము' అను తమ పరిశోధనా గ్రంథంలో (పుట–179 నుండి 187) పేర్కొన్నారు.

గుణముల విషయమున (సంఖ్యా విషయమున) మత భేదములున్ననూ ప్రధానంగా శ్లేషము, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థవ్యక్తి, ఔదార్యము, కాంతి, ఓజస్సు, సమాధి మున్నగునవి ప్రముఖమైనవి. కావ్యశోభాకరములైన ఈ గుణములు విజయ విలాస కావ్యమున అడుగడుగునా పాఠకుల ఆనందానుభూతికి కారణమవుతాయి.

వర్ణనములు:

చేమకూర సమయోచిత సరస వర్ణనములతో తీర్చిదిద్దిన ప్రబంధము విజయవిలాసము. ఈ కావ్యములోని వర్ణనములన్నిటిలో నాగకన్య ఉలూచి, సుభద్రా వర్ణనములు శృంగార రసమునకాటపట్టై ప్రభలనీనుచున్నవి. ప్రథమాశ్వాస ప్రారంభ దశలో శ్రీకృష్ణుల పనుపున ఇంద్రప్రస్థమున కేతెంచిన గదుని (రాయబారి) ముఖమున మరియు ప్రభాసతీర్థమున ద్వితీయాశ్వాసములో సుభద్రారూప రేఖా విలాసములను అర్జునుడు స్మరించిన ఘట్టమున, ఆ తర్వాత ఆపెను ప్రత్యక్షంగా యతిరూపమున వీక్షించిన సందర్భములను కడు జాగరూకతతో వర్ణించిన చేమకూర కావ్య గౌరవమును ఇనుమడింపజేసిన విధము పండితులు, విమర్శకుల మన్ననలకు నోచుకుంది. అట్లే వనవిహారము, సూర్యోదయ, చంద్రోదయ, ఉత్సవ, పుణ్యక్షేత్ర, జనన, సరోవరాది ఇతర సందర్భాల యందు, శృంగార, రౌద్ర, భయానక, కరుణ, అద్భుత, శాంత బీభత్సాది రసములను..

> పీతాంబరమును, శిరస్సుపై కిరీటమును, వక్షమున కౌస్తుభమును ధరించి, యాదవ వంశమునకు చంద్రుడైన కృష్ణుడు సుందరమైన మోముగల వాడు. దయారసము ఉప్పతిల్లగా.. అర్జునుని ముందు సాక్షాత్కరించాడు



ప్రబంధోచితముగా వర్ణించిన విధము అనన్యము.

పాత్రచిత్రణము:

విజయ విలాసమునందు వేంకటకవి పాత్రచిత్రణమున తన ప్రతిభా వ్యుత్పత్తుల సంపన్నతను ప్రదర్శించాడు. ఆయన చిత్రించిన పాత్రలు.. అడుగడుగునా పాఠకుల మనోనేత్రంలో కదులాడుతాయి. ఇవి ఓ రకంగా సజీవ చైతన్య మూర్తులుగా భాసిల్లుతున్నాయి. విజయవిలాసమునందలి ధర్మజుడు

శా. దేవబ్రాహ్మణ భక్తి ప్రోవు, ప్రియ వక్తృత్వంబు కాణాచి, వి
ద్యా వైదుష్యము దిక్కు, ధర్మమునకున్ దార్కాణ, మర్యాదకున్
ఠా, వౌచిత్యము జీవగఱ్ఱ, హితశిష్ట వ్రాత సంతోషణ
శ్రీవజ్రాంగి యజాత శత్రుడు మహీభృన్మాత్రుడే చూడగన్ (1–85)

ఇక విజయవిలాసమునందలి అర్జునుడు.

ఉ. అన్నల పట్ల దమ్ముల యెడాటమునన్ సముడంచు నెన్నగా
నెన్నికగన్న మేటి, యెదు రెక్కడలేక నృపాలకోటి లో
వన్నెయు వాసియుం గలిగి వర్తిలు పౌరుషశాలి, సాత్త్వికుల్
తన్ను నుతింపగా దనరు ధార్మికుడర్జును డొప్పునెంతయున్ (1–92)

నాయికలలో ఒకరైన సుభద్ర.. దివ్యాదివ్య (నాయిక)

చం. జలరుహగంధి వీనుల పసల్ నవసంఖ్య నదేమి లెక్కనున్
జెలువ నఖాంకురాలి నెలచేడియ సైకము దా నుచుక్కనున్
బొలతుక గబ్బి చన్ను గవ పువ్వుల చెండ్లను లేదు బంతనున్
గలికి ముఖారవిందమల కల్వలరాయని త్రోసిరాజనున్ (1–102)

కావ్య నాయికలలో ఒకరైన నాగకన్య ఉలూచి

ఉ. గుట్టసియాడ, గబ్బిచనుగుట్టలపై బులకాంకు రావళుల్
తెట్టువగట్ట, గోరికలు దేటలు వెట్టగ, వేడుకల్ మదిన్
దొట్టికొనంగ, నచ్చెరువు తొంగలి ఱెప్పల వీగనొత్తగా
బెట్టిన దండదీయక విభీత మృగేక్షణ సూచె నాతనిన్ (1–126)

ఆపై కావ్య నాయికలలో మరొకరైన మానుషకన్య–చిత్రాంగద

ఈ వెలంది యొడల్ పైడిలో వెలంది
యీనెలంత లలాటంబు లే నె లంత
ఈ సుపాణి రదశ్రేణి యే సుపాణి
ఈబి డారు మృగీవంద శ్రీ బిడారు (1–195)

ఇక కృతిభర్త రఘునాథ నాయకుడు.. సంగీత సాహిత్య కళావిదుడు, పోషకుడు. అతడు చేమకూర వేంకటకవి మాటలలో

మ. రసికుండౌ రఘునాథు కీర్తి సతి యౌరా! తొల్త వాగ్బంధమున్
రసవాదంబును రాజవశ్యవిధి నేరంబోలు; గానున్న, వె
క్కసపుం బ్రౌఢి వహించి, శేషఫణి మూగం జేయ, దారాద్రి ను
ల్లసము ల్వల్కగ ఛత్రచామర మహాలక్ష్ముల్ నగన్ శక్యమే. (1–18)

అట్లే రఘునాథుని అభినవ భోజరాజుగా (1–53) పద్యంలో పేర్కొని తన కావ్యాన్ని ఆయనకు అంకితమిచ్చిన సరస వచోవిలాసి.. వేంకటకవి.

ఇక సుభద్రార్జునుల వివాహమునకు కీలకసూత్రధారియైన వాడు శ్రీకృష్ణుడు. ఆయనను

ఉ. సొన్నపు సన్న చేల గటి జుట్టి, కిరీటము మౌళి దాల్చి, రే
మన్నియ తోడబుట్టు పెనుమానిక మక్కున జేర్చి, వచ్చి, చెం
త న్నిలిచెన్ దయారస మెదం బొదవన్ యదువంశ దుగ్ధవా
రాన్నిధి పూర్ణిమా విశద రశ్మి దరస్మిత చారువక్త్రుడై. (2–84)

పీతాంబరమును, శిరస్సుపై కిరీటమును, వక్షమున కౌస్తుభమును ధరించి, యాదవ వంశమునకు చంద్రుడైన కృష్ణుడు సుందరమైన మోముగల వాడు. దయారసము ఉప్పతిల్లగా.. అర్జునుని ముందు సాక్షాత్కరించాడు.. అంతేగాదు.. పాఠకులమైన మన కనుల ముందున్నూ ఆ దివ్యమోహన విగ్రహాన్ని కవి చేమకూర నిలిపాడు.

గంగాస్తుతి:

ఈ ప్రబంధమునందలి పద్యరత్నములలో ప్రత్యక్షర పుష్టిగల్గి.. కవిత్వశిల్పాన్ని ప్రకటించు పద్యము గంగానది స్తుతి..

శా. తాసైరింప కపర్ద యుండగ భవద్గర్భంబునన్ దాల్చి తే
జోసహ్యాన్ శరజన్మ గాంచి యల నీహార క్షమాభృత్ కుమా
రీసాపత్న్యము గన్న మోహపు బురంధ్రీ రత్నమౌదీవ; కా
దే సర్వజ్ఞుడు నిన్ను నేల తలపై నెక్కించుకో జాహ్నవీ॥ (1-114)

ఓ గంగాదేవీ! భరించనలవి గాని తేజస్సంపన్నుడైన కుమారస్వామిని పార్వతి సహింపజాలక (ఱెల్లుపొదలలో విడిచిన తేజమును) నీవు నీ గర్భమునందు ధరించి అతడిని కన్నావు. దానితో పర్వత రాజ పుత్రి (పార్వతి) నీకు సవతియైనది. నీవు ఈశ్వరునకు గారాబు భార్యవయ్యావు. అందువల్లే నీ సహనశక్తి నెఱిగిన ఈశ్వరుడు నిన్ను తలపై పెట్టుకొని గౌరవించాడు. పరికరము, కావ్యలింగము, శ్లేషాలంకార శోభితమైన ఈ పద్యం ఈ తరం వారికి ఓ విధంగా పారాయణ యోగ్యమే.

అలంకారములు:

"ప్రతీయమానం పునరన్యదేవ వస్త్వస్తి వాణీషు మహాకవీనాం
యత్తత్ ప్రసిద్ధావయవాతిరిక్తం విభాతి లావణ్య మివాంగనాసు"

– ఆనంద వర్ధనుడు

కావ్య శరీరమే ఇతివృత్తము. అయితే ఈ ఇతివృత్తము సహృదయ పాఠకునకు ప్రీతికారణము కావాలనుకున్నప్పుడు ఆ ఇతివృత్తాన్ని తీర్చిదిద్దు తీరుతెన్నులు ప్రముఖమైనవి. కావ్య నిర్మాణంలో లావణ్య స్పృహను, సౌందర్యానుభవాన్ని కల్గించే అంశాలలో కవి ప్రతిభ నుండి ఉద్గమించిన ద్రవ్యాలలో అలంకారం ఒకటియన్న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యుల వారి అభిప్రాయం అక్షర సత్యం. ఈ అభిప్రాయాన్ని మరింత వాస్తవానికి చేరువచేస్తున్న ప్రసిద్ధ ప్రబంధము విజయ విలాసము.

కవి భావనా పటిమ, రసపుష్టి గల రచనా శైలి కావ్యకన్య సహజ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాయి. ఇవి కావ్యానికి బాహ్యశోభ కల్గించి విపులమైన విషయానికి సంక్షిప్తతనద్ది, కథన రీతికి, వర్ణనా చాతుర్యానికి పదును పెట్టగల్గుతాయి. సహజ సౌందర్యం ఉన్నా ఏ అలంకారాలు లేక వనితాముఖం ప్రకాశించదు నకాంతమపి నిర్భూషం విభాతి వనితాముఖమ్ – భామహుడు అను ఆలంకారికుని అభిప్రాయాన్ననుసరించి.. భావవ్యక్తీకరణలో స్పష్టత.. రసపూర్ణిత కల్గించగల ప్రాణభూత తత్వాలై (ప్రాచీనాలంకారికుల ననుసరించి) అలంకారాలు పాఠకులకు రసానందాన్ని కల్గించు హేతువులవుతున్నాయి.

ఋగ్వేద ఋషుల నుండి ఆధునిక కవివతంసులవరకు అందరూ తమ కావ్య నిర్మాణశైలికి అలంకారములను ఆలంబనం చేసుకున్నారు. ఈ అలంకారాలు శబ్దాలంకారాలు (శబ్దాన్ని ఆశ్రయించినవి), అర్థాలంకారాలు (అర్థాన్ని ఆశ్రయించినవి) అని రెండు రకాలు.. ఈ శబ్దార్థాలు రెంటినీ ఆశ్రయించిన అలంకారాలను కొందరు అలంకారికులు ఉభయాలంకారాలు అని వ్యవహరించడం కూడా ఉంది. అలంకారం ఏదైనా దాని ఆశయం భావసాంద్రత. స్పష్టత, శ్రావ్యత.. మున్నగునవి దాని లక్షణములైతే ఆ రచన పాఠకులను ఆకట్టుకుంటుంది. వామనుడు అను ఆలంకారికుని దృష్టిలో ఉపమాలంకారమే.. సర్వాలంకారాలకు బీజభూతమైనా.. తర్వాతి కాలపు ఆలంకారికులు.. తమదైన ప్రతిభావ్యుత్పత్తులతో జరిపిన సూక్ష్మ పరిశీలనల ఫలితంగా భరతుడు చెప్పిన (మొదటగా) (4) అలంకారాల నుండి అప్పయ దీక్షితుల నాటికి (118) అలంకారాలు సోదాహరణంగా ఆయా కావ్యాల నుండి నిరూపితమయ్యాయి.

కవి భావనా పటిమ, రసపుష్టి గల రచనా శైలి కావ్యకన్య సహజ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాయి. ఇవి కావ్యానికి బాహ్యశోభ కల్గించి విపులమైన విషయానికి సంక్షిప్తతనద్ది, కథన రీతికి, వర్ణనా చాతుర్యానికి పదును పెట్టగల్గుతాయి.

సాహిత్య శిల్పంలో ఇంతటి విశిష్టత గల్గిన అలంకారాలు 'విజయవిలాసము' అను ప్రకృతకావ్యములో ప్రతి పద్యమునందును.. ఒకటికి మించి పాఠకులకు దర్శనమిస్తాయి.. అంతేగాదు వారి హృదయాలను రసప్లావితం చేస్తాయి. ఇందుకు కొన్ని ఉదాహరణములు చూద్దాం. (తాపీ వారి హృదయోల్లాస వ్యాఖ్య నుండి–1968)

క్షితిపయి వట్టిమ్రాకులు జిగిర్పవసంతుడు (1–210) అను పద్యంలో అర్థాంతరన్యాసాలంకారము, రసికుండౌ రఘునాథు కీర్తిసతి (1–18) అను పద్యంలో ఉత్ప్రేక్ష, శ్లేష, పరికరాలంకారాలు; శ్రీరసభావముల్ వెలయ జెప్పి ప్రబంధము (1–39) అను పద్యంలో రూపకము; ఆనతి యిచ్చెనాయది శిలాక్షరమె (1–54) అను పద్యంలో శబ్దాలంకారము పాఠకులకు ముచ్చట గొల్పుతుంది.

ఆపై (3–21) పద్యంలో అపహ్నుతి అలంకారం; సముచ్చయము (3–23)లో; లోకోక్తి, శ్లేష, పరికరములు (3–

ఆంధ్ర సాహిత్య ప్రపంచంలో నన్నయాది కవులు ప్రస్తావించని, కేవలం తన పూర్వుడు చిన నారాయణ నాయకుడు మాత్రమే ప్రస్తావించిన కవిత్వ లక్షణములైన జాతి వార్తా చమత్కారములను (మరోసారి వెలుగులోకి తెచ్చిన కవిపుంగవుడు చేమకూర వేంకటకవి.



15)లో; పర్యాయోక్తి (2-102)లో; అప్రస్తుత ప్రశంస, యమకము (2-103)లో; శ్లేష, అనుప్రాస, ఉపమ, ఉత్ప్రేక్షలు (2-106)లో; యమకము (2-24)లో; శ్లేష, సమాసోక్తి (2-31)లో; ఉల్లేఖము, అనుప్రాసము, స్వభావోక్తి (1-27)లో; ఉదాత్తము (1-23)లో; అతిశయోక్తి, వ్యతిరేకము, అంత్యానుప్రాసము (1-25)లో; అతిశయోక్తి, ఉత్ప్రేక్షలు (1-43)లో; కావ్యార్థాపత్తి (1-76)లో; ప్రతీపము, శ్లేష (1-102)లో; ముక్తపదగ్రస్తము, ఛేకానుప్రాసము, ఉపమ (1-196)లో; ఉత్ప్రేక్ష, యమకము (2-14)లో; ఉదాత్తము, యమకము, రూపకము (2-84)లో; ఉపమ, అనుప్రాసము, ముక్తపదగ్రస్తము (2-200)లో, కావ్యలింగము (2-203)లో, అపహ్నుతి (3-22)లో; పరికరాంకురము (3-208)లో; స్వభావోక్తి (3-219)లో. ఇలా ఈ కావ్యంలోని ప్రతి పద్యంలోనూ అలంకారాలు ఒదిగిపోయి శబ్దార్థాల సౌందర్యాన్ని ఇనుమడించి పాఠకులకు అమందానందాన్ని కల్గిస్తున్నాయి. చేమకూర తాను ముందు చెప్పినట్లుగానే తన మాటను తన కావ్య ప్రపంచంతో నిలబెట్టుకున్నాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

జాతివార్తా చమత్కారములు:

16వ శతాబ్దపు చివరి కవి చిన నారాయణనాయకుడు. ఆయన రాసిన కావ్యము కువలయాశ్వ చరిత్రము. ఆ కావ్యారంభమున

మ. ఒకచో శబ్దనిగుంభనంబు లొకచో యుక్తిక్రియా గౌరవం
బొకచో నద్భుత జాతి వార్త లొకచో నుజ్జృంభితత్వప్రస
ప్రకరంబుం గనిపించి నన్మదికి సంభావింపనర్హంబుగా
కకటా యేమియు లేని కబ్బమది యాహ్లాదంబు గావించునే

(ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము, ఖండవల్లి లక్ష్మీరంజనం, పుట-160)

అంటూ శబ్ద నిగుంభనము, యుక్తి క్రియా గౌరవము, అద్భుత జాతి వార్తలు, ఉజ్జృంభిత రస ప్రకరములు పాఠకుల మనసును ఉల్లసితం చేస్తాయి. ఇవి లేని కావ్యం పాఠకులనెలా అలరిస్తుందని చెప్తూ తన కవిత్వ లక్షణాన్ని పూర్వ కవుల బాటలో చెప్పుకున్నాడు.

17వ శతాబ్ది ప్రారంభంలోని వాడైన చేమకూర వేంకట కవియు తన కృతిభర్త రఘునాథ నాయకుడు ఇష్టపడే కవిత్వము, కావ్యమేదో చెప్తూ..

ఉ. తారస పుష్టిమై బ్రతి పదంబున జాతియు వార్తయున్, జమ

త్కారము నర్థగౌరవము గల్గననేక కృతుల్ ప్రసన్న గం
భీర గతిన్ రచించి మహి మించినచో యిక శక్తులెవ్వర
య్యా రఘునాథ భూప రసికాగ్రణికిం జెవిసోక చెప్పగన్ (1-31)

అంటూ తన కవిత్వ లక్షణముగా రసపుష్టి, పదములందు జాతి, వార్తలు, చమత్కారము, అర్థగౌరవములను చెప్పుకున్నాడు. వేంకటకవి తన పూర్వ కవుల కృతులన్నిటినీ చదివి యుంటేనే ఇది సాధ్యమవుతుందని భావించవచ్చు.

ఆంధ్ర సాహిత్య ప్రపంచంలో నన్నయాది కవులు ప్రస్తావించని, కేవలం తన పూర్వుడు చిన నారాయణ నాయకుడు మాత్రమే ప్రస్తావించిన కవిత్వ లక్షణములైన జాతి వార్తా చమత్కారములను (సంస్కృతాలంకారికులు, నైఘంటికులు మాత్రమే ప్రస్తావించిన కవిత్వ లక్షణాలను) మరోసారి వెలుగులోకి తెచ్చిన కవిపుంగవుడు చేమకూర వేంకటకవి. దక్షిణాంధ్ర యుగ కవులు రసహృదయులు, స్వయంగా కవులూయైన తంజావూరు నాయక రాజుల పోషణలో సరస కావ్య రచనకు.. నవనవోన్మేష కల్పనలకు.. జాతి వార్తా ప్రసంగములను జోడించి వేంకటకవి కృతకృత్యుడయ్యాడు. ఇందుకు పైన పేర్కొన్న 'తారసపుష్టిమై' అను పద్యమే ఉదాహరణము.. ఈ జాతి వార్తలకు సంబంధించిన భావనా ప్రపంచము దండి కావ్యాదర్శమున ప్రస్తావితమైనది.

శ్లో॥ నానావస్థం పదార్థానాం రూపం సాక్షాద్వివృణ్వతీ
స్వభావోక్తిశ్చ జాతిశ్చేత్యాద్యా సాలంకృతిర్యథా॥ (2-8, కావ్యాదర్శము)

దండి ననుసరించి స్వభావోక్తి లక్షణమే జాతి. స్వభావోక్తి,

జాతి అను ఈ రెండు పదములు తుల్యార్థకములు. అట్లే శబ్దకల్పద్రుమమున వార్త అనుటకు వృత్తిరస్యాం ఆస్తీతి వార్తా అను వ్యుత్పత్తి చెప్పబడినది. ఈ మాటకు సారము, నిరామయము, కృషికర్మ, జనశ్రుతి మున్నగు అర్థములను నిఘంటువులు పేర్కొంటున్నాయి. చేమకూర ప్రభృత కవులు జాతి వార్తలకవినాభావ సంబంధమున్నదని భావించిన కారణమునే వీటికి 'చమత్కారము' అను మాటను జతచేసి తమ ఉక్తి చమత్కారాన్ని తమ రచనలలో ప్రదర్శించి కృతకృత్యులయ్యారు. ఈ వార్తను.. ఓజస్సు గల కవి మాటయని, వస్తు స్వరూపముగల యథార్థ కథనమునని, జాతియన స్వభావోక్తియని, వార్తయన అర్థానర్థ వివేచనాశక్తియని ఆధునికులలో ప్రముఖులైన వేదం వేంకటరాయశాస్త్రి గారు తమ విజయ విలాస వ్యాఖ్యలో పేర్కొన్నారు. ఇంతటి విశేష పూర్ణమైన ఈ రెండు కవిత్వ లక్షణాలను తమ కవిత్వంలో రంగరించిన చేమకూర వేంకటకవికి గల పద ప్రయోగ సాధికారత, సాహిత్య శిల్పంపై సాధికారత ఎనలేనిది. ఇందుకుదాహరణముగా (మచ్చుకు) 'ఆణిమెఱుంగు ముత్తెపుటొయారము' (1-83) అను పద్యమునందు వార్త; దేవబ్రాహ్మణ భక్తి ప్రోవు (1-85), జలరుహగంధి వీనుల పసల్ నవసంఖ్య (1-102) అను పద్యముల యందు 'జాతి'; మోక్షమునకు పోవమొసలెత్తుకొని పోయె (2-43) అను పద్యంలో వార్త పాఠకులను పలుకరిస్తాయి. ఇలాంటి ఉదాహరణలను మరెన్నిటినైనా క్రోడీకరించవచ్చు.

చేమకూర, మాటల అంతరార్థాలను, విలువలను గుర్తించిన విద్వన్మణి. ప్రతి పదమ్మున గల చమత్కారమును దర్శించినవాడు. సందర్భానికి తగిన విధంగా పదాలను వాటి అర్థగౌరవానికనుగుణంగా ఉపయోగించు నేర్పు గలవాడు. అతడి మాటల విరుపులు పాఠకుల మనస్సులను దోచుకుంటాయి. "స్వకపోల కల్పిత మనోజ్ఞ కళాగతిని అనన్య సామాన్యమైన ప్రక్రియా నియమంతో ప్రతిపద్యమునందు జమత్కృతి గలుగంజెప్ప నేర్తు.." (1-50) అంటూ వేంకట కవి చెప్పిన

ఊదుకుపోవు శంఖము.. వాదుకబట్టి (1-34)

మాటల నేర్పులా, సరసమార్గములా.. (1-23)

వెండియు బైడియు దడబడు చుండుం.. (1-68)

పాఱజూచిన బరసేన పారజూచు.. (1-94)

నలిన లీల సంచు నలినలి గావించు; నించుమించులాడు నించుమించు

లేమ నగవజూపు లేమన నగు బాపు; జగమెఱుంగు దాని జగమెఱుంగు (1-101)

హిమరసైక సైకతము నందు విహరించు కైరవేషు (1-124)

అమ్మక చెల్లనా హృదయమమ్మక చెల్లదు వీని కియ్యెడన్ (1-135)

రవరవలు నెఱపు నీలపు - రవరవణముతో జెలి యరాళ కచంబుల్ (1-150)

సైకము నడుము విలాస రసైకము నెమ్మొగము.. (2-107)

విహరించున్ మలయానిలంబచట.. సహకారాళి.. సహకారాళి.. (2-53)

మంచిమగడు.. మనసుభద్ర.. మనసు భద్ర.. (3-88)

నువ్వుబువ్వ నవ్వు జవ్వని నాసిక (1-149)

పుణ్యస్థలము నెన్నడు మీరందు నరుగా నరుగానరుగా (2-165)

అను పద్యములుదాహరణములు.. ఇంతటి బిగి, జిగి గల్గిన రచనతో విజయ విలాస కావ్యము శోభించినదనుటలో విప్రతిపత్తి లేదు.

> **చేమకూర, మాటల అంతరార్థాలను, విలువలను గుర్తించిన విద్వన్మణి. ప్రతి పదమ్మున గల చమత్కారమును దర్శించినవాడు. సందర్భానికి తగిన విధంగా పదాలను వాటి అర్థగౌరవానికనుగుణంగా ఉపయోగించు నేర్పు గలవాడు. అతడి మాటల విరుపులు పాఠకుల మనస్సులను దోచుకుంటాయి.**

పద సంపదా సౌందర్యము:

ఇక కావ్య శరీరము పదములు, పదబంధములు, జాతీయములు, సామెతలు, మున్నగు వానితో ఏర్పడుతుంది. (నిర్మిత మవుతుంది). అట్లే సమాస ఘటనము కూడా కృతికి వన్నె తెస్తుంది. తెలుగు సాహిత్యంలో దక్షిణాంధ్ర యుగం వరకు తత్సమ పదాల ప్రాచుర్యం ఎక్కువ. అంటే తెలుగు పదాలు ఆయా కావ్యాల్లో లేకపోలేదు. ప్రాచీన కవులలో తిక్కన తన భారత భాగములో తెలుగు పదాలకే ప్రాధాన్యత కల్పించాడు. చేమకూర కూడా తిక్కనను ఆదర్శంగా గ్రహించి కావచ్చు.. తన రచనలో సంస్కృత పదాలను (తత్సములను) తగ్గించి.. తెలుగు, అచ్చ తెనుగు మాటలకు కావ్య గౌరవాన్ని కల్పించాడు. ఒక్కో విషయ గ్రథనంలో ఒక్కో విధంగా పదాలను కూర్చుకొనుటలో.. కృతికర్త యొక్క భాషా సామర్థ్యం, పదజాలంపై గల సాధికారత, ప్రయోగ వైవిధ్యతా శక్తియుక్తులు, ఊహాశక్తి, మున్నగు వానిపై కావ్యమందలి కథా క్రమం ఆధారపడి యుంటుంది. తద్వారా

> జాతీయము అంటే మాట చమత్కారము. చిరకాలం ఒక భాషా సమాజ వ్యవహారంలో ఒక ప్రత్యేకార్థాన్ని సూచిస్తున్న రెండు లేదా ఆ పై మాటల కలయిక.



కావ్యం చదువాలన్న ఆసక్తిని పెంచుతుంది. అందువల్లే కవులందరూ తమ కవిత్వ రచనల తీరులో తీయదనాన్ని, చమత్కారాన్ని కలగలపి (రంగరించి) రచన శ్రవణపేయము మరియు పఠన ప్రేయమొనరుస్తారు. ప్రతి కవికి తనదైన పదజాలం ఉంటూ.. ఆ పదజాలం పొందిక కూడా క్రొంగొత్త రూపాలను సంతరించుకుంటుంది. ఉదాహరణకు.. ధాత్రీచక్రము, బాహుపీఠము, కమలాప్తత, కువలయాప్తత, వాగ్బంధము, సుధారసము వంటి తత్సమ పదాలు, పదబంధాలు; కడకన్నులు; ప్రతిచేయుట; అరచట్ట (చొక్కా); పున్నమిరేలు, పసిడి మేడలు; తాసైరింప; పెల్లుసెకజల్లు; తెల్లని దొర; పువ్వారుబోడి; నువ్వు పువ్వు నవ్వు; రవరవలు; చనుగవ; వెలది యొడలు; చక్కనమ్మ వంటి అచ్చ తెలుగు బంధాలు ఒక్క ప్రథమాశ్వాసంలోనే పాఠకులను పలుకరిస్తాయి. ఇలా ద్వితీయ, తృతీయాశ్వాసాల్లోని పదాలను కూడా ప్రస్తావిస్తే.. అది ఈ కావ్యంలోని పదాల పట్టిక అవుతుందనుటలో అతిశయోక్తి లేదు.

ఇక జాతీయము అంటే మాట చమత్కారము. చిరకాలం ఒక భాషా సమాజ వ్యవహారంలో ఒక ప్రత్యేకార్థాన్ని సూచిస్తున్న రెండు లేదా ఆ పై మాటల కలయిక. ఇందుకు.. తామరతంపర (1–19); మాయముసేయుట (1–140); కొగిటజేర్చుట (1–173); జాఱుపాటు (1–172); చక్కెరబొమ్మ (2–29); నెఱికురులు, కేలు జివురులు (2–55); బరాబరిసేయుట (2–99); మేలుబంతులు (2–104); నల్లచీమలబారు (2–106); గండుమీలు (2–108); పైఠణీరవిక, చేదోడు వాదోడు (2–157); చక్కెర కెంపు మోవి (3–7); పచ్చపూసయగుట (3–12); కస్తురిచుక్క (3–13); తేఱిచూచుట (3–14); కైసేయుట, యడ్డపెట్టుట, మోవి చక్కెర పానక మగుట (3–23); ఏనుగు పాడి (1–54); విసపు విత్తు (3–25); అచ్చిక బుచ్చిక సేయుట (3–30); కల్లరిత్రాచు, నిప్పుకలు గైకొనుట (3–57; హుటాహుటి (3–142); వెగటు సూపుట, రట్టడి తనము (3–150); వేగిర కత్తె (3–205); జీవగఱ్ఱ (1–85); అమ్మకచెల్ల (1–135); తెలికన్నులు (1–139); చెట్టపట్టు (2–159); కాలుద్రొక్కు (2–159); నేలయీనుట (1–57; మిన్నుముట్టుట (3–64); జాతియంచలు (3–62); నిత్యకల్యాణము పచ్చతోరణము (1–83); బిరుదుపాత్రలు (1–89); పిలువని పేరంటము (1–78) మున్నగునవి కొన్ని ఉదాహరణములు మాత్రమే.

ఆపై సామ్యం అంటే పోలిక.. ఈ సామ్యం అను మాట నుండే సామెత అను మాట పుట్టింది. చెప్పదలచిన లేదా అభివ్యక్తీకరించదలచిన భావాలను అంతగా వివరణ అవసరం లేకుండా ఒక వాడియైన వాక్యంలో వేడిగా, తూటిలో తేల్చి చెప్పడానికి ఉపయోగపడే వాక్య ఖండికయే సామెత.. ఇందుకు ఓ సందర్భాన్ని పోలిన మరో సందర్భాన్ని తెలిపే వాక్యాన్ని ఆలంబనంగా ఉదహరిస్తారు. ఈ సామెతలకే లోకోక్తులన్న వ్యవహారమూయుంది. వీటిలో జనుల ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, అలవాట్లు కనబడతాయి. సంక్షిప్తత, బహుళ ప్రచారము, ప్రభావయుత నివేదన, సుబోధకత, దృష్టాంతత, చమత్కృతులతో జాతి అనుభవ ప్రతిబింబాలైన ఈ లోకోక్తులు చేమకూర కృతిలో పాఠకులకు మనోహ్లాదాన్ని కల్గిస్తాయి. నిండు వేడుక మిన్నందికొండదాకె (2–20); మోక్షమునకు బోవ మొసలెత్తుకొని పోయె (2–43); కుత్తుక బంటి తామరలకున్ తలమున్నలు గండుమీలకున్ (3–15); ఏ యెడనింపుగావు గణియింప నవీన వయోవిలాసముల్ (1–98); ఎయ్యెడమేలె చూతురు గ్రహింపరు జాణలు జాఱుపాటులన్ (1–172); ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా (1–210); మనమునందునది మొగమున కనిపించును (3–27); ఆడపుట్టువు పుట్టింటి కాసపడును (3–133); ఈతకు మిక్కిలి లోతు గల్గునే (1–167; పెద్దలున్నా రెఱిగి వారె పెండ్లి సేయగలరు (2–187); చదువు బెట్టగ నున్న మతియు బోయె (3–10); అందినన్ సిగయు అందకయున్న కాళ్ళు పట్టుకొనుట (3–51); నాగవలి లోపల నిష్కరమేల పలుక (3–171); అనునవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

సమకాలీన ప్రజా జీవనము:

ఆపై విజయవిలాసము నందును.. అన్ని కావ్యాలలో వలెనే..

సమకాలపు ప్రజాజీవన విధానము, ప్రజల సంస్కృతి–సంప్రదాయాలు, విశ్వాసాలు.. ఆచారాలు విపులంగా ప్రస్తావనకు నోచుకున్నాయి. వాస్తవానికి సామాజిక జీవనానికి అన్వయించని.. సంబంధం లేని కావ్యం.. పూర్ణ కావ్యత్వ లక్షణాలను సంతరించుకోదు. ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారి ననుసరించి (సాహిత్య సోపానములు, పుట–40), "కవులు విశిష్ట గుణములు గలవారైనను నితరులతో బాటు తామును సంఘజీవులే. వారు భావుకులై ఉన్నత లోకమున (ఊహాలోకంలో) విహరించు వేళ కూడా లౌకిక ప్రపంచమును మరువలేరు. ఈ ప్రపంచంతో సంబంధంలేని కవితా వ్యవసాయము నేల విడిచిన సాము వంటిది." అన్న అభిప్రాయము ప్రకారం చేమకూర కావ్యమునందునూ సమకాలిక జీవన చిత్రణము బహు పసందుగా సాగింది. ఇక సాహిత్య విమర్శకులలో ఒకరైన B.R. Mallik తమ Principles and History of Literary Criticism అను రచనలో (పుట–14) "Literature is intimately related to society.. literature is the finest expression of contemporary feelings" అని అభిప్రాయపడిన తీరుకూడా కావ్యానికి సమాజానికి మధ్యగల సంబంధాలను అభివ్యక్తం జేస్తోంది.

ఈ దృష్ట్యా విజయవిలాస కావ్యమున సమకాలీన సామాజిక చైతన్యము విస్పష్టముగా ప్రతిబింబించింది. నాటి నాయకరాజులు వైష్ణవమును అభిమానించినా ఇతర మతములను కూడా సమభావంతో సమాదరించారు. సర్వసమానత్వ స్థాపకుడు–రఘునాథ నాయకుడని నాటి చరిత్రకారులు నమోదు చేశారు. వేంకటకవి రామచంద్రుని, రంగనాథుని వర్ణించిన తీరు నాన్యతోపూర్వము. నాటి కాలమున రాజన్యులు జరిపిన ఆలయ నిర్మాణాలు ఆలయాలలోని దేవీదేవతలకు జరిపే నిత్య పూజాదికాలు, నివేదనలు, నిర్వహించు ఉత్సవాలు.. వైదిక సంప్రదాయంలోనే జరిపించేవారని ప్రకృత కావ్యముతో బాటు సమకాలీన రచనలు కూడా నిరూపిస్తున్నాయి.

జనులు తమ స్థాయికనుగుణమైన వేషధారణలో కనబడేవారు. ఇందుకు పీతాంబరములు, గండ పెండరములు.. మున్నగు భూషణములు ధరించెడివారు (అవతారికా పద్యాలు).. పురుషులు కూడా స్త్రీల వలె శిరోజ సంపదగల్గి పూలతో నలంకరించుకొనెడు వారని ఇంద్రప్రస్థ పురవర్ణనలో చెప్పబడింది. రాజులు రసికులై సుగంధ ద్రవ్యాల నలదుకొనెడివారు. స్త్రీలును తమ సౌందర్యాతిశయమునకు పసిడి గాజులు, పచ్చలహారములు, కడియములు ధరించెడి వారన్న ప్రస్తావన ఈ కావ్యంలో ఉంది. పురుషులు నుదుట ఊర్ధ్వపుండ్రములు ధరించెడి వారుగా, త్రిదండి వేషధారియైన అర్జునుడు కాషాయవస్త్రములు ధరించినట్లు, పావడలను వస్త్ర విశేషమును, పైఠణీరవికలను, కాళ్ళకు బంగారు అందియలను, ముక్కుకు ముక్కెరను ధరించెడు వారు. యువతులు వల్లెవాటు వేసుకొనుట సుభద్ర వృత్తాంతమున ప్రస్తావించబడింది.

సమాజమునందలి ప్రజలందరూ సమభావనతో తమ ప్రాచీన సంస్కృతి, సదాచారముల పరిరక్షణకు పాటు పడినట్లు వర్ణాశ్రమ ధర్మములు, కులవృత్తులను అనుసరించుచు ప్రజలందరూ ఆహారము, ఆవాసముల కొరత లేకుండా జీవితములను గడుపువారని ఈ కావ్యం సాక్ష్యమిస్తోంది. ఈ కావ్య రచన తంజావూరు ఆస్థానంలో జరిగింది. ఈ నగరము చుట్టుపక్కల కర్పూరపు అరటితోటలు, పోకచెట్లు (పూగవృక్షములు) విరివిగా ఉండేవి. ఈ నాటికీ కూడా ఈ ప్రాంతం ఇలాంటి సుగంధ ద్రవ్య వృక్షాలకు ప్రతీతి. ఇక ఇంద్రప్రస్థమున గృహిణులు తమ

> **స్త్రీ పురుషుల బంధమైన వివాహ ప్రక్రియలో మంగళస్నానము చేయించుట, వరుని పాదములు కడుగుట, తెరపట్టుట, మంగళసూత్రము కట్టుట, తలంబ్రాలు పోయుట, ధవళాలు వంటి మంగళ గీతాలు పాడుట, బువ్వాన.. అంటే పంక్తి భోజనము చేయుట అను సంప్రదాయములు ఈ నాటికీ తెలుగు వారిండ్లలో కొనసాగుతున్నవే.**

ముంగిళ్ళను ముత్యాల ముగ్గులతో అందంగా తీర్చిదిద్దేవారుగా, సంజెవేళలలో దీపముల వరుసలతో ప్రాంగణాలను తేజోమయం జేసేవారుగా వర్ణితమైంది. ఈ దృష్ట్యా నాటి ప్రజా జీవనము సుఖసంతోషాలతో నిత్యకల్యాణము పచ్చ తోరణముగా నున్నట్లు భావించవచ్చును.

ఈ నాటి వలెనే నాటి సమాజంలోనూ సంపన్న వర్గం, పేద వర్గం ఉండేవి. అయితే సంపన్న వర్గం వారు నిరాడంబరులై యణకువ గల్గి తమకు గల దానిలో పేదలకు పంచి ఇచ్చువారని ఈ కావ్యం చెప్తోంది. ధర్మపాలన, పెద్దల యందు గౌరవము, శకునములయందు విశ్వాసము కలిగిన ప్రజలు ఖండ చక్కెర (కలకండ), పంచదార విరివిగా ఉపయోగించిన సందర్భాలున్నాయి. షడ్రసోపేతమైన భోజనము, ఆపై తాంబూల సేవనము నాటి ప్రజల జీవనమున అంతర్భాగమైంది.

స్త్రీ పురుషుల బంధమైన వివాహ ప్రక్రియలో మంగళస్నానము చేయించుట, వరుని పాదములు కడుగుట,

> తంజావూరు రాజన్యులైన నాయకులు కళాపోషకులు. సంగీతము, సాహిత్యము వంటి లలిత కళలు వారి ఆస్థానమున మూడు పూవులు ఆరు కాయలుగా విలసిల్లినవి. ఈ కారణమున కావచ్చు నాటి ప్రజలు చిత్రకళ యందు ఆసక్తి గలవారై, గీత వాద్యములు శుభకార్యములలో భాగమై అతిథులకు మనోరంజకములయ్యేవి.



తెరపట్టుట, మంగళసూత్రము కట్టుట, తలంబ్రాలు పోయుట, ధవళాలు వంటి మంగళ గీతాలు పాడుట, బువ్వాన.. అంటే పంక్తి భోజనము చేయుట అను సంప్రదాయములు ఈ నాటికీ తెలుగు వారిండ్లలో కొనసాగుతున్నవే. అంతేగాదు వివాహ తంతులో కులదేవతా స్థాపన, ఐరేని కుండలను దెచ్చుట, బాసికములు కట్టుట, ముత్యాల తలంబ్రాలను (కల్గినవారిండ్లలో) బంగారు పళ్ళెరములో ఉంచుట.. మంగళవాద్యముల మ్రోతలు.. రాత్రుళ్లు దివిటీలు పట్టుట.. వధూవరులకు ఉక్కపోతను తగ్గించుటకు వింజామరలు వీచుట. వధూవరులకు ఇరు పక్షాల వారు మధుపర్కములిచ్చుట. వియ్యంపులు, వియ్యపురాండ్ర కలుపుగోలు అనురాగభరితమైన వాక్సుగంధాలతో పరస్పర ఆలింగనాలతో వివాహానంతరము వీడ్కోలు తీసుకొనుట.. వరుని గృహమున నాగబలి (నాగవెల్లి) చేయుట. వధువు తరపువారందరూ వరుని గృహమున కేతెంచుట ఈ కావ్యమున వర్ణితములైనవి.

ప్రజలు తమ తమ హోదాలకు తగినట్లుగా చిలుకలను, గోరువంకలను పెంచెడివారని, వాటికి మాటలు నేర్పెడివారని, సామాజిక మర్యాదలలో భాగంగా తమ గృహాలకు ఏతెంచిన అతిథుల తాపోపశమనార్థము పంచదార పానకమును త్రావుటకు ఇచ్చు అలవాటున్నట్లు ఈ కావ్యం తెలుపుతోంది. అట్లే 'పొంగలి' అను తీపి వంటకము ('చక్కెర పొంగలి' కావచ్చు.. నేటికీ తమిళనాడు ప్రాంతాల్లో కట్టెపొంగలి, తీపి పొంగలిగా ప్రజలు అత్యంత తృప్తిగా తినే పదార్థాలుగా కొనసాగుట మన అనుభవంలోనిదే.

తంజావూరు రాజన్యులైన నాయకులు కళాపోషకులు. సంగీతము, సాహిత్యము వంటి లలిత కళలు వారి ఆస్థానమున మూడు పూవులు ఆరు కాయలుగా విలసిల్లినవి. ఈ కారణమున కావచ్చు నాటి ప్రజలు చిత్రకళ యందు ఆసక్తి గలవారై, గీత వాద్యములు శుభకార్యములలో భాగమై అతిథులకు మనోరంజకములయ్యేవి. ఈనాడు కూడా తంజావూరు చిత్రకళ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుకు నోచుకొంది. అట్లే నాటక శాలలు, ఆలయ గోపుర నిర్మాణములు, దేవతామూర్తుల విగ్రహములు మున్నగునవి నాటి కాలపు రాజుల – ప్రజల కళాభిమానమునకు గురుతులుగా విజయ విలాసమునందు పేర్కొనబడినవి. అట్లే ప్రజలు క్రీడల యందును ఆసక్తికలవారై ఉదయ సంధ్య, సాయంసంధ్యల్లో సాముగరడీలు.. గుజ్జెనగూళ్ళు.. చదరంగం వంటి క్రీడలు వారి నిత్య కృత్యాలలో భాగమయ్యాయి. ఈ విధంగా విజయవిలాస రచనా కాలపు ప్రజల మధ్య సమరస భావన, కళా హృదయము, ధర్మరక్షణ యందు రాజుల ఏలుబడిని అనుమోదించుట. పెద్దల యందు భక్తి ప్రపత్తులు, పిల్లల యందు అనురాగమును కల్గి జీవించువారలన్న ఈ జీవన విధానము నేటికీ ఆదర్శమైనదన్నచో అతిశయోక్తి కాదు.

ఇంతటి మహోన్నత లక్షణాలను తనలో దాచుకున్న ఈ ప్రబంధము దీపాల పిచ్చయ్య శాస్త్రి, వేదం వేంకటరాయ శాస్త్రి, తాపీ ధర్మారావు ప్రభృత పండిత విమర్శకుల నాకట్టుకొంది. వీరేకాక మరెందరో ఈ కావ్యమందలి జ్ఞాన సంపదను.. అపారమూ, అగాధమూయైన.. జ్ఞాన తీర్థాన్ని వారి వారి ప్రజ్ఞాపాటవాలతో పలుకోణాల్లో ఆవిష్కరించారన్న ఆచార్య తూమాటి దోణప్ప గారి అభిప్రాయము సాభిప్రాయమే. వీరందరి ననుసరించి చేమకూర వేంకటకవి చేమకూర పాకాన పడ్డదన్న 'ఆభాణకానికి' నోచుకున్న సాహితీ స్రష్టగా, వాఙ్మయమరూఢినీయంత వాడికేడి అన్న కితాబు పొందిన వేంకటకవి తన ప్రజ్ఞాపాటవాలకు తగిన కవితా సామగ్రితో విజయవిలాస కావ్య సృష్టి చేసి ఆంధ్ర సరస్వతికి అలంకారంగా సమర్పించాడనుటలో విప్రతిపత్తి లేదు.

ఈ కావ్యంలోని ఒక ప్రత్యేక సందర్భాన్ని 'గ్రంథగ్రంథి'ని ఇటీవల 'వాఙ్మయంలో వ్యాసఘట్టాలు' అన్న బృహద్రచన.. సాహిత్య వ్యాస సంపుటి.. (2024) (అజో విభో కందాళం ఫౌండేషన్ ప్రచురణ)..లో డా. ఏల్చూరి మురళీధర రావు గారు విప్పిచూపారు. శ్రీహర్షుడు తన నైషధకావ్యంలో "గ్రంథగ్రంథి రిహక్వచిత్" అన్న భావనను, వ్యాస ఘట్టము అని పేర్కొన్న డా. మురళీధర రావు గారు విజయ విలాస కావ్యం

ప్రథమాశ్వాసంలోని ఒకింత క్లిష్టాన్వయత, శాబ్దిక, సాంస్కృతిక, అంతర్గత, సాంకేతిక, ప్రహేళికా భావార్థ ప్రౌఢతలు గల..

చం॥ క్షితిపయి వట్టి మ్రాకులు జిగిర్ప వసంతుడు దార సోపగుం

భిత పద వాసనల్ నెఱప, మెచ్చక చంద్రుడు మిన్నునం బ్రస

న్నతయును సౌకుమార్యము గనంబడ ఱాల్గరగంగజేసె; నే

గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా! (1–210)

అను పద్యాన్ని ఉదహరిస్తూ, "ఈ పద్యంలో వసంతుడు, చంద్రుడు, ఇద్దరూ ప్రకృతి విలాస కావ్యకర్తలే. ఇద్దరూ తమ శక్తి విలసనంతో మనోహరమైన ప్రకృత కావ్యము యొక్క అందచందాలను ఇనుమడింపజేసిన వారే. మన్మథుని ఆస్థానమున ప్రముఖ పాత్రను పోషిస్తున్న ఆ ఇద్దరిలో చంద్రునికి వసంతుడంటే ఎందువల్లనో అహమిహక రగుల్కొన్నది. అందుకే ఈ పద్యం" అని వాక్రుచ్చారు. ఆపై కొనసాగింపుగా చంద్రునికి వసంత విలాసం మెచ్చుగొల్పలేదు. స్వాభిమానం గలవాడు లోకంలో తనంత వాడు మరొకడుంటే నిద్ర పట్టదుకదా! అందుకే కావచ్చు.. తాను వసంతునికి మించిన శక్తిని ప్రదర్శించాడు. వసంతుడు ఎండిన మ్రాకులను చిగురింపజేస్తే.. తాను ఱాళ్ళను కరిగింపజేశాడు. ఈ పద్యంలోని సౌకుమార్యత సమాస కల్పనలోని చమత్కారం. రసోపగుంభనములు, గ్రంథగ్రంథి అంతర్గత భావసౌకుమార్యములను రచయిత (6) పుటలలో (525 నుండి 530) వసంత చంద్రుల కూర్పు – చేమకూర తీర్పు అను పేర ప్రకటించారు. ఈ పద్యాన్ని వసంత చంద్రుల పరంగా, ప్రకృతి పరంగా గుణపరంగా సమీక్షించి సమకాలము వారు మెచ్చుకొనక పోయినా, మహాకవులకు కాలాంతరములో వారి వారి కవిత్వాల గుణావగుణాల నిగ్గుతేల్చి సహృదయ సదస్సులలో గౌరవ పాత్రత సిద్ధిస్తుందని.. అందువల్లే వట్టిమ్రాకులను చిగురింపజేసిన వసంతుడు చెఱకువింటినీ, ఔదార్య సౌకుమార్యములతో ఱాల్గరగింపజేసిన సారసవైరి చంద్రుడు తనకు నచ్చిన కలువ బాణాన్ని రసజ్ఞుడైన మన్మథునకు బహూకరించి, ఆయన ఇంటిలో ఇద్దరూ మన్ననలు పొందారని వ్యాఖ్యానించి కావ్యంలోని దుర్భేద్యమైన సంక్లిష్టతను, కవి వాక్రౌఢిమను, భావశబలతా గాంభీర్యమును విడమరచి చెప్పి తనదైన కృషి ఫలనైవేద్యమును పాఠకుల కందించి ధన్యులైన సాహితీమూర్తి బ్రహ్మశ్రీ ఏల్చూరి మురళీధరరావు గారు. (మరిన్ని వివరాలకు మూలగ్రంథం చూడండి)

ఆపై అక్షరార్చన అను వాక్చలి సమూహంలో ప్రాచీన ఆధునిక సాహిత్యంపై.. ఆయా కవుల పద్యములపై వారం వారం తమ వ్యాఖ్యలను పంచిన 'కవి మందార' బిరుదాంకితులు డా.వఝుల రంగాచార్యుల వారు, విజయవిలాస కావ్యంలోని (31) పద్యాలకు చెప్పిన తమ వ్యాఖ్యలను 'విజయవిలాస విశిష్ట వ్యాఖ్య – అపూర్వము' అను పేర ఇటీవలే ప్రచురించారు. (2026 ఆగస్టు) డా.సూరం శ్రీనివాసులు గారు ఈ వ్యాఖ్యలను విశేషవ్యాఖ్యా విలాసం అని ప్రశంసిస్తే; డా. బేతవోలు రామబ్రహ్మం గారు అపురూపం అని; డా. శ్రీరంగాచార్య గారు ఉత్తమ విశ్లేషణమని; డా.లక్ష్మణచక్రవర్తి గారు పాఠ్యధార వివేచనమని; కితాబులనిచ్చారు. ఈ వ్యాఖ్యలలో వఝుల వారు కావ్యకర్త ద్వైవస్తుతి మరియు త్రిదండి స్వరూపములోని విశిష్టాద్వైత సంప్రదాయ లక్షణములను వ్యాఖ్యానిస్తూ తమకు స్ఫురించిన పరిధిలో శబ్ద చమత్కారములను.. శ్లేషములను.. వినూత్న ఆలోచనలుగా పాఠకుల ముందుకు తెచ్చి.. సాహిత్య విమర్శ భవిష్యద్గమన వివేచనకు పునాదులు నిర్మించారు.. ఇలా విజయవిలాసంలోని విశిష్టాద్వైత సంప్రదాయ కోణాన్ని ఆవిష్కరించిన వఝులవారు అభినందనీయులు. సాహిత్య చరిత్రలోనే ఈ కావ్యానుశీలనమునకు పలువురు ప్రయత్నించిన దాఖలాలున్నాయి. ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోస్తాడన్న.. కవి మాట ఈ కావ్య విషయంలో సార్థకమైనదని చెప్పవచ్చు.

వినూత్న ఆలోచనలుగా పాఠకుల ముందుకు తెచ్చి.. సాహిత్య విమర్శ భవిష్యద్గమన వివేచనకు పునాదులు నిర్మించారు.. ఇలా విజయవిలాసంలోని విశిష్టాద్వైత సంప్రదాయ కోణాన్ని ఆవిష్కరించిన వఝులవారు అభినందనీయులు. సాహిత్య చరిత్రలోనే ఈ కావ్యానుశీలనమునకు పలువురు ప్రయత్నించిన దాఖలాలున్నాయి

దక్షిణాంధ్రయుగపు తెలుగు సాహిత్య చరిత్రలో క్షీణయుగం అని పలువురు పేర్కొంటున్న కాలంలో చేమకూర తన రచనా వైదగ్ధ్యంతో సభ్యశృంగారంతో కూడిన మూడు వలపు కథలను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దినారన్న తాపీ ధర్మారావు గారి అభిప్రాయం సరియైనది. ఈ కావ్యంలోని ప్రతి పద్యం; ప్రతి పదం ఒక శబ్దచిత్రంగా, వర్ణచిత్రంగా, గుణవరిష్ఠమైన కవి సమయములకుదాహరణగా, భాషా సాహిత్యాల అంతరంగము పదాంతరంగము, పదార్థ స్పృహ, పదార్థ పార్శ్వములు.. సమాసఘటన చాతుర్యములపై గల సాధికారతతో చేమకూర

వేంకటకవి విజయ విలాస కావ్యమును ఒక దృశ్య నాటకంగా తీర్చిదిద్దాడు. పాఠకలోకం ప్రతిపద్యంలోనూ, నిబిడీకృతమైన భావనామూర్తిని ఈ కావ్య పఠన సమయంలో దర్శించి.. రసప్లావితమైన ఎడందతో మహదానందమును పొందుతుందనుటలో విప్రతిపత్తి లేదు. ఈ రసవత్కావ్యము, పిల్ల మను చరిత్రలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన విజయ విలాసము సాహిత్య శిల్పమునకు ఒక ఉదాహరణ కావ్యంగా భావించవచ్చు. అంతేగాదు ఇందలి పదసంపద ఒక పసిడిమూట. రసహృదయులైన పాఠకులు.. అంతేగాదు.. రసమును గూర్చి అంతగా తెలియని సామాన్య పాఠకులు, ఓసారి ఈ కావ్యం చదివినా.. లేదా విన్నా వారి హృదయాల్లో రసం ఉల్లసితమవుతుందనుటలో అతిశయోక్తి లేదు.

రసప్రపూర్ణమైన ఈ కావ్యమునకు "విజయ విలాసము – అభివ్యక్తి సౌందర్యము"ను పేర నాల్గు మాటలు నా అవగాహనా పరిధిలో కూర్చుటకు అవకాశం ఇచ్చిన 'ప్రకాశిక' అంతర్జాల సాహిత్య పత్రిక నిర్వాహకులు డా. కొవ్వలి గోపాలకృష్ణ గారికి కృతజ్ఞతలతో.. "బాణోచ్ఛిష్టం జగత్సర్వం" అను మహితోక్తిని విశ్వసిస్తూ..

ఇదం కవిభ్యః పూర్వేభ్యో నమో వాకం ప్రశాస్మహే।

– ఉత్తర రామ చరితమ్


డా.దహగాం సాంబమూర్తి

ఆధార రచనలు.. ఆయా రచయితలకు, ప్రచురణ కర్తలకు కృతజ్ఞతలతో..

1. విజయ విలాసము – ఎమెస్కో ప్రచురణము
2. విజయ విలాసము – వావిళ్ళ వారి ముద్రణము
3. విజయ విలాసము – హృదయోల్లాస వ్యాఖ్య, తాపీ ధర్మారావు (1968)
4. విజయ విలాసానుశీలనము – డా. కలిదిండి వేంకట రామరాజు (1983)
5. వాఙ్మయంలో వ్యాసఘట్టాలు – డా. ఏల్చూరి మురళీధరరావు (2024) (అజో విభో కందాళం ఫౌండేషన్ వారి ప్రచురణ)
6. విజయ విలాస విశిష్ట వ్యాఖ్య – డా. వఝుల రంగాచార్య (2026)
7. మల్లినాథసూరి జీవితం–రచనలు–తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురణ (2019)
8. సాహిత్య సోపానములు, ఆచార్య దివాకర్ల వేంకటావధాని, ఆంధ్ర సారస్వత పరిషత్తు హైద్రాబాద్ (1966)
9. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము – ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం (1958)
10. అంతర్జాలంలోని సమాచారం.

కాంచి

సంతోష్ శర్మ లక్కరాజు
santhoshsarma.lakkaraju@gmail.com



ఆమె పేరు కాంచి. నాకంటే అయిదేళ్ళు పెద్దది. ఊర్లో నాతో ఆడుకునే ఒకే ఒక్క వ్యక్తి ఆమె. నాతోటి పిల్లలందరూ నేను అంత చురుగ్గా ఉండనని నన్ను ఆటలలో చేర్చుకునే వాళ్ళు కాదు. కాంచి మాత్రం నాతో దాగుడు మూతలు, కోతి కొమ్మచ్చి ఇలా చాలా ఆటలు ఆడేది. ఎందుకో తనంటే నాకు వల్లమాలిన అభిమానం. ఆమెకి నేనంటే కూడా. సాయంత్రం మూడింటికి బడి అవగానే ఇంటికి వెళ్లి గబగబా బువ్వ తినేసి పరిగెత్తుకుంటూ కాంచి వాళ్ళింటికి వెళ్ళేవాడిని. అమ్మ తిట్టేది వాళ్ళింటికి వెళ్ళకు అని. అయినా నేను వినే వాడ్ని కాదు. నేనెళ్ళేసరికి కాంచి చెంగుచెంగున దూకుతూ వచ్చేది. అలా వచ్చేటప్పుడు అటు ఇటూ ఊగే ఆమె రెండు జడలు, నా దగ్గరికి వచ్చి "రాము వచ్చావా, పద ఆడుకుందాం" అని అనేటపుడు ఆమె కాటుక కన్నులలో వెలుగు, పళ్ళ వరస కనపడేలా నవ్వే ఆమె నవ్వు, ఇవి నాకింకా కళ్ళలో మెదిలే తియ్యని అనుభూతులు. బడికి సెలవిస్తే మేమిద్దరం ఎంచక్కా రోజంతా సీమ చింతకాయలు కోస్తూ, పొలం గట్లపై పరిగెడుతూ, కాలువలలో దూకుతూ ఎంతో ఆనందంగా గడిపేవాళ్ళం. ఏ పూటైనా కాంచిని కలవకపోతే నాకు చాలా దిగులుగా ఉండేది. అన్నం కూడా సహించేది కాదు. మరుసటి రోజు ఆమె నవ్వు ముఖాన్ని చూసేదాకా నాకు నిద్ర పట్టేది కాదు.

అలాంటిది ఒక వేసవి కాలం ఒక పది రోజుల పాటు ఆమెని నేను కలుసుకోలేదు. సెలవులొచ్చాయి ఇంక కాంచితో రోజంతా ఆడుకోవొచ్చు అని ఎంతో ఊహించుకున్న నాకు మొదటి రోజే ఎదురు దెబ్బ తగిలింది. ఆ రోజు ఆనందంగా కాంచి ఇంటికి వెళ్ళిన నాకు కాంచికి బదులుగా, ఒక పొట్టి లావాటి మనిషి కనపడ్డాడు. నన్ను చూసి ఎవడ్రా నువ్వు అన్నాడు చాలా కటువుగా. నేను బిక్క మొగం వేసి, "నేను రాము, కాంచి.." అంతకుమించి మాట్లాడలేకపోయాను.

"కాంచితో నీకేం పని రా?"

"మేమిద్దరం రోజూ ఆడుకుంటాం"

ఈలోపు ఇంట్లో నుండి కాంచి వాళ్ళ అమ్మ వచ్చి "నువ్వట్రా రాము. కాంచి ఇక నుంచి నీతో ఆడదు అమ్మ. వెళ్ళు వెళ్ళి నీ తోటి పిల్లలతో ఆడుకో", "రా అన్నయ్యా" అంటూ ఆ పొట్టి మనిషిని తీసుకుని ఇంట్లోకెళ్ళి తలుపేసేసింది.

నాకు ఏడుపు పొంగుకొచ్చింది. ఏం చేయాలో అర్థం కాలేదు. పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళి మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. అమ్మ వచ్చి ఏమైంది రాము అని కంగారుగా అడిగింది.


"కాంచి ఇంక నాతో ఆడటానికి రాదంటమ్మా.. వాళ్ళ అమ్మ చెప్పింది" ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ చెప్పాను.

"రాకపోతే పోనీ. అసలు ఆ ముదనష్టపు కొంపలోని పిల్లతో నీకు ఆటలొద్దని చెప్తూనే ఉన్నాను. నువ్వు విన్నావా? ఇప్పటికైనా దరిద్రం వదిలింది. ఏడవకు. రేపటి నుంచి నీ తోటి అబ్బాయిలు ఎవరితోనైనా ఆడుకో. రా లేచి వచ్చి అన్నం తిను"

"నేను తినను. నువ్వు పో పో" అని అమ్మ మీద అరిచాను కోపంగా.

ఇది జరిగి సరిగ్గా పది రోజులకి, ఓ సాయంకాలం మా ఊరి

> కాంచి కూడా నన్ను చూసింది. చూడగానే కళ్ళలో ఒక మెరుపుతో నవ్వింది. ఆ నవ్వులో ఇదివరకటి స్వచ్ఛత లేదు. అప్పుడు నాకు తెలియలేదు కానీ, ఆ నవ్వులో ఏదో భయం, అంతకంటే ఎక్కువ బాధ ఉన్నాయి. నేను కాంచి బండి మీద వెళ్ళిన త్రోవనే అలా వెనకకి తిరిగి చూస్తూ నాన్న వెంట నడిచాను.



అడ్డ రోడ్డు మీద నేను నాన్న నడిచి వస్తుంటే, కాంచి కనపడింది. ఆ పొట్టి మనిషి బండి మీద కాంచిని పట్నం వైపు తీసుకువెళ్తున్నాడు. మొహం నిండా పౌడర్ కొట్టుకుని, ఒంటి జడ నిండా ఎక్కువ పూలు పెట్టుకుని, కొత్తగా చీర కట్టుకుని ఉంది కాంచి. ఆమెని చూడటం నాకు ఆనందాన్ని కలిగించినా, ఆమె ఈ కొత్త రూపం ఏంటో వికారంగా తోచింది. కాంచి కూడా నన్ను చూసింది. చూడగానే కళ్ళలో ఒక మెరుపుతో నవ్వింది. ఆ నవ్వులో ఇదివరకటి స్వచ్ఛత లేదు. అప్పుడు నాకు తెలియలేదు కానీ, ఆ నవ్వులో ఏదో భయం, అంతకంటే ఎక్కువ బాధ ఉన్నాయి. నేను కాంచి బండి మీద వెళ్ళిన త్రోవనే అలా వెనకకి తిరిగి చూస్తూ నాన్న వెంట నడిచాను.

ఆ రోజు సాయంకాలం నేను పడుకున్న తరువాత నాన్నకి అన్నం వడ్డిస్తోంది అమ్మ. సరిగ్గా నిద్ర పట్టని నాకు వాళ్ళ మాటలు వినపడ్డాయి.

నాన్న: ఆ రంగమ్మ ఉంది కదా! కూతుర్ని కూడా వ్యాపారంలోకి దింపింది. పాపం పసి పిల్ల.

అమ్మ: అవునా! మొన్న మన పిల్లోడు ఆడుకోవటానికి వెళ్తే ఇంక మా పిల్ల బయటికి రాదు అని చెప్పిందంట. అప్పుడే నాకు అనుమానం వచ్చింది.

నాన్న: ఆ.. మనిషిని పెట్టి రోజూ రాత్రులు పట్నం పంపిస్తోంది పిల్లని. రేపట్నుంచి ఊర్లో నుంచి బిచాణా ఎత్తేసి పట్నంలోనే ఉంటారంట. ఇంక ఆ పిల్ల బ్రతుకు బుగ్గి పాలే.

అమ్మ: మరి ఆ కొంపలో పుట్టాక తప్పుతుందా. ఎవరు మాత్రం ఏం చేయగలరు. దాని కర్మ.

అమ్మ నాన్న మాట్లాడుకున్న మాటలు నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు. కానీ కాంచి ఊరు విడిచి వెళ్ళిపోతోందని మాత్రం తెలిసింది. ఇంక ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

తరువాత రోజు నేను ఇంటి బయట చెట్టు కింద ఒక్కడినే ఏదో ఆడుకుంటుండగా, కాంచి హడావిడిగా నా వైపు రావటం చూసాను. నేను వెంటనే పరిగెత్తుకుంటూ ఎదురెళ్లాను.

కాంచి వచ్చి నా అరచేతులు పట్టుకుని "రాము, ఎలా ఉన్నావు? నిన్ను కలవకుండానే వెళ్ళిపోతానేమో అని చాలా భయపడ్డాను. అమ్మ కళ్ళు కప్పి వచ్చాను. మేము పట్నం వెళ్ళిపోతున్నాం రాము. ఇంక ఈ ఊరు రాను నేను. వెళ్ళే ముందు నిన్ను ఒక్కసారి చూడాలనిపించి వచ్చాను" అని గుక్క తిప్పుకోకుండా, నీళ్లు నిండిన కళ్ళతో మాట్లాడింది.

నేను బిక్క మొహం పెట్టి "ఎందుకు కాంచి? నీకు పట్నంలో ఏం పని. ఇక్కడే ఉండొచ్చు కదా. ఎంచక్కా ఎప్పటిలాగా మనిద్దరం ఆడుకోవొచ్చు. ఉండు కాంచి, ఉండు" అని ఏడ్చేసాను.

కాంచి ఒక చిన్న అలసిన నవ్వు నవ్వి "నీకు చెప్పినా అర్థం కాదు రాము. నా బ్రతుకుకి ఇది తప్పదు. నువ్వు మాత్రం బాగా చదువుకుని పెద్దోడివి అవ్వాలి. జాగర్త. నన్ను గుర్తుంచుకుంటావు కదూ!"

నేను కాంచిని కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.


కాంచి నన్ను ఓదారుస్తూ "ఊరుకో రాము. ఊరుకో. చూడు నీకోసం ఏం తెచ్చానో!" అని చెంగు ముడి విప్పి గుప్పెడు సీమ చింతకాయలు నా చేతిలో పెట్టింది.

"ఇంక నేను వెళ్ళాలి రాము. అమ్మకి తెలిస్తే కొడుతుంది. మళ్ళీ మనం ఇంక కలవకపోవొచ్చు. కానీ నువ్వెప్పుడూ నాకు గుర్తుంటావు. ఉంటాను రాము. జాగర్త రా!" అని చెప్పి కాంచి గబగబా తిరిగి వెళ్ళిపోయింది.

అదే నేను ఆమెని చివరి సారి చూడటం.

పెళ్ళిచూపుల ప్రహసనం

ఒడియా కథమూలం:
శ్రీమతి కమల సత్పతి
అనువాదం: శ్రీ అంబల్ల జనార్దన్



ఈరోజు మళ్ళీ అమ్మ హుకుం జారీ అయింది. ముఖానికి రంగుల పూతలు పూసుకుని, అందంగా ముస్తాబై, నకిలీ నవ్వు ముసుగు తగిలించుకుని, టీ ట్రే పట్టుకుని నిర్దేశిత సమయానికి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళాలని. అమ్మ వైపు సూటిగా చూడకపోయినా నాకు అర్థమైంది అమ్మ అది నిజానికి ఆజ్ఞ కాదు, బతిమిలాడటమేనని. నా ప్రతిస్పందన ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా లేకుండా ఆమె చరచరా బయటకు వెళ్ళిపోయింది. పెళ్ళిచూపుల పరీక్షల్లో పదే పదే విఫలమవుతూ, వయసు పైబడుతున్న తన కూతురి ముందు ఎక్కువసేపు నిలబడి మాట్లాడే ధైర్యం బహుశా ఆమెలో చచ్చిపోయి ఉంటుంది. నేను కూడా ఏమీ మాట్లాడకుండా డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని, జుట్టు దువ్వుకోవడంలో మునిగిపోయినట్లు నటించసాగాను. అద్దంలో నన్ను నేను చూసుకున్నాను. పదే పదే రకరకాల పూతలు, పౌడర్లు వాడటం వల్ల ముఖంలోని సహజమైన కాంతి ఎప్పుడో మాయమైపోయింది. జీవితపు చివరి వసంతాన్ని దాటేసి, రాలిపోతున్న ఆకురాలే కాలపు ఛాయలు నా శరీరమంతా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా సరే, నన్ను నేను అలంకరించుకుంటాను, తీర్చిదిద్దుకుంటాను. నా కోసం కాదు, కేవలం ఇతరుల కోసం మాత్రమే. ఎక్కడో ఏదో ఒక మూల ఒక చిన్న ఆశ, నా రూపలావణ్యాల మసక వెనుక దాగున్న లోపభూయిష్టమైన వెలుగు ఎవరి కంటికైనా ఆనుతుందేమోనని. ఎవరికైనా నాలాంటి పనికిరాని వస్తువు కూడా అత్యవసరమైపోతుందేమోనని. కానీ నేటి వరకు నలభై, యాభై సార్లు సింగారించుకుని వేదికపైకి వచ్చి నిలబడినా, ఎవరి నుంచీ ప్రశంస గానీ, మెప్పు గానీ, మనస్ఫూర్తిగా కొట్టే చప్పట్లు గానీ దక్కలేదు. మొక్కుబడి ఓదార్పులు, మినుకుమినుకుమనే నమ్మకపు దివ్వెను వెలిగించి, ప్రేక్షకులు మళ్ళీ ఈ వైపు రాకుండానే ఈ సభాభవనాన్ని వదిలి వెళ్ళిపోతారు. వారి కపట ప్రవర్తన, మాటల వలలో పడిన అమ్మ, నాన్నల కళ్ళలో కొన్ని క్షణాల పాటు ఆశాకిరణం మెరుస్తుంది. కానీ ఆ తర్వాత అతి త్వరలోనే ఆ మెరుపు గాఢాంధకారంగా మారిపోతుంది. ఈ తంతు ఇలాగే కొనసాగుతూ ఉంది... అలసట లేకుండా, ఆగకుండా. గత కొన్నేళ్ళుగా ఈ నాటకం నిరాటంకంగా నడుస్తూనే ఉంది.

కపటపు ముసుగు వేసుకుని ప్రేక్షకుల ముందుకు వెళ్ళడానికి గతంలో కాస్త బిడియంగా ఉండేది, తల దించుకుపోయేది, నాలుక పిడచకట్టుకుపోయేది, గుండె చప్పుడు పెరిగిపోయేది, కళ్ళ ముందు చీకట్లు కమ్ముకునేవి, చెవులు మొద్దుబారిపోయేవి. కానీ ఇప్పుడు అలాంటిదేమీ లేదు. ఎవరూ ఏమీ చెప్పకముందే అర్థమైపోతుంది. ఇప్పుడు నటించే సమయం ఆసన్నమైందని. ఎన్నో ఏళ్ళుగా సాగుతున్న ఈ అయిష్టమైన ప్రక్రియలో ఒక మంచి చీర తీసి కట్టుకోవడం, ముఖానికి పౌడర్ రాసుకోవడం, జుట్టు దువ్వుకోవడం, ఆ పై నవ్వుతూ ముసిముసిగా కనిపిస్తూ

అబ్బాయి తరఫు తల్లిదండ్రులు, తోబుట్టువులు, మేనమామలు, పిన్నులు, అందరూ తమ అబ్బాయి కోసం ఒక తగిన అమ్మాయిని వెతకడానికి తరలివస్తారు. అబ్బాయిలో లోపాలు ఎన్ని ఉన్నా ఫర్వాలేదు కానీ, అమ్మాయిలో మాత్రం సకల సుగుణాలు ఉండాల్సిందే.



తనను తాను ప్రదర్శించుకునే పని యాంత్రికంగా ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోతాయి. దీనికి ఎలాంటి ముందస్తు సన్నాహాలూ అవసరం లేవు.

పెళ్ళికొడుకు తరఫువారు వస్తారు; వారితో పాటు సంబంధం లేని మరో ఐదారుగురు వ్యక్తులను వెంటేసుకు వస్తారు. నాకు తెలుసు, పిల్లని చూడటం కంటే పెళ్ళికూతురి వాళ్ళ ముందు తమ అబ్బాయి ఇంటి గొప్పలు చెప్పుకోవడానికే వాళ్ళు ఎక్కువగా ఉపయోగపడతారు. అబద్ధపు పొగడ్తలు కురిపించకపోతే, వాళ్ళ గొప్పదనం ఆడపెళ్ళివారి ముందు ఎలా ప్రదర్శితమవుతుంది! ఏది ఏమైనా, పూర్తి దర్పంతో పెళ్ళికొడుకు తరఫువారు ప్రతిసారీ వస్తారు, అమ్మ – నాన్నల అసహాయత ముందు తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తారు. వడ్డించిన పిండివంటలను గొంతు వరకు మెక్కి రకరకాల వంకలు వెదుకుతూ అమ్మాయిని శల్య పరీక్ష చేసి, 'తర్వాత కబురు చేస్తాం' అని ఎంతో దర్జాగా సెలవు తీసుకుంటారు. ఆడపిల్ల ఉన్న ప్రతి ఇంట్లోనూ ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణమే, కానీ మా ఇంట్లో ఈ ప్రహసనం కాస్త మితిమీరిపోయింది. అబ్బాయి తరఫు తల్లిదండ్రులు, తోబుట్టువులు, మేనమామలు, పిన్నులు, అందరూ తమ అబ్బాయి కోసం ఒక తగిన అమ్మాయిని వెతకడానికి తరలివస్తారు. అబ్బాయిలో లోపాలు ఎన్ని ఉన్నా ఫర్వాలేదు కానీ, అమ్మాయిలో మాత్రం సకల సుగుణాలు ఉండాల్సిందే. ఆశ్చర్యం కలిగించినా, మన దుస్థితిని గురించి ఎప్పుడూ ప్రశ్నించే హక్కు మనకు ఉండదు. భరించడం కష్టమైనా అంతా మౌనంగా భరించక తప్పదు. దుకాణంలో పేర్చిన వస్తువుల్లో ఒకటిగా మారి, కొనుగోలుదారుడి దయాదృష్టి కోసం నిరీక్షించాల్సిందే. నాన్న కళ్ళలో సుడులు తిరిగే తీవ్ర ఆందోళన, అమ్మ మనసులోని ఆక్రందన, తమ్ముడి బెదిరిపోయిన ముఖం చూసి, ఆ ఇబ్బందికరమైన పరిస్థితిలోనూ ఓర్పుతో కూర్చోవాల్సి వస్తుంది.

పెళ్ళికొడుకు తల్లి తన సుపుత్రుడి సద్గుణాల గురించి ఎడాపెడా పొగుడుతూ ఉంటుంది, అందులో నిజం ఎంత ఉందో అందరికీ తెలిసిందే. ఒక్కోసారి అనిపిస్తుంది, ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు వినే కంటే అక్కడి నుంచి లేచి వెళ్ళిపోవడం మేలని; కానీ వెళ్ళాలనిపించినా లేవలేను. అప్పుడప్పుడు తొందరపాటుతో అమ్మ కూడా తన ముద్దుల కూతురి రెండు మూడు సుగుణాల గురించి ప్రస్తావిస్తుంది, దాన్ని వాళ్ళు తీవ్ర నిర్లక్ష్యంతో వింటున్నట్లు నటిస్తుంటారు. అమ్మ, నాన్నల స్థితిని చూసి అప్పుడు ఎంతో జాలి కలుగుతుంది.

ఆడపిల్లను కన్నందుకు ఎంతగా తలదించుకోవాల్సి వస్తోంది వాళ్ళు! వాళ్ళ కూతురు ఎంత అందంగా ఉన్నా, గుణవంతురాలైనా, చదువుకున్నా, ఉద్యోగం చేస్తున్నా... అబ్బాయితో సమానం కాలేదు. వాళ్ళు రావడం, అమ్మాయిని చూడటమే గొప్ప, ఇక తమతో సమానంగా పరిగణించడం అనేది అత్యాశే అవుతుంది. వాళ్ళ మాటల్లో ఎనభై శాతం అబద్ధాలు ఉన్నా, అబ్బాయిలో ఎన్నో అవలక్షణాలు ఉన్నా... వాళ్ళు మగపెళ్ళివారు కదా.. అంతే మరి.

నా పరిస్థితి చూసుకుని నాపై నాకే ఒక్కోసారి ఎంతో జాలి వేస్తుంది. సర్వం వదిలేసి ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తుంది.. కానీ ఎక్కడికి..? పరిసరాలు మారితే పరిస్థితులు కూడా మారిపోతాయంటే, బహుశా నాలాంటి ఎందరో ఆడపిల్లలు ఇలాంటి అవమానకరమైన నాలుగు గోడల మధ్య తమను తాము బందీలుగా చేసుకోకపోయేవారేమో. కానీ ఎన్నో అసమ్మతులతో కూడిన ఈ చక్రబంధం మన జీవితంతో ఎలా పెనవేసుకుపోయిందంటే, ఇష్టం లేకపోయినా మనం దాన్ని బలవంతంగా భరిస్తూనే ఉన్నాం.

అమ్మ ఆజ్ఞాపించినా, అభ్యర్థించినా, ఆమె వెళ్ళిపోయిన తర్వాత గదిలో భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది. నా గుండె చప్పుడు తప్ప నాకు ఇంకేమీ వినిపించడం లేదు. చాలా ఏళ్ళుగా ఆ చప్పుడు కూడా వినిపించడం ఆగిపోయింది, బహుశా ఎప్పుడో తప్ప అది కొట్టుకోవడం లేదేమో. ఇలాంటి ప్రహసనాల్లో ఇక పాల్గొనకూడదని నా మనసు గట్టిగా మొరపెట్టుకుంది. స్పష్టమైన మాటలతో వారిని ఎదిరించాలని, ఎప్పటికీ దీనికి ముగింపు పలకాలనిపించింది. పదే పదే నన్ను నేను

క్షతగాత్రురాలిని చేసుకున్నాను. ఇక ఎన్ని రోజులు? వయసు ముల్లు ముప్పై దాటిపోయింది. అయినా అమ్మ, నాన్నలలో ఆశ చావలేదు. పెళ్ళికి అవసరమైన లక్షణాలన్నీ మసకబారినా, ఎప్పటికైనా ఖచ్చితంగా ఎవరో ఒకరు వచ్చి తన ఈ నల్లటి కూతురిని సంతోషంగా స్వీకరిస్తారని అమ్మ నమ్మకం. అమ్మ దృష్టిలో తన కూతురు నల్లగా ఉండదు, కేవలం కాస్త చామనచాయ అంతే. కానీ ఈ రెండు రంగుల మధ్య ఉండే విభజన రేఖ ఏమిటో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. ఏది ఏమైనా, నాకు అర్థం కావడం, కాకపోవడంతో నా పెళ్ళికి ఎలాంటి సంబంధమూ లేదు.

రోజులు గడుస్తూ పోయాయి. అమ్మ సహనానికి హద్దులు దాటిపోయాయి. ఈ మధ్య ఆమె మరింత మొండిగా మారింది. మాటిమాటికీ నన్ను ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోమని సలహా ఇస్తోంది. ఎందుకంటే, నా పెళ్ళి కాకపోవడానికి అసలు కారణం నా ఉద్యోగమేనని ఆమె గట్టిగా నమ్మింది. ఏ మంచి వంశానికి చెందినవారూ ఉద్యోగం చేసే కోడలిని తెచ్చుకోవడానికి ఇష్టపడరట, అందుకే నా పెళ్ళి ఆలస్యమవుతోందట. నా పెళ్ళి కాకపోవడానికి వెనుక ఎన్నో కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది నా చామనచాయతో పాటు పెరుగుతున్న వయసు. సరిగ్గా పెళ్ళి ఈడులో ఉన్నప్పుడు ఆర్థిక పరిస్థితి బాగోలేక రెండు మూడు సంబంధాలు వచ్చి తప్పిపోయాయి. ఆ తర్వాత నాకూ, తమ్ముడికీ ఉద్యోగాలు రావడంతో ఇంటి ఆర్థిక పరిస్థితి మెరుగైంది. కానీ అంతలోనే నా వయసు మీరిపోయింది. వయసు ఉన్నప్పుడు కట్నం ఇవ్వడానికి డబ్బు లేదు; ఇప్పుడు కట్నానికి డబ్బు ఉంటే, వయసు దాటిపోయింది. కానీ అబ్బాయి వాళ్ళకి రెండూ కావాలి కదా!

ఈ చూడటాలు, నచ్చడాలు, నచ్చకపోవడాల సుడిగుండంలో నా జీవితం నుంచి ఎన్నో విలువైన భావాలు ఎలా దూరమైపోయాయో నాకే తెలియలేదు. నవయవ్వనపు సున్నితత్వం, పెళ్ళి గురించిన ఉత్సాహం, నుదుటన సిందూరం, చేతులకు గాజులు వేసుకోవాలన్న కోరిక.. మనసులోని ఏ మూలన సమాధి అయిపోయాయో, ఎంత వెతికినా కనిపించకుండా పోయాయి. అయినా ప్రతిసారీ ముస్తాబై పెళ్ళికొడుకు తరపువారి ముందుకు వెళ్ళక తప్పదు. వారి సిగ్గులేని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వక తప్పదు. నా రూపురేఖల పోస్ట్‌మార్టంను నా కళ్ళతో నేనే చూడాలి, నా చెవులతో నేనే వినాలి. ఇవన్నీ చూసి, విని, రగిలిపోతున్న రక్తాన్ని అణచుకుంటూ నిబ్బరంతో మళ్ళీ గదిలోకి నడిచిరావాలి. ఆ తర్వాత జరిగేదంతా ముందే నిర్ణయించిన లాంఛనం మాత్రమే. పెళ్ళికొడుకు వాళ్ళు తమ గొప్పలను, అబ్బాయి హోదాను వివరించి, మా ఇల్లు, ఏర్పాట్లలోని లోపాలను భూతద్దంలో చూపి, 'తర్వాత కబురు పంపుతాం' అన్న వాగ్దానంతో సెలవు తీసుకుంటారు. తర్వాత వచ్చే కబురు ఏమిటో అందరికీ తెలిసినా, ఏదో ఒక అద్భుతం జరగకపోతుందా అన్న ఆశతో మా ఇంట్లోవాళ్ళు ఎదురుచూస్తూనే ఉంటారు. కానీ ఆ అద్భుతం ఎప్పుడూ జరగదు.

ఈరోజు మళ్ళీ అదే పునరావృతం కాబోతోంది. దృశ్యం అదే, కేవలం పాత్రధారులు మాత్రమే మారారు. నిజానికి నా ఓర్పు నశించి ఎంతో కాలమైంది. నా కుటుంబ సభ్యులపై నాకున్న కాస్తోకూస్తో జాలి భావన కూడా ఇప్పుడు మిగలలేదు. నా అవమానానికి నా సొంత మనుషులే నూటికి నూరు శాతం బాధ్యులనిపిస్తోంది. అసలు ఇలాంటి బూటకపు వేషాలు, నాటకాలు ఎందుకు? సగం జీవితం గడిచిపోయింది, మిగిలిన

రోజులు గడుస్తూ పోయాయి. అమ్మ సహనానికి హద్దులు దాటిపోయాయి. ఈ మధ్య ఆమె మరింత మొండిగా మారింది. మాటిమాటికీ నన్ను ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోమని సలహా ఇస్తోంది. ఎందుకంటే, నా పెళ్ళి కాకపోవడానికి అసలు కారణం నా ఉద్యోగమేనని ఆమె గట్టిగా నమ్మింది.

దాని కోసం ఈ తాపత్రయం ఎందుకు? ఇలాగే గడిచిపోదా? కానీ ఈ విషయాలు వాళ్ళకి ఎప్పటికీ అర్థం కావు. కన్యాదానం చేయకపోతే తమకు మోక్షం దక్కదన్న ఒకే ఒక్క ఆలోచన వాళ్ళ మనసుల్లో పాతుకుపోయింది. వాళ్ళకి స్వర్గద్వారాలు మూసుకుపోతాయట. తమ పరలోకాన్ని బాగుచేసుకోవడానికి, వాళ్ళు నా ఇహలోకాన్ని నాశనం చేయడానికి పూనుకున్నారు. గత కొద్ది రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆ తుఫాను మళ్ళీ నా మనసులో చెలరేగడానికి సిద్ధమైంది. ఆ తుఫాను వల్ల కలిగే భీకర పరిణామాలను తలచుకుంటే భయమేసింది. ఆ తుఫాను కట్టలు తెంచుకుంటే నా చేతుల నుంచి చాలా విషయాలు చేజారిపోతాయని. అమ్మ పిలుపుతో ఆలోచనల దారం తెగింది. వెళ్ళాల్సిన సమయం వచ్చేసింది.

ఇలాంటి సమయాల్లో డ్రాయింగ్ రూమ్‌లోని గంభీరమైన వాతావరణం నాకు మరింత ఊపిరాడకుండా చేస్తుంది.

ఎవరో ఒక ఆడపిల్లను ఇలాంటి పిచ్చి ప్రశ్నలు ఇంకెవరైనా అడిగారో లేదో నాకు తెలియదు. ఒకవేళ అడిగి ఉంటే, దానికి సమాధానంగా ఎవరైనా ఏమి చెప్పారో, లేక అందరూ మౌనంగా ఉండిపోయారో కూడా నాకు తెలియదు. కానీ ఇకపై నేను మౌనంగా ఉండటం అసాధ్యం.



దానికితోడు మగపెళ్ళివారి అసహజమైన ప్రశ్నలతో ఆ వాతావరణం ఇంకా విషతుల్యంగా మారిపోతుంది. ఈరోజు వచ్చిన ఆ పెద్దమనిషి మొదటి ప్రశ్నే సంధించింది:

"అమ్మాయికి ఇంత వయసొచ్చినా ఇంకా ఎందుకు పెళ్ళి చేయలేదు?"

వినగానే నా కణతలు దిమ్మెక్కిపోయాయి. ఇంత సూటిగా దాడి చేసే ప్రశ్నకు ఏమి సమాధానం చెప్పగలం? నేను మౌనంగా ఉండిపోతూ గోళ్ళతో నేలపై గీతలు గీస్తూ ఉండిపోయాను. మగపెళ్ళివారు ఆ పని నా గుండెలపై గీతలు గీస్తూ చేస్తున్నారు. నా తండ్రి, తమ్ముడి నిస్సహాయత నా కళ్ళముందు మెదిలింది. నేను తల ఎత్తి చూశాను.

ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్న వ్యక్తితో నా చూపులు కలిశాయి. అమ్మ చెప్పింది, అతనే పెళ్ళికొడుకని. వయసెంత ఉంటుంది? ముప్పై ఐదు లేదా ముప్పై ఆరు కన్నా తక్కువ ఉండదు. అయినా కూడా ఆ అబ్బాయి తల్లి నా పెరుగుతున్న వయసు గురించి వేలెత్తి చూపుతోంది. నాన్న ముఖం చూస్తూ ఆమె అడుగుతున్న ప్రశ్నలన్నీ పూర్తిగా నా గురించి, నా వయసు గురించే. నాన్న నిరుత్తరుడైపోతున్నారు. ఆమె ప్రశ్నకు ఎదురు ప్రశ్న వేయాలనిపించింది. "మీ అబ్బాయికి 35 ఏళ్ళు వచ్చినా ఎందుకు పెళ్ళి చేయకుండా ఉంచారు?" అని. కానీ అడగలేకపోయాను. అమ్మ దీనమైన చూపులు నా గొంతును నొక్కేశాయి.

"అయితే మీ అమ్మాయి జీతం ఎంత? చాలా కాలంగా ఉద్యోగం చేస్తోంది కదా, పొదుపు బాగానే చేసి ఉంటుంది.. ఏమంటారు?"

ఎవరో ఒక ఆడపిల్లను ఇలాంటి పిచ్చి ప్రశ్నలు ఇంకెవరైనా అడిగారో లేదో నాకు తెలియదు. ఒకవేళ అడిగి ఉంటే, దానికి సమాధానంగా ఎవరైనా ఏమి చెప్పారో, లేక అందరూ మౌనంగా ఉండిపోయారో కూడా నాకు తెలియదు. కానీ ఇకపై నేను మౌనంగా ఉండటం అసాధ్యం. ఇది నా అస్తిత్వంపై నేరుగా జరుగుతున్న దాడి తప్ప మరొకటి కాదు. ఇప్పుడు నేను ఖచ్చితంగా నోరు విప్పుతాను; నాలోని ఆత్మగౌరవాన్ని ఇకపై అణచిపెట్టుకోవడం ఏమాత్రం సరికాదు. నాన్న ఏమనుకున్నా, అమ్మ మనసు ఎంతగా గాయపడినా, నా అవమానాన్ని నేను ఇక భరించలేను. పిల్లలకు పాఠాలు చెప్పేటప్పుడు అన్యాయం, అక్రమాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని ఎంతో బోధించాను. ఇప్పుడు నా వంతు వచ్చినప్పుడు నేనెందుకు మౌనంగా ఉండాలి? ఏదో ఒకటి చెప్పడానికి నా అంతరాత్మను సిద్ధం చేసుకుంటుండగానే, ఆ అబ్బాయి తల్లి మళ్ళీ అడిగింది:

"ఖర్చులకే అంతా సరిపోతోందా, లేక భవిష్యత్తు కోసం కూడా ఏమైనా దాచుకుంటున్నావా? పొదుపు చేసిన మొత్తం ఎంత ఉంది?"

"మీ అబ్బాయి పొదుపు కంటే కాస్త తక్కువే ఉంది!" ఈ సమాధానం ముందే అనుకున్నది కాదు. అయినా ఎలా వచ్చిందో ఒక్క ఉదుటున నా నోటి నుంచి దూసుకొచ్చింది. అది వినగానే ఆమె వెకిలి నవ్వు ఒక్క దెబ్బతో మాయమైపోయింది. బహుశా ఏ అమ్మాయి నుంచీ అలాంటి సమాధానాన్ని ఆమె ఊహించి ఉండదు. పెళ్ళికొడుకు కూడా నోరెళ్ళబెట్టి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు. నాన్న కళ్ళలోని ఆగ్రహాన్ని, అమ్మ ముఖంలోని నిరాశను చూస్తూ కూడా నేను ఏ భావమూ లేకుండా అలాగే కూర్చున్నాను. ఈరోజు ఇక్కడి నుంచి నేను అవమానపడి వెళ్ళను, బదులుగా వాళ్ళే లేచి వెళ్ళిపోయేలా చేస్తాను. నాన్న మాట మార్చడానికి ప్రయత్నించారు, కానీ ఆ ఇల్లాలు ఆ తర్వాత మామూలు స్థితికి రాలేకపోయింది. అతి త్వరలోనే మా ఇంటి నుంచి వెళ్ళిపోయారు.

నాకు తెలుసు, వాళ్ళు వెళ్ళిపోయాక నాన్న విరుచుకుపడతారని, అమ్మ కోపంతో ఊగిపోతుందని. కానీ అలాంటిదేమీ జరగలేదు. ముభావంగా మారిన ముఖాలు, భారమైన మనస్సులతో అమ్మ, నాన్న నన్ను అక్కడే ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయారు. నాన్న కళ్ళలోని శూన్యం ఈరోజు మరింత దట్టంగా మారింది. అమ్మ ముఖం వైపు తదేకంగా

చూస్తూ, ఆమె చెమ్మగిల్లిన కళ్ళను చూసి బాధపడాల్సిన అవసరాన్ని నేను గుర్తించలేదు. కాసేపు కూర్చుని టీవీ ఛానెళ్ళు మారుస్తూ ఉండిపోయాను.

ఎలాంటి అద్భుతం జరుగుతుందని ఆశించకపోయినా, ఒక అద్భుతం జరిగింది. రెండు మూడు రోజుల తర్వాత పెళ్ళికొడుకు తల్లి ఫోన్ చేసింది. కాకతాళీయంగా ఫోన్ నేనే ఎత్తాను. నన్ను అమ్మాయి తల్లి అనుకుని ఆమె ఎంతో ఉత్సాహంగా చెప్పింది:

"మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చింది. వాడు సరేనన్నాడు. నిజానికి మాకు ఇంకా చాలా సంబంధాలు ఉన్నాయి, కానీ ఇక ఈ తిరుగుళ్ళు పడలేము. మీ అమ్మాయితో పెళ్ళి చేసుకోవడానికి నా కొడుకు సిద్ధంగా ఉన్నాడు."

నా గుండెలపై ఎవరో బలంగా పిడిగుద్దు గుద్దినట్లయింది. చెవుల్లో ఎవరో ఎంతో ప్రేమగా సలసల కాగే నూనె పోస్తున్నట్లు అనిపించింది. అంటే ఇది నాపై వాళ్ళ అబ్బాయి చూపిస్తున్న దయాదాక్షిణ్యమా? నాకు పెళ్ళి కావడం లేదని, ఈ తల్లీకొడుకులు నాపై జాలి చూపిస్తున్నారా? ఫోన్ రింగ్ వినగానే అమ్మ ఆత్రుతగా అంగలు వేసుకుంటూ వస్తోంది. ఆమెకు ఇది ప్రపంచంలోనే అత్యంత ఆనందకరమైన వార్త. కానీ నాకు? లేదు, ఎవరి దయాదాక్షిణ్యాల నీడన బతకాల్సిన అవసరం నాకు లేదు. ఆమె గొంతులో జాలిని ప్రదర్శించే అహంకారం నిండి ఉంది. తన కొడుకు సమ్మతిని తెలిపిన తర్వాత, ఇక సూటిగా పెళ్ళి ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి అనే విషయానికి ఆమె వచ్చేసింది. ఇక్కడ అమ్మ వేగంగా నా దగ్గరకు వస్తోంది, అక్కడ ఆమె మాటలు సాగుతూనే ఉన్నాయి. ఆమె మాటలను మధ్యలోనే తుంచుతూ నేను ఠక్కున అన్నాను:

"క్షమించండి, మీ అబ్బాయి మా అమ్మాయికి నచ్చలేదు."

అది వినగానే అవతలి వైపు వాతావరణం ఎలా మారిపోయి ఉంటుందో నేను ఊహించగలను. అమ్మ నా వైపు ప్రశ్నార్థకంగా చూస్తోంది. బహుశా ఏదో అడగాలని అనుకుంది. కానీ అంతకంటే ముందే నేను ఫోన్ కింద పెట్టేసి అన్నాను: "రాంగ్ నంబర్!" అయినా అమ్మ అక్కడే నిలబడి ఉంది. నా మాటలను ఆమె నమ్మలేకపోతోందని తెలిసినా నేను ఎలాంటి వివరణా ఇవ్వలేదు. నా గుండెల్లో ఏళ్ళుగా పేరుకుపోయిన సంతాపం ఇప్పుడు కరిగి ప్రవహించడం మొదలైంది. ఒక అనిర్వచనీయమైన ఆత్మసంతృప్తితో నా అంతరాత్మ వికసించసాగింది. ఇన్నాళ్ళ తర్వాత నన్ను నేను చూసి గర్వపడే అవకాశం నా చేతికి వచ్చింది. ఆ ఆనందాన్ని మనసారా ఆస్వాదించాలనుకున్నాను. అమ్మకు ఏదో అనుమానం వచ్చింది, ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. కానీ నాలో మాత్రం ఎలాంటి చలనమూ లేదు, ప్రశాంతంగా ఉన్నాను.

అపార్ట్‌మెంట్

డా. దారల విజయ కుమారి
9177192275



అపార్ట్‌మెంట్‌లోని తలుపులన్నీ ఒకే రంగులో ఉంటాయి. ఒకే సైజులో ఉంటాయి. వాటి మీద పేర్లు కూడా చిన్న పలకల్లోనే ఉంటాయి. కానీ ఆ తలుపుల వెనుక జరిగే జీవితాలు మాత్రం ఒకదానికొకటి చాలా దూరంగా ఉంటాయి.

సాయి శాంతి రెసిడెన్సీలో రామమూర్తి, జానకి 304లో ఉంటారు. ఊర్లో ఉన్నప్పుడు ఇంటి ముందు కళ్లాపి వేసినా, రంగవల్లులు తీర్చినా పక్కింటి వాళ్లు పలకరించకుండా వెళ్లేవాళ్లు కాదు. ఎవరి ఇంట్లో పొయ్యి వెలగకపోయినా తెలిసేది. ఎవరికైనా జ్వరం వచ్చినా తెలిసేది. ఎవరి ఇంట్లో దుఃఖం వచ్చినా నాలుగు ఇళ్లు చేరి నిలబడేవి. ఇక్కడ మాత్రం తలుపు మూసుకుంటే జీవితం కూడా మూసుకుపోయినట్టే.

"ఎవరింటి విషయాల్లో వాళ్లను ఉండనివ్వాలి నాన్నా. ప్రైవసీ ముఖ్యం," అని కొడుకు కార్తిక్ ఒకసారి చెప్పిన మాట రామమూర్తికి గుర్తుండేది.

కాలం మారిందని అనుకుని ఆయన కూడా తనను తాను మార్చుకున్నాడు.

వర్మగారు 305లో ఉండేవారు. అరవై ఐదేళ్లు. మధుమేహం, బీపీ. గత కొంతకాలంగా ఉదయాన్నే లేవగానే తల తిరుగుతోందని, కాళ్లలో బలహీనంగా ఉంటోందని చెప్పేవారు. డాక్టర్ మందులు మార్చి, "మందు వేసుకునే ముందు ఏదైనా తినాలి. షుగర్ బాగా పడిపోకూడదు. బలహీనంగా ఉన్నప్పుడు ఒంటరిగా బాత్‌రూమ్‌కి వెళ్లకండి," అని చెప్పాడు.

ఒకరోజు ఉదయం వర్మగారు తలుపు దగ్గరే తూలిపడబోయారు.

"ఏమైంది?" అని రామమూర్తి పట్టుకున్నాడు.

"ఏం లేదు. షుగర్ కాస్త తగ్గిందేమో," అని నవ్వారు వర్మగారు.

ఆ మాటను రామమూర్తి నవ్వుతోనే తీసుకున్నాడు.

మరో రోజు వర్మగారి భార్య చెప్పింది.

"ఇవాళ మందు వేసుకున్నారు. కానీ టిఫిన్ చేయకముందే వేసుకున్నారేమో. ఆయన మాట వినరు."

"జాగ్రత్తగా ఉండమని చెప్పండి," అన్నాడు రామమూర్తి.

అంతే.

ఆ తర్వాత వర్మగారు రెండు రోజులు కనిపించలేదు.

ఉదయాన్నే వచ్చే పాల ప్యాకెట్ తలుపు దగ్గరే ఉంది. పేపర్ కూడా అలాగే ఉంది. బాల్కనీలో ఆరేసిన బట్టలు సాయంత్రం వరకూ అలాగే వేలాడుతున్నాయి.

జానకి గమనించింది.

"రెండు రోజులుగా వర్మగారు కనిపించట్లేదు."

రామమూర్తి కిటికీ దగ్గరకు వెళ్లి చూశాడు.

305 తలుపు మూసే ఉంది.

"ఇంట్లోనే ఉంటారేమో."

"ఒక్కసారి తలుపు కొట్టండి."

రామమూర్తి తలుపు వైపు నడిచాడు. రెండు అడుగులు వేసి ఆగిపోయాడు. 'ఏమై ఉంటుంది? నిద్రపోతుండొచ్చు. మనం ఎందుకు కలగజేసుకోవాలి? ఏదైనా అవసరం ఉంటే వాళ్లే చెబుతారు.' తన చేతి వేళ్లు తలుపు కొట్టడానికి పైకి లేచాయి. మళ్లీ దిగిపోయాయి.

"సాయంత్రం చూద్దాం," అన్నాడు.

సాయంత్రం ఫోన్ చేశాడు. లోపలే రింగ్ వినిపించింది.

తెల్లవారుజామున 305 తలుపు కింద నుంచి నీరు బయటికి వచ్చింది. తలుపు పగలగొట్టారు. బాత్‌రూమ్ దగ్గర వర్మగారి భార్య నేలపై పడిపోయి ఉంది. నడుముకు గాయం. లేవలేకపోతోంది.



ఎవరూ తీయలేదు. ఆ రింగ్ ఆగిపోయింది. రామమూర్తి కొంతసేపు తలుపు వైపు చూస్తూ నిలబడ్డాడు. తలుపు కొట్టాలని అనిపించింది. కానీ లోపల నుంచి ఎవరో, 'మా విషయం మాకు వదిలేయండి' అన్నట్టనిపించింది.

ఆ రాత్రి పదకొండు దాటాక లోపల ఏదో బరువైన వస్తువు పడిన శబ్దం వచ్చింది. తర్వాత ఏదో లాగుతున్నట్టుగా శబ్దం.

"అమ్మా."

చాలా బలహీనమైన స్వరం. రామమూర్తి గుండె ఒక్కసారిగా బిగుసుకుంది. తలుపు దగ్గరకు వెళ్లాడు.

పక్కింటివాళ్లు కూడా వచ్చారు.

"కొడుకు విదేశాల్లో ఉన్నాడట. అతనికి ఫోన్ చేద్దాం."

ఫోన్ స్విచ్‌డ్ ఆఫ్.

"తలుపు పగలగొట్టాలా?" అని ఎవరో అడిగారు.

రామమూర్తి నోరు తెరిచాడు.

"ఇప్పుడు రాత్రి. తెల్లవారితే చూద్దాం."

ఆ మాట బయటకు వచ్చిన క్షణంలోనే అతని గుండెలో ఏదో విరిగింది. కానీ ఆలస్యం అయిపోయింది.

తెల్లవారుజామున 305 తలుపు కింద నుంచి నీరు బయటికి వచ్చింది. తలుపు పగలగొట్టారు.

బాత్‌రూమ్ దగ్గర వర్మగారి భార్య నేలపై పడిపోయి ఉంది. నడుముకు గాయం. లేవలేకపోతోంది. వర్మగారు ఆమెను పైకి లేపడానికి ప్రయత్నించి ఉండాలి. కానీ ఖాళీ కడుపుతో వేసుకున్న మందుల వల్ల షుగర్ ప్రమాదకరంగా పడిపోయి, ఆయన కూడా అక్కడే కుప్పకూలిపోయారు. డాక్టర్ వచ్చిన తర్వాత విషయం స్పష్టమైంది.

"ముందుగా ఆమె పడిపోయింది. ఎక్కువసేపు లేవలేకపోయింది. ఆమెను లేపడానికి ప్రయత్నించినప్పుడు ఆయనకు షుగర్ బాగా పడిపోయింది. సమయానికి సహాయం అందితే ఇద్దరికీ పరిస్థితి ఇంత తీవ్రంగా ఉండేది కాదు."

డాక్టర్ మాటల కంటే వర్మగారి భార్య రామమూర్తిని చూసిన చూపే అతన్ని ఎక్కువగా వెంటాడింది.

"తలుపు దగ్గరికి వచ్చాను," అంది ఆమె.

"తీయలేకపోయారా?"

"తీయలేక కాదు. కొట్టలేక."

ఆమె కళ్లలో నీళ్లు నిలిచాయి.

"ఎవరినైనా పిలవాలనిపించింది. కానీ అందరూ తమ పనుల్లో ఉంటారనుకున్నాను. ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదనుకున్నాను."

ఆ మాట రామమూర్తి చెవుల్లో చాలాసేపు మోగుతూనే ఉంది. ఆ రోజు నుంచి 305 తలుపు అతనికి సాధారణ తలుపుగా కనిపించలేదు. దాని ముందు పడివున్న పాత పాల ప్యాకెట్, తలుపు పక్కన పేరుకుపోయిన పేపర్లు, లోపల నుంచి బయటికి వచ్చిన ఆ నీటి గీత, బాత్‌రూమ్ దగ్గర పడి ఉన్న ప్లాస్టిక్ కుర్చీ, అన్నీ అతని కళ్లకు ఒకే ప్రశ్నలా కనిపించాయి.

'నువ్వు ముందే తలుపు కొట్టి ఉంటే?'

అతను తనను తాను సమాధానపరచుకోవడానికి ఎన్నో కారణాలు వెతికాడు.

'తెలియదు కదా.'

'ఏదైనా చిన్న విషయం అయి ఉండొచ్చు.'

'వాళ్ల ప్రైవసీ.'

కానీ ఆ కారణాలన్నింటి చివరా ఒకే మాట నిలబడేది.

ఆలస్యం.

ఆ తర్వాత రామమూర్తి తలుపులు గమనించడం మొదలుపెట్టాడు. ఎవరి తలుపు ఎక్కువసేపు మూసి ఉంది? ఎవరి ఇంటి ముందు పేపర్ అలాగే ఉంది? ఎవరి బాల్కనీలో బట్టలు రెండు రోజులుగా కదలలేదు? ఎవరి దగ్గర నుంచి పిల్ల ఏడుపు వినిపించింది?

జానకికి ఆయన మార్పు కనిపించింది.

"ఏమైంది మీకు?"

"ఏమీ లేదు."

"ఎప్పుడూ తలుపులనే చూస్తున్నారు."

రామమూర్తి సమాధానం చెప్పలేదు. అప్పుడే 306లో ఉండే అనన్య అతని దృష్టిలోకి వచ్చింది.

పదేళ్ల పిల్ల. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్తారు. కొన్ని రోజులు స్కూల్ నుంచి వచ్చాక ఒంటరిగానే ఉంటుంది. ఒకసారి ఆమె చేతిలో లైటర్ కనిపించింది.

"ఇది ఎందుకు?"

"అమ్మ దీపం వెలిగించమంది."

"నువ్వు వంటగదిలో ఒంటరిగా అలా చేయకూడదు."

పిల్ల నవ్వింది.

"నాకు తెలుసు తాతయ్యా."

అదే వారం ఒకరోజు ఆమె వంటగదిలో స్టవ్ పక్కన పుస్తకం పెట్టుకుని చదువుతోంది. జానకి చూసి పుస్తకాన్ని తీసేసింది.

"ఇక్కడ పెట్టకూడదు."

"సరే."

మరోసారి ఖాళీ పాత్రను ఇండక్షన్ మీద పెట్టి స్విచ్ ఆన్ చేసి బయటికి వచ్చింది. జానకి ఆపేసింది.

"అనన్యా, జాగ్రత్త."

"మర్చిపోయాను."

అంతే. ప్రమాదం జరగలేదు కాబట్టి ఆ సంఘటనలు కూడా చిన్నవిగానే మిగిలిపోయాయి. కానీ రామమూర్తి మాత్రం వాటిని మరచిపోలేకపోయాడు. ఒక శనివారం అనన్య తల్లి ఫోన్ చేసింది.

"అంకుల్, మేము కొంచెం ఆలస్యంగా వస్తాం. అనన్య ఇంట్లోనే ఉంటుంది."

రామమూర్తి వెంటనే,

"ఇక్కడికి పంపండి," అనబోయాడు.

మాట గొంతులోనే ఆగిపోయింది.

'వాళ్లకు ఇష్టం లేకపోతే?'

'పిల్లను ఎందుకు పిలుస్తున్నారని అనుకుంటే?'

'వాళ్లు స్పష్టంగానే ఇంట్లో ఉంటుందని చెప్పారు కదా.'

అతని కళ్ల ముందు మళ్లీ 305 తలుపు కనిపించింది.

ఈసారి మాత్రం తలుపు కొట్టడానికి ఆలస్యం చేయకూడదని లోపల ఒక స్వరం గట్టిగా చెప్పింది.

అదే సమయంలో మరో స్వరం నెమ్మదిగా చెప్పింది.

'అంతగా ఆలోచించాల్సిన అవసరం లేదు. చిన్నపిల్లే. ఇంట్లోనే ఉంది.'

అతను ఫోన్ పెట్టేశాడు. పది నిమిషాలు గడిచాయి.

ఇరవై నిమిషాలు. హఠాత్తుగా గాలిలో కాలిన వాసన వచ్చింది. రామమూర్తి తలుపు తెరిచాడు.

306 తలుపు కింద నుంచి పొగ బయటికి వస్తోంది.

"అనన్యా!"

అతను పరుగెత్తాడు. లోపల ఇండక్షన్ మీద ఖాళీ పాత్ర ఎర్రగా వేడెక్కి ఉంది. పక్కనే ఉన్న కాగితం మంటపట్టింది. ఆ మంట కిచెన్ టవల్‌కి అంటుకుంది. అనన్య మూలన నిలబడి ఏడుస్తోంది. రామమూర్తి ఆమెను బయటికి లాగాడు. కార్తిక్, సెక్యూరిటీ వాళ్లు వచ్చేసరికి మంట అదుపులోకి వచ్చింది. అనన్య అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

"తాతయ్యా."

"ఏమమ్మా?"

"నేను మీ ఇంటికి రావచ్చా?"

రామమూర్తి ఒక్క క్షణం 305 వైపు చూశాడు.

తర్వాత 306 తలుపు వైపు చూశాడు.

"ఇక అడగక్కర్లేదు."

అతను ఆమె చేతిని పట్టుకుని తన ఇంటికి తీసుకెళ్లాడు.

జానకి అప్పటికే నీళ్లు తెచ్చి నిలబడింది. ఆమె ఇంటి ముందు వేసిన రంగవల్లి మీద పొగ నల్లటి మచ్చ వేసింది.

రామమూర్తి ఆ మచ్చను చూస్తూ నిలబడ్డాడు.

పక్కనే 305 తలుపు మూసే ఉంది.

తన 304 తలుపు మాత్రం తెరిచి ఉంది.

రెండు తలుపుల మధ్య దూరం ఎంత ఉందో అంతే ఉంది.

కానీ ఆ రోజు నుంచి వాటి మధ్య నిశ్శబ్దం మాత్రం లేదు.

రేపటికై ముందడుగు



ఆచంట సుధాకళ్యాణి, హైదరాబాదు
8897129206

ఓ విద్యార్థీ నీ కలలనే తెడ్డుగా చేసుకో.
చేరాల్సిన గమ్యం జ్ఞాపకం ఉంచుకో.
మరి బాల్యమంటే మాటలా?
కనిపించని రెక్కలున్న సీతాకోకచిలుకలా!

నీలాకాశం మన తలపైనే ఉన్నదని
చేతులెత్తి అందుకుంటే అందునా?
మెట్టు మెట్టుగా ఒక్కో మెట్టే ఎక్కాలిగా.
అందమైన భవితే నీ సొంతమవ్వాలిక!

మన కాళ్ళ కిందనే ఉన్నదని
నిలబెట్టిన నేలను చులకన చేయొద్దు!

ఎంత ఎదిగినా, ఏమి పొందినా
బ్రతుకు ప్రసాదించిన గురువే దైవమని మరువద్దు.

గాలికి తిరిగేస్తూ, గాలికి పెరిగేస్తూ
కాలం కళ్ళిలు వదిలేసుకోవద్దు.
తలరాతను మార్చే మంత్రదండమది.
శ్రమశిక్షణే విలువైనదని అస్సలు మరువద్దు.


విజయానికి దగ్గరి దారులంటూ
నిను మించిన వారు లేరంటూ
ఆనందాల భ్రమల వెంట పరుగులు పెట్టొద్దు.
అడ్డదారుల్లో ఆకాశానికి నిచ్చెన వేయొద్దు!

ఆటుపోటులు వచ్చి వెళుతున్నా
నిరాశ నమ్మకాన్ని నమిలేస్తున్నా
అణుగారని అగ్ని శిఖలా స్ఫూర్తిని రగిలించుకో.
ఓటమి పాఠాలతో గెలుపుకు దారిని వేసుకో!

మిము కన్నవారి కలలేగా మీకు ఆలంబన
రేపటికై ముందడుగు వేయించు దీవెన.

జ్ఞానోదయం

టీ.ఎ.మిత్ర
9989787737



రమేష్, వంశీ ట్రిప్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసుకుని జీపులో తమ ఊరికి తిరిగి వెళ్తూ ఉన్నారు. "ఇంకో అరగంటలో ఇంటికి వచ్చేస్తాను. దారిలో ఉన్నాము" అని వంశీ ఫోన్లో తన చెల్లి ప్రణతితో అన్నాడు. "చీకటి పడుతుంది.. నాలుగు గంటలకే వచ్చేస్తాను అన్నావు, ఇప్పుడు 5 అవుతుంది. ఎందుకు లేట్ అయింది?" అడిగింది ప్రణతి. "రమేష్, నేను మాట్లాడుకుంటూ నెమ్మదిగా వస్తున్నాము" అన్నాడు వంశీ.

హఠాత్తుగా రమేష్ జీపు ఆపి "అయ్యయ్యో! ఇతను ఎవరో కింద పడిపోయారే" అంటూ ముందుకు పరుగెత్తాడు. వెంటనే వంశీ కూడా ఫోన్ పెట్టేసి పరుగెత్తాడు. రమేష్ పడిపోయిన వ్యక్తిని తట్టి లేపడం మొదలుపెట్టాడు. కానీ అతను లేవలేదు. స్పృహ తప్పాడని రమేష్‌కి అర్థం అయింది. ఆ పక్కనే పడి ఉన్న పర్స్ ఓపెన్ చేసి చూశాడు వంశీ. దాంట్లో ఆ పడిపోయిన వ్యక్తి పేరు కృష్ణ అని వంశీకి అర్థమైంది. రమేష్ చుట్టూ ఎవరైనా ఉన్నారేమో చూశాడు. ఎవరూ కనబడలేదు. కృష్ణ పల్స్ చూసి అతను ఇంకా బ్రతికున్నాడని కన్ఫామ్ చేసుకున్నారు. వెంటనే కృష్ణని తీసుకొని వంశీ, రమేష్ జీపులో బయలుదేరారు.

"ఏ హాస్పిటల్‌కి తీసుకెళ్దాం రమేష్?" అని అడిగాడు వంశీ. "దగ్గర్లో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్దాం" అన్నాడు రమేష్. "ఆ గవర్నమెంట్ హాస్పిటల్‌కి వద్దు రోయ్.. బ్రతికే మనిషి కూడా అక్కడికి తీసుకెళ్తే బ్రతకడు. అసలు తీసుకెళ్లొద్దు. వేరే ఆప్షన్ ఏదైనా ఉందేమో ఆలోచించు. పోనీ ప్రైవేట్ హాస్పిటల్స్ ఏమీ లేవా?" అడిగాడు వంశీ. "ఇక్కడ గవర్నమెంట్ హాస్పిటల్ తప్ప ప్రైవేట్ హాస్పిటల్ లేదు. మనది పెద్ద సిటీ ఏం కాదు, మనది ఒక చిన్న గ్రామం మాత్రమే. ఇక్కడ గవర్నమెంట్ హాస్పిటల్ ఉండడమే గొప్ప విషయం. కాబట్టి ముందు గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకెళ్దాం. మనకు వేరే ఆప్షన్ లేదు" అన్నాడు రమేష్.

"మనం ఇతన్ని బాధ్యతగా అక్కడికి తీసుకెళ్తాం, కానీ ఇతను బ్రతుకుతాడా అనే డౌట్ ఉంది. ఇంతకుముందు ఆ హాస్పిటల్లో ఏం జరిగిందో మర్చిపోయావా?" అన్నాడు వంశీ. "అది మర్చిపోయేంత చిన్న విషయం కాదు కదా" అన్నాడు రమేష్. జీపు వెనకాల పడుకున్న కృష్ణకి కొంచెం స్పృహ వచ్చింది. కృష్ణ కళ్ళు తెరవడానికి ప్రయత్నించాడు. తెరవలేకపోయాడు. కానీ రమేష్, వంశీ మాటలు మాత్రం అతనికి స్పష్టంగా వినిపిస్తున్నాయి. ముందు సీట్లలో కూర్చున్న రమేష్, వంశీ మాట్లాడుకుంటూ వేగంగా వెళ్తున్నారు.

"ఆ హాస్పిటల్లో ఎలుకలు ఎక్కువ. ఇంతకుముందు ముగ్గురు పసిపిల్లల్ని ఆ ఎలుకలు కొరికి చంపాయి" అన్నాడు వంశీ. "అవును, అది చాలా దారుణం. నేను కూడా విషయం తెలుసుకున్నప్పటి నుంచి ఆ గవర్నమెంట్ హాస్పిటల్ మీద చెడు అభిప్రాయం కలిగింది" అన్నాడు రమేష్. "అంతటితో ఆగలేదు, ఆ తర్వాత ఏమైందో తెలుసా! ఒక గర్భిణీ స్త్రీని లోపలికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్ కూడా లేదు. చాలాసేపు ఎదురు చూసి చేసేదేమీ లేక ఆమె బంధువులు ఆమెని మోసుకుంటూ లోపలి వరకు తీసుకొచ్చారు. పోనీ లోపల వరకు తీసుకువచ్చిన తర్వాత అక్కడైనా అంతా సవ్యంగా జరిగిందా అంటే.. అదీ లేదు. అక్కడ కూడా ఎక్విప్మెంట్ ప్రాబ్లం ఉంది. ట్రీట్మెంట్ లేటుగా చేశారు. ఆవిడ అదృష్టం బావుంది కాబట్టి జన్మనిచ్చింది. ఇంకాస్త ఆలస్యం అయితే వాళ్ల పరిస్థితి ఏంటో తలచుకుంటేనే భయమేస్తుంది" అన్నాడు వంశీ.

"అవును ఆ హాస్పిటల్ మెయింటెనెన్స్ అసలు బాలేదు" అన్నాడు రమేష్. ఇదంతా వింటున్న కృష్ణకి లో లోపల భయం మొదలైంది. కానీ బయటకి మాట్లాడే ఓపిక అతనికి

ఇతన్ని గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లాలంటే నాకు భయం వేస్తుంది. బ్రతికున్న మనిషిని అక్కడికి తీసుకెళ్లి వైద్యం అందించాలనే మన ఉద్దేశం తప్పు అవుతుందేమో అనిపిస్తుంది. ఆ హాస్పిటల్ గురించి అన్నీ తెలిసి అక్కడికి ఈయన్ని తీసుకెళ్లి ఇబ్బంది పెట్టడం అవసరమా!



లేకపోవడంతో అలాగే కళ్ళు మూసుకొని ఉన్నాడు. "పోయిన వారం అక్కడ ఎలక్ట్రిసిటీ ప్రాబ్లం వచ్చి చాలా ఇబ్బంది అయింది, తెలుసా?" అడిగాడు వంశీ. "అవును. దాదాపు పది గంటలు కరెంటు పోయింది. ఆ రోజు ఎంతో మంది ఇబ్బంది పడి ఇక్కడ నుంచి దూరం అయినా ప్రైవేట్ హాస్పిటల్ కి చాలామంది వెళ్లారు" అన్నాడు రమేష్. "అవును, అసలు గవర్నమెంట్ హాస్పిటల్ సవ్యంగా ఉంటే ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తుంది?.. డబ్బులు లేక పేదవాళ్లు ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్ళకుండా గవర్నమెంట్ హాస్పిటల్ కి వస్తున్నారు. కానీ అక్కడ ఏదీ సరిగ్గా లేదు. ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్తే చిన్న చిన్న వాటికి కూడా ఎక్కువ బిల్లు వేస్తున్నారు. ఇంకా గవర్నమెంట్ హాస్పిటల్ దేనికి?" అన్నాడు వంశీ. "పేరుకే అక్కడ గవర్నమెంట్ హాస్పిటల్ ఉంటుంది, కానీ ఫెసిలిటీస్ సరిగ్గా ఉండవు" అన్నాడు రమేష్.

"అందరూ చూస్తుండగానే అక్కడ చాలాసార్లు గోడ పెచ్చులు ఊడిపోయాయి. అప్పుడప్పుడు పేషెంట్స్ మీద పడుతూ ఉంటాయి" అన్నాడు వంశీ. వంశీ వైపు భయపడుతూ చూశాడు రమేష్. "మనలాంటి సామాన్యుల అవస్థలు హాస్పిటల్ అధికారులకి, రాజకీయ నాయకులకి అర్థం కాదు. వాళ్లకి కూడా మనకు పట్టిన గతే పడితే అప్పుడు అర్థమవుతుంది" అన్నాడు రమేష్.

"ఇతన్ని గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకెళ్లాలంటే నాకు భయం వేస్తుంది. బ్రతికున్న మనిషిని అక్కడికి తీసుకెళ్లి వైద్యం అందించాలనే మన ఉద్దేశం తప్పు అవుతుందేమో అనిపిస్తుంది. ఆ హాస్పిటల్ గురించి అన్నీ తెలిసి అక్కడికి ఈయన్ని తీసుకెళ్లి ఇబ్బంది పెట్టడం అవసరమా!" అన్నాడు వంశీ. వెంటనే రమేష్ "అయితే ఇప్పుడు ఏం చేద్దాం! మనకున్న ఒకే ఒక్క ఆప్షన్ ఆ గవర్నమెంట్ హాస్పిటల్. ఇప్పుడు అక్కడికి తీసుకెళ్దామా.. వద్దా?" అన్నాడు. ఆలోచిస్తూ గాల్లోకి చూస్తున్నాడు వంశీ.

"మనం ఇతన్ని అక్కడికి తీసుకెళ్లి ఇబ్బందులు పెట్టి చంపడం కన్నా ఇక్కడే రోడ్డు పక్కన వదిలేస్తే మంచిది. మనం కాకపోతే వేరే ఎవరైనా ఇతనికి సహాయం చేస్తారు" అన్నాడు వంశీ. "ఏంటి! నీ ఉద్దేశం?" అన్నాడు రమేష్. "ఒకవేళ ఎవరైనా డాక్టర్ ఇటువైపుగా వెళ్తూ ఇతన్ని చూస్తే వెంటనే బ్రతికిస్తాడు కదా" అన్నాడు వంశీ. ఇదంతా వింటున్న కృష్ణకి భయం వేసి మళ్లీ స్పృహ కోల్పోయాడు.

మరుసటి రోజు కృష్ణ మెల్లగా కళ్ళు తెరిచి చూశాడు. రూమ్‌లో ఎవరూ కనిపించలేదు. కృష్ణ తన చుట్టూ చూసి ఒక హాస్పిటల్‌లో ఉన్నాడనే విషయం అర్థం చేసుకున్నాడు. "హమ్మయ్య.. నేను బ్రతికే ఉన్నాను. నన్ను ఇక్కడికి తీసుకు వచ్చిన వాళ్ళు ఎక్కడ ఉన్నారు?" అనుకున్నాడు. "ఎవరు ఇక్కడ.. ఇక్కడికి నన్ను ఎవరు తీసుకొచ్చారు?" అంటూ బెడ్ దిగే ప్రయత్నం చేశాడు. కృష్ణ మాటలు విని వెంటనే రూమ్‌లోకి డాక్టర్ వచ్చి "ఇప్పుడు మీకు ఎలా ఉంది?" అడిగాడు. "బాగానే ఉంది" అన్నాడు కృష్ణ. "మీకు బీపీ డౌన్ అయ్యి స్పృహ కోల్పోయారు అంతే. మీరు కాసేపట్లో డిశ్చార్జ్ అవ్వచ్చు" అన్నాడు. "ఓకే డాక్టర్, నన్ను ఇక్కడికి ఎవరు తీసుకొచ్చారు?" అడిగాడు కృష్ణ. "ఎవరో ఇద్దరు వ్యక్తులు జీపులో మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చారు. కాసేపు ఇక్కడ ఉండి తర్వాత వాళ్లు వెళ్లిపోయారు" అన్నాడు డాక్టర్.

కాసేపటికి నర్స్ వచ్చి "మిమ్మల్ని తీసుకెళ్లడానికి మీ వాళ్ళు ఎవరైనా ఉన్నారా?" అడిగింది. "పర్లేదు. నేను వెళ్ళగలను. ఇప్పుడు నాకు ఓపిక ఉంది" అన్నాడు కృష్ణ. "ఇదిగోండి మీ బిల్. మీరు వెళ్లేటప్పుడు డబ్బులు కట్టేసి వెళ్ళండి" అని చెప్పి వెళ్ళిపోయింది. కృష్ణ బిల్ చూసి "ఏంటి! బీపీ డౌన్ అయి పడిపోయినందుకు 10000 బిల్లా" అని ఆశ్చర్యపోయాడు. "నా దగ్గర డబ్బులు ఉన్నాయి కాబట్టి సరిపోయింది. ఇలాంటి పెద్ద ప్రైవేట్ హాస్పిటల్‌కి పేదవాళ్లు వస్తే వాళ్ల పరిస్థితి ఏంటో! ఊహించుకుంటేనే భయమేస్తుంది" అనుకున్నాడు.

మరుసటి రోజు కృష్ణ తన ఆఫీస్ రూమ్‌లో కూర్చుని ఒక లెటర్ రాయడం మొదలుపెట్టాడు. "హాస్పిటల్లో సరైన వసతులు లేవు. మరి కొంతమంది ఉద్యోగులు, వైద్యులు కావాలి. మీరు వీలైనంత త్వరగా ఎక్విప్మెంట్, వైద్యులని మాకు అందిస్తారని కోరుకుంటున్నాను" అని ప్రభుత్వానికి లెటర్ రాశాడు కృష్ణ. తర్వాత రూమ్ నుంచి బయటికి వచ్చి ఫ్యూన్ ని పిలిచి "ఈరోజు నుంచి మన హాస్పిటల్లో డాక్టర్స్ అందరూ కరెక్ట్ టైంకి రావాలి. కరెక్ట్ టైంకి ఇంటికి వెళ్ళాలి. ఎమర్జెన్సీ అయితే ఎక్కువ టైం ఇక్కడ ఉండాలి. ఇవాల్టి నుంచి ఈ రూల్స్ అందరూ పాటించాల్సిందే"

అన్నాడు కృష్ణ. "సరే సార్, ఈ విషయం అందరికీ చెప్తాను" అన్నాడు ఫ్యూన్.

పక్కనే ఉండి ఇదంతా వింటున్న కృష్ణ కొలీగ్ ప్రతాప్ "అదేంటి సార్.. కొత్త రూల్స్ పెడుతున్నారు" అన్నాడు. "ఈరోజు నుంచి ప్రతి ఒక్కరూ రూల్స్ పాటించాల్సిందే. ప్రజలకి మంచి వైద్యం అందించడం మన గవర్నమెంట్ హాస్పిటల్ బాధ్యత" అన్నాడు కృష్ణ. "మీరు ఇలాంటివన్నీ పట్టించుకోరు కదా. అందుకే కదా మన హాస్పిటల్‌లో ఉన్న ఇద్దరు లేడీ డాక్టర్లు ఒక్కోసారి టైంకి రారు. నర్స్ అయితే మరీ దారుణం, రోజులో మూడు గంటలు ఇక్కడ పనిచేసి మిగతా టైమంతా ఆవిడ ఇంట్లో వంట చేసుకుంటూ, పిల్లల్ని స్కూల్ కి పంపిస్తూ, మిగతా పనులు చేసుకుంటుంది. ఆవిడని మీరు ఎప్పుడూ మందలించలేదు కూడా" అన్నాడు ప్రతాప్.

"అవును. ఇన్ని రోజులు నేను నర్స్‌ని, మిగతా డాక్టర్లని ఏమీ అనలేదు. వాళ్లు సరిగ్గా డ్యూటీ చేయకపోయినా చూసి చూడనట్టు వదిలేసాను. నేను అలా చేయడం వల్ల ఎన్ని ఇబ్బందులు వచ్చాయో నాకు నిన్ననే అర్థమైంది" అన్నాడు కృష్ణ. "నిన్న ఏమైంది సార్?" అడిగాడు ప్రతాప్. "నిన్న నేను చిన్న పని ఉండి ఎమ్మార్వో ఆఫీస్ దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుంటే స్పృహ తప్పి పడిపోయాను. నన్ను ఇద్దరు వ్యక్తులు హాస్పిటల్‌కి తీసుకెళ్లే దారిలో వాళ్లు మన హాస్పిటల్ గురించి మాట్లాడుకున్నది విన్న తర్వాత ఈ హాస్పిటల్ సూపరింటెండెంట్ అయిన నన్ను ఇక్కడికి ట్రీట్మెంట్‌కి తీసుకొస్తున్నారని తెలిసి చాలా భయపడ్డాను. హాస్పిటల్లో ఇన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయని నాకు తెలిసినా నేను పెద్దగా పట్టించుకోలేదు.. తనదాకా వస్తే గాని ఏదీ తెలియదు అంటారు కదా! వాళ్లు నన్ను ఈ హాస్పిటల్‌కి తీసుకొస్తారని అనగానే నాకు ప్రాణ భయం పట్టుకుంది. నా నిర్లక్ష్యమే నన్ను చంపబోతుందని తెలిసి వచ్చింది. జీవితం మీద ఆశ చచ్చిపోయింది" అని కృష్ణ అంటూ ఉండగా.. ప్రతాప్ మధ్యలో కలగజేసుకొని..

"వాళ్లు మిమ్మల్ని ముందు ఈ హాస్పిటల్‌కే తీసుకువస్తా అన్నారు కదా! మరి ఇక్కడికి కాకుండా వేరే చోటికి ఎందుకు తీసుకెళ్లారు?" అని అడిగాడు.

"వాళ్ళిద్దరూ మానవత్వం ఉన్నవాళ్లు. అందుకే నా మానాన నన్ను వదిలేయకుండా.. నా ప్రాణాలు కాపాడాలని నన్ను మంచి హాస్పిటల్‌లో చేర్పించారు. అందుకే బ్రతికి బట్ట కట్టాను. ఆ ప్రైవేట్ హాస్పిటల్‌లో వసతులు అన్నీ బాగున్నాయి, కానీ మన ఆసుపత్రిలో నేను సరిగ్గా పట్టించుకోకపోవడం వల్ల చాలా ప్రాణాలు పోయాయి. నాకు నిన్న పది వేలు బిల్ అయింది. నా దగ్గర డబ్బులు ఉన్నాయి కాబట్టి కట్టేశాను. కానీ మనం సరిగ్గా ఉండకపోవడం వల్ల ఎంతో మంది పేదవాళ్లు ఆ ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి అప్పుల పాలవుతున్నారు. ఉచితంగా పొందాల్సిన వైద్యానికి అంత డబ్బు ఖర్చు పెడుతుంటే ఎంత బాధగా ఉంటుందో ఆ బాధ నాకు నిన్న తెలిసి వచ్చింది.

నేను ఈ హాస్పిటల్ సూపరింటెండెంట్ అని నిన్న నన్ను కాపాడిన వాళ్ళకి తెలిస్తే.. వాళ్లు అసలు నన్ను కాపాడే వాళ్ళు కాదేమో అనిపించింది. ఇక నుంచైనా నా కర్తవ్యం సరిగా నిర్వర్తించాలని నిర్ణయించుకున్నాను. ఈ హాస్పిటల్లో ఎక్విప్మెంట్, ఫర్నిచర్, పెచ్చులూడిన గోడలు, సరిగా డ్యూటీ చేయని సిబ్బంది ఇలా చాలా బాగు చేయాల్సి ఉంది" అన్నాడు కృష్ణ.

కొన్ని రోజుల తర్వాత ఆ హాస్పిటల్ పూర్తిగా మారిపోయింది. చాలా మార్పులు వచ్చాయి. ఎవరి డ్యూటీ వాళ్లు సక్రమంగా నిర్వహిస్తూ ఉన్నారు. ఒకప్పుడు ఈ హాస్పిటల్ గురించి చెడుగా చెప్పుకున్న వాళ్ళే ఇప్పుడు మంచిగా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు.

ఇదంతా హాస్పిటల్ బయట నుంచొని చూస్తున్న రమేష్ "కొన్ని

వాళ్ళిద్దరూ మానవత్వం ఉన్నవాళ్లు. అందుకే నా మానాన నన్ను వదిలేయకుండా.. నా ప్రాణాలు కాపాడాలని నన్ను మంచి హాస్పిటల్‌లో చేర్పించారు. అందుకే బ్రతికి బట్ట కట్టాను. ఆ ప్రైవేట్ హాస్పిటల్‌లో వసతులు అన్నీ బాగున్నాయి, కానీ మన ఆసుపత్రిలో నేను సరిగ్గా పట్టించుకోకపోవడం వల్ల చాలా ప్రాణాలు పోయాయి

నెలల క్రితం ఇదే హాస్పిటల్లో నా చెల్లి వీళ్ళ నిర్లక్ష్యానికి బలయింది. ఇంతకుముందు కూడా ఈ హాస్పిటల్ ఇలా ఉండుంటే బాగుండేది. ఇప్పటికైనా మరికొన్ని ప్రాణాలు వీళ్ళ నిర్లక్ష్యానికి బలి అవ్వవని అనుకుంటున్నాను" అన్నాడు వంశీతో.

"అవును మనకి జరిగిన నష్టం ఎవరికీ జరగకూడదు. మనిషికి ప్రాణం పోసే శక్తి ముగ్గురికే ఉంది. అమ్మకి, దేవుడికి, వైద్యుడికి. అమ్మ ఒకసారి ప్రాణం పోస్తుంది. దేవుడు కూడా అంతే. కానీ మనకి అనారోగ్యం వచ్చిన ప్రతిసారి ప్రాణం పోసేది డాక్టర్ మాత్రమే. డాక్టర్ లో మనం దైవం చూస్తాము. ఆ డాక్టరే నిర్లక్ష్యంగా ఉంటే వారిలో మనకి దైవం కాదు, దెయ్యం కనిపిస్తుంది" అన్నాడు వంశీ.

"అన్నట్టు మనం ఆరోజు కృష్ణకి సహాయం చేసాము కదా, ఆయనే ఈ హాస్పిటల్ సూపరింటెండెంట్ అంట" అన్నాడు వంశీ. "అవును నాకు కూడా ఆ విషయం తర్వాత తెలిసింది" అంటూ రమేష్ హాస్పిటల్ వైపు నడిచాడు కృష్ణని మెచ్చుకోవడానికి.

నాన్న మేల్కొలుపు

జె.డి. వరలక్ష్మి
85002 30421



ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. రవళి పూజకూడా చేసినట్టులేదు. గణగణమని మోగే గంట శబ్దం వినిపించలేదు. నాలుగు రోజుల నుండి ఇదే వాతావరణం ఇంట్లో నెలకొని ప్రసాదును వెక్కిరిస్తుంది..

రాత్రి రోజూ తాగేదానికంటే ఇంకో రెండు గ్లాసులు ఎక్కువే తాగాడు ప్రసాదు. తాగుడును కౌన్సిలింగ్ తీసుకుని మానేసిన నాలుగు సంవత్సరాల తర్వాత మళ్లీ ఇప్పుడు తిరిగి మొదలెట్టాడు. దానితో ఉదయం మేల్కోవడానికి ఎనిమిది దాటిపోయింది. రవళి మౌనంగా కాఫీ కప్పును టీపాయ్ మీద పెట్టి కళ్లు ఒత్తుకుంటూ వంటగదిలోకి వెళ్లిపోయింది.

చూసీ చూడనట్టుగా పేపర్ అందుకుని కాఫీ తాగుతూ చదవడం మొదలెట్టాడు. రెండు పేజీలు తిరగేసేసరికి

"డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం రాలేదని ఉరి వేసుకున్న అభ్యర్థి" పెద్ద అక్షరాలతో వేశారు. ఐదోసారి ప్రయత్నంలో కూడా వైఫల్యమే ఎదురయింది. దీక్ష పట్టి దక్కించుకుందామన్న ప్రభుత్వ కొలువు చేజారిపోవడంతో మానసికంగా కుంగిపోయిన నిరుద్యోగి ఒత్తిడితో సమాజంలో చులకన అవుతాడని అభద్రతాభావంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వివరంగా రాశారు.

ఓరి భగవంతుడా.. ఐదుసార్లు రాసాడా డీఎస్సీ..! కనీసం నాలుగు సంవత్సరాల వ్యవధితో నోటిఫికేషన్ వేసినా 16 సంవత్సరాల యవ్వనాన్నంతా పరీక్ష ప్రిపరేషన్‌కే ఉపయోగించాడా!

ఈ లెక్కన నా కొడుకు స్వామి గాడెంత! ఒక్క డీఎస్సీనే రాసాడు. కానీ కొలువు మార్కులు డెబ్భై తొమ్మిది పాయింట్ ఆరు పెట్టడం, వీడికి డెబ్భై తొమ్మిది పాయింట్ నాలుగు రావడంతో కేవలం పాయింట్ల తేడాతో ప్రభుత్వ కొలువు చేజారిపోవడం దురదృష్టమనుకున్నాడు మనసులో.

ఒరేయ్ స్వామీ.. తలుపు తీయరా.. ఎంతసేపటి నుండి తలుపు తడుతుందో! బద్దలు కొట్టినంత దూకుడు చేస్తోంది రవళి.

వార్తల్లో అభ్యర్థిలా తన కొడుకు స్వామి కూడా.. ఆ ఆలోచన రాగానే పరుగు పరుగున వెళ్లి తలుపును బలంగా తోయబోయాడు. లోపలి నుండి గడియ తీసిన శబ్దం వినిపించి వెనక్కి తగ్గాడు.

టవల్‌తో తడితల తుడుచుకుంటూ ఎందుకమ్మా అంతలా తలుపు తడుతున్నారు ఆశ్చర్యంగా అడిగాడు స్వామి. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ప్రసాదు, రవళి.

ఏమీ లేదురా కాఫీ ఏమైనా తాగుతావేమో రాత్రి ఏమీ తినకుండా పడుకున్నావు కదా మృదువుగా అడిగింది.

టిఫిన్ పెట్టమ్మా మళ్లీ ఆరు నెలల్లో డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తారట చదువుకుంటానన్నాడు.

తన కొడుకు త్వరగానే ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయిన బాధనుండి బయటకి రావడం చూసి సంతోషించింది.

ప్రసాదుకు గుండె దడ ఇంకా తగ్గలేదు. కొద్దిగా నొప్పిగా అనిపించింది. వేసుకున్న తెల్లని రామరాజ్ బనియన్ మొత్తం చెమటతో తడిసి ముద్దయిపోయింది. వేగంగా తన గదిలోకి వెళ్లిపోయాడు.

అతడిని ఇంకా ఆ పేపర్లో వార్తే వెంటాడుతూ ఉంది.

స్వామి మళ్లీ పట్టుదలగా చదువుతాననడం సంతోషంగా ఉన్నా ఈ పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కొలువంటే మాటలా! మరోసారి ప్రయత్నంలో ఓటమే ఎదురైతే! ఆ ఆలోచన భయంకరంగా తోచింది ప్రసాదుకి. తను ఉద్యోగ వేట చేసిన యవ్వన కాలం కళ్ళముందు తెచ్చుకున్నాడు.

ప్రభుత్వం మారే సమయానికే కొలువుల నోటిఫికేషన్ విడుదల చేసేవారు. గుమస్తాగిరీ అయినా బంట్రోతు పనైనా ప్రభుత్వ డబ్బు తినడమంటే రాసిపెట్టి ఉండాలనే నానుడి అందరి నాలుకల మీద నానుతుండేది. దానికోసమే పద్దెనిమిది సంవత్సరాల వయసు నుండి ఇరవై తొమ్మిది సంవత్సరాల వయసు వచ్చేవరకు జనరల్ నాలెడ్జ్ కోసం, కరెంట్ అఫైర్స్ కోసం చదవని పత్రికా లేదూ, నమలని పుస్తకమూ లేదు. యవ్వనంలో ఉన్న కండపుష్టిని, తెలివితేటలని, ఓపికను ఎరగా వేసి ఉపాధ్యాయ వృత్తిని అతి కష్టం మీద చేజిక్కించుకోవాలనుకున్న రోజులవి. విధి వెన్నుపోటు పొడిచి ప్రైవేట్ స్కూల్లో అరకొర జీతానికి స్థిరపడ్డాడు ప్రసాదు. ఎప్పుడు ఉద్యోగం నుండి బయటికి తీసేస్తారో.. జీతం జేబు చేరక నడి బజార్లో కుటుంబం నిలబడితే పరిస్థితి ఏమిటో అర్థం కాని బ్రతుకును నెట్టుకొస్తున్నాడు.

ఇప్పుడైతే మరీను.. నోటిఫికేషన్ విడుదల చేసినా జిల్లాకు పదో పరకో ఉద్యోగాలు తప్ప ఒరిగేదేమీ లేదు. అతని తల వేడెక్కిపోతుంది.

కొడుకు కొబ్బరి చెట్టులా ఎదిగొస్తాడనుకున్నాడు. కుటుంబానికి సంపాదించే చెయ్యి సాయమొస్తుందని, గౌరవం మర్యాద ఒళ్లో వాలతాయనుకున్నాడు. ఫైనల్ సెలక్షన్ లిస్ట్ క్యాన్సిల్ అయిపోవాలని, వాళ్ళ కులంలో అభ్యర్థికి ఏ పత్రాలో తేడా వచ్చేసి వెరిఫికేషన్ లో స్వామికి ఉపాధ్యాయ పోస్టింగ్ వచ్చేయాలని రకరకాల ఆలోచనలను చేస్తున్నాడు.

స్వామి పట్టు వదలని విక్రమార్కుడిలా పంతం పట్టి నిద్రాహారాలు, సరదా సంతోషాలు మర్చిపోయాడు. మిత్రులతో సంభాషణలు కరువయ్యాయి. సర్కారు నౌకరి వస్తుందో లేదో గాని స్వామికి మెడ నొప్పి మొదలై అది రాను రానూ పెద్ద సమస్యగా మారిపోయి సర్జరీ చేయించుకునే పరిస్థితి వరకూ వెళ్లిపోయాడు.

కొడుకు వయసు చిన్నది. అప్పుడే ఆపరేషన్ గట్రా అంటే వయసు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలని ఎదుర్కోవలసి వస్తుందని గ్రహించిన ప్రసాదు మిత్రుడి సలహా మేరకు స్వామిని వరంగల్లో ఉన్న ప్రముఖ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. రెండు మూడు నెలల చికిత్స తర్వాత స్వామికి ఉపశమనం లభించింది. ఆరోగ్య సమస్యలను, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటూ అహర్నిశలు పుస్తకాలతోనే సమయాన్ని గడిపాడు.

పరీక్ష సమయం రానే వచ్చింది. కంప్యూటర్ స్క్రీన్ సరైన సమాధానాన్ని వెతికి పెట్టమని చెప్తున్నట్టుగా ఉంది.

బయట చెట్టు కింద కూర్చుని తెచ్చుకున్న టిఫిన్ పొట్లాన్ని విప్పి తిన్నాడు ప్రసాదు. మంచినీళ్ల తాగి కొళాయి దగ్గరికి వెళ్లి చెయ్యి కడిగి నీళ్ల పుక్కిలించాడు. నీళ్ల రుచి ఉప్పగా తగిలింది. మళ్లీ అదే చెట్టు కింద కూర్చుని ఆశావహ దృక్పథంతో ఎదురుచూస్తున్నాడు.

స్వామి పట్టు వదలని విక్రమార్కుడిలా పంతం పట్టి నిద్రాహారాలు, సరదా సంతోషాలు మర్చిపోయాడు. మిత్రులతో సంభాషణలు కరువయ్యాయి. సర్కారు నౌకరి వస్తుందో లేదో గాని స్వామికి మెడ నొప్పి మొదలై అది రాను రానూ పెద్ద సమస్యగా మారిపోయి సర్జరీ చేయించుకునే పరిస్థితి వరకూ వెళ్లిపోయాడు.

సాయం చెయ్యమని పదే పదే భగవంతున్ని ప్రార్థిస్తున్నాడు.

ఆ తండ్రి మనసు పరిపరి విధాలుగా పోతుంది. శుభం, అశుభం.. సంతోషం, బాధల వ్యతిరేక భావనల మధ్య ఇరుక్కుపోయి ఊపిరాడనట్లుగా ఉన్నాడు. ఏ పరిస్థితినైనా తట్టుకోగలిగే గుండె నిబ్బరం కోసం శూన్యంలో వెతుకుతున్నాడు. అతడి హృదయం మౌనంగా జరగబోయే పరిణామాలను ఊహించుకుంటుంది.

రెండు గంటల పోరాటం తర్వాత పరీక్ష గది నుండి బయటకు వచ్చాడు స్వామి. ఇన్నాళ్లు తలపై మోస్తున్న బరువేదో కిందకి దిగినట్టుగా తేలికపడ్డాడు స్వామి. పరీక్ష హాల్ నుండి బయటకు వస్తున్న అందరూ అభ్యర్థులు ఉన్నారిక్కడ. అందులో వందల మందికి ఉద్యోగం వస్తే వేలమంది నిరుద్యోగులుగా మళ్ళీ పుస్తకం తీస్తూ కొందరు, ఏ ప్రైవేట్ పాఠశాలలోనో ఉపాధ్యాయులుగా మరి కొందరు, ఓటమిని భరించలేక ఆత్మహత్యా ప్రయత్నం చేసేవారు కూడా ఉంటారు కదా అనుకున్నాడు.

నాన్నా వెళ్దామా అని వినపడ్డ పిలుపుకు ఊహ నుండి బయటకొచ్చాడు. స్వామి భుజం మీద చెయ్యి వేసి బండి పార్కింగ్ వైపు కదిలాడు.

స్వామికి సుబ్బయ్య హోటల్‌లో తృప్తిగా భోజనం పెట్టించాడు.

నువ్వు తిను నాన్న ఇంటికి వెళ్లేటప్పటికి ఆలస్యం అవుతుంది కదా.. బ్రతిమలాడినట్టే అన్నాడు స్వామి.

నేను కొంతసేపటి క్రితమే టిఫిన్ తిన్నాను రా ఆకలి లేదు. నువ్వు తినంటూ కందిపొడిని అరిటాకులో వేశాడు.

భోజనం చేసిన తర్వాత గంట పాటు షాపింగ్ మాల్‌లో తిరిగి ఎండ తీవ్రత తగ్గాక సముద్రం ఒడ్డుకు తీసుకెళ్లాడు. ఎగసిపడుతున్న అలలు కాళ్ళ కింద ఇసుకను లాక్కుపోతున్నాయి. కొద్ది దూరం తీరం వెంట నడిచి ఒకచోట కూర్చున్నాడు ప్రసాదు. నిటారుగా నిలబడి కనుచూపుమేర తీరాన్ని చూస్తున్నాడు స్వామి.

ఒరేయ్ స్వామీ.. నీతో పది నిమిషాలు మాట్లాడాలి రా.

చెప్పు నాన్న ఏంటి విషయం పరీక్ష గురించా.. ఈసారి వచ్చే అవకాశం.. అని ఆగిపోయాడు స్వామి.

ప్రసాదు పెదవుల మీద నిర్వికారమైన నవ్వు కనిపించి మాయమైంది.

స్వామీ..

నువ్వు చాలా గట్టి వాడివి రా.. అందుకే మళ్ళీ అంత స్థాయిలో చదివి పరీక్ష రాశావు.

కానీ జీవితం పెట్టే పరీక్ష నువ్వు ఊహించిన దానికంటే కఠినంగా ఉంటుంది సుమా!

నువ్వు ప్రభుత్వ ఉపాధ్యాయుడివి అయినా కాకపోయినా నా కొడుకువే. మేము నీ తల్లిదండ్రులమే.

నీకు మేమున్నాం. ఒక్క మాట గుర్తుపెట్టుకో..

ఎక్కడ పోతే అక్కడ వెతుక్కునే రోజులు కావివి. కావలసిన దాన్ని ఆవిష్కరించుకునే రోజులు.

తెలివికి సృజనాత్మకతను జోడించి ప్రత్యేకంగా నెలల పిల్లాడి నుండి స్త్రీ, పురుష, దివ్యాంగులు, ముసలి వాళ్ళని వయస్సు, లింగ భేదం లేకుండా వాళ్ళ జ్ఞానానికి కృత్రిమ మేధని జోడించి సామాజిక మాధ్యమాల ద్వారా పబ్లిసిటీతో గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

వారి ప్రతిభను నలుగురికి చాటి ఉపాధి ఏర్పరచుకొనే దిశగా వారి అడుగులు వేస్తున్నారు. చెప్పడం ఆపి రెండు నిమిషాలు మౌనంగా ఉన్నాడు ప్రసాదు.

అవును నాన్న.. నువ్వు చెప్పేది నాకూ తెలుసు. కానీ ఇప్పుడిదంతా నాకెందుకు చెప్తున్నావు!

కొడుకు చేతిని తన చేతిలోకి తీసుకుని ఒరేయ్ నీకు ఉద్యోగం వచ్చినా రాకపోయినా నీ జీవితాన్ని మాత్రం చేజారి పోకుండా చూసుకో.

కాలం గడిచిపోతే నడివయసు దాటి వృద్ధాప్యం తప్ప ఇప్పుడున్న యవ్వనం తిరిగి రాదు.

నువ్వేం సాధించాలనుకున్నా ఇప్పుడే చేయాలి. నాలాగా ఆలస్యం చెయ్యకు. ముందే మేలుకో..

తవ్వినా లోతులో బంగారుగని దొరక్కపోతే ఇంకా లోతుకు తవ్వమని నేను చెప్పను. అసలక్కడ గని ఉందో లేదో తెలుసుకునే పరిస్థితులు, అవకాశాలు సరిచూసుకోమంటాను.

ధరలు పెరుగుతుంటే జీతం పెరగటం లేదని నిట్టూర్పు విడిచే ఈ ఉద్యోగిగా ఉండిపోవడం కంటే ఆర్థికంగా మరో నలుగురికి ఉద్యోగాలు కల్పించే గొప్ప సంస్థగా నువ్వు నిలబడలేవా?

నీకు తెలివి ఉంది, ధైర్యం ఉంది, ఓపికా ఉంది..అన్నిటికీ మించి నీ సమయం నీ చేతిలోనే ఉంది.

నీ దిశను మార్చుకుని ముందుకు వెళ్లలేవా! ఈరోజు రాత్రికి బాగా ఆలోచించమని చెప్పదలుచుకున్న విషయం చెప్పి పైకిలేచి బట్టలకంటిన ఇసుకను దులుపుకున్నాడు.

ఒక్కోసారి నువ్వేం మాట్లాడతావో ఏమో నాన్నా.. అయోమయంగా మొఖం పెట్టాడు స్వామి.

నేను అనుభవాన్ని చెప్పి భవితను ఇద్దామనుకుంటున్నాను. నా దగ్గర అదే ఉందని ముందుకు నడిచాడు.

క్షేమంగా ఇంటికి చేరుకున్నారు ఇద్దరూ. ఉదయం స్వామి నిద్రలేచినా ప్రసాదు అలికిడి లేదు.

రవళి చేతిలో కాఫీ కప్పు కిందపడి పగిలిపోయింది.

రాత్రి నిద్రలోనే ప్రాణం పోయిన ప్రసాదు శరీరం మంచం మీద ఇంకా పడుకునే ఉంది.

స్వామి గుండెను బిగబట్టి నాన్న మాటలను నెమరు వేసుకుంటున్నాడు.

యశోద తనయ

సత్య
80951 55638



మధురాపురి సదనా మృదువదనా
మధుసూదన ఇహ స్వాగతం కృష్ణా..
శరణాగతం కృష్ణా..
స్వాగతం కృష్ణా శరణాగతం కృష్ణా..
మధురాపురి సదనా మృదువదనా మధుసూదన ఇహ స్వాగతం కృష్ణా..!

ఇంటి గేట్ తీసుకుని అడుగు లోపలికి పెడుతూనే అమ్మ గొంతు ఎంతో మధురంగా నాకు స్వాగతం పలుకుతున్నట్టే వినిపించింది.

సంగీత పాఠాలు నేర్చుకోవడానికి వచ్చిన పిల్లలు అమ్మ పాడిన విధంగానే ఎంతో శ్రద్ధగా, శ్రావ్యంగా శ్రుతి కలుపుతున్నారు..

ఇంటి కాంపౌండ్‌లో ఉండే మందార, సన్నజాజి చెట్లు, కనకాంబరాల మొక్కలు, ఇవన్నీ అమ్మ సంగీతానికి మైమరిచి పోయి ఊగుతున్నట్టుగానే కనిపిస్తున్నాయి నా కంటికి..

ఇక ఆ కొమ్మలకి విరగబూసిన పూలు ఎంతో అందంగా నర్తిస్తున్నట్టుగానే ఊగుతున్నాయి..

ఆఫీస్ లో కిందా మీదా పడి పనిచేసి వచ్చే నాకు

ప్రతి రోజు ఇంటికి వచ్చేసరికి ఒక ప్రశాంతత అమ్మ చెప్పే ఈ సంగీత పాఠాల వల్ల..

అమ్మని చూస్తూ చిన్నగా నవ్వుతూ,

నాతో పాటుగా తెచ్చిన వస్తువులన్నిటిని చాలా జాగ్రత్తగా పట్టుకుని వస్తూ, పిల్లల్లో ఒకరిని చూసి రమ్మని సైగ చేసా.. నా దగ్గరికి రాగానే నా చేతిలో ఉండే ఒక కవర్ తనకి ఇచ్చి..

"క్లాస్ అయిపోయాక పిల్లలందరికీ ఇవ్వు స్వాతి.." అని చెప్పి లోపలకి వెళ్ళిపోయా..

"సరే అన్నయ్యా.." అని అంటూ తిరిగి స్వాతి తన స్థానంలోకి వెళ్ళి కూర్చుంది.

స్వాతి ఇంటర్ చదువుతుంది. పిల్లలందరిలో తనే సీనియర్ పాడటంలో.. అమ్మ లేని టైమ్‌లో తనే చిన్న పిల్లలకి క్లాస్ తీసుకుంటుంది.

లోపలికి వెళ్తూనే నా భార్యామణి ఎదురు వచ్చింది కాఫీ కప్పుతో.. నన్ను చూడగానే కాఫీ కప్పు పక్కన పెట్టి నా చేతిలో ఉండే బ్యాగ్స్ ని తీసుకొని పక్కన పెట్టి, మళ్ళీ కప్పు అందుకుంది..

"అబ్బా..! చాలా చాలా థాంక్స్ రాధా.. తలపగిలిపోతుంది అనుకో.. నువ్వు కరెక్ట్ టైమ్‌కి కాఫీ పట్టుకొచ్చావ్.." అంటూ నా చేయ్ ముందుకు వెళ్ళగానే తను వెనక్కు తీసుకుంది.

"ఈ కాఫీ నీకు కాదు బావా.. అత్తమ్మకి.. ముందు నువ్వు ఫ్రెష్ అయ్యి రా..! ఈలోగా నీకు ఫ్రెష్ గా స్ట్రాంగ్ కాఫీ రెడీ చేస్తాగా.."

"కాఫీ తాగడానికి కూడా ఫ్రెష్ అవ్వాలా రాధా..!" అంటూ తన రెండు భుజాల మీద చేతులు వేస్తూ నా తలతో తన తలని చిన్నగా ఢీ కొట్టి అడిగా..

"అవును బావా..!" అంటూ నా ముక్కు పట్టుకొని అటు ఇటు ఊపుతూ..

"కాఫీ చల్లారిపోతుంది అత్తమ్మకి ఇచ్చి వస్తా.. నువ్వెళ్ళు.." అంటూ నా నుంచి తప్పించుకొని వెళ్ళిపోయింది రాధ..

రాధ నేను చిన్నప్పటి నుంచి కలిసే పెరిగాం.. కలిసే ఆడుకున్నాం.. కొట్టుకున్నా తిట్టుకున్నా అంతా రాధతోనే.. అలా మా స్నేహం మొదలైంది.. అది ఎప్పుడు ఇష్టంగా మారిందో, ఆ ఇష్టం ఎప్పుడు ప్రేమగా మారిందో తెలియదు..



రాధ.. నా మరదలు, మేనమామ కూతురు. పెళ్ళి ఐనా సరే బావా అనే పిలుస్తుంది.. అది తనకే కాదు నాక్కూడా ఇష్టమే.. పక్కింట్లోనే మామయ్య వాళ్ళు ఉండేది. నిజం చెప్పాలంటే మేమే పక్కింట్లోకి వచ్చి సెటిల్ అయ్యాం.. నా చిన్నప్పుడే నాన్న చనిపోయారు. మావయ్య అమ్మని తీసుకొచ్చేసారు తన ఇంటికి..

ఎంత అన్నయ్య ఐనా ఒకే ఇంట్లో కలిసి ఉండలేక నాన్న పేరున ఉన్న పొలం అమ్మకి కొంత ఇస్తే, దాన్ని అమ్మేసి మామయ్య వాళ్ళ పక్కింటినే కొన్నదంట అమ్మ. మరో పెళ్ళి చేస్తాను అని మామయ్య ఎంత చెప్పినా వినలేదంట..

ఇక్కడే ఉండొచ్చు కదా అని మావయ్య ఎంతగా బ్రతిమాలినా ఎక్కడికో వెళ్లిపోను కదా అన్నయ్య.. పక్కిల్లేగా అని చాలా సర్ది చెప్పాక గానీ మామయ్య ఒప్పుకోలేదంట..

పెళ్ళి కాక ముందు వరకు సంగీత పాఠాలకు వెళ్ళి, అందులో ప్రావీణ్యం సంపాదించిన అమ్మకి.. నాన్న పోయాక అదే జీవనాధారం అయిపోయింది..

రాధ, నేను చిన్నప్పటి నుంచి కలిసే పెరిగాం.. కలిసే ఆడుకున్నాం.. కొట్టుకున్నా తిట్టుకున్నా అంతా రాధతోనే.. అలా మా స్నేహం మొదలైంది.. అది ఎప్పుడు ఇష్టంగా మారిందో, ఆ ఇష్టం ఎప్పుడు ప్రేమగా మారిందో తెలియదు గానీ ఇంట్లో వాళ్ళు ఇద్దరికి పెళ్ళి చేస్తాం అని అనగానే ఇద్దరం మారు మాటాడకుండా ఒప్పేసుకున్నాం.

కాని అత్తయ్యకు ఎందుకో అంతగా ఇష్టం లేదు రాధని నాకిచ్చి పెళ్ళి చేయడం.. ఆ అయిష్టత ఇప్పటికీ ఉంది.. మామయ్య బలవంతం మీద ఒప్పుకున్నట్టు ఉంది..

"నన్ను వాళ్ళన్నయ్య కొడుక్కి ఇచ్చి పెళ్ళి చేయాలని అనుకుంది.. కాని నేను నిన్ను ఇష్ట పడ్డాను కదా బావా.. అందుకేనేమో.. పట్టించుకోకు." అని రాధ ఒకసారి మాటల సందర్భంలో చెప్పింది.

నేను ఫ్రెష్ అయ్యి వచ్చేసరికి నా ముందు వేడి వేడి కాఫీ దర్శనం ఇచ్చింది. సోఫాలో కూర్చొని దాన్ని తీసుకొని తాగుతూ ఉంటే రాధ నాకు కాస్త దూరంగా కూర్చొని నా వంక చూసింది చిన్న చిరునవ్వుతో..

దాని అర్థం నాకు తెలుసు నా రెండు కాళ్ళు తన ఒడిలోకి తీసుకొని నా కాలి వేళ్ళను సుతిమెత్తనైన తన చేతులతో పట్టుకుని లాగుతుంది చిన్నగా..

తరువాత కాళ్ళని వత్తుతుంది.. నా అలసట అంతా దూది పింజలా ఎగిరిపోయింది ఆ క్షణం..

మనసుకి చాలా హాయిగా అనిపించింది నాకు..

ఇంతకు మించి ఏమి కావాలి ఒక మనిషికి..

నన్నే ప్రాణం అనుకొనే అమ్మ..

అమ్మలా ప్రేమను పంచే భార్య..

చాలు ఈ జన్మకి..

వీళ్లిద్దర్ని నా ప్రాణం ఉన్నంత వరకు కళ్ళల్లో నీళ్ళు తెప్పించకుండా చూసుకుంటే అదే వాళ్ళకి నేనిచ్చే గొప్ప బహుమతి..

కాసేపటికి రాధ చేతులను పట్టుకొని ఆపేసి నా పెదవులను అద్దా.. ఇప్పుడు తన కాళ్ళు రెండు నా ఒడిలో పెట్టుకొని సుతారంగా వత్తుతున్నా.. "అయ్యో బావా వద్దు.. అత్తమ్మ వస్తుందేమో.." అంది రాధ కాళ్ళని వెనక్కి తీసుకుంటూ...

ఆ కాళ్ళని వెనక్కి పోనీయకుండా మళ్లీ దగ్గరికి లాక్కుంటూ

"అమ్మ ఇప్పుడే రాదులే.. కాసేపు మాట్లాడకుండా కళ్ళుమూసుకో.." అన్నా.. కళ్ళుమూసుకుంది రాధ.. పసిపాపలా ఉన్న రాధ ముద్దు మోమును చూస్తూ మురిసిపోయా నేను..

అన్యోన్యమైన దాంపత్యం, ముచ్చటైన కుటుంబం నాది కానీ అన్నీ బాగుంటే ఆ దేవుడికి ఎవరు మొక్కుతారు చెప్పండీ.. ఏదో ఒక లోపం పెడతాడు.. ఆ లోపమే మాకు పిల్లలు లేకపోవడం..

అవును.. మాకు పిల్లలు లేరు..

పెళ్ళై ఐదు సంవత్సరాలు కావొస్తోంది

ఇప్పటికీ ఆ శుభ వార్త లేదు..

రాధ చేయని పూజ లేదు మొక్కని దేవుడు లేడు

కాని ఎందుకో ఆ దేవుడు ఇంకా మా పైన కరుణించ లేదు.. హాస్పిటల్స్ చుట్టూ తిరిగాం..అంతా నార్మల్ గానే ఉంది అన్నారు.. నేనేం బాధ పడటం లేదు.. కాని రాధని చూస్తేనే నా బాధంతా.. ఈ విషయం వల్ల తను అందరిలో కలవలేక పోతుంది..

ఎక్కడకి వెళ్ళినా ముందు పిల్లల గురించి మాట్లాడటమే, ఉచిత సలహాలు ఇచ్చేవాళ్ళే.. ఐనా ఈ జనాలకి ఏం పనో మరి.. ఎదుటి వారు దేని కోసం ఐతే బాధపడుతుంటారో దానికోసమే పని గట్టుకొని మరీ పలకరిస్తూ, గుర్తు చేస్తుంటారు..

సలహాలు ఇచ్చేవరకు బాగుంటుంది కానీ ఏదైనా శుభకార్యానికి రాధని ముందుకు రానివ్వరు..

దీని వల్ల తను ఎంత మధన పడుతుందో అది మాకే తెలుసు..

నా ఆలోచనల్లో నేను వుండగానే అమ్మ పిల్లలందరినీ పంపించేసి లోపలికి వచ్చింది.. అమ్మ అలికిడితో రాధ కళ్ళు తెరిచి లేచి కూర్చుంది..

నేను సరిగా కూర్చుంటూ..” ఏంటీ అమ్మా.. ఈ మధ్య సంగీత క్లాస్ లకి వచ్చే పిల్లలు ఓ ముగ్గురు ఎక్కువ అయినట్టు ఉన్నారే..” అని మాట కలిపా.

“అవును కన్నయ్యా.. కొత్తగా వచ్చారు అంటా వాళ్ళు ఈ కాలనీకి.. ఆ పిల్లలు డ్యాన్స్ క్లాస్ లకి వెళ్ళేవారంట ఇంతకు ముందు.. కాని డాన్స్ ఐతే ఒక వయసు వరకే చేయగలరు కాని సంగీతం అలా కాదు కదా..! ఏ వయసులో ఐనా సరే అవలీలగా పాడగలరు అని ఎవరో చెప్తే ఇక్కడ జాయిన్ చేసారు..”

“మంచిదేగా అమ్మ.. సరే.. ముందు నువ్వు చెప్పిన లిస్ట్‌లో ఉన్నవన్నీ తెచ్చానో లేదో ఒకసారి చూడు..”

“హ్మ్మ్.. చూస్తా.. తొందరేం ఉంది.. అన్నట్టు స్వీట్ బాక్స్ తెచ్చావ్ ఏంటి కన్నా..”

“ఓహ్.. అదా.. అదేం లేదమ్మా.. మా కొలీగ్‌కి..” అంటూ చెప్పబోయి రాధ వంక చూసి..” రాధ..! లోపల రూమ్‌లో ఒక ఫైల్ ఉంటుంది తీసుకురా..” అని పంపించా..

“ఏం లేదమ్మా.. మా కొలీగ్‌కి నిన్న పాప పుట్టిందమ్మా.. అందుకే ఈరోజు ఆఫీస్ లో అందరికీ స్వీట్ బాక్స్‌లు ఇచ్చాడు..”

“అవునా.. చాలా మంచి విషయం చెప్పావ్ కన్నా..

రాధని అందుకేనా లోపలికి పంపించావ్..”

“హా అమ్మా.. తను వింటే బాధ పడుతుంది..”

“నిజమే..” అంది నెమ్మదిగా తల ఆడిస్తూ..

“ఏ ఫైల్ బావా.. అక్కడేం లేదే..” అని రాధ లోపల్నుంచి వచ్చింది..

“లేదా.. అయ్యో.. ఆఫీస్ లోనే మర్చిపోయినట్టు ఉన్నాను.. సారీ.. నిన్ను శ్రమ పెట్టినందుకు..”

“సారీ..” అని కోపంగా ఒక్క చూపు చూసి లోపలికి వెళ్ళిపోయింది రాధ..

హహ.. అని చిన్నగా అమ్మ నవ్వుతూ.. “కన్నా.. నేను మొన్న చెప్పిన దాని గురించి ఏం ఆలోచించావ్..”

“ఇంకా ఏం అనుకోలేదు, ఆలోచించను కూడా.. ఎందుకంటే నాకు ఇష్టం లేదు..” అని అమ్మ ఒడిలో తల పెట్టుకొని చెప్పా.

“కాస్త ఆలోచించరా.. రాధ బాధ చూడలేకపోతున్నాను.. రాధకి కూడా చెప్పా.. నీకు ఇష్టం ఐతే తనకు ఇష్టమే అంది..”

“ఏంటమ్మా దాని ఇష్టం.. తనకి ఏం తెలియదులే..

అయినా ఇప్పుడేం అంత మాకు వయసు అయిపోయిందని నువ్వీలాంటి నిర్ణయం తీసుకున్నావ్ చెప్పు..”

“వయసు ఐపోతుంది అని కాదురా నా బాధ..

రాధ మనతో బాగానే ఉన్నట్టు అనిపిస్తుంది కానీ సంతోషంగా ఐతే లేదురా.. ఎక్కడికీ వెళ్ళలేకపోతుంది.. వెళ్తే నలుగురు నాలుగు మాటలు అంటారు, అది రాధ తట్టుకోలేకపోతున్నది.. తనకోసమే నేను ఆ నిర్ణయం తీసుకున్నా..”

“నీ నిర్ణయం మంచిదే, బాగుంది కూడా.. కాని రేపన్న రోజు దీని వల్ల ప్రాబ్లమ్స్ వస్తాయి అనే నా ఆలోచన, భయం కూడా అమ్మ..”

“అవును కన్నయ్యా.. కొత్తగా వచ్చారు అంటా వాళ్ళు ఈ కాలనీకి.. ఆ పిల్లలు డ్యాన్స్ క్లాస్ లకి వెళ్ళేవారంట ఇంతకు ముందు.. కాని డాన్స్ ఐతే ఒక వయసు వరకే చేయగలరు కాని సంగీతం అలా కాదు కదా..! ఏ వయసులో ఐనా సరే అవలీలగా పాడగలరు అని ఎవరో చెప్తే ఇక్కడ జాయిన్ చేసారు..”

“అలా ఏమీ జరగదు కదా కన్నా.. నా మాట విను..”

నా తలలో చెయ్యి పోనిచ్చి చాలా ప్రేమగా నిమురుతూ అడిగింది అమ్మ..

“సరే చూద్దాం.. కాని ఇప్పుడే ఏ నిర్ణయం నేను చెప్పలేను.. నాకు టైమ్ కావాలి..”

“ఎంతైనా టైమ్ తీసుకో.. కాని మంచి నిర్ణయమే తీసుకో..” అంటూ నవ్వుతూ నా వంక చూసింది అమ్మ..

“మీ కబుర్లు ఐపోతే తినడానికి రావొచ్చు అత్తమ్మా..”

“హా సరే సరే.. వస్తున్నాం రాధమ్మా..” అని తనని వెక్కిరించా..

“బావా..!” అంటూ ఏడుపు మొఖం పెట్టుకుంది రాధ

✣ ✣ ✣

“బావా.. నువ్వు అత్తమ్మ చెప్పినదాని గురించి ఎక్కువ ఆలోచించకు.. నీకు ఇష్టమైతేనే ముందుకి వెళ్దాం..సరేనా..!”

అప్పటి దాక సీలింగ్ ఫ్యాన్ కేసి తదేకంగా చూస్తూ ఉన్న నేను

మన పిల్లలైతే మన మాట వింటారు అదే పరాయి పిల్లల్ని మనం ఎంత బాగా చూసుకున్నా, పెంచినా వాళ్లు, వాళ్ళ బుద్ధులు మనలా వస్తాయో రావో అనేదే పెద్ద సందేహం.. దీని వల్లనే అమ్మ ఎంత చెప్పినా నేను వెనకడుగు వేస్తున్నా..



తన వైపు చూసా.. తన బాధని బయటికి చెప్పకుండా నేనెక్కడ ఎక్కువ ఆలోచిస్తానో అనే దిగులే ఎక్కువ ఉంది తన మొఖంలో..

అది చూడగానే ఇలా రా అన్నట్టు కళ్ళను ఆర్పాను..

రాధ తలవంచగానే ప్రేమగా తన నుదిటిన ముద్దిచ్చి

"సరే రాధ.. నేనేం ఎక్కువ ఆలోచించనులే.." అని కళ్ళు మూసుకొని పడుకున్నా కాని నిద్ర పట్టలేదు..

రాధ నిద్రపోయింది.. తను నిద్రపోయింది అని నిర్ధారించుకున్నాక లేచి టెర్రస్ మీదకి వెళ్ళి, అటు ఇటు తిరుగుతున్నా.. రేపు నా బర్త్‌డే.. నా బర్త్‌డే రోజు అమ్మ ఎప్పుడూ చేసే ఒక మంచి పని.. అనాథ ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ అన్నదానం చేసి, పిల్లలందరికీ కొత్తబట్టలు, బొమ్మలు ఇంకా కావాల్సిన వస్తువులు అన్ని నా చేతుల మీదుగా ఇప్పిస్తుంది..

అమ్మ ఎందుకో చాలా ఇష్టంగా చేస్తుంది ఆ పని ఎప్పుడూ..

ఇంతకీ అమ్మ తీసుకున్న నిర్ణయం ఏంటో తెలుసా..

ఒక అనాథని దత్తత తీసుకుని పెంచుకుందాం అని..

దాని వల్ల మాకు సంతోషం, ఒక అనాథకి జీవితం ఇచ్చిన సంతోషం రెండూ జరుగుతాయి అని..

అమ్మ ఆలోచన మంచిదే కానీ దానికి నేను అంగీకరించకపోవటానికి కూడా ఓ కారణం ఉంది..

ఈరోజుల్లో కన్నపిల్లలే తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదు.. ఇక ఇలా ఎవరో పిల్లలు మనల్ని ఎలా చూస్తారు.. చూడటం మాట అటుంచి అసలు మన మాట వింటారా అని నా సందేహం..

మన పిల్లలైతే మన మాట వింటారు అదే పరాయి పిల్లల్ని మనం ఎంత బాగా చూసుకున్నా, పెంచినా వాళ్లు, వాళ్ళ బుద్ధులు మనలా వస్తాయో రావో అనేదే పెద్ద సందేహం.. దీని వల్లనే అమ్మ ఎంత చెప్పినా నేను వెనకడుగు వేస్తున్నా..

"మురళి.. మనం ఉన్నంతలో బాగానే ఉన్నాం కదా..! ఒక అనాథని దత్తత తీసుకుంటే మన ఇంటికి ఒక కొత్త ఆనందం వస్తుంది. ఓ చిన్నారి నవ్వుతో మన యిల్లంతా కళకళ లాడుతుంది."

"అమ్మ, మనం ఎంత ప్రేమగా పెంచినా, ఆ పిల్లలు వేరే రక్తం. పెద్దయ్యాక మన కుటుంబం కాదు అని తెలిస్తే..! మనకి అలవాటు పడకపోతే? మనని తనవాళ్లలా అనుకోకపోతే? ఒకవేళ రేపన్న రోజు మాకు పిల్లలు పుట్టి, దత్తత తీసుకున్న వాళ్ళని సరిగా చూసుకోక పోతే, లేక వాళ్ళే మనతో ఇమడలేక పోతే ఎలా..?"

"నువ్వు అనుకున్నదీ నిజమే. కానీ మురళి.. ప్రేమ కంటే గొప్ప బంధం ఇంకేదీ ఉండదని నమ్మాలి. మనం నిజాయితీగా ప్రేమిస్తే, ఆ వచ్చే కొత్త అతిథి కూడా మనల్ని తల్లిదండ్రులుగా అంగీకరిస్తారు.. మన పిల్లలతో పాటే సమానంగా మనం కూడా చూసుకుంటాం.."

నా మనసులో ఇంకా చిన్న సందేహం మిగిలే ఉంది. "ఇది అంత ఈజీ కాదమ్మా.."

అమ్మ చిరునవ్వుతో నా చెంప మీద చేయి వేసి "జీవితంలో కొన్ని నిర్ణయాలు మనకి ముందే అర్థం కావు. కానీ మనం ప్రేమతో, ఒక నమ్మకంతో ముందడుగు వేసినప్పుడే దాని విలువ అర్థం అవుతుంది, తెలుస్తుంది."

అమ్మకి నాకు మధ్య జరిగిన సంభాషణ గుర్తొచ్చింది..

ఎందుకో అమ్మని చూడాలి అనిపించి కిందకి వెళ్లా అమ్మ గదిలోకి.. అమ్మను చూసా.. చాలా ప్రశాంతంగా పడుకుంది.. దుప్పటి సరిగా కప్పి వెనక్కి వచ్చేయబోయాను.. గదిలో ఉన్న టేబుల్ మీద ఒక బుక్ ఓపెన్ చేసి ఉంది.. బుక్ మధ్యలో పెన్ ఉంది.. పేజీలు గాలికి కదులుతూ కనిపించాయి.

దగ్గరికెళ్ళి చూసా.. అమ్మ డైరి.. అమ్మ రాసినంత వరకు ఉంది.. బుక్ మూసేసి అరలో పెట్టి, తిరిగి వచ్చేసా..

✣ ✣ ✣

మరుసటి రోజు నిద్ర లేవగానే చాలా ప్రశాంతంగా అనిపించింది.. చాలా హుషారుగా రెడీ అయ్యా..రాధ విష్ చేసింది.. నా చేతికి ఓ అందమైన రిస్ట్ వాచ్ ని కడుతూ.. థాంక్యూ అని సైడ్ హగ్ ఇచ్చా. అమ్మ దగ్గరికి రాగానే చేతిలో హారతి పళ్ళెంతో ఎదురొచ్చింది.. "హ్యాపీ బర్త్‌డే నాన్నా.."అంటూ.. కళ్ళకి హారతి అద్దుకొని అమ్మ కాళ్ళకి మొక్కా..

"అరె.. ఏం చేస్తున్నావ్.. ముందు దేవుడికి దండం పెట్టుకో.."

అంది నన్ను ఒక చేత్తో లేపుతూ..

"నాకు అమ్మ తర్వాతే ఎవరైనా.." అని అమ్మను హత్తుకున్నా..

"అమ్మ, రాధ.. త్వరగా వెళ్దాం ఈరోజు ఆశ్రమానికి.. మధ్యాహ్న సమయానికి భోజనం వచ్చేస్తుంది.. మనం తీసుకెళ్ళాల్సిన వస్తువులు తీసుకెళ్తే సరిపోతుంది.. పదండి త్వరగా.." అంటూ హడావిడి చేసి, బయటికి వచ్చి ఒకరికి కాల్ చేసి కాసేపు మాట్లాడి లోపలికి రాగానే డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని అమ్మ, రాధ ఆశ్చర్యంగా చూస్తున్నారు నా వంక..

"ఏంటలా చూస్తున్నారు ఇద్దరు.. అన్నట్టు రాధ.. మామయ్యని, అత్తయ్యని కూడా తీసుకెళ్దాం అని చెప్పాగా.. మరి చెప్పావా వాళ్ళకి.." నేను కూడా వచ్చి కూర్చుంటూ అడిగా..

"చెప్పాను బావా.. కాని ఈ బర్త్‌డేకి ఏంటి చాలా హుషారుగా ఉన్నావ్.. పైగా అమ్మవాళ్ళని కూడా తీసుకెళ్దాం అని అంటున్నావ్.." పాయసం గిన్నె నా చేతికి ఇస్తూ అడిగింది రాధ..

"అవును మురళీ.. ఏంటి.. ఎప్పుడు లేనిది మామయ్య వాళ్ళని కూడా రమ్మంటున్నావ్.. ఏమైనా విశేషమా..!?" అడిగింది అమ్మ.

"అబ్బబ్బా.. ఇద్దరు ఆపుతారా ఇక.. ఏమీ లేదు.. ఎప్పుడు మామయ్య వాళ్ళు రాలేదని, ఈ సారి తీసుకెళ్దాం అని అనుకున్నాను.. అంతే..!" తింటూనే సమాధానం చెప్పా..

ఇద్దరు నా వైపు వింతగానే చూస్తూ తినడం ముగించారు..

ఈ లోగా మావయ్య అత్తయ్య వాళ్ళు కూడా వచ్చేసారు.

అందరూ కలిసి కార్ లో బయల్దేరాం..

ముందుగా గుడికి వెళ్ళి దేవుడి దర్శనం చేసుకొని ఆశ్రమానికి వెళ్లాం..

అది పెద్ద ఆశ్రమం కాదు చాలా తక్కువ మందే ఉంటారు..

అమ్మకి అక్కడున్న వాళ్ళంతా సుపరిచితమే..

నా బర్త్‌డే కే కాకుండా తనకి వీలున్నప్పుడల్లా వస్తుంటుంది.. అందుకే అక్కడ ఉన్న వాళ్ళందరూ ఎంతో ఆప్యాయంగా పలకరించారు మమ్మల్ని..

ముందుగా ఆర్డర్ ఇచ్చిన కేక్ రాగానే పిల్లలందరి చేత కట్ చేయించి, కేక్ ముక్కలు, చాక్లెట్లు పిల్లలందరికీ పంచిపెట్టాం.. భోజన సమయానికి భోజనం కూడా వచ్చేసింది.. అందరితో పాటు మా కుటుంబం కూడా కలిసి భోజనం చేసాం.. అంతా ముగించుకొని ఇక ఇంటికి బయలుదేరే సమయానికి ఒక కార్ అక్కడికి వచ్చింది. దాని కోసమే ఎదురు చూస్తున్నా నేను..

అందులో నుంచి ఒక మధ్యవయసు ఉన్నావిడ దిగే లోపే నేను ఎదురెళ్ళాను.. ఎవరు అంటూ చూస్తున్నారు అందరూ.. దగ్గరికి రాగానే అప్పుడు గమనించారు ఆమె రెండు చేతుల్లో భద్రంగా పట్టుకున్న ఒక నెలల పసి కూనని..

ఆమె చేతుల్లో ఉన్న బిడ్డని నా చేతుల్లోకి తీసుకొని అమ్మ ముందుకి వచ్చా.. అర్థం కాకుండా చూస్తుంది అమ్మ.. రాధ, మామయ్య వాళ్ళ పరిస్థితి కూడా అలాగే ఉంది..

అమ్మ చేతిలో ఆ బిడ్డని ఉంచి..

"ఈ చిన్ని కృష్ణుడ్ని మరో మురళీని చేయగలవా అమ్మా.. నా పుట్టిన రోజు నీకిచ్చే బహుమతి వీడే అమ్మా..!" అని అన్నాను.. అంతే.. అమ్మ కళ్లల్లో నీళ్లు..

"మురళీ.. ఏం మాట్లాడుతున్నావ్.." ఆశ్చర్యంగా అడిగింది అమ్మ..

"నాకెలా తెలిసింది అనా.. రాత్రి నీ రూమ్‌కి వచ్చా అమ్మా.. అక్కడ నీ డైరీలో లాస్ట్‌లో రాసిన రేపు ఈ యశోద దగ్గరికి వచ్చిన చిన్ని మురళీ కృష్ణుడి ముప్పై ఏళ్ళ వసంతం.. అన్న పదాలు చూసా.. సగం అర్థం అయ్యింది.. ఫస్ట్ నుంచి చూస్తే పూర్తిగా అర్థం అయ్యింది.. ఈ ఆశ్రమం బయట ఎవరో పసిగుడ్డుగా ఉన్న నన్ను వదిలి వెళ్ళిపోతే అది నీకు తెలిసి దత్తత

"ఈ చిన్ని కృష్ణుడ్ని మరో మురళీని చేయగలవా అమ్మా.. నా పుట్టిన రోజు నీకిచ్చే బహుమతి వీడే అమ్మా..!" అని అన్నాను.. అంతే.. అమ్మ కళ్లల్లో నీళ్లు..
"మురళీ.. ఏం మాట్లాడుతున్నావ్.." ఆశ్చర్యంగా అడిగింది అమ్మ..

తీసుకున్నావ్ అని, ఆ రోజే నా పుట్టిన రోజుగా జరుపుతున్నావ్ అని.. అప్పట్నుంచే నువ్వు డైరీలో నా గురించి మాత్రమే రాయడం మొదలు పెట్టావు.. నువ్వు చెప్పింది నిజమే అమ్మా.. మన పెంపకంలోనే ఉంటుంది పిల్లల మంచి చెడ్డ అంతా.. అలా అని చెడ్డవారు అందరూ పెంపకం సరిగా లేక కాదు.. చెడు దారులు అలాంటివి. అంతే..

ఇప్పుడు నాకు ఎలాంటి భయం లేదమ్మా.. మాకు ముందు ముందు పిల్లలు పుట్టినా పుట్టకపోయినా.. వీడిని మాత్రం ప్రేమగానే పెంచుతాం.. వీడి తర్వాతే మాకు పుట్టిన పిల్లలు కూడా..

అత్తయ్యకి నేనంటే ఎందుకిష్టం లేదో కూడా ఇప్పుడే అర్థం అయ్యింది.. ఒక అనాథకి తన కూతురిని ఇచ్చి పెళ్ళిచెయ్యడం ఇష్టం లేదు.. అత్తయ్యకే కాదు ఎవరికి కూడా అలా ఇష్టం ఉండదు.. కాని మామయ్యని కాదనలేక పెళ్ళికి ఒప్పుకుంది అంతే కదా అత్తయ్యా.." అని అత్తయ్య వంక చూసా.. తనేం

మాట్లాడలేదు..

"ఇంత త్వరగా ఎలా చేసావ్ మురళీ ఇదంతా" అని అమ్మ అడిగితే..

ఆశ్రమంలో ఉన్న ఒక పెద్దావిడ అమ్మ ముందుకు వచ్చి..

"ఈరోజు ఉదయం మురళీ ఫోన్ చేశాడు మాకు.. అర్జంట్ గా ఒక బిడ్డ కావాలి అని..అది నెలల బిడ్డ అయ్యుండాలి అని..నాకు తెలిసిన ఆశ్రమాలకు ఫోన్ చేసి వివరాలు అన్ని చెప్పి, బిడ్డని మీకు దత్తత ఇవ్వడానికి ఏర్పాటు చేయగలిగాను ఇప్పటికీ.. ఇంకా దీని గురించి మనం మళ్ళీ మాట్లాడుకుందాం.. ఇప్పటికి అయితే మీరు నిరభ్యంతరంగా ఇంటికి తీసుకెళ్లొచ్చు.." అని అమ్మతో చెప్పింది..

"ఇందులో నా స్వార్థం కూడా ఉంది మురళీ..

నీకు ఒక వయసు వచ్చాక నీ గురించి నీకు చెప్పాలి కాని నేను అలా చేయలేక పోయాను.. చెప్తే నన్ను వదిలేసి వెళ్ళిపోతావ్ అని కాదు కానీ ఎందుకో చెప్పలేక పోయాను.. ప్రాణంలా ప్రేమించిన నా భర్త చనిపోయాక నా కళ్ల ముందు శూన్యం తప్ప ఇంకేం కనబడలేదు.. బతుకు మీద ఆశ లేదు.. చావు తప్ప మరొకటి నాకు కనిపించలేదు.. అలాంటి సమయంలో చీకట్లో చిరుదివ్వెలా నీ రాక నాకో మార్గం చూపించింది.. మళ్ళీ బ్రతుకు మీద ఆశ పుట్టింది..నీకోసం బ్రతకాలి అనిపించింది.."

"అమ్మా..! నువ్వు నాన్న పోయాక మరో పెళ్ళి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించకుండా, ఎవరో కని వదిలేసిన నా కోసం నీ జీవితాన్నే త్యాగం చేసావ్.. నన్నే ప్రాణం అనుకున్నావ్, నాలోనే అన్ని చూసుకున్నావ్.. ఇంత గొప్ప మనసున్న నీ కడుపున పుట్టలేదే అని బాధ పడుతున్నా కాని నీ చేతుల్లో పెరిగాను అన్న ఆనందం చాలు ఈ జన్మకి.. చాలా సంతోష పడుతున్నా కూడా.. నువ్వే లేకుంటే నేను ఏమైపోయేవాడినో అని ఇప్పుడు తల్చుకుంటే భయం వేస్తుంది.. ఐనా ఇప్పుడు అవన్నీ ఎందుకు.. ఆ నాడు యశోదమ్మతో శ్రీ కృష్ణుడు కూడా కొన్ని సంవత్సరాలే ఉన్నాడు.. కాని ఈ కృష్ణుడు మాత్రం జీవితాంతం ఈ యశోదమ్మతోనే ఉండిపోతాడు.." అంటూ అమ్మను గట్టిగా పట్టుకున్నా.. కన్నీళ్ళు ఆగనంటూ వచ్చేస్తున్నాయి నాకు..

అప్పటిదాక అంతా విన్న రాధ ముందుకి వచ్చి

"మీరు చాలా గొప్పవారు అత్తమ్మా".. అని

"ఏంటి బావా".. మీరిద్దరే వాడిని ఎత్తుకొని మాట్లాడుకుంటున్నారు.. నేను పరాయి దాన్ని ఐపోయా కదా అప్పుడే.." రాధ మొఖం చిన్నబుచ్చుకున్నట్టుగా అంది..

అయ్యో రాధ.. అలా అంటావేంటి.. ఇక నుంచి వీడే నీకు అన్నీ..నన్ను అమ్మను కూడా మర్చిపోతావ్ చూస్తూ ఉండు.. అని వాడిని తన చేతుల్లో పెట్టేసరికి హాయిగా నవ్వుతూ గుండెలకి హత్తుకుంది రాధ..

అందరం ఇక ఆశ్రమంలో సెలవు తీసుకుని ఇంటికి బయల్దేరాం.. అప్పటికి సాయంత్రం ఐదు ఐపోయింది.. మేము ఇంటి ముందుకి రావడంతోనే


స్వాతి పిల్లలకి క్లాస్ తీసుకుంటుంది.. నిన్న అమ్మ పాడిన అదే పాట..

మధురాపురి సదనా మృదువదనా
మధుసూదన ఇహ
స్వాగతం కృష్ణా..
శరణాగతం కృష్ణా..
స్వాగతం కృష్ణా శరణాగతం కృష్ణా..
మధురాపురి సదనా మృదువదనా మధుసూదన ఇహ స్వాగతం కృష్ణా..

గురజాడ ఫౌండేషన్ ప్రచురణలు (భారత్ & అమెరికా)


Gurajada Foundation Publications (India & America)

www.prakasika.org




ఆధునిక కవితా ప్రక్రియలు

రూ. 300/-




గురజాడ సాహిత్యంలో భాషా విశేషాలు

రు. 100/-




ప్రాచీన సాహిత్యంలో సామాజిక స్పృహ

రు. 200/-




తెలుగు భాషా పరిణామం తెలుగు కవిత్వోద్యమాలు

రు. 300/-




మహా కవితాఖండికలు

రు. 300/-




మీ పేరేమిటి? గురజాడ ఇతర కథానికలు

రు. 200/-




జానపద, వాగ్గేయకార సాహిత్యం

రు. 300/-




మేటి కథలు - లోతు వ్యాఖ్యలు

రు. 300/-




మనస్వినీయం

రు. 200/-




THE SUCCESS BLUEPRINT


Rs. 250/-




BEYOND BORDERS

Rs. 175/-







సంప్రదించండి:

Dr. Gopalakrishna Kovvali | డా. కొవ్వలి గోపాలకృష్ణ
editor@prakasika.org

Turaga Krishna Kumar తురగా కృష్ణకుమార్
+91-9032593153